

సోమవారం 17-2-2025

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 327
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'



కోల్‌కతా X బెంగళూరు

మార్చి 22న ఐపీఎల్ టి20 క్రికెట్ టోర్నీ 18వ సీజన్ ప్రారంభం కానుంది. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే తొలి మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు ఆడుతుంది. మే 25న కోల్‌కతాలో జరిగే ఫైనల్‌తో టోర్నీ ముగుస్తుంది. క్వాలిఫయర్-1, ఎలిమినేటర్ మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. విశాఖపట్నంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండు మ్యాచ్‌లు ఆడుతుంది. 14లో



హిందూ సమాజం బాధ్యతగలది

దేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని ఐక్యతగా భావించే బాధ్యతగల సమాజం హిందూ సమాజమని మోహన్ భాగవత్ చెప్పారు.
- వివరాలు 6లో



బైదూ, ఓపెన్‌ఏఐ సేవలు ఫ్రీ

భారీ రేట్లకు ఏఐ చాట్‌బాట్ సేవలు అందిస్తున్న బైదూ, ఓపెన్‌ఏఐ వంటి దిగ్గజ సంస్థలు చైనా డీప్‌సీక్ దెబ్బకు 'ఉచిత' జపం చేస్తున్నాయి.
- వివరాలు 6లో



భారత్‌కు ఎన్నికల నిధులు ఆపేశాం

విదేశాలకు ఇచ్చే నిధులకు కోతలో భాగంగా భారత్‌కు 2.1 కోట్ల డాలర్ల ఎన్నికల నిధులను నిలిపేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది.
- వివరాలు 6లో



గృహరుణం.. దిగొస్తుంది భారం

ఆర్‌బీఐ రెపో రేటును పావు శాతం తగ్గించిన నేపథ్యంలో గృహరుణాలపై తగ్గే ఆర్థిక భారంపై ఈవారం 'ప్రాఫిట్ ప్లస్' కథనం.
- వివరాలు 15లో

నాణ్యత లేకుంటే సీట్లు కట్!



ప్రమాణాలు పాటించని ఇంజనీరింగ్ కాలేజీలపై కొరడా

రాష్ట్రంలోని ఇంజనీరింగ్ విద్య నాణ్యతపై ప్రభుత్వం ఆందోళన

కోర్సుల సమతుల్యతపై నివేదిక ఇవ్వాలని ఉన్నత విద్యామండలికి ఆదేశం

కంప్యూటర్ కోర్సుల్లో నాణ్యతపై, కోర్ గ్రూపుల తిరోగమనంపైనా అధ్యయనం

- కోర్సుల ఆడిటింగ్‌కు ఉన్నత విద్యామండలి నిర్ణయం
- కంప్యూటర్ కోర్సుల్లో 61 వేల మంది చేరితే... స్కిల్డ్ ఉద్యోగాలొచ్చేది 5 వేల మందికే..
- కనీసం 40 శాతం మందికి ఉపాధి కల్పించని కాలేజీలపై మరింత లోతుగా పరిశీలన
- సమగ్ర సమాచారం సేకరణలో ఉన్నత విద్యామండలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీలు ఇబ్బడిముబ్బడిగా కోర్సులు, సీట్లకు అనుమతులు పొందుతున్నాయి. వాటిల్లో సరైన ఫ్యాకల్టీ, మౌలిక వసతులు లేవనే ఆరోపణలున్నాయి. ఫలితంగా ఇంజనీరింగ్ విద్యలో నాణ్యత దెబ్బతింటోంది. ఏటా 57 వేల మంది కంప్యూటర్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు బయటికొస్తుండగా.. వీరిలో స్కిల్డ్ ఉద్యోగాలు పొందే వారి సంఖ్య 5 వేలు దాటడం లేదు. మరోవైపు కోర్ బ్రాంచీలు మూతపడే పరిస్థితి ఏర్పడుతోంది. ఇదే ట్రెండ్ కొనసాగితే సీఎస్ఈ, దాని అనుబంధ బ్రాంచీలు తప్ప,

మిగతా 3వ పేజీలో ▶

నాణ్యత కోసమే ఆడిట్



కోర్సుల ఆడిటింగ్ ద్వారా డిమాండ్ ఉన్న కోర్సుల్లో నాణ్యత ఎంతో ప్రజలకు తెలుస్తుంది. క్రేజ్ కొద్దీ చేరే విద్యార్థులు ఏమేర నష్టపోతున్నారో అర్థం చేసుకోవడానికి ఆడిటింగ్ మంచి ఆయుధమని భావిస్తున్నాం. సమాజానికి అవసరమైన ఇంజనీరింగ్ విద్యలో ప్రైవేటు కాలేజీలు వ్యాపార ధోరణితో కాకుండా, నాణ్యత ప్రమాణాలు పాటించాలని ప్రభుత్వం కోరుకుంటోంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఆడిట్‌కు సిద్ధమయ్యాం. పూర్తి ఆడిట్ నివేదికను ప్రభుత్వం ముందుంచుతాం.

- ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్

ఎందుకీ పరిస్థితి ?

కంప్యూటర్ సైన్స్ బ్రాంచీల్లో సీట్లు పెరిగినా... తగ్గట్టుగా ఫ్యాకల్టీ ఉండటం లేదు. చాలా కాలేజీల్లో రికార్డుల ప్రకారం బోధకులు నిపుణులే (పీహెచ్‌డీ, ఎంఫిల్ చేసిన వాళ్లు) ఉంటున్నారు. కానీ వాస్తవంగా బోధించేది బీటెక్, ఎంటెక్ చేసిన వాళ్లే. అరకొర వేతనాలివ్వడమే ఈ పరిస్థితికి కారణం. అనుబంధ గుర్తింపు ఇచ్చేటప్పుడు జరిగే తనిఖీ సమయంలోనే రికార్డుల్లోని బోధకులు వస్తున్నారు. ఇక మౌలిక వసతుల మాటకొస్తే... 76 కాలేజీల్లో కంప్యూటర్ కోడింగ్ లేబొరేటరీలు లేవని జేఎన్‌టీయూహెచ్ వర్గాలు అంటున్నాయి. డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై నిష్ణాతులైన బోధకులే కరువయ్యారు. 28 కాలేజీల్లో విద్యార్థులకు కోడింగ్‌లో 20 శాతం పరిజ్ఞానం కూడా ఉండటం లేదని గత ఏడాది క్యాంపస్ నియామకాలు చేపట్టిన ఓ దిగ్గజ సాఫ్ట్‌వేర్ కంపెనీ ముఖ్య ఉద్యోగి తెలిపారు.

ఒక తప్పు చేయాలంటే.. మూడు చేద్దామంటున్నారు

అధికారుల వ్యవహార శైలిపై నేను సంతోషంగా లేను: సీఎం రేవంత్

గతంలో 70-80 శాతం మంది అధికారులు వద్దని చెప్పేవారు

దానివల్ల వచ్చే సమస్యలను వివరించేవారు.. ఇప్పుడలా లేదు

శిక్షణలోనే ఐఏఎస్, ఐపీఎస్‌లు సివిల్ పంచాయితీలు తెంచుతున్నారు

ఏసీ రూమ్‌ల నుంచి బయటకెళ్లడానికి వెనకాడుతున్నారు

ప్రతిదానికీ ఎలా అడ్డు వేయాలి, నెగెటివ్ కామెంట్స్ రాయాలనే ఆలోచన వద్దు

అందరినీ అనడం లేదు.. ముఖ్యమంత్రిగా నా పరిమిత అనుభవాన్ని పంచుకుంటున్నా..

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ రచించిన 'లైఫ్ ఆఫ్ కర్మయోగి' పుస్తకావిష్కరణలో సీఎం సంచలన వ్యాఖ్యలు


ఆదివారం హైదరాబాద్‌లో రిటైర్డ్ ఐఏఎస్ గోపాలకృష్ణ దంపతులతో కలసి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: "గతంలో ప్రజాప్రతినిధులు ఏవైనా అంశాలను ప్రస్తావిస్తే 70, 80 శాతం మంది అధికారులు అందులోని లోటుపాట్లు, చట్ట విరుద్ధతను వివరించేవారు. వాటితో ఏ విధంగా సమస్య వస్తుందో చెప్పారు. ఇలా చేస్తే ప్రజలకు, రాష్ట్రానికి, మీకూ ఇబ్బందేనని వివరించి నాయకులకు జ్ఞానోదయం కల్పించేవారు. ఈ రోజుల్లో అలా చేయడం తగ్గిపోయింది. మేం ఒక తప్పు చేయాలంటే.. ఒకటేంది సార్ మూడు చేద్దాం బాగుంటుంది. బలంగా ఉంటుంది. మళ్లీ మళ్లీ ఎందుకు.. రేపు కొత్తగా మూడు తప్పులు చేయవచ్చంటున్న అధికారులను చూస్తున్నాం. ఇది సమాజానికి మంచిదికాదు" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణలో ఉన్నప్పుడే ఐఏఎస్, ఐపీఎస్‌లు సివిల్ పంచాయితీలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఆదివారం సాయంత్రం తెలంగాణ ఐఏఎస్ అధికారుల ఇనిస్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ రచించిన

మిగతా 12వ పేజీలో ▶

న్యూస్‌రీల్

'మిగులు' రాష్ట్రంగానే అప్పగించాం



రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన తాము అధికారం నుంచి దిగిపోయే నాడు కూడా మిగులు బడ్జెట్ రాష్ట్రంగానే తెలంగాణను కాంగ్రెస్‌కు అప్పగించామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలను తిప్పికొడుతూ బహిరంగ లేఖ విడుదల చేశారు.

- వివరాలు 12లో ▶

నిర్మాత, నటి, గాయని కృష్ణవేణి కన్నుమూత



తెలుగు సినిమా స్వర్ణయుగం నుంచి ప్రపంచ స్థాయికి ఎదగడం వరకు చూసిన నాటి తరం ప్రముఖ నిర్మాత, నటి, గాయని చిత్తజల్లు కృష్ణవేణి (101) హైదరాబాద్‌లో అనారోగ్యంతో కన్నుమూశారు.

- వివరాలు 13లో ▶

పత్తి తీసే యంత్రం రెడీ!



పత్తి తీత సీజన్‌లో రైతుల కష్టాలకు తెరదించేలా త్వరలోనే ట్రాక్టర్‌కు జోడించి పత్తి తీసే యంత్రం ప్రొటోటైప్ సిద్ధం చేస్తున్నట్లు భోపాల్‌లోని కేంద్రీయ వ్యవసాయ ఇంజనీరింగ్ సంస్థ వ్యవసాయ యాంత్రీకరణ విభాగాధిపతి వి.పి.చౌదరి 'సాక్షి సాగుబడి'కి చెప్పారు.

- వివరాలు 2లో ▶

11కే మటన్ మాయం!



హైదరాబాద్ నగరవ్యాప్తంగా ఆదివారం ఉదయం దాదాపు 11 గంటలకే మటన్ షాపులు మూతబడ్డాయి. చెంగిచర్ల, జియాగూడ వంటి మటన్ మండీల్లోనూ మధ్యాహ్నానికే స్టాక్ ఖాళీ అయిపోయింది. మరోవైపు బర్డ్ ఫ్లూతో కోళ్లు మృతిచెందుతున్నాయన్న వార్తలతో చికెన్ దుకాణాలు వెలవెలబోయాయి.

- వివరాలు 16లో ▶

ఆ అసత్యాలపై బదులేది బాబూ?



- తిరుపతి లడ్డూపై బాబుకు సుప్రీం చీవాట్లను 'ఎక్స్' వేదికగా గుర్తు చేసిన సుబ్రమణియన్ స్వామి
- బీజేపీని బాబు ఎప్పుడు వదిలేస్తారని ప్రశ్న

సాక్షి, న్యూఢిల్లీ: తిరుపతి లడ్డూ విషయంలో అసత్యాలు చెప్పినందుకు అత్యున్నత న్యాయస్థానం మందలించడంపై ఏపీ సీఎం చంద్రబాబు నుంచి ఇంతవరకూ సమాధానమే లేదని బీజేపీ సీనియర్ నేత, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ సుబ్రమణియన్ స్వామి మండిపడ్డారు. ఈమేరకు తిరుపతి లడ్డూ కల్తీ కేసు విచారణ సందర్భంగా గతేడాది సెప్టెంబర్ 30న సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ స్వామి ఆదివారం తన ఎక్స్ ఖాతాలో మూడు పోస్టులు చేశారు. తిరుపతి లడ్డూ వివాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబును కోర్టు తీవ్రంగా మందలించిందని, కల్తీ నెయ్యిని వాడారనేందుకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవని న్యాయస్థానం స్పష్టం చేసిందని గుర్తు చేశారు. 'ఆ అసత్యాలపై ఇప్పటికీ చంద్రబాబు నుంచి సమాధానం లేదు. ఆయన నిర్లక్ష్యంపై మోదీ ఎందుకు చర్యలు తీసుకోరు? బాబు ఎప్పుడు బీజేపీని వదిలేస్తారు?' అని ఎక్స్‌లో స్వామి ప్రశ్నలు సంధించారు.

సుప్రీంలో పిల్ దాఖలు చేసిన స్వామి..: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతు కొవ్వులను కలిపారన్న ఆరోపణలపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీని నియమించాలని కోరుతూ సుబ్రమణియన్ స్వామి గతేడాది సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేయడం తెలిసిందే. ల్యాబ్ నివేదికపై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి, టీటీడీ ఈవోలను ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ కేసులో సుబ్రమణియన్ స్వామి స్వయంగా (పార్టీ ఇన్ పర్సన్) వాదనలు వినిపించారు. ఏ నివేదిక ఆధారంగా రాద్ధాంతం చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారో.. దాన్ని రూపొందించేందుకు ఉపయోగించిన నెయ్యి ఎక్కడిది? టీటీడీ తిరస్కరించిన నెయ్యిలో అది ఉందా? నివేదిక

మిగతా 3వ పేజీలో ▶



రెండు రైళ్లు.. ఒకే పేరు

ఢిల్లీ తొక్కిసలాటకు అదే కారణం

అనౌన్స్‌మెంట్ వినగానే హైరానా

- తమ రైలే అనుకుని ప్లాట్‌ఫాం మారేందుకు పరుగులు
- ఇరుకు మెట్లు, ఓవర్‌బ్రిడ్జిపై ఒకరి మీద ఒకరు పడి దుర్ఘటన
- 18కి పెరిగిన మృతులు, 30 మందికి గాయాలు.. మృతుల్లో 16 మంది మహిళలు, చిన్నారులే

6లో

కుంభ్‌కు అర్థమే లేదు

- అది ఒక అర్థంలేని కార్యక్రమం
- ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ వ్యాఖ్యలు

6లో

భూముల లెక్కలు పక్కా!



- ఆధునిక పరికరాలను కొనుగోలు చేసేందుకు సర్కారు గ్రీన్‌సిగ్నల్
- బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే త్వరలోనే పైలట్ ప్రాజెక్టు ప్రారంభమయ్యే చాన్స్
- సర్వే చేపడితే భూముల లెక్కలన్నీ తేలుతాయంటున్న నిపుణులు.. భూవివాదాలకూ చెక్ పడుతుందని వెల్లడి

రాష్ట్రవ్యాప్తంగా భూముల సర్వే దిశగా అడుగులు

పైలట్ సర్వే కోసం ప్రభుత్వాన్ని అనుమతి కోరిన రెవెన్యూ శాఖ.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయించాలని ప్రతిపాదన

150 మండలాల్లో ఒక్కో గ్రామంలో పైలట్ సర్వేకు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూముల లెక్కలను పక్కాగా తేల్చేందుకు, భూవివాదాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందుకోసం విస్తృత స్థాయిలో భూముల సర్వే చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ రూపకల్పనలో భాగంగా రెవెన్యూ శాఖ పద్దుపై జరిగిన సమీక్ష సందర్భంగా ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వం ముందు భూముల సర్వే ప్రతిపాదన చేసినట్టు తెలిసింది. రాష్ట్రంలో భూముల డిజిటల్ సర్వేకు అనుమతివ్వాలని, నిధులు కేటాయిస్తే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 150 మండలాల్లోని ఒక్కో గ్రామంలో పైలట్ ప్రాజెక్టు చేపడతామని కోరినట్టు సమాచారం. దీనిపై సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క... సర్వే నిర్వహణ కోసం అవసరమైన ఆధునిక సాంకేతిక పరికరాలను కొనుగోలు చేసుకోవాలని సూచించినట్టు తెలిసింది.

గత ప్రభుత్వ హయాంలో ఆలోచన చేసినా.. రాష్ట్రంలో భూముల సర్వే చేపట్టాలనే ప్రతిపాదన చాలాకాలం నుంచి ఉంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పలుమార్లు ఈ ప్రతిపాదన వచ్చింది. రాష్ట్ర బడ్జెట్‌లో సర్వే కోసం నిధులు కేటాయించారు. కేంద్రం నుంచి కూడా నిధులు వచ్చాయి. కానీ భూముల సర్వే ఆచరణలోకి రాలేదు. ఇటీవల భూభారతి చట్టం ద్వారా రాష్ట్రంలోని రెవెన్యూ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం


మిగతా 2వ పేజీలో ▶

'కోడ్' ముగిశాక ఆర్టీసీలో సమ్మె

- ప్రభుత్వానికి మరో జేఏసీ అల్టిమేటం
- ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చిన ఒక జేఏసీ
- మార్చి 7 వరకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్
- కార్మికులు సమ్మెకు సిద్ధంగా లేరని ఇంటెలిజెన్స్ నివేదిక

3లో





ఎయిర్‌పోర్ట్స్ మాలామాల్!

ప్రీమియం రిటైల్ స్టోర్స్.. లగ్జరీ బొటిక్స్.. డైనింగ్ ఏరియాలు.. వెల్‌నెస్ సెంటర్లు.. స్పాలు.. కాఫీ షాపులు.. రెస్టో బార్‌లు.. 24 గంటలూ కిటకిటలాడే జనాలు... ఇవన్నీ ఏదైనా భారీ షాపింగ్ మాల్‌లో ప్రత్యేకతలు అనుకుంటున్నారా? ఎయిర్‌పోర్టుల నయా అవతారం ఇది. విమానయాన కార్య కలాపాల నుంచి వచ్చేది అంతంతమాత్రమే కావడంతో ప్రయాణికులకు ప్రపంచస్థాయి షాపింగ్ అనుభవాన్ని అందిస్తూ.. ఆదాయాలను దండిగా పెంచుకుంటున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ప్రధాన విమానాశ్రయాలన్నీ ఇప్పుడు షాపింగ్ మాల్స్‌కు ఎక్కువ.. ఎయిర్‌పోర్టులకు తక్కువ అనే రేంజ్‌లో నడుస్తున్నాయి!!

- సాక్షి, బిజినెస్ డెస్క్



షాపింగ్ మాల్స్‌ను తలపిస్తున్న ఎయిర్‌పోర్టులు

విమానేతర కార్యకలాపాల ద్వారానే అత్యధిక ఆదాయం

ప్రయాణికుల సంఖ్య పెరగడం మరింత ప్లస్..

విమానాశ్రయాల్లో భారీగా రిటైల్ స్పేస్ విస్తరణ..

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో దేశంలోనే అతిపెద్ద మాల్ నిర్మాణం

దేశీయంగా ఎయిర్‌పోర్టుల నిర్వహణలో దిగ్గజ సంస్థ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్. భారత్‌లో అతిపెద్ద విమానాశ్రయం ఢిల్లీతోపాటు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ కూడా ఈ కంపెనీ చేతిలోనే ఉంది. ప్రయాణికుల రాకపోకల్లో ఇవి రికార్డులు సృష్టిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం మూడో క్వార్టర్లో ఢిల్లీ ఎయిర్‌పోర్టు 2 కోట్ల మందికిపైగా ప్రయాణికుల ట్రాఫిక్‌తో దుమ్మురేపింది. తొలి తొమ్మిది నెలల్లో ఒక్క ఢిల్లీ ఎయిర్‌పోర్టు ద్వారా లభించిన మొత్తం ఆదాయం రూ.3,775 కోట్లు. ఇందులో విశేషం ఏముందంటారా? తాజా లెక్కల్ని లోతుగా పరిశీలిస్తే.. ఆశ్చర్యపోవాల్సిందే! ఆదాయంలో విమాన (ఏరో) కార్యకలాపాల వాటా 20 శాతమే. మరో 57 శాతం విమానయేతర కార్యకలాపాలు (నాన్-ఏరో) సమకూర్చిపెట్టాయి. అంటే రిటైల్, డ్యూటీ-ఫ్రీ సేల్స్, అద్దెలు, ప్రకటనలు, ఆహార-పానీయాల విక్రయం తదితర మార్గాల్లోనే లభించాయి. దీన్నిబట్టి చూస్తే.. ఢిల్లీ ఎయిర్‌పోర్టు ఇప్పుడో భారీ మాల్ కింద లెక్క!

ఏరో 'మాల్స్' కిటకిట..: ఒకవైపు నగరాల్లోని భారీ మాల్స్‌లో రిటైల్ గిరాకీ తగ్గుముఖం పడుతోంది. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్ఈ తాజా నివేదిక ప్రకారం... దేశంలోని 8 ప్రధాన నగరాల షాపింగ్ మాల్స్‌లో రిటైల్ స్థలాల లీజింగ్ గతేడాది 10శాతం

మిగతా 3వ పేజీలో ▶

ఫాల్కన్ స్కామ్ రూ. 850 కోట్లు



భారీగా డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన కంపెనీ

మల్టీలెవెల్ మార్కెటింగ్ స్కీమ్‌ల పేరుతో దోపిడీ

- సింగపూర్, దుబాయ్, యూఏఈలోని షెల్ కంపెనీలకు నిధుల మళ్లింపు.. తెలుగు రాష్ట్రాల నుంచి మోసపోయింది సుమారు 7 వేలమంది
- ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: ఫాల్కన్ సంస్థ అధిక లాభాల ఆశ చూపించి అమాయకుల నుంచి భారీ మొత్తంలో డిపాజిట్లను సేకరించింది. ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ ప్లాట్‌ఫామ్ పేరుతో మల్టీలెవెల్ మార్కెటింగ్ స్కీమ్‌లతో ఏకంగా రూ.1,700 కోట్లు వసూలు చేసింది. ఇందులో రూ.850 కోట్లు డిపాజిటర్లకు తిరిగి చెల్లించగా, మిగిలిన రూ.850 కోట్లు తిరిగి చెల్లించకుండా బోర్డు తిప్పేసింది. తెలుగు రాష్ట్రాల్లో 6,979 మందిని

మిగతా 2వ పేజీలో ▶

మార్చి 9 నుంచి శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు

తిరుమల: తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు మార్చి 9–13 వరకు టీటీడీ నిర్వహించనుంది. ఈ రోజుల్లో రాత్రి 7– 8 గంటల వరకు పుష్కరిణిలో స్వామి, అమ్మ వారు దర్శనమివ్వనున్నారు. తెప్పోత్సవాల్లో తొలి రోజున శ్రీ సీతాలక్ష్మణఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తిగా.. రెండో రోజున రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామిగా.. మూడో రోజున శ్రీభూసమేతంగా మలయప్ప స్వామిగా.. నాలుగో రోజు 5 సార్లు, చివరి రోజు 7 సార్లు తెప్పపై స్వామివారు పుష్కరిణిలో విహరిస్తారని పేర్కొంది. ఈ కారణంగా మార్చి 9, 10వ తేదీల్లో సహస్రదీపాలంకార సేవ, మార్చి 11, 12, 13 తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల శ్రీవారిని కాశీ మఠాధిపతి శ్రీమద్ సమయమింద్ర తీర్థ స్వామీజీ, తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ కుమార్తె ఐశ్వర్య, ఆమె కుమారుడు ఆదివారం దర్శించుకున్నారు.

పత్తి తీసే యంత్రం రెడీ!

ట్రాక్టర్ ఆపరేటెడ్ బ్రష్ టైప్ కాటన్ హార్వెస్టర్ త్వరలో సిద్ధం



భోపాల్‌లోని ఐసీఏఆర్ సంస్థ సీఐఏఈ రూపకల్పన

95 శాతం సమర్థతతో గంటకు 150–217 కిలోల పత్తి తీత

'సాక్షి సాగుబడి' ముఖాముఖిలో

సీఐఏఈ వ్యవసాయ యాంత్రీకరణ విభాగాధిపతి వి.పి.చౌదరి వెల్లడి

సాక్షి సాగుబడి, హైదరాబాద్: దేశంలో అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే పంటల్లో వరి తర్వాత ముఖ్యమైనది పత్తి. వర్షాధారంగా గానీ, ఆరుతడి పంటగా గానీ దాదాపు 113 లక్షల హెక్టార్లలో పత్తిని సాగు చేస్తున్నప్పటికీ పత్తి తీయటానికి ఉపయోగపడే యంత్రం లేదు. మార్కెట్‌లో కనీసం ఒక్క హార్వెస్టర్ కూడా అందుబాటులో లేని ముఖ్యమైన పంట ఏదైనా ఉందంటే అది పత్తి మాత్రమే. రైతులు పత్తి తీతకు పూర్తిగా కూలీలపైనే ఆధారపడాల్సి రావటం, సీజన్‌లో రైతులందరికీ ఒకేసారి పత్తి తీసే అవసరం ఉండటంతో వారు అనేక కష్టాలు ఎదుర్కోక తప్పటం లేదు. కాటన్ హార్వెస్టర్ రాక కోసం రైతులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్న సమయంలో భోపాల్‌లోని కేంద్రీయ వ్యవసాయ ఇంజనీరింగ్ సంస్థ (సీఐఏఈ)లో వ్యవసాయ యాంత్రీకరణ విభాగాధిపతి వి.పి.చౌదరి తీపి కబురు చెప్పారు. ట్రాక్టర్‌కు జోడించి పత్తి తీసే యంత్రంపై తమ పరిశోధన కొలిక్కి వస్తోందని, త్వరలో ప్రొటోటైప్ సిద్ధమవుతుందని ఇటీవల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన చౌదరి 'సాక్షి సాగుబడి' తో చెప్పారు.



పత్తి తీతలో 95% సామర్థ్యం

ట్రాక్టర్‌కు జోడించి నడిపించే బ్రష్ టైప్ కాటన్ హార్వెస్టర్ పొలంలోని 95 శాతం పత్తిని సమర్థవంతంగా తీయగలుగుతోందని చౌదరి చెప్పారు. ఒక హెక్టారు పత్తి పొలంలో దూదిని పూర్తిగా తీయటానికి 1,560 గంటల మానవ శ్రమ అవసరమవుతోందని శాస్త్రవేత్తల అంచనా. ఒక మనిషి నిమిషానికి ఒకటిన్నర (1.58) మొక్కల నుంచి దూదిని తీస్తుంటే, తాము రూపొందించిన యంత్రం 70 మొక్కల నుంచి దూదిని తీస్తోందన్నారు. మనిషి గంటకు 4.92 కిలోల గింజల పత్తిని తీస్తుంటే, ఈ యంత్రం 150–217 కిలోలు తీస్తోందని తెలిపారు. అయితే పత్తి మొక్కల నుంచి దూదిని తీసే క్రమంలో 28 శాతం వరకు ఆకులు, రెమ్మలు తదితర చెత్త కూడా పత్తికి అంటుకొని వస్తోందన్నారు. ఈ యంత్రానికి ప్రీ క్లీనర్లను అమర్చటం ద్వారా చెత్తను 10–12 శాతానికి తగ్గించగలిగామని చెప్పారు. ప్రొటోటైప్ యంత్రాన్ని సిద్ధం చేసి టెక్నాలజీని కంపెనీలకు అందుబాటులోకి తెస్తామని చౌదరి వెల్లడించారు. దీని ధర మార్కెట్‌లో రూ.5 లక్షల వరకు ఉండొచ్చని తెలిపారు.

అనువైన వంగడాల లేమి!

పత్తి తీసే యంత్రం సిద్ధమైనంత మాత్రాన సమస్య తీరిపోదు. మిషీన్ హార్వెస్టింగ్‌కు అనువైన పత్తి వంగడాలు మన దగ్గర లేకపోవటం మరో ప్రధాన ప్రతిబంధకం. విదేశాల్లో పండించే పత్తి రకాలు యంత్రం వినియోగానికి అనువుగా ఉంటాయని చౌదరి వివరించారు. మొక్కకు ఒకే కొమ్మ (సింగిల్ షూట్) పెరుగుతుందని, అన్ని కాయలూ ఒకేసారి పక్వానికి వస్తాయన్నారు. అయితే, దేశంలో సాగయ్యే పత్తి మొక్కలకు అనేక కొమ్మలు వస్తాయని తెలిపారు. కాయలన్నీ ఒకేసారి పక్వానికి రావు.. పగలవని, అందుకే నాలుగైదు దఫాలుగా పత్తి తీయాల్సి వస్తోందని వివరించారు. కాయలన్నీ ఒకేసారి కోతకు వచ్చే పత్తి వంగడాన్ని రూపొందించడానికి నాగపూర్‌లోని కేంద్రీయ పత్తి పరిశోధనా కేంద్రంలో పరిశోధనలు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు. యంత్రంతో పత్తి తీయటానికి కొద్ది రోజుల ముందే పత్తి మొక్కల ఆకులను రాల్చేందుకు డీఫోలియంట్ రసాయనాన్ని పిచికారీ చేయాల్సి ఉంటుందన్నారు. దూదితో పాటు వచ్చే చెత్త శాతాన్ని తగ్గించటంలో ఇది కూడా కీలకమని చౌదరి చెప్పారు.

ఫాల్కన్ స్కామ్ రూ.850 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

మోసం చేసిన ఈ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్‌చేశారు. ఫాల్కన్ క్యాపిటల్ వెంచర్స్ కంపెనీ డైరెక్టర్ కావ్య నల్లూరి, బిజినెస్ హెడ్ పవన్ కుమార్ ఓడెలను సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) ఈనెల 15న అరెస్టు చేసినట్లు పోలీసులు చెప్పారు. ఆదివారం పోలీసు లు మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రధాన నిందితుడు ఫాల్కన్ ఎండీ అమర్‌దీప్ కుమార్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆర్యన్ సింగ్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ యోగేందర్ సింగ్‌లు క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అనుబంధ సంస్థ ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు ఇస్తామని ప్రజలకు ఆశ పెట్టారు. డిపాజిట్లను సేకరించేందుకు మొబైల్ యాప్, వెబ్‌సైట్‌ను సైతం రూపొందించారు.

22 శాతం వరకు రాబడి: నిందితులు 2021లో డిపాజిట్ల సేకరణను ప్రారంభించారు. రూ.25 వేల నుంచి రూ.9 లక్షల డిపాజిట్ చేస్తే 45 నుంచి 180 రోజుల వ్యవధికి 11–22% రాబడిని ఇస్తామని నమ్మబలికారు. దీనికి ఆకర్షితులైన ప్రజలు పెద్ద ఎత్తున డిపాజిట్లు చేశారు. డిపాజిటర్లకు రాబడిని అందించే క్రమంలో నిరంతరం కొత్త డిపాజిట్లను జోడిస్తూ వెళ్లారు. 2025 జనవరి 15న నాటికి ఈ స్కీమ్ ఆగిపోయింది. అయితే అప్పటికే డిపాజిటర్లకు చెల్లింపులు నిలిపివేసి కార్యాలయానికి తాళం వేసేశారు. దీంతో డిపాజిటర్లు లబోదిబోమంటూ సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు బీఎన్ఎస్‌తోపాటు తెలంగాణ స్టేట్ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–1999లోని పలు సెక్షన్ల కింద 19 మందిపై కేసు నమోదు చేశారు. సాంకేతిక ఆధారాలతో ఈనెల 15న ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, మిగిలిన వారు పరారీలో ఉన్నారు.

షెల్ కంపెనీలకు సొమ్ము

జనాల నుంచి సేకరించిన డిపాజిట్ల మొత్తాన్ని మన దేశంతోపాటు సింగపూర్, దుబాయ్, యూఏఈ వంటి దేశాల్లోని షెల్ కంపెనీలకు మళ్లించారు. కాయిన్ ట్రేడ్, బ్లూలైఫ్ ఇంటర్నేషనల్ ఇండియా, యుకియో రిసార్ట్, ప్రెస్టీజ్ జెట్స్, ఫాల్కన్ ఇంటర్నేషనల్ ప్రాపర్టీస్, ఆర్‌డీపీ, రెట్ హెర్బల్స్ అండ్ రెట్ హెల్త్‌కేర్, ఎంబీఆర్–1, క్యాపిటల్ టెక్సోల్, విర్గో గ్లోబల్, ఓజేఏఎస్, హాష్‌బ్లాక్, వెల్‌ఫెల్లా ఇంక్, స్వస్తిక్ నెయ్యి వంటి షెల్ కంపెనీలకు నిధులను మళ్లించారు. నిందితులు గతంలోనూ ఇదే తరహా మోసాలకు పాల్పడ్డారు. బ్లూలైఫ్ ఇంటర్నేషనల్ మల్టీలెవెల్ మార్కెటింగ్ కంపెనీ ద్వారా మోసం చేసినట్లు 2022లో చేవెళ్ల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

రాగిముద్ద, జొన్న సంకటితో అందరికీ ఆరోగ్యం

జీవన శైలి మార్చుకుంటే షుగర్‌ను రివర్స్ చేసుకోవచ్చు

- చిరు ప్రాయంలోనే 20 శాతం మంది స్థూలకాయులు
- అందుకే యువతలో పెరుగుతున్న మరణాలు
- హోమా టెస్ట్‌తో భవిష్యత్‌లో వచ్చే వ్యాధుల గుర్తింపు

'సాక్షి'తో ఇంటర్నల్ మెడిసిన్ ప్రొఫెసర్ సురేంద్ర నెఫ్రూ

సాక్షి ఇంటర్వ్యూ





కర్నూలు (హాస్పిటల్): 'ఇటీవలి కాలంలో చాలా మంది యువత అర్ధాంతరంగా మరణిస్తున్నారు. కొందరు నడుస్తూ.. మరికొందరు ఆడుతూ పాడుతూ, ఇంకొందరు జిమ్ చేస్తూ తనువు చాలిస్తున్నారు. దీనికంతటికీ కారణం వారిలో అంతర్లీనంగా కొవ్వు నిల్వలు పెరిగి పోవడమే. వారికి తెలియకుండానే బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) పెరిగిపోతోంది. దీనికి చెక్ పెట్టకపోతే దేశంలో అధిక శాతం బీపీ, షుగర్, గుండె జబ్బులతో బాధపడే వారే కనిపిస్తారు' అని హైదరాబాద్ గచ్చిబౌలిలోని కోమా హెల్త్‌కేర్ సెంటర్ ఇంటర్నల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.సురేంద్ర నెఫ్రూ చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎంఈ, అలుమ్ని మీట్‌కు హాజరైన ఆయన ఆదివారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

తెలియకుండానే కొవ్వు నిల్వలు

సాధారణంగా మనిషి బరువెక్కితే పొట్ట భాగంతో పాటు కాళ్లు, చేతులు కూడా లావు కావాలి. కానీ పొట్ట మాత్రమే లావుగా ఉండి, కాళ్లు.. చేతులు సన్నగా ఉంటున్నాయి. దీని కారణంగా పొట్ట చుట్టు కొలత పెరిగిపోతోంది. సాధారణంగా మనిషి బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 18 లోపు ఉంటే తక్కువగా ఉన్నట్లు. 35 పైన ఉంటే హై, 45 పైన ఉంటే సివియర్ హైగా ఉన్నట్లు గుర్తించాలి. మన దేశంలో ఎక్కువ మంది 60–80 కిలోల బరువు ఉంటున్నారు. సగటు ఎత్తు 5.5 అడుగులు. ఈ ఎత్తుకు ఆ బరువు ఎక్కువ. మన దేశంలో 1977కు ముందు ప్రతి వెయ్యి మందిలో ఇద్దరు మాత్రమే స్థూలకాయులుండేవారు. ఇప్పుడు ఆ సంఖ్య వంద మందిలో 20కి చేరింది. పొట్ట చుట్టు కొలత 33 ఇంచులు దాటితే వారికి భవిష్యత్‌లో బీపీ, షుగర్, గుండెపోటు వచ్చేందుకు అవకాశాలు ఉన్నాయి. స్వాతంత్ర్యానికి ముందు కూడా మనవాళ్లు బియ్యమే అన్నం వండుకుని తిన్నా ఆరోగ్యంగా ఉన్నారు. అప్పట్లో దంపుడు బియ్యం ఎక్కువగా తినేవారు. వరికి దిగుబడి తక్కువగా వచ్చేది. వరికి జీన్ మార్పిడి చేయడం వల్ల దిగుబడి పెరిగింది. ఇప్పుడు యంత్రాల ద్వారా పాలిష్ పట్టుకుని తింటున్నారు. దీనివల్ల బియ్యంలో నాణ్యత దెబ్బతింటోంది. దీనివల్లే స్థూలకాయుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ కారణంగా ఒంట్లో కొవ్వు నిల్వలు పెరిగిపోయి భవిష్యత్‌లో బీపీ, షుగర్, గుండె జబ్బులు అధికం అవుతున్నాయి.

మందుల కంటే ఆహారమే ముఖ్యం

స్వాతంత్ర్యానికి పూర్వం మనవాళ్లు రోజుకు వెయ్యి గ్రాముల ఫైబర్ తినేవారు. కానీ ఇప్పుడు 100 గ్రాములు కూడా తినడం లేదు. ఇప్పటి అవసరాలకు రోజుకు కనీసం 500 గ్రాములైనా ఫైబర్ తినాలి. ఒకప్పుడు రాయలసీమలో తినే ఆహారపు అలవాట్లు ఇప్పుడు ఎంతో మేలు చేస్తాయి. రాగుల ద్వారా చేసే సంకటి (రాగిముద్ద), సజ్జలు, కొర్ర బియ్యం, దంపుడు బియ్యం, దొడ్డు బియ్యంతో చేసిన ఆహారాలు వ్యాధులను తగ్గిస్తాయి. రోజుకు 7–8 గంటల నిద్రతోపాటు కనీసం నాలుగైదు కిలోమీటర్లు నడవాలి. మోకాళ్ల నొప్పులున్న వారు స్విమ్మింగ్ పూల్‌లో నడిచినా, ఈత కొట్టినా సరిపోతుంది. ఇసుకలో చెప్పులు లేకుండా నడిస్తే మోకాళ్ల నొప్పులు గణనీయంగా తగ్గుముఖం పడతాయి. షుగర్‌కు ఇప్పుడు కొత్త కొత్త మందులంటూ ఎక్కువగా వాడుతున్నారు. దీనివల్ల సైడ్‌ఎఫెక్ట్స్ అధికం అవుతాయి. ముఖ్యంగా హోమియో స్టాసిస్ ఆఫ్ ఇన్సులిన్ అసెస్‌మెంట్ టెస్ట్ (హోమా) చేయించుకోవాలి. దీనివల్ల భవిష్యత్‌లో వచ్చే బీపీ, షుగర్, గుండె జబ్బుల గురించి ముందే తెలుసుకోవచ్చు.

ఓ లింగా.. ఓ లింగా..

వైభవంగా పెద్దగట్టు జాతర ప్రారంభం



దురాజ్‌పల్లిలోని పెద్దగట్టు ఆలయం చుట్టూ మంద గంపలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

సూర్యాపేట: 'ఓ లింగా.. ఓ లింగా..'నామస్మరణతో సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర మార్మోగింది. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతర ఆదివారం అర్ధరాత్రి మంద గంపల ప్రదక్షిణలతో వైభవంగా ప్రారంభమైంది. మొదటి రోజు వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ట్రాక్టర్లు, ఆటోలు, డీసీఎంలలో పెద్దగట్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా యాదవులు సంప్రదాయ దుస్తుల్లో డోలు వాయిద్యాలు, భేరీల చప్పుళ్లు, కటారు విన్యాసాలు చేస్తూ ఓ లింగా.. నామస్మరణతో గట్టుపైకి వచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి పూజలు చేశారు. జాతర మొదటిరోజులో భాగంగా సూర్యాపేట మండలం కేసారం గ్రామం నుంచి దేవరపెట్టెను యాదవ కులస్తులు కాలినడకన ఊరేగింపుగా పెద్దగట్టుకు చేర్చారు. అంతకు ముందు కేసారం గ్రామంలో దేవరపెట్టెలోని దేవతామూర్తులకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి వేర్వేరుగా పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి కూడా ప్రత్యేక పూజలు చేశారు. కాగా, సోమవారం.. చౌడమ్మతల్లికి బోనాలు సమర్పించనున్నారు. జాతర రెండోరోజు అత్యంత ముఖ్యమైన ఘట్టం కావడంతో భక్తులు లక్షల్లో తరలివచ్చే అవకాశం ఉందని చెపుతున్నారు. ఇదిలా ఉండగా, పెద్దగట్టు జాతర నేపథ్యంలో విజయవాడ నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి విజయవాడ, ఖమ్మం వైపు వెళ్లే వాహనాలను పోలీసులు దారిమళ్లిస్తున్నారు.

'తెలంగాణ నీటి ప్రయోజనాలకు గండి'



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నీటి ప్రయోజనాలకు ఏపీ ప్రభుత్వం గండి కొడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కృష్ణా జలాలను ఏపీ అడ్డూఅదుపూ లేకుండా తరలించుకుపోతుంటే సీఎం, నీటి పారుదల శాఖమంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10 వేల క్యూసెక్కులను ఏపీ తరలిస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనం పాటిస్తోందని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హరీశ్‌రావు ప్రశ్నించారు. ఏడాదిలోనే 646 టీఎంసీలు తరలిస్తున్నా ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. తెలంగాణ తాగునీటి అవసరాలకు శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నిలువ చేయాల్సిన కోటాను ఏపీ తీసుకెళ్తోందని తెలిపారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో మిగులు నిల్వలు లేకున్నా పోతిరెడ్డిపాడు, సాగర్ కుడి కాల్వ ద్వారా ఇప్పటికే ఏపీ నీటిని తరలిస్తూ మొండిగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఏపీ నీటి దోపిడీని అడ్డుకునేందుకు కృష్ణా బోర్డుపై ఒత్తిడి తేవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

నేడు కేసీఆర్ జన్మదిన వేడుకలు

71 కిలోల భారీ కేక్ సిద్ధం.. తెలంగాణ భవన్‌లో ప్రత్యేక డాక్యుమెంటరీ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు 71వ జన్మదిన వేడుకలు సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహిస్తారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో భాగంగా 71 కిలోల భారీ కేక్‌ను కట్ చేస్తారు. కేసీఆర్ రాజకీయ ప్రస్థానాన్ని వివరించేలా రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శిస్తారు. డప్పు కళాకారులు, గిరిజన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. తెలంగాణ భవన్‌లో జరిగే కేసీఆర్ జన్మదిన వేడుకల ఏర్పాట్లను మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు హాజరవుతారు. రాష్ట్రవ్యాప్తంగా పండ్ల పంపిణీ, అన్నదానం, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు, దేవాలయాల్లో పూజలు నిర్వహిస్తారని తలసాని వెల్లడించారు. మాజీ మంత్రి మహమూద్ అలీ, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించిన వారిలో ఉన్నారు. కాగా, కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా 'వృక్షార్చన'లో భాగంగా పంజగుట్టలోని జలగం వెంగళరావు పార్కులో 40 మంది మాజీ కార్పొరేషన్ల చైర్మన్లు మొక్కలు నాటారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు జోగినిపల్లి సంతోష్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు.

డిస్కంల నష్టాలు రూ.67,276 కోట్లు



వీటిలో టీజీఎస్పీడీసీఎల్ నష్టాలు రూ.47,239.15 కోట్లు..

టీజీఎన్పీడీసీఎల్‌వి రూ.20,036.92 కోట్లు

విద్యుత్ కొనుగోళ్లకు అధిక వ్యయం చేయడమే కారణం

ఈఆర్సీకి నివేదించిన దక్షిణ, ఉత్తర తెలంగాణ డిస్కంలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు ఆర్థిక సంక్షోభం అంచున కొట్టుమిట్టాడుతున్నాయి. ఏటేటా పేరుకుపోతున్న నష్టాలు కొండలాగా పెరిగి చివరకు డిస్కంలను దివాళా పట్టించేలా మారాయి. ఉత్తర/దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్ / టీజీఎన్పీడీసీ ఎల్)లు రాష్ట్రంలో విద్యుత్ సరఫరా చేస్తున్నాయి. ఏటేటా పెరిగిపోతున్న రెండు డిస్కంల ఆర్థిక నష్టాలు 2023–24 నాటికి రూ.67,276.07 కోట్లకు ఎగబాకాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి ఇటీవల రెండు డిస్కంలు సమర్పించిన 2025–26కి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ బిజినెస్, వీలింగ్ టారిఫ్ ప్రతిపాదనలపై విద్యుత్ రంగ నిపుణుడు ఎం.వేణుగోపాల్ రావు లేవనెత్తిన పలు అభ్యంతరాలకు వివరణ ఇస్తూ ఈ వివరాలు వెల్లడించాయి.

నష్టాల్లో దక్షిణ తెలంగాణ డిస్కం టాప్

దక్షిణ తెలంగాణలోని ఉమ్మడి ఐదు జిల్లాల్లో వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసే టీజీఎస్పీడీసీఎల్ 2023–24లో రూ.4,909. 53 కోట్ల నష్టాలను మూటగట్టుకోగా.. సంస్థ మొత్తం నష్టాలు రూ.47,239.15 కోట్లకు ఎగబాకాయి. ఇక ఉత్తర తెలంగాణలోని ఐదు ఉమ్మడి జిల్లాల్లో విద్యుత్ సరఫరా చేసే టీజీఎన్పీడీసీఎల్ 2023–24లో రూ.1441.18 కోట్ల నష్టాల ను చవిచూడగా మొత్తం రూ.20,036.92 కోట్లకు పెరిగిపోయాయి. అంటే, రెండు డిస్కంలు కలిపి 2023–24లో రూ.6350.71 కోట్ల నష్టాలను మూటగట్టుకున్నట్టు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఏటేటా నష్టాలు ఇదే తీరులో కొనసాగితే మరో ఐదారేళ్లలో నష్టాల మొత్తం రూ.లక్ష కోట్లకు చేరే సూచనలు కనిపిస్తున్నాయి.

టీజీఎస్పీడీసీఎల్ నష్టాలు ఇలా.. (రూ.కోట్లలో)

ఆర్థిక సంవత్సరం	నష్టాలు
2019 నాటికి	24,362.30
2019-20	4933.41
2020-21	4245.96
2021-22	626.8
2022-23	8147.48
2023-24	4909.53
మొత్తం	47,239.15

సర్కారు అదనపు సహాయం ఇస్తేనే..

పెరిగిన విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టు వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడం కోసం విద్యుత్ కొనుగోళ్లకు అధిక వ్యయం చేయడంతోనే భారీ నష్టాలను చవిచూడాల్సి వచ్చిందని రెండు డిస్కంలు స్పష్టం చేశాయి. అయితే, ప్రభుత్వ శాఖలకు సరఫరా చేసిన విద్యుత్‌కి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు టీజీఎస్పీడీసీఎల్ పేర్కొంది. వివిధ గ్రాంట్లు, పథకాల కింద ప్రభుత్వం అదనపు సహాయాన్ని అందిస్తే నష్టాలను అధిగమిస్తామని టీజీఎస్పీడీసీఎల్ వివరించింది.

భూముల లెక్కలు పక్కా!

▶ మొదటి పేజీ తరువాయి

పేర్కొంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో భూముల సర్వేకు మార్గం సుగమం అయినట్లేనని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇందుకు అవసరమైన నిధులు కోరామని, ప్రభుత్వం అంగీకరిస్తే భూముల పైలట్ సర్వే ప్రారంభం అమవుతుందని ఆ శాఖ వర్గాలు చెప్తున్నాయి.

రూ.800 కోట్లపైనే అవసరం

తెలంగాణలో భూముల సర్వే కోసం రూ.800 కోట్ల నుంచి రూ.1,000 కోట్ల వరకు అవసరమని భూచట్టాల నిపుణులు చెప్తున్నారు. గతంలో అంచనా వేసినప్పుడే రాష్ట్రంలోని భూములన్నింటినీ సర్వే చేసేందుకు రూ.560 కోట్లు కావాలని తేలిందని, ప్రస్తుతం అధునాతన సాంకేతిక నైపుణ్యాలతో కచ్చితమైన సర్వే చేసేందుకు రూ.800 కోట్లు అవసరమని అంచనా వేశారు. అయితే భూముల సర్వే కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్‌లో నిధులు చూపాల్సిన అవసరం లేదని, కేంద్రానికి ప్రతిపాదనలు పంపి భూముల సర్వేకు సిద్ధమైతే కేంద్రమే పూర్తిస్థాయిలో నిధులిస్తుందని చెబుతున్నారు. సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం... తెలంగాణలో భూముల డిజిటల్ సర్వేను 3–6 నెలల్లో పూర్తి చేయవచ్చని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ప్రకారం భూముల సర్వే పెద్ద సమస్య కాబోదని భూచట్టాల నిపుణులు పేర్కొంటున్నారు. కానీ భూముల సర్వే తర్వాత సెటిల్‌మెంట్ అవసరమని, భూమిని కొలవడమే కాకుండా ల్యాండ్ పార్శిల్ ఎవరిదో నిర్ధారణ చేయడమే అసలు సమస్య అని చెబుతున్నారు. ఇందుకు నిధులతో పనిలేదని రాజకీయ నిబద్ధత, ప్రజల భాగస్వామ్యంతోపాటు రెవెన్యూ శాఖకు అవసరమైన సిబ్బంది కావాలని పేర్కొంటున్నారు. పదేళ్ల క్రితం గుజరాత్‌లో ప్రైవేటు సంస్థలతో భూముల సర్వే నిర్వహించినా.. ఇప్పటికీ సెటిల్‌మెంట్ సమస్యతో ఇబ్బందులు వస్తున్నాయని వివరిస్తున్నారు. అలా సర్వే పూర్తయిన తర్వాత సమస్యలు రాకుండా తెలంగాణలో కూడా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఇప్పటివరకు ఈటీఎస్ విధానంలో...

భూముల సర్వే కోసం రాష్ట్రంలో గతంలో చైన్, క్రాస్ టాప్ పద్ధతులను అనుసరించేవారు. గొలుసు పద్ధతిలో సర్వే నిర్వహించడం చాలా కష్టమన్న ఉద్దేశంతో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టిపెట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో భూముల సర్వే కోసం ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్ (ఈటీఎస్) పద్ధతిని ఉపయోగిస్తున్నారు. మండల సర్వేయర్లు, రెవెన్యూ శాఖ ఇదే పద్ధతిలో అవసరమైన చోట భూముల సర్వే చేస్తున్నారు. అయితే ప్రస్తుతం గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్), డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (డీజీపీఎస్) అందుబాటులోకి వచ్చాయని.. అన్నింటికంటే ఉత్తమమైన డ్రోన్ సర్వే కూడా చేయవచ్చని.. వీటితో మైదాన ప్రాంతాల్లో 99.9 శాతం కచ్చితత్వంతో సర్వే చేయవచ్చని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. అత్యాధునిక 'రియల్‌టైమ్ కైనమాటిక్' పద్ధతిలో లైడార్ స్కానింగ్, మొబైల్ మ్యాపింగ్‌ల ద్వారా డ్రోన్ ఆధారిత ఏరియల్ సర్వే ఉత్తమమైనదని పేర్కొంటున్నాయి. అయితే రెవెన్యూ శాఖ చేసిన భూముల సర్వే ప్రతిపాదనపై ప్రభుత్వం చివరికి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది తేలాల్సి ఉంది.

ఎన్నో ప్రయోజనాలు.. కొన్ని సమస్యలు..

రాష్ట్రంలో భూముల సర్వేతో అనేక ప్రయోజనాలు చేకూరుతాయని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణలో ఎప్పుడో నిజాం కాలంలో భూముల సర్వే జరిగింది. ఆ తర్వాత ఇప్పటివరకు రీసర్వే జరగలేదు. నాటి రికార్డులే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఇప్పుడు పూర్తిస్థాయిలో భూముల సర్వే జరిగితే రికార్డులు మరింత పకడ్బందీగా రూపొందుతాయని భూచట్టాల నిపుణులు చెబుతున్నారు. భూముల సర్వేతో దాదాపు అన్ని రకాల భూవివాదాలకు చెక్ పడుతుందని, ప్రతి భూకమతం హద్దులు పక్కాగా తేలుతాయని వివరిస్తున్నారు. ప్రభుత్వ, రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దులు కూడా పక్కగా గుర్తించవచ్చని అంటున్నారు. సర్వే ద్వారా వ్యక్తులు, సంస్థల మధ్య ఉండే భూవివాదాలే కాకుండా.. ప్రభుత్వ శాఖల మధ్య ఉండే భూవివాదాలు కూడా పరిష్కారమయ్యే అవకాశాలు ఉంటాయని పేర్కొంటున్నారు. ఏ సర్వే నంబర్‌లో ఎవరికి ఎంత భూమి ఉందనే అంశం కూడా వెల్లడవుతుందని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఆమోదించిన భూభారతి చట్టంలో కూడా భూముల రీసర్వేకు అవకాశం కల్పించడంతోపాటు ప్రతి భూకమతానికి పక్కాగా భూదార్ నంబర్ ఇచ్చేలా నిబంధనలు పొందుపరిచారని అధికారులు గుర్తు చేస్తున్నారు. ''తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో రైతుల భూమి ఒక సర్వే నంబర్‌లో ఉంటే.. వారి రికార్డుల్లో మరో సర్వే నంబర్ నమోదైంది. ఇలాంటి సమస్యలకు కూడా భూముల సర్వేతో పరిష్కారం లభించే అవకాశం ఉంది..'' అని రెవెన్యూ వర్గాలు అంటున్నాయి.

సిబ్బంది కొరతతో ఇబ్బంది

భూముల సర్వేలో కొన్ని సమస్యలు కూడా ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని రెవెన్యూ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది కొరత భూముల సర్వేకు విఘాతంగా మారుతుందని.. కొన్ని సందర్భాల్లో రైతుల నుంచి కూడా ప్రతిఘటన ఎదురయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని పేర్కొంటున్నాయి. భూవిస్తీర్ణంలో తేడాలు, కబ్జాలోని తేడాలను రైతులు అంగీకరించే పరిస్థితి ఉండదని.. ఇలాంటి సమస్యలకు సంబంధించి ప్రభుత్వం ముందుగానే ఓ నిర్ణయం తీసుకుంటే మంచిదని భూచట్టాల నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపి, పక్కాగా లెక్కలు తేల్చగలిగితేనే భూముల సర్వే వల్ల ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు.

సమగ్ర సర్వే కోసం బీసీ కమిషన్ పర్యటన

- జీహెచ్ఎంసీ పరిధిలో కమిషన్ చైర్మన్, సభ్యుల అవగాహన కార్యక్రమాలు
- వివరాలు ఇవ్వనివారి కోసం మరోమారు కుటుంబ సర్వే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో పాల్గొనని వారు నమోదు చేసుకోవడంకోసం మరోమారు అవకాశం కల్పిస్తూ ఆదివారం నుంచి వివరాల సేకరణ చేపట్టింది. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే ఎక్కువమంది నమోదు చేసుకోనివారు ఉన్నట్టు గుర్తించారు. దీంతో ఆయా కుటుంబాల వివరాలను నమోదు చేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు కసరత్తు చేపట్టగా, రాష్ట్ర బీసీ కమిషన్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా వార్డుల వారీగా కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్ తదితరులు క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టారు. మిస్సింగ్ హౌస్‌హోల్డ్స్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పర్యటించి అవగాహన కల్పిస్తున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా సర్వేలో పాల్గొనని కుటుంబాలు 3.6 లక్షలు ఉన్నాయి. ఇందులో సగానికిపైగా జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉన్నాయని చెపుతున్నారు. ఈ నేపథ్యంలో సర్వేకు సహకరించని వారికి బీసీ కమిషన్ సభ్యులు అవగాహన కల్పించి, వివరాలు నమోదు చేసుకునేలా చైతన్యపరుస్తున్నారు. తాజా సర్వే జరిగినన్ని రోజులు నిర్దేశించుకున్న ప్రాంతాల్లో పర్యటనలు చేపట్టనున్నట్లు రాష్ట్ర బీసీ కమిషన్ ప్రకటించింది.

నేటి నుంచి రెండో ఏఎన్ఎంల సమ్మెబాట

- చర్చలకు ఆహ్వానించకపోవడంతో సమ్మెకు..
- రెండో ఏఎన్ఎంల సంఘం గౌరవాధ్యక్షుడు రామాంజనేయులు

సాక్షి, హైదరాబాద్: తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని రెండవ ఏఎన్ఎంలు సోమవారం నుంచి సమ్మెబాట పట్టాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని 636 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), 235 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (యూపీహెచ్‌సీలు) పనిచేస్తున్న వేలాది మంది రెండో ఏఎన్ఎంలు సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించారు. గత నెల 27న ఏఐటీయూసీ రెండవ ఏఎన్ఎం సంఘం ఆధ్వర్యంలో కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కలిసి వినతిపత్రంతో పాటు సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెలోకి వెళ్తామని నోటీసు ఇచ్చారు. అన్ని జిల్లాల్లోని జిల్లా వైద్యాధికారులకు కూడా సమ్మె నోటీసులు, వినతిపత్రాలు అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 3,422 మంది రెండవ ఏఎన్ఎంలు పనిచేస్తున్నారని ఏఐటీయూసీ రెండో ఏఎన్ఎంల సంఘం గౌరవ అధ్యక్షుడు తోట రామాంజనేయులు తెలిపారు. ప్రభుత్వం రెండో ఏఎన్ఎంలుగా ఉన్న వారిని మొదటి ఏఎన్ఎంలుగా పర్మినెంట్ చేయాలని, జనాభాకు తగిన విధంగా కొత్తగా రెండో ఏఎన్ఎం పోస్టులకు నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఓల్గాకు కృష్ణమూర్తి సాహిత్య పురస్కారం ప్రదానం



ఏలూరు (ఆర్ఆర్‌పేట): తన రచనల ద్వారా ఓల్గా 50 ఏళ్లుగా తెలుగు సమాజాన్ని ప్రభావితం చేస్తున్నారని ప్రొఫెసర్ చుండూరి మృణాళిని అన్నారు. ఏలూరు నగరానికి చెందిన గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఆదివారం రచయిత్రి ఓల్గాకు శ్రీ కృష్ణమూర్తి సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మృణాళిని మాట్లాడుతూ.. ఓల్గా తన రచనల ద్వారా నాటి నుంచి నేటి వరకు రచయితలను ప్రభావితం చేస్తూనే ఉన్నారన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ సాహిత్య పోషణ, సేవా దృక్పథం ఒకే వ్యక్తిలో ఉండటం అరుదని, మడుపల్లి మోహన గుప్తా ఈ రెండు దృక్పథాలతో ముందుకు సాగుతున్నారని కొనియాడారు. తనను ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక చేసిన గుప్తా ఫౌండేషన్ ప్రతినిధులకు ఓల్గా కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం కింద ఓల్గాకు రూ.3 లక్షల నగదు అందజేశారు.

ఆ రోజు ఇల్లు కదలరు.. ముద్ద ముట్టరు

ప్రతి శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి.. శనివారం సాయంత్రం 6 గంటల వరకు దైవ చింతనే

ఇళ్లు, వాకిళ్లను ఊడవరు | సిగరెట్, కల్లు, మద్యం ముట్టరు | లహరి కృష్ణ భక్తుల ఆచారం



ఎల్లారెడ్డిలోని ఎర్రమన్నుకుచ్చ ముఖచిత్రం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: తెలవారకముందే ఊళ్ల వెంట తిరుగుతూ పాత ఇనుప సామగ్రి కొనుగోలు చేసి, వాటిని అమ్ముకుని పొట్టపోసుకునే ఆ కుటుంబాలు.. వారంలో ఒక రోజు మాత్రం ఇల్లు వదిలి బయటకు వెళ్లరు. ఆ రోజు ఇల్లు, వాకిలి కూడా ఊడ్వరు. పొయ్యి వెలిగించేది అసలే లేదు. రోజంతా వాళ్లు ఆధ్యాత్మిక చింతనలోనే గడుపుతారు. వాళ్లే లహరి కృష్ణ భక్తులు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రమన్నుకుచ్చ ప్రాంతంలో బుడగ జంగాల కులానికి చెందిన 110 కుటుంబాలున్నాయి. వారు దశాబ్దాలుగా శ్రీ లహరి కృష్ణ ఆధ్యాత్మిక చింతనలో గడుపుతున్నారు. ప్రతి ఇంటి ముందు లహరి కృష్ణకు సంబంధించిన జెండా ఒకటి రెపరెపలాడుతూ ఉంటుంది. ఈ సంప్రదాయంలో కొబ్బరికాయ కొట్టడం, అగరొత్తులు వెలిగించడం ఉండవు. ఏటా అక్టోబర్ 3న జెండా పండుగ నిర్వహిస్తారు. పండుగపూట శాకాహార భోజనం.. అదీ అందరూ ఒకే చోట చేస్తారు.

ఆ 24 గంటలు ప్రత్యేకం

వీరు శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి శనివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక దినచర్యను పాటిస్తారు. ఆ సమయంలో ఇంట్లో పొయ్యి వెలిగించరు. పిల్లల కోసం ముందు రోజు వండిన ఆహారంలో కొంత మిగిలించి శనివారం తినిపిస్తారు. పెద్దవాళ్లయితే ఆ రోజంతా ఏమీ తినరు. సిగరెట్, బీడీలు, మద్యం ముట్టరు. శనివారం కనీసం ఇళ్లు, వాకిళ్లు కూడా ఊడవరు. అందరూ శనివారం ఇంటి వద్దే ఉంటారు. ఎంత పని ఉన్నా శనివారం సాయంత్రం 6 గంటల తర్వాతే బయటకు వెళతారు. శనివారం ఎవరైనా చనిపోయినా అంత్యక్రియలు కూడా చేయరు.



అందరం నియమాలు పాటిస్తాం

ఇక్కడ ఉన్న వాళ్లందరూ పేద, మధ్య తరగతివారే. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి శనివారం సాయంత్రం 6 గంటల వరకు ఇంట్లో పొయ్యి వెలిగించరు. లహరి కృష్ణ సమాజంలోని అన్ని కుటుంబాలు ఈ ఆచారాన్ని పాటిస్తాయి.


– దాసరి శ్రీనివాస్, ధ్యానమందిరం నిర్వాహకుడు

గ్రామంలోని శ్రీ లహరి కృష్ణ స్తుతి ధ్యాన మందిరంలో శనివారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రార్థనలు చేస్తారు. ఆ తర్వాతే బయటకు వెళతారు. భగవద్గీత, బైబిల్, ఖురాన్.. ఇలా అన్నింటినీ పాటిస్తామని వీరు చెబుతున్నారు.

ఎయిర్‌పోర్ట్స్.. మాలా‘మాల్’!

▶ మొదటి పేజీ తరువాయి

తగ్గిపోవడం గమనార్హం. అదే ఎయిర్‌పోర్టుల్లోని మాల్స్ మాత్రం కిటకిటలాడి పోతున్నాయి. జీఎంఆర్‌కు ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి వాణిజ్య అద్దెల రూపంలో ఏకంగా రూ.597 కోట్లు (2024 డిసెంబర్‌తో ముగిసిన 9 నెలల కాలంలో) లభించడం విశేషం. ప్రయాణికుల రద్దీ చూస్తే.. దేశీ ట్రాఫిక్‌లో 17 శాతం, అంతర్జాతీయ ట్రాఫిక్‌లో 28 శాతంతో ఢిల్లీ ఎయిర్‌పోర్టు టాప్‌లో ఉంది. ఎయిర్‌పోర్టు ఆదాయంలో 28 శాతం రిటైల్, డ్యూటీ–ఫ్రీ షాపుల ద్వారా, 18 శాతం అద్దెల ద్వారా లభించగా, మరో 10 శాతం ఆహార–పానీయాల అమ్మకం ద్వారా తోడైంది. ఢిల్లీ ఎయిర్‌పోర్టు డ్యూటీ–ఫ్రీ షాపుల్లో ఒక్కో ప్రయాణికుడి సగటు ఖర్చు రూ.1,026 కావడం గమనార్హం.



ప్రపంచవ్యాప్తంగా ఇదే ట్రెండ్..

ఎయిర్‌పోర్టుల విమాన సంబంధ ఆదాయాల్లో.. ల్యాండింగ్ ఫీజులు, విమానాల పార్కింగ్ చార్జీలు, ప్రయాణికుల సెక్యూరిటీ ఫీజులు, విమానాల టెర్మినల్ స్పేస్ అద్దెలు, గేట్లు, సర్వీసులకు సంబంధించి వినియోగ ఫీజులు కీలకమైనవి. అయితే అంతపెద్ద ఏరియాలో కార్యకలాపాలను నిర్వహించేందుకు ఈ ఆదాయం ఏ మూలకూ సరిపోదు. అందులోనూ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టులు భారీ పెట్టుబడులు, వ్యయ ప్రయాసలతో కూడుకున్నవి. అందుకే ఎయిర్‌పోర్టులను ఫైవ్‌స్టార్ మాల్స్‌గా మార్చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి కంపెనీలు. ప్రపంచవ్యాప్తంగా ఎయిర్‌పోర్టులన్నీ నాన్–ఏరో బిజినెస్‌లపైనే ఫోకస్ చేస్తున్నాయి. సింగపూర్ చాంగి ఎయిర్‌పోర్టుకు కూడా 55 శాతం ఆదాయం నాన్–ఏరో కార్యకలాపాల ద్వారానే వస్తోంది. రిటైల్, డ్యూటీ–ఫ్రీ, ఫుడ్–బేవరేజ్ షాపులకు అధిక స్పేస్ కేటాయిస్తుండటంతో ఎయిర్‌పోర్టులు మాల్స్‌ను తలపిస్తున్నాయి. దీంతో షాపింగ్ స్పేస్ పెరిగిపోయి విమానాశ్రయాలు ఇరుకై పోయాయంటూ ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు కూడా వెల్లువెత్తుతున్నాయి. అంతర్జాతీయంగా ఎయిర్‌పోర్టుల నాన్–ఏరో ఆదాయం సగటున 40–50 శాతం కాగా.. మన దగ్గర దానికి మించి ఉండటం విశేషం. ఆదాయం కోసం మాల్ సదుపాయాలను విస్తరించినప్పటికీ.. ప్రయాణికుల సౌకర్యాలను మరింత మెరుగ్గా ప్లాన్ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇందుకోసం దుబాయ్, చాంగి ఎయిర్‌పోర్టులను ఆదర్శంగా తీసుకోవాలని అంటున్నారు.

భారత్‌లో అతిపెద్ద మాల్.. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో..

28 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం (బిల్టప్ ఏరియా)తో దేశంలోనే అతిపెద్ద మాల్ ఢిల్లీ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని జీఎంఆర్ ఏరోసిటీలో ఏర్పాటవుతోంది. 2027 మార్చి కల్లా ఈ మెగా మాల్ అందుబాటులోకి వస్తుందని అంచనా. దీని అండర్ గ్రౌండ్‌లో 8,000కుపైగా కార్లు పార్క్ చేయొచ్చట! వరల్డ్ మార్క్ ఏరోసిటీ పేరుతో 2.5 బిలియన్ డాలర్లతో చేపట్టిన ఫేజ్–2 విస్తరణ ప్రాజెక్టులో భాగమిది. భారత్‌లో తొలి ‘ఏరోట్రోపోలిస్ (విమానాశ్రయం చుట్టూ నిర్మిస్తున్న మెట్రోపాలిటన్ ఏరియా)’గా కూడా ఇది రికార్డు సృష్టించనుంది. భారతీ రియల్టీ సంస్థ ఈ ప్రాజెక్టును చేపడుతోంది. ఫేజ్–2లో మొత్తం 35 లక్షల చదరపు అడుగుల లీజింగ్ స్పేస్ అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం ఏరోసిటీలోని 11 స్టార్ హోటళ్లలో 5,000 గదులు ఉండగా.. విస్తరణ తర్వాత 15 హోటళ్లు, 7,000 గదులకు పెరగనున్నాయి. కాగా ప్రస్తుతం కొచ్చిలో ఉన్న లులు ఇంటర్నేషనల్ మాల్ 25 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియాతో అతిపెద్ద మాల్‌గా ఉంది.

హైదరాబాద్‌లోనూ..

హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉన్న జీఎంఆర్ ఏరోసిటీలో కూడా 20 ఎకరాల్లో భారీ మాల్ నిర్మాణంలో ఉంది. మొత్తం విస్తీర్ణం 8 లక్షల చదరపు అడుగులు. 100కు పైగా దేశ, విదేశీ దిగ్గజ బ్రాండ్ స్టోర్లు సహా అతిపెద్ద ఎంటర్‌టైన్‌మెంట్ స్పేస్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ 2,000 సీట్ల సామర్థ్యంలో ఐనాక్స్ 11 స్క్రీన్ల థియేటర్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ ఏడాదే ఇది అందుబాటులోకి వస్తుందని అంచనా. 68.8 బిలియన్ డాలర్లు.. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఎయిర్‌పోర్టు రిటెయిలింగ్ మార్కెట్ అంచనా ఇది. ఏటా 6.9 శాతం వృద్ధి చెందుతుందని లెక్కలేస్తున్నారు. 2023లో ఇది 43.2 బిలియన్ డాలర్లుగా ఉంది.

నాణ్యత లేకుంటే సీట్లు కట్!

▶ మొదటి పేజీ తరువాయి

ఈఈఈ, సివిల్, మెకానికల్‌తోపాటు అనేక కోర్ గ్రూపులకు కాలం చెల్లినట్టే. ఈ పరిణామాలపై ఆందోళన చెందుతున్న ప్రభుత్వం.. వీటికి చెక్ పెట్టాలని సంకల్పించింది. కోర్సుల సమతుల్యతపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉన్నత విద్యామండలిని ఆదేశించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కళాశాలల్లోని బ్రాంచీలపై ఆడిటింగ్ చేపట్టాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. డిమాండ్ ఉన్న కోర్సుల్లో నాణ్యత పరిశీలనే దీని ప్రధాన ఉద్దేశమని మండలి వర్గాలు తెలిపాయి. నాణ్యత పాటించని కళాశాలల్లో ఆయా కోర్సుల్లో సీట్లకు కోత వేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

సీఎస్ఈదీ క్రేజేనా?

రాష్ట్రవ్యాప్తంగా 175 ఇంజనీరింగ్ కాలేజీలు కౌన్సెలింగ్‌లో పాల్గొంటున్నాయి. వీటిలో 1.06 లక్షల సీట్లున్నాయి. ఇందులో కన్వీనర్ కోటా కింద 87 వేల సీట్లు ఉండగా, వీటిలో 61 వేల సీట్లు కంప్యూటర్ కోర్సుల్లోనే ఉన్నాయి. ఈ సీట్లకే పోటీ తీవ్రంగా ఉంటోంది. 2019లో రాష్ట్రంలో కంప్యూటర్ సీట్లు 22,033 మాత్రమే. 2024 సంవత్సరానికి ఇవి 61,587కు పెరిగాయి. అంటే మూడు రెట్లు పెరిగాయి. ఇక కోర్ గ్రూపు (సివిల్, మెకానికల్, ఈఈఈ తదితరాలు)ల్లో 2019లో 43,532 సీట్లు ఉంటే, 25,823 సీట్లు భర్తీ అయ్యాయి. 2024లో కోర్ గ్రూపులో సీట్లు 25,597కు పడిపోయాయి. ప్రవేశాలు కూడా 19,739కి తగ్గిపోయాయి. కోవిడ్ తర్వాత నుంచి కోర్ గ్రూపుల్లో సీట్లు, ప్రవేశాలు గణనీయంగా తగ్గిపోగా.. కంప్యూటర్ సైన్స్ సీట్లకు డిమాండ్ పెరిగింది. ఈ సీట్ల పెరుగుదల మూడు రెట్లు ఉన్నప్పటికీ, నాణ్యత అంతంత మాత్రంగానే ఉంది. 56 శాతం మంది అన్‌స్కిల్డ్ ఉద్యోగాలతోనే సరిపెట్టుకుంటున్నారు.

ఇప్పుడేం చేస్తారు?

బ్రాంచీల ఆడిటింగ్ చేపట్టి వాటికి ప్రామాణికతను పొందుపరచాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ముందుగా కాలేజీల నుంచి సీఎస్ఈ, ఇతర కంప్యూటర్ కోర్సుల సమగ్ర సమాచారం తెప్పిస్తున్నారు. ఫ్యాకల్టీ, కోర్సుకు కావాల్సిన లాంగ్వేజ్, లైబ్రరీ, లేబొరేటరీల వివరాలను తీసుకుంటారు. సీఎస్ఈ అనుమతి లభించినప్పటి నుంచీ కాలేజీల్లో ఉపాధి అవకాశాలను పరిశీలిస్తారు. కనీసం 40 శాతం ఉపాధి కల్పించని కాలేజీలపై మరింత లోతుగా అధ్యయనం చేస్తారు. డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో ఉండాల్సిన ప్రమాణాలు, బోధన పద్ధతులను మార్కెట్ నిపుణుల నుంచి తెలుసుకుంటారు. ఈ తరహా ప్రమాణాలు ఎన్ని కాలేజీల్లో ఉన్నాయో పరిశీలిస్తారు. వీటి ఆధారంగా నాణ్యతను గుర్తించి, అది లోపించిన కాలేజీల్లో సీట్లను తగ్గించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసే అవకాశముంది. మరోవైపు ప్రాజెక్టు వర్క్‌ను గుర్తింపు ఉన్న సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో చేయించేలా కాలేజీలే ఆయా సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవాలి. ఈ దిశగా భరోసా ఇచ్చిన తర్వాతే వాటికి అనుమతినివ్వాలని భావిస్తున్నారు.

2019 నుంచి కంప్యూటర్... కోర్ గ్రూపుల్లో సీట్ల భర్తీ ఇలా...

సంవత్సరం	సీఎస్ఈ సీట్లు	ప్రవేశాలు	కోర్ సీట్లు	ప్రవేశాలు
2019	22,033	20,311	43,532	25,823
2020	34,852	27,474	35,283	20,265
2021	43,955	38,335	35,867	19,210
2022	48,984	44,789	30,464	17,295
2023	58,381	52,219	27,616	16,670
2024	61,587	59,485	25,597	19,739

తొక్కిసలాటకు చెక్ పెడదాం

- జనం గుమికూడితే పరిష్కార మోడళ్లను కనిపెట్టండి
- హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ స్కూళ్లకు ఆనంద్ మహీంద్రా సూచన



న్యూఢిల్లీ: న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా స్పందించారు. ఇలాంటి తొక్కిసలాట ఘటనలు జరక్కుండా తగు పరిష్కార ‘సాంకేతిక’ మార్గాలను కనుగొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ స్కూల్స్ విభాగాలకు ఆనంద్ మహీంద్రా తగు సూచనలు చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ‘ఎక్స్’లో ఒక పోస్ట్‌చేశారు. ‘‘ఢిల్లీ రైల్వే స్టేషన్ ఘటనతో నా హృదయం నిజంగా ముక్కలైంది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశంగా, అత్యల్ప తలసరి ఆదాయం గల దేశాల్లో ఒకటిగా ఉన్న భారత్‌లో తొక్కిసలాట వంటి గుమికూడే ఘటనలు పునరావృతంకాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. జనం గుమికూడే సందర్భాల్లో ప్రజాభద్రత అంశాన్ని మనం పరిగణనలోకి తీసుకోవాలి. సాంకేతికత, డేటా అనాలసిస్ సమన్వయంతో ఈ సమస్యకు మన పరిష్కారం కనుగొనాలి’’ అని ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ స్కూల్స్ విభాగాలకు ఆయన సూచనలు చేశారు.

బీసీలకు అభివృద్ధి ఫలాలు దక్కాలి

నాగర్‌కర్నూల్ ‘సగర శంఖారావం’ సభలో మంత్రి జూపల్లి



సభలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు. చిత్రంలో ఈటల, వకుళాభరణం, జాజుల

సాక్షి, నాగర్‌కర్నూల్: సగరుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కృషిచేస్తుందని ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ మైదానంలో ఆదివారం నిర్వహించిన ‘సగర శంఖారావం’ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బీసీలకు ఇంకా సౌకర్యాలు, అభివృద్ధి ఫలాలు దక్కాల్సి ఉందన్నారు. ఈ మేరకు ప్రతి అంశంపై చట్టసభల్లో చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. సగరులను బీసీ–డీ నుంచి ‘ఏ’ లో చేర్చాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని, గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు బీసీ–ఏలో చేర్చగా, ఇతరులు కోర్టుకు వెళ్లడంతో మళ్లీ పూర్వస్థితిలోనే కొనసాగుతున్నారని జూపల్లి తెలిపారు. సగరుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు.

బీసీలదే రాజ్యాధికారం: ఈటల

సమీప భవిష్యత్‌లో బీసీలకే రాజ్యాధికారం దక్కుతుందని సభకు హాజరైన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఓటు అనే వజ్రాయుధం ఉండగా.. ఎవరినీ అడుక్కోవాల్సిన పనిలేదని చెప్పారు. గతంలో తాను ఆర్థికమంత్రిగా ఉండగా బీసీలకు రెసిడెన్షియల్ స్కూళ్ల సంఖ్య పెంచానని గుర్తుచేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన వాటా దక్కాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అభిప్రాయపడ్డారు.

విజయవంతంగా బీఎఫ్ఎస్ఐ స్కిల్లింగ్ శిక్షణ

- రెండు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి
- మూడో బ్యాచ్‌కి ఆదివారం అర్హత పరీక్ష
- మూడేళ్లలో 30 వేల మందికి ఉద్యోగాలే లక్ష్యంగా శిక్షణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం బీటెక్ పట్టభద్రుల కోసం ప్రారంభించిన బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ – స్కిల్లింగ్) కోర్సుకు మంచి స్పందన లభిస్తోంది. మొదటి, రెండో విడత బ్యాచ్‌ల శిక్షణ ఇప్పటికే పూర్తికాగా, మూడో విడత కోర్సుల శిక్షణ కోసం ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించారు. వీరిలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ ఏడాది జూలై వరకు బ్యాంకింగ్ ఆపరేషన్స్, ఫైనాన్షియల్ మార్కెట్స్, ఇన్సూరెన్స్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్, ప్రోగ్రామింగ్, అప్లికేషన్ అండ్ డేటాబేస్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, సాఫ్ట్ స్కిల్స్ తదితర అంశాలపై యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో శిక్షణ ఇస్తారు. ఆ తరువాత బీఎఫ్ఎస్ఐకు సంబంధించి హైదరాబాద్‌లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఏటా 10 వేల మందికి శిక్షణ ఇస్తారు. వీరిలో 5 వేల మంది ఇంజనీరింగ్, మరో 5 వేల మంది డిగ్రీ పట్టభద్రులుంటారు. రానున్న మూడేళ్లలో 30 వేల మంది తెలంగాణ యువతకు ఈ కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో ‘బీఎఫ్ఎస్ఐ – స్కిల్లింగ్’ కోర్సు ప్రారంభమైంది. ఖర్చును ఎక్విప్, బీఎఫ్ఎస్ఐ కన్సార్షియం భరిస్తుంది. విద్యార్థుల నుంచి రూ.5 వేలు వసూలు చేస్తారు. ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న పట్టభద్రులు స్కిల్స్ యూనివర్సిటీ వెబ్‌సైట్ yisu.in ను సందర్శించాలని కోరారు.

ఆ అసత్యాలపై బదులేది బాబూ?

▶ మొదటి పేజీ తరువాయి

వెనుక రాజకీయ పార్టీల దురుద్దేశాలున్నాయా? అనే విషయాలను తేల్చాలని స్వామి తన పిటిషన్‌లో సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలన్న కోర్టు..

లడ్డూ తయారీకి జంతువుల కొవ్వుతో కూడిన నెయ్యిని వాడారంటూ దాఖలైన పిటిషన్‌పై సెప్టెంబర్ 30న విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలంటూ చంద్రబాబు ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేసింది. తిరుపతి లడ్డూ తయారీకి జంతువుల కొవ్వుతో కూడిన నెయ్యిని వాడారంటూ ప్రభుత్వం చేసిన వాదనను నిరూపించేందుకు ఖచ్చితమైన ఆధారాలు లేవంటూ.. ఆ ఆరోపణలను తీవ్రంగా తప్పుబట్టింది. ఏపీ ప్రభుత్వం సమర్పించిన ల్యాబ్ నివేదికను పరిశీలించిన సుప్రీంకోర్టు.. పరీక్ష కోసం పంపిన నెయ్యిని తిరస్కరించారని, లడ్డూల తయారీకి దాన్ని ఉపయోగించలేదని పేర్కొంది.

పోష్ చట్టం అమలు నివేదికపై నిర్లక్ష్యం

తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు రూ.5 వేల జరిమానా

సాక్షి, న్యూఢిల్లీ: పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2013లో ప్రవేశపెట్టిన పోష్ (ప్రివెన్షన్ ఆఫ్ ది సెక్సువల్ హరాస్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఎట్ వర్క్‌ప్లేస్) చట్టం అమలుపై నివేదిక సమర్పించడంలో నిర్లక్ష్యం వహించిన రాష్ట్రాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణతోపాటు ఐదు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి రూ.5 వేల చొప్పున జరిమానా విధించింది. దేశవ్యాప్తంగా పోష్ చట్టం అమలయ్యేలా ఆదేశించాలని గోవాకు చెందిన ఔరేలియానో ఫెర్నాండెజ్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గతేడాది డిసెంబర్‌లో ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు.. చట్టం అమలుపై ఈ ఏడాది ఫిబ్రవరి 11వ తేదీలోపు వివరాలను సమర్పించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. అయితే, నివేదికను సమర్పించటంలో పుదుచ్చేరి, తెలంగాణ, జార్ఖండ్, మణిపూర్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. తాజాగా ఈ పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. చట్టం అమలుకు మరింత సమయం కావాలని ఐదు రాష్ట్రాల న్యాయవాదులు అభ్యర్థించగా, కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఒక్కో రాష్ట్రానికి రూ.5 వేల చొప్పున జరిమానా విధించింది. జరిమానాను రెండు వారాల్లో చెల్లించాలని, మూడు వారాల్లో అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశాలు జారీచేసింది.

కుంభమేళాకు 52.83 కోట్ల మంది

మహాకుంభ్ నగర్: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాలో ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి 1.36 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం తెలిపింది. దీంతో, జనవరి 13వ తేదీన ఈ మహా క్రతువులో ఇప్పటి వరకు పుణ్యస్నానాలు చేసిన వారి సంఖ్య 52.83 కోట్లకు చేరిందని వివరించింది. అమృత్ స్నాన్, మాఘి పౌర్ణిమ వంటి ముఖ్యమైన రోజులు పూర్తయినా భక్తుల రాక ఏమాత్రం తగ్గ లేదని తెలిపింది. శనివారం సైతం 1.36 కోట్ల మంది వచ్చారంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 17 నుంచి 20 వరకు ప్రయాగ్‌రాజ్‌లోని అన్ని స్కూళ్లు 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు పెట్టాలని యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది.

‘కోడ్’ ముగిశాక ఆర్టీసీలో సమ్మె

ప్రభుత్వానికి మరో జేఏసీ అల్టిమేటం

- ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చిన ఒక జేఏసీ
- మార్చి 7 వరకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్
- కార్మికులు సమ్మెకు సిద్ధంగా లేరని ఇంటెలిజెన్స్ నివేదిక

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికులు సంస్థ యాజమాన్యంపై పోరుకు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే ఒక కార్మిక జేఏసీ సమ్మె నోటీసు ఇవ్వగా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సమ్మె నోటీసు ఇవ్వాలని మరో జేఏసీ తాజాగా నిర్ణయించింది. మొదటి జేఏసీ నిరవధిక సమ్మెకు మొగ్గు చూపుతుండగా, రెండో జేఏసీ మాత్రం ఐదారు రోజులపాటు సమ్మె చేయాలని భావిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసేలోపు తమ డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో సమ్మె అనివార్యమని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చింది. అయితే, కార్మికుల్లో సమ్మెపై ఒకింత భయం కనిపిస్తుండగా, సంఘాల నాయకులు మాత్రం సమ్మెకు సిద్ధమని ప్రకటిస్తున్నారు.



ప్రైవేటు సంస్థల పెత్తనంతో..

ఇటీవల ఆర్టీసీ పెద్ద సంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతోంది. అవన్నీ గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు పద్ధతిలో ప్రైవేటు సంస్థ నుంచి అద్దెకు తీసుకుంటోంది. ఆ బస్సుల నిర్వహణ కోసం కొన్ని డిపోలను సదరు సంస్థకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేయటంతో ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇది ఆర్టీసీలో ప్రైవేటీకరణకు మార్గం సుగమం చేయటమేనని మండిపడుతున్నారు. దీంతో అధికారులు వెనక్కు తగ్గి డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సులతోపాటు సాధారణ సొంత బస్సులు కూడా కొనసాగుతాయని స్పష్టత ఇచ్చారు. అయినా ఉద్యోగుల్లో అనుమానాలు తొలగిపోలేదు. ఈ అంశంతోపాటు చాలా కాలంగా పెండింగులో ఉన్న ఇతర సమస్యలను తెరపైకి తెచ్చి కార్మిక సంఘాలు సమ్మెకు సై అంటున్నాయి.

విలీనం, పీఆర్సీనే ప్రధాన ఎజెండాగా..

గత ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ప్రారంభించింది. అంతలోనే ప్రభుత్వం మారటంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని పెండింగులో పెట్టింది. 2017 వేతన సవరణ బకాయిలు కూడా చెల్లించలేదు. 2021 వేతన సవరణపై ప్రభుత్వం స్పందించటంలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దుచేసిన గుర్తింపు యూనియన్ల పునరుద్ధరణ జరగలేదు. సీసీఎస్, పీఎఫ్‌లకు భారీగా బకాయిలు పేరుకుపోయాయి. వీటి సాధనే లక్ష్యంగా కార్మికులు సమ్మెకు సిద్ధమయ్యాయి.

ఎవరికి వారే..

ఎంప్లాయీస్ యూనియన్, టీఎంయూ చీలికవర్గం, బీడబ్ల్యూయూ, బీకేయూ, ఎస్ఎంయూ చీలిక వర్గం, కేపీ సంఘాలతో కూడిన తొలి జేఏసీ గత నెల 27న యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చింది. ఫిబ్రవరి 3న ఆ యూనియన్ల ప్రతినిధులను కార్మిక శాఖ చర్చలకు పిలిచి, తర్వాత ఎన్నికల కోడ్ కారణం చూపి సమావేశం రద్దు చేసింది. దీంతో, ఎన్నికల నోటిఫికేషన్ నుంచి ఆర్టీసీ సమ్మెకు మినహాయింపు ఇవ్వాలని ఆయా సంఘాల నేతలు ఎన్నికల కమిషనర్‌కు విన్నవించారు. టీఎంయూ, ఎస్ఎంయూ వర్గాలు, బీఎంఎస్, ఎస్‌టీ ఎంయూలతో కూడిన మరో జేఏసీ తదుపరి సమావేశం ఏర్పాటు చేసుకుని, ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రభుత్వానికి గడువు ఇస్తున్నట్టు ప్రకటించింది. కోడ్ ముగిసిన తర్వాత సమ్మె నోటీసు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. మార్చి 7 వరకు కోడ్ అమలులో ఉంటుంది. ఐదారు రోజులపాటు సమ్మె చేసి, కొద్ది రోజుల గడువు ఇచ్చి మళ్లీ సమ్మె చేయాలనే యోచనలో ఉన్నట్టు సమాచారం. మరోవైపు ఆర్టీసీ కార్మికుల్లో 10 వేల మంది మాత్రమే సమ్మెకు సిద్ధంగా ఉన్నట్లు ఇంటెలిజెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు తెలిసింది.



ఒక పని బాగా చేసినందుకు వచ్చే ప్రతిఫలం దాన్ని చేయడమే!
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
సోమవారం, 17 ఫిబ్రవరి 2025

‘పెన్షన్’ పత్రిక

ఆ జ్ఞానము అచట ఉన్నది. పండిన అనుభవాల రాశి పోగుబడి ఉన్నది. వేళ్లకు వయసు వచ్చినది కాని కలానికి కాదు సుమా. విశాలమైన తలపులు చెప్పవలసిన సంగతులు ఒకటా రెండా? మేము విశ్రాంతిలో లేము. అక్షరాల ఆలోచనల్లో ఉన్నాం. గత యాత్రకు కొనసాగింపులో ఉన్నాం. మేము నడవవలసిన దారి తెరిచిన పుటల మీదుగా సాగుతుంది. పాఠకుల మనోరథాల మీదుగా విహరిస్తుంది. ఊహలకు ఊపిరి పోస్తే మాకు ఆయువు. పాత్రలతో సంభాషిస్తే మాకు ఉత్సాహం. మేమెవరమో మీకు తెలుసా? మా లోపల ఏముందో మీకు ఎరుకేనా?

‘మా నాన్న అదృష్టవంతుడు. చనిపోయే వరకూ రాస్తూనే ఉన్నాడు. రాసిన దాని కోసం పత్రికలు ఎదురు చూశాయి. ప్రచురించి మర్యాద చేశాయి. ఆయన రచయితగా జీవించి రచయితగా మరణించాడు. నేనూ ఉన్నాను. కథ రాస్తే ఎక్కడ ఇవ్వను. రాయకుండా ఎలా బతకను?’ పెన్షనర్ వయసున్న ఒక రచయిత అన్న మాటలు ఇవి. నేటి తెలుగు రాష్ట్రాల్లో యాభైలు దాటి, రచనాశక్తితో ఉన్న వారి ఆవేదనంతటికీ ఈ మాటలు శోచనీయమైన ఆనవాలు.

ఒక రచయిత పరిణతి యాభైల తర్వాతే రచనల్లో వ్యక్తమవుతుంది. అనుభవాల సారము, వాటి బేరీజు, వాటిపై వ్యాఖ్యానం, వాటితో నేటి తరానికి చెప్పవలసిన జాగరూకత, వాటి సమోదు, తద్వారా బలపడే సారస్వత సంపద... ఏ జాతికైనా పెను పెన్నిధి. దురదృష్టం, కాలమహిమ తెలుగు రాష్ట్రాల్లో పత్రికలు కనుమరుగైపోయాయి. సాహిత్య పత్రికలు, చిన్న పత్రికలు, వీక్లీలు.... ఎంత రాసినా వేసే మంత్లీలు... బైమంత్లీలు... క్వార్టర్లీలు.... ఏ బస్టాండ్ బడ్డీకొట్టులోనో అందుకునే అపరిచిత పాఠకుడికై వాటి అందుబాటు... ఎక్కడ... ఎక్కడా? ‘మీ రచనను ప్రచురణకు స్వీక రించాం’ కార్డు ముక్క, దానికి ఫలానా చిత్రకారుడు వేసే గొప్ప బొమ్మ, పోస్టులో పత్రిక అందడం, మరికొన్ని రోజులకు సంబరంగా సంతకం చేసి తీసుకునే పారితోషికపు మనీఆర్డర్... ఎక్కడ... ఎక్కడా? కంప్యూటర్ స్క్రీన్‌కో, సెల్‌ఫోన్ కురచదనానికో సంతృప్తి పడే నేటి పాఠకులు ఉండుగాక. కాని పెద్దలు ఉన్నారు. కాగితపు వాసనను పీల్చి, అక్షరాలను వేళ్లతో తడిమిగాని సంతృప్తి పడని ప్రాణాలున్నాయి. కట్టె కొట్టె తెచ్చేలా కాకుండా, అరచేత్తో లోడేదే లోతు అనుకునే రచయితల్లా కాకుండా, తమ రచనలతో చెరువులనూ, కడలి కెరటాల సంచలనాత్మలనూ సృష్టించిన చేతులు ఉన్నాయి. వారి సంగతి ఏమిటి? వారికేదైనా పెన్షన్ కావాలని ఎవరైనా ఆలోచించారా?

1970–90ల మధ్య కాలంలో కథ అంటే కనీసం ఐదారు పేజీలు ఉండేది. పెద్దకథలు ఉండేవి. నవలికలు, సీరియల్ నవలలు, గల్పికలు, ప్రహసనాలు, ఆత్మకథలు, జ్ఞాపకాలు, సంవాదాలు, అనువాదాలు, ఇంటర్వ్యూలు... ఇవన్నీ రాసినవారు, ఇచ్చినవారు ఇంకా ఉన్నారు. జనాభా లెక్కల్లో గల్లంతై పోలేదు. వీరు రాయగా చదివి అభిమానులు అయినవారు ఉన్నారు. బండలై పోలేదు. ఈ రాసే వారు రాయడానికీ... ఈ చదివేవారు అనుసంధానమై చదవడానికీ... అవసరమైన వేదికలే తెలుగునాట లేవు. ఈ రచయితలకు, పాఠకులకు ఒక పెన్షన్ స్కీమ్ కావాలి. వీరి అనుభవాన్ని, ఆత్మగౌరవాన్ని మన్నిస్తూ వీరి రచనలకు చోటు కల్పించడం కోసం ఒక పథకం కావాలి. కొత్త తరాలతో పోటీ పడుతూ డిజిటల్ క్యూలలో దూరి బుకింగ్ కోసం వీరు చేయి దూర్చరని గ్రహించడం అత్యవసరం. అదొక్కటేనా? పునఃపఠనం సంగతో? ఎంతో రాసి, ఎన్నో క్లాసిక్స్ ఇచ్చిన రచయితలను రీవిజిట్ చేయడానికి ఒక్క కాగితపు పుట ఇంత పెద్ద జాతికి లేకపోవడం విషాదమా, కాదా?

‘ఏజ్‌లెస్ ఆథర్స్’... 65 ఏళ్లు ఆపైన వయసున్న వారి రచనలనే క్రమం తప్పకుండా వెలువ రించే సంకలనాల వరుస ఇది. ‘క్రోన్: విమెన్ కమింగ్ ఆఫ్ ఏజ్’... ఇది అరవైలు దాటిన స్త్రీల రచనలు ప్రచురించే పత్రిక. ‘పాసేజర్’... యాభై ఏళ్ల తర్వాత రాసిన వారివే ఈ పత్రిక వేస్తుంది. ‘ఎనభై ఏళ్లు పైబడిన వారు రాయట్లేదే అని చింతించాం. కాని ఇప్పుడు ఆ వయసు వారూ వచ్చి రాస్తున్నందుకు సంతోషంగా ఉంది’ అని ఆ పత్రిక పేర్కొంది. ‘రీ ఇన్వెన్షన్ ఆఫ్టర్ రిటైర్‌మెంట్’... స్లోగన్‌తో యాభైలు దాటిన రచయితల రచనలు మాత్రమే వేసే పత్రికలు పాశ్చాత్య దేశాల్లో ఉన్నాయి. వారి మానసిక ఆనందానికి అవి అవసరం అని ఆ యా దేశాలు భావిస్తున్నాయి. మన దేశంలో ఇతర భాషల్లో పత్రికలు సజీవంగా ఉన్నాయి కాబట్టి వారికి ఈ బెడద తెలియదు. తెలుగు సీనియర్స్‌కే సమస్య అంతా! వీరు చదివిన వందల పుస్తకాల నుంచి విలువైన మాటలు చెప్పాలా, వద్దా? వేయిదీపాల మనుషులు వీరు అనే సోయి మనకు ఉందా?

‘రాయాలంటే ఎక్కడ రాయాలి’ అనుకునే కవులు, రచయితలు, ఆలోచనాపరులు, విమర్శకులు, నాటకకర్తలు, వ్యంగ్య విన్యాసకులు నేడు ఎందరో నిశ్శబ్దంగా ఉన్నారు. లోపలి వెలితితో ఉన్నారు. వీరి సృజన సన్నగిల్లలేదు. మరింత విస్తరణను కోరుకుంటోంది. వీరిని నిర్లిప్తంగా ఉంచడమంటే కనబడని గోడల జైలులో పెట్టడమే! సాంస్కృతిక ఆస్తిపత్రాలు గల్లంతు చేసుకోవడమే. ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, ఇద్దరు సంపాదక సిబ్బందితో ఏ రాష్ట్ర సాంస్కృతిక శాఖ అయినా ఏ యూనివర్సిటీ అయినా ఏ బాధ్యత గల్ల సంస్థైనా ప్రతి నెలా ‘పెన్షన్ పత్రిక’ నడపవచ్చు. పెన్షన్లు వ్యక్తిగత హితానికైతే ఇది సామాజిక హితానికి! అమరావతి, మూసీల ఖర్చులో దీనికై వెచ్చించవలసింది 0.0000001 పైసా.

ఈ కొత్త పెన్షన్ కోసం డిమాండ్ చేద్దాం!

మీరు చాలా మారాలి సార్!

తూర్పు తీరం



కె.ఎన్. మల్లీశ్వరి

అంతరిక్షంలో చిక్కుకుపోయి, భూమికి చేరేమార్గం కోసం ధైర్యంగా ఎదురుచూస్తున్న సునీతా విలియమ్స్ వంటి సాహసగత్తెల కాలంలో ఉన్నాము. అదే సమయంలో స్త్రీల మీద వివక్షలు మారకపోగా కొత్త రూపాలు తీసుకున్నాయని ఇటీవలి కొన్ని వరుస ఘటనలు నిరూపిస్తున్నాయి. ప్రాబల్య స్థానాల్లో ఉన్న కొందరు పురుషులు బహిరంగంగా, ఎటువంటి సంకోచాలూ లేకుండా స్త్రీల గురించి చేస్తున్న వ్యాఖ్యలు పితృస్వామ్య సామాజిక స్థితిని దగ్గరగా చూపిస్తున్నాయి. ఈ పురుషుల్లో సినిమా నటులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, చివరికి న్యాయ, రక్షణ వ్యవస్థలు కూడా ఉండడం వివక్ష తీవ్రతను తెలుపుతున్నది.

మాట, చూపు, హావభావ కవళికల్లో పెద్దమనిషితనం ఉట్టి పడుతున్నట్లు కనిపించేలా సవాలక్ష జాగ్రత్తలు తీసుకునే ‘మెగాస్టార్’ ఈసారి దొరికిపోయారు. ఆడపిల్లలతో నిండిన తన ఇల్లు లేడీస్ హాస్టల్లా, తను వార్డెన్‌లా ఆయనకి అనిపించింది. అయిదుగురు చెల్లెళ్లకి రక్షకుడిలా తను నటించిన ‘హిట్లర్’ సినిమా నిజం అనుకున్నారు కాబోలు! అంతేకాకుండా తమ లెగసీ కొనసాగించడానికి ఈసారైనా కొడుకుని కనమని కొడుక్కి బహిరంగంగా చమత్కారపూర్వక సలహా ఇచ్చారు. పసిబిడ్డ మొహాన్ని కూడా బహిరంగపరచకుండా తమ ప్రైవసీని కాపాడుకునే అతని కొడుకూ కోడలూ – తమ ఆడపిల్లకి ఎదురైన ఈ బహిరంగ వివక్షని ఎలా తీసుకుంటారో బహుశా అది వారి కుటుంబ విషయం. కానీ అనేకమంది ఆరాధకులని పెంచి పోషించుకునే ఒక సినిమా నటుడిగా ఆయన వ్యాఖ్యలు వ్యతిరేకించవలసినవి. రేపుమాపు ‘మెగా’ అభిమానులందరూ తమ ఇంటి స్త్రీలకి వార్డెన్లగానూ, లెగసీ కోసం కొడుకుల్ని కనమని వేధించేవారిగానూ ఉండడమే ఫ్యాషన్ అనుకుంటే అది ప్రమాదం కనుక ఈ వ్యాఖ్యలని కొందరైనా ఖండిస్తున్నారు.

స్త్రీలపట్ల అసభ్యంగా ప్రవర్తించడంలో సినీనటుడు బాలకృష్ణ ‘గాడ్ ఆఫ్ వల్గారిటీ’కి ప్రతీకగా మారిపోయారు. స్త్రీలను ఉద్దేశించి నర్మగర్భంగా తను ఎక్కని ఎత్తులు, దిగని లోతులు లేవని అనడం, వెంటపడే పాత్రలు చేస్తే తన ఫాన్స్ ఊరుకోరని, అమ్మాయిలు కనపడగానే ముద్దయినా పెట్టాలి, కడుపైనా చేసేయాలని కోరుకుంటారన్న అసభ్య వ్యాఖ్యలకి కోర్టుకేసులు ఎదుర్కొన్నారు. ఒక నటిని పడిపోయేంతగా వేదిక మీద నెట్టడం దగ్గర్నుంచి తన చుట్టూ ఉండే స్త్రీలతో కొన్నిసార్లు ఆయన ప్రవర్తన వేధింపు పరిధిలోకి వస్తుంది. ఇటీవల విడుదలైన చిత్రంలోని ఒక పాటకు ఆయన వేసిన స్టెప్పులు దిగజారడానికి పరిధులు ఏమీ లేనంత హీనమైనవి. అది కళారంగపు టేస్ట్ అనుకుని వదిలేయనివ్వలేదు బాలకృష్ణ. అదే నటితో ఒక ప్రయివేట్ పార్టీలో అవే స్టెప్పులు వేస్తూ ఆమెని ఇబ్బంది పెట్టారు. వారికి లేని బాధ మీకేమిటనే అభిమానులకి కొరత లేదు. మగనటుల పవర్, స్త్రీ నటుల అవకాశాలను ప్రభావితం చేస్తుంది కనుక వారు ఊరుకుంటారు. కానీ సమాజం కూడా ఊరుకోవాల్సిన అవసరం లేదు. బహిరంగంగానే ఇలా ఉంటే కనపడని వేధింపులు ఎన్నో ఊహించలేము. నటుడిగా దాక్కోడానికి చోటు ఉన్నట్లు రాజకీయాల్లో ఉండదు కనుక ఇట్స్ టైమ్ టు స్టాపబుల్ మిస్టర్ ఎమ్మెల్యే!



భిన్న సినిమా ప్రమోషన్స్‌లో నటులు చిరంజీవి, బాలకృష్ణ

> ఆకాశంలో సగాలకి తాము వార్డెన్లమని బాధపడటం కాకుండా – వారి పుట్టుక, ఎదుగుదల, విజయాలు సాధికారికంగా సెలెబ్రేట్ చేసుకోవడం మన వివేకంలో భాగం కావాలి.

భార్యతో భర్త చేసే బలవంతపు అసహజ శృంగారం నేరం కాదని ఇటీవల ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఇపుడు చర్చలోకి వచ్చింది. 2017లో జరిగిన ఘటన ఇది. భర్త చేసిన అసహజ లైంగికచర్యల కారణంగా భార్య అనారోగ్యానికి గురయి మరణించింది. మరణ వాఙ్మూలంలో ఆమె ఇదే చెప్పింది. కింది కోర్టు వేసిన పదేళ్ళ శిక్షని కొట్టేసి భర్తని నిర్దోషిగా తేల్చింది హైకోర్టు. మారిటల్ రేప్ గురించి ఇప్పటికే చాలా చర్చలు జరిగాయి. భార్యకి ఇష్టం లేకుండా భర్త బలవంతంగా ఆమె శరీరాన్ని తాకకూడదన్నది ఒక విలువగా, హక్కుగా సమాజానికి అలవాటు కావాల్సిన సమయంలో ఈ తీర్పు స్త్రీల లైంగిక స్థితిని కొన్ని రెట్లు వెనక్కి నెట్టేదిగా ఉంది. ఆ భర్త అసహజ లైంగిక చర్య చేయడం గురించి కొంతమంది తప్పు బడుతున్నారు. సహజమా, అసహజమా అన్నది కాదు ముఖ్యం. ఆమె సమ్మతి ముఖ్యం. స్త్రీని లైంగిక కోరికలు తీర్చే వస్తువుగా చూసే పాత ఆలోచనా విధానాన్ని అందరూ సవరించుకోవాల్సిన అవసరాన్ని ఈ సందర్భం గుర్తు చేస్తోంది.

పనిగంటల విషయంలో ఎల్ అండ్ టి ఛైర్మన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా చాలా చర్చల్లోకి వచ్చాయి. వారానికి తొంభై పనిగంటలు పనిచేయాలని సూచిస్తూ ‘ఇంట్లో మీరు మీ భార్య మొహం ఎంతసేపు చూస్తూ ఉండగలరు, మీ భార్య మీ మొహం ఎంతసేపు చూస్తూ ఉండగలదు’ అని వ్యాఖ్యానించారు. పనిగంటల భారాన్ని వ్యతిరేకిస్తూ ఇంటిపనులు, బైటిపనులు, వ్యక్తిగత, మానసిక అవసరాల గురించి చాలామంది మాట్లాడారు. అయితే తక్కువగా చర్చకు వచ్చిన విషయం ఒకటి ఉంది. అది ఈ పనిగంటల సూచన కేవలం మగ ఉద్యోగులను ఉద్దేశించినట్లుగా ఉండడం. దాని ద్వారా ఇల్లు, పిల్లలు, వృద్ధుల బాధ్యతలు మగవారి టెరిటరీ కావు, అవి కేవలం స్త్రీలకి ఉద్దేశించినవి మాత్రమేనన్న విషయాన్ని చెప్పకనే చెప్పినట్లు! మగవారు తమ పూర్తికాలం ఉద్యోగంలో గడిపితే కుటుంబాల సమస్త బాధ్యతలు స్త్రీల మీద పడతాయి. ఉద్యోగం పురుష లక్షణం, ఇల్లు దిద్దుకోవడం స్త్రీ లక్షణంగా ఆ వ్యాఖ్యల అంతరార్థం స్ఫురిస్తోంది.

పై నాలుగు ఘటనల్లో నాలుగు ప్రధానమైన సమస్యలు మన ముందుకు చర్చకు వచ్చాయి. ఆడశిశువుని పురిటిలోనే చంపేసిన సమాజాలు మనవి. ఆ దశ దాటి వస్తున్నాము. ఆకాశంలో సగాలకి తాము వార్డెన్లమని బాధపడటం కాకుండా– వారి పుట్టుక, ఎదుగుదల, విజయాలు సాధికారికంగా సెలెబ్రేట్ చేసుకోవడం మన వివేకంలో భాగం కావాలి. స్త్రీలకు సొంత లైంగిక వ్యక్తిత్వం ఉంటుంది. అధికారం, హోదా, పేరు ప్రఖ్యాతులతో మదించినవారు ఆ వ్యక్తిత్వం మీద దాడి చేస్తూనే ఉంటారు. ధైర్యంగా వ్యతిరేకించేవారు పెరగాలి. న్యాయవ్యవస్థలు న్యాయసూత్రాల పరిధికి లోబడి పనిచేస్తాయి. న్యాయసూత్రాలు కాలం చెల్లినవిగా, స్త్రీలకి రక్షణ కల్పించలేనివిగా ఉన్నప్పుడు వాటిమీద పౌరసమాజం విస్తృత చర్చ చేయాలి. ఇంటిపనికి విలువ కట్టడం సరే, స్త్రీ పురుషుల మధ్య పని విభజనకి మార్గదర్శకాలు రూపొందించుకోవాలి. వీటన్నిటితో పాటు లోకం తన చూపుకి మరికాస్త స్త్రీ తత్వాన్ని అద్దుకోవాలి.

వ్యాసకర్త ప్రరవే ఏపీ కార్యదర్శి
malleswari.kn2008@gmail.com

సోషల్ మీడియా

అసలు వ్యవహర్త



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చాలా తెలివైన వ్యవహర్త. ‘గట్టిగా బేరమాడగలరు’ అని ఇండియా ప్రధాని మోదీని ప్రశంసించారు. ఆ వెంటనే, ఇండియాకు అదనంగా ఏడాదికి 10 బిలియన్ డాలర్ల చమురును అమ్మారు. అంటే అమెరికా నుంచి ఇండియా దిగుమతులు ఏటా 15 బిలియన్ డాలర్ల నుంచి ఏటా 25 బిలియన్ డాలర్లకు పెరుగుతాయి.

– ఎం.కె. వేణు, సంపాదకుడు

లెక్కించలేరా?



క్విక్ రిమైండర్: దేశంలో జనగణన జరగకుండా మనం పదిహేనో ఏడాదిలోకి అడుగు పెడుతున్నాం. సహచర భారతీయులకు శుభాభినందనలు! ఒక సార్వభౌమ దేశపు అత్యంత ప్రాథమిక బాధ్యతను కూడా మన పాలకులు నెరవేర్చడంలో విఫలమయ్యారు.

– మాథుర్ జె. సత్య, కమ్యూనిస్టు

అపారమైన జ్ఞానం



విశ్వానికి సంబంధించిన ప్రాథమిక సందేహాల మీద సైన్సు, తత్వశాస్త్రం పోగుచేసిన లోతైన జ్ఞానం గురించి చాలామందికి పూర్తిగా అవగాహన లేదు. దీనికి కారణాలు: వాటిని చదవడానికి సమయం లేకపోవడం ఒకటైతే, రెండోది ‘విశ్వం అనేది అభేద్యమైనది. అత్యున్నత ప్రశ్నల గురించి సైన్సు, ఫిలాసఫీ చెప్పేవి కల్పితాలు, దురూహలు’ అన్న తప్పుడు అభిప్రాయం.

– జాఫర్ మీర్జా, రచయిత

సానుకూలత ముఖ్యం



మీ ప్రతికూల ఆలోచనలు మిమ్మల్ని నిర్వచించలేవు. వాటిని గుర్తించండి. కానీ అవి మిమ్మల్ని నియంత్రించకుండా చూసుకోండి. సానుకూలతను ఆచరించండి, వృద్ధిపై దృష్టి పెట్టండి. మీరు అనుకున్నదానికంటే బలవంతులు అని గుర్తుంచుకోండి.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

అప్పు ఇవ్వొద్దు!



ప్రాణాపాయ పరిస్థితుల్లో తప్ప సన్నిహిత మిత్రులకు, బంధువులకు అప్పులు ఇవ్వొద్దు. డబ్బు పోవడంతో పాటు బంధుత్వమూ చెడే అవకాశం ఎక్కువ. మీరు ఇవ్వగలిగితే, ఇవ్వాలను కుంటే వాళ్లకు ఉదారంగా ఇవ్వండి.

– మనోజ్ అరోరా, ఫైనాన్షియల్ ప్లానర్

సమయం సమస్య



“ఎప్పుడైనా గమనించారా మీరు చేస్తున్నదాన్ని బట్టి సమయం ఎలా గడిచిపోతుందో? బోరు కొట్టే ఒక గంటసేపు మీటింగ్ యుగాల తరబడి జరిగినట్టు అనిపిస్తుంది. అదే స్నేహితులతో గంట సమయం ఐదు నిమిషాల్లో ముగిసినట్టుగా ఉంటుంది. అంటే సమస్య సమయంతో లేదు– దాన్ని మనం ఎలా గడుపుతాం అన్నదానితో ఉంది.

– నోవా బెన్నెట్, వ్యాఖ్యాత

అలా చేయకపోతే...




మీ శరీరం దానికదే నయం చేసుకోగలదు. చేయాల్సిందల్లా దాన్ని కృత్రిమ ఆహారాలతో విషపూరితం చేయకుండా ఉండటం!

– ఎరిక్ బెర్గ్, పోషణ నిపుణుడు

ఇన్‌బాక్స్

‘ఎవల్యూషన్ డే’ని జరుపుకొందాం!

ఇంగ్లిష్ నేచురలిస్ట్ ఛార్లెస్ డార్విన్ తన జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రకటించిన రోజు 1859 నవంబర్ 24. ఈ ఆధునిక వైజ్ఞానిక కాలానికి ఆ సిద్ధాంతం ఎంత ముఖ్యమో గ్రహించడానికి, ఆ శాస్త్రవేత్త మీద ఉన్న గౌరవం ప్రకటించుకోవడానికి 24 నవంబర్‌ను ‘ఎవల్యూషన్ డే’గా ప్రపంచ దేశాలన్నీ జరుపుకొంటున్నాయి. దీన్ని పెద్ద ఎత్తున మన దేశంలో కూడా జరపడం అవసరం. ఎందుకంటే వైజ్ఞానిక దృక్పథం దేశంలో బలహీనపడుతోంది. జీవ పరిణామ సిద్ధాంతం (థియరీ ఆఫ్ ఎవొల్యూషన్) పనికిరానిదని మాట్లాడే రోజులొచ్చాయి. ఇలాంటి వాటిని అడ్డుకోవాలంటే, ప్రగతిశీల భావాలు గల వారంతా వైజ్ఞానిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుపుకోవాలి.



ఛార్లెస్ డార్విన్

‘నిన్ను నువ్వు తెలుసుకో’ అని ధ్యానిస్తూ కళ్ళు మూసుకోవడం కాదు, నువ్వెవరు? ఎన్ని పరిణామాలు జరిగి, నువ్వు ఇలా మారావు అన్నది తెలుసుకుంటే, నీ కళ్ళు తెరుచుకుంటాయి. ఎన్నెన్ని మానవ జాతులు ఉద్భవించి అంతరించాయి? ఎన్ని వలసల తర్వాత నీ జాతి ఇప్పుడు నువ్వు ఉన్న ప్రాంతానికి చేరింది వంటి విషయాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే, జీవ పరిణామం గురించి పూర్తిగా తెలుసుకోవాలి.

చీకట్లోనే జీవితం బాగుందనుకునే వారితో మనకు పేచీ లేదు. జీవితంలో వెలుగులు కావాలనుకునేవారు తప్పక వైజ్ఞానిక స్పృహ పెంచుకుంటారు. జీవ పరిణామం గురించి తెలుసుకుంటారు. మత మౌఢ్యాన్ని చావుదెబ్బ తీసిన డార్విన్ పరిణామ సిద్ధాంతం వెలువడిన ఆ రోజును గుర్తు చేసుకుంటారు.

అర్థవంతమైన వైజ్ఞానిక కార్యక్రమాలు విద్యాసంస్థల్లోగానీ, పౌర సమాజాల్లోగానీ, కుటుంబాల్లోగానీ ఏ ఒక్కటైనా నిర్వహిస్తున్నారా? లేదు కదా? అందుకే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సైన్స్ కార్యకర్తలు, బాధ్యతగల పౌరులు, వివేకవంతులైన అధికారులు, మరీ ముఖ్యంగా మహిళలు పూనుకుని దేశంలో కొనసాగుతున్న విషమ పరిస్థితులను అర్థం చేసుకుని, ఎక్కడికక్కడ ఎవరికి వారు వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలకు రూపకల్పన చేసుకోవాలి. వట్టి ఆలోచనలతో పని జరగదు. వాటిని ఆచరణలో పెట్టాలి.

విద్యా సంస్థల్లో పనిచేసే వారిపై బాధ్యత మరింతగా ఉంది. విద్యార్థులకు జీవ పరిణామంపై, డార్విన్‌పై సందర్భాన్ని బట్టి ఇంకా అనేక వైజ్ఞానిక అంశాలపై వ్యాస రచన, ఉపన్యాస పోటీలు పెడుతూ వారిలో వైజ్ఞానిక జిజ్ఞాస పెంచాలి. భావి భారత పౌరులు వారే గనక, మనం వారి మీదే శ్రద్ధ పెట్టాలి. వారిని హేతుబద్ధంగా ఆలోచింపజేయాలి. మానవ వాదులుగా తీర్చిదిద్దుకోవాలి. చేస్తున్న కార్యక్రమాలతో మనం మరొకరికి స్ఫూర్తినిస్తూ ఉండాలి.

– డా॥ దేవరాజు మహారాజు
వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, బయాలజీ ప్రొఫెసర్

సాంత్వననిచ్చే గొంతులు

కామెంట్



కరణ్ థాపర్

అంతా నిన్ననే జరిగినట్లుంది. జ్ఞాపకం ఏమాత్రం మసకబారలేదు. ఫాదర్ టెర్రీని నేను మొదటిసారి కలిసి దాదాపు 45 ఏళ్లయ్యింది. అది 1982. వేసవి కాలం చివరి రోజులు. నిషా, నేను పెళ్లి చేసుకోబోతున్నాం. మా రెండు జీవితాలు ఒక్కటి కాబోతున్నాయి. తను క్యాథలిక్కు. అన్ని లాంఛనాలతో చర్చిలో పెళ్లి జరగాలని ఆమె కోరిక. నాకూ అభ్యంతరం లేదు. కాకుంటే చర్చి మతాధికారిని మూడుసార్లు కలిసి పెళ్లి ట్యూషన్ చెప్పించుకోడం ఒక్కటే నాకు నచ్చలేదు. అలా చేస్తేనే నిషాకు నాన్–క్రిస్టియన్ అయిన నాతో పెళ్లి జరుగుతుంది. ఈశాన్య ఇంగ్లాండ్‌లోని నార్తంబర్లాండ్ ఎవెన్యూలోని సెయింట్ మేరీ మాగ్దలీన్ చర్చి నిబంధన అలా ఉంది. కాబట్టి ఒప్పుకోక తప్పలేదు.

సెప్టెంబరు నెలలో ఒక శనివారం నేను, నిషా కలిసి ఫాదర్ టెర్రీ దగ్గరకు వెళ్లాం. అప్పుడు సమయం సరిగ్గా సాయంత్రం 6 గంటలు. ఆయన డెస్క్ వెనుక కూర్చుని ఉన్నారు. గది చివరన ఎదురుగా ఉన్న పాత లెదర్ సోఫా మీద మేం కూర్చున్నాం. ముక్కు మీదకు జారిన కళ్లజోడు పైనుంచి ఆయన మమ్మల్ని నిశితంగా గమనిస్తున్నారు. బయట వేడిగా ఉన్నా ఆ గదిలో వాతావరణం ఎందుకో బాగా చల్లగా ఉంది.

‘‘షెర్రీ తీసుకుంటారా?’’ ఫాదర్ చేసిన ఆఫర్ నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తింది. ‘‘ మీ ఇద్దరి సంగతి నాకు తెలియదు. నాకు మాత్రం షెర్రీ వైన్ చాలా ఇష్టం’’ అన్నాడాయన. ఆయన ఇచ్చిన టియో పెపే నా ఫేవరైట్ బ్రాండ్. ఫాదర్ టెర్రీకి ఎన్నో విషయాల్లో మంచి పరిజ్ఞానం ఉంది. వివేచనశీలి. కాసేపట్లోనే మేం బాగా దగ్గరయ్యాం. యూఎస్ ఓపెన్ టెన్నిస్, నాటింగ్ హిల్ కార్నివాల్, సల్మాన్ రష్దీ ‘మిడ్‌నైట్స్ చిల్డ్రెన్’ నవల... మా మధ్య చర్చకు వచ్చాయి. విశేషమేమిటంటే... మా పెళ్లి ఎలా జరగాలి, మాకు పుట్టబోయే పిల్లలు ఏ మతం స్వీకరించాల్సి ఉంటుంది వంటి అసలు విషయాలు మినహా అన్నీ చర్చించాం.

ఫాదర్ టెర్రీ జారిపోతున్న కళ్ల జోడును వెనక్కు ఎగదోసుకుంటూ సంభాషణను చక్కగా ఎంజాయ్ చేశారు. గంట సేపు ఇట్టే గడచిపోయింది. వచ్చే వారం మళ్లీ కలవాలనుకున్నాం. ఇక మేము సెలవు తీసుకుని అలా తలుపు వద్దకు వెళ్లామో లేదో ఫాదర్ మమ్మల్ని ఆపేశారు.



> ఫాదర్ టెర్రీలు ప్రతి మతంలోనూ ఉంటారు. దైవమే పరమావధిగా భావించేవారు సాటి మానవులను ప్రేమ పూర్వకంగా అర్థం చేసుకోగలరు. మనకు అలాంటి వారి అవసరం నేడు ఎంతగానో ఉంది.

‘మీరు విడివిడిగా ఎందుకు ఉంటున్నారు?’ అంటూ బాంబు లాంటి ఒక ప్రశ్న కూల్‌గా అడిగారు. అలా అడుగుతున్నప్పుడు, ఆయన గుండ్రటి ముఖం మీద చిరుదరహాసం మెరిసింది. దాంతో మా ముఖాలు లిప్తపాటు రక్తవిహీనం అయ్యాయి. నోట మాట రాలేదు. వాస్తవం ఏమిటంటే, మేం అప్పటికే సహజీవనం చేస్తున్నాం. కానీ ఆ విషయం దాచిపెట్టి, ఫాదర్ టెర్రీకి మేము వేరు వేరు చోట్ల ఉంటున్నట్లు అడ్రస్‌లు ఇచ్చాం. ఆయన ఆ విషయం పసిగట్టారు. అయినా అదేమంత పెద్ద విషయం కాదులే అంటూ మమ్మల్ని ఆ ఇరకాటం నుంచి బయట పడేశారు. అలా ఉండేది ఆయన సరళి.

ఫాదర్ టెర్రీ మాకు త్వరలోనే ఆప్తమిత్రుడయ్యారు. మా పెళ్లికి రెండు రోజుల ముందు ఒక రిహార్సల్ జరిగింది. పెళ్లిలో భగవద్గీత నుంచి ఏవైనా రెండు మంచి మాటలు చదవాలని ఆ సందర్భంగా ఆయన సూచించారు. ఆ ఎంపిక బాధ్యత నా మీదే పెట్టారు. తీరా ఆ సమయం వచ్చేసరికి నేను చేతులెత్తేశాను. ‘మరేం ఫర్లేదులే, ఇలా జరుగుతుందని నేను ముందే ఊహించి వేరొకటి రెడీగా పెట్టుకున్నా’ అంటూ నవ్వి మృదువుగా నా వీపు చరిచారు. ఆయన ఎంపిక చేసుకున్న పేరా ఖలీల్ జిబ్రాన్ ‘ప్రాఫెట్’ లోనిది.

పెళ్లి సందర్భంగా ఫాదర్ టెర్రీ చేసిన ఉపదేశం అందరినీ ఆకట్టుకుంది. నరకం, దేవుడు, దేవుడి మంచితనం... వంటి పెద్ద మాటలను పక్కన పెట్టారు. ఐ లవ్ యూ అనే ‘మూడే మూడు చిన్న మాటలు’ చెప్పారు.

‘నేను, నువ్వు అనే భేదాన్ని ప్రేమ చెరిపేస్తుంది... అలాగే అది ఆ రెంటినీ విడదీస్తుంది కూడా! కరణ్, నిషా... మీరు ఈ సత్యం గుర్తు పెట్టుకోవాలి. మీరు ఇద్దరు విభిన్న వ్యక్తులు అనే వాస్తవాన్ని మర్చిపోయిన రోజు ఆ బంధం కూడా వేర్పడిపోతుంది.’’

ఈ ప్రవచనం ఆర్భాటం లేకుండా ఇష్టాగోష్ఠిలా సాగింది. స్నేహపూర్వకమైన ఆయన సందేశం మర్చిపోలేనిది. పాతికేళ్లుగా అది నా జ్ఞాపకాల్లో మసకబారకుండా నిలిచిపోయింది.

ఆరేళ్ల తర్వాత... నిషా తన ఆఖరు ఘడియల్లో లైఫ్ సపోర్ట్ మీద ఉన్నప్పుడు ఫాదర్ టెర్రీ ఆమె పక్కనే ఉన్నారు. ఆమెకు మత కర్మలు నిర్వహించారు. అంతే కాకుండా, మా అమ్మను కూడా నిషా చెవిలో హిందూ పుణ్యవచనాలు వినిపించవల్సిందిగా కోరారు. చివరకు నిషా ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోతున్న క్షణాల్లో కూడా ఫాదర్ టెర్రీ నా పక్కనే ఉన్నారు.

నాకు తెలిసిన ఒకే ఒక క్రైస్తవ మతాచార్యుడు టెర్రీ గిల్ఫెడర్! ఆయన అసాధారణమైన గొప్ప వ్యక్తి. క్రైస్తవుల మీద, ముస్లిముల మీద దాడులు జరిగాయన్న వార్తలు చదివిన ప్రతిసారీ నేను ఆయనను తలచుకుంటాను. గాయపడిన హృదయాలకు సాంత్వన చేకూర్చేందుకు ఫాదర్ టెర్రీ వద్ద ఎప్పుడూ కొన్ని మాటల దివ్యౌషధాలు ఉండి తీరుతాయి. ఆయన ఆఫర్ చేసే షెర్రీ వారికి ఉపకరిస్తుంది.

ఫాదర్ టెర్రీలు ప్రతి మతంలోనూ ఉంటారు. దైవమే పరమావధిగా భావించేవారు సాటి మానవులను ప్రేమపూర్వకంగా అర్థం చేసుకోగలరు. మనకు అలాంటి వారి అవసరం నేడు ఎంతగానో ఉంది. అయినా వారెవరూ ఎందుకు నోరు మెదపడం లేదు?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.పంచమి రా.2.34 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** చిత్త తె.5.40 వరకు (తెల్లవారితే మంగళవారం) తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.11.57 నుండి 1.41 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.40 నుండి 1.28 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.46 వరకు, **అమృతఘడియలు:** రా.10.29 నుండి 12.14 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.30, **సూర్యాస్తమయం:** 5.57.

మొన్న తల్లి.. నేడు పిల్లలు

- పిల్లలకు విషమిచ్చి తానూ తాగిన తల్లి
- చికిత్స పొందుతూ శుక్రవారం తల్లి మృతి
- ఆదివారం చిన్నారులిద్దరూ కన్నుమూత


మయాంతలక్ష్మి, కృషంత్

పెగడపల్లి: ఇద్దరు పిల్లలకు విషమిచ్చిన తల్లి.. తానూ తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన విషాదాంతంగా ముగిసింది. ఈ ఘటనలో చికిత్స పొందుతూ తల్లి శుక్రవారం మృతిచెందగా.. పిల్లలు కృషంత్ (10), మయాంతలక్ష్మి (8) ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో కన్నుమూశారు. పిల్లల మృతదేహాలను స్వగ్రామమైన జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం మద్దులపల్లికి తరలించారు. కాగా, తమ అల్లుడు తిరుపతి మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతోపాటు అదనంగా కట్నం తేవాలని వేధించినందుకే తమ కూతురు ఇద్దరు పిల్లలతో కలసి ఆత్మహత్య చేసుకుందని హారిక తల్లిదండ్రులు అల్లెం మల్లయ్య, పోచవ్వ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై రవికిరణ్ తెలిపారు.

కుటుంబ సభ్యుల ఆందోళన..

పిల్లల మృతదేహాలను ఆదివారం మధ్యాహ్నం మద్దులపల్లికి తీసుకొచ్చారు. అప్పటికే హారిక కుటుంబ సభ్యులు, బంధువులు మద్దులపల్లికి తరలివచ్చారు. హారికతోపాటు పిల్లల మృతికి తిరుపతే కారణమని, అతడిని కఠినంగా శిక్షించాలని హారిక తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. అప్పటివరకు పిల్లల మృతదేహాలకు అంత్యక్రియలు చేయమని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అక్కడికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రవి హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య పిల్లల మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తి చేశారు.

బిల్లులు రాక మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న వెంకటయ్య

బషీరాబాద్: గ్రామాభివృద్ధికి చేసిన పనులకు బిల్లులు రాక ఓ మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాశింపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చింతకింది వెంకటయ్య ఐదేళ్లు సర్పంచ్‌గా కొనసాగారు. అప్పులు తెచ్చి గ్రామంలో అభివృద్ధి పనులు చేశారు. దీంతో అవి వడ్డీతో సహా రూ.10 లక్షల వరకు మీదపడ్డాయి. సర్పంచ్ పదవీకాలం ముగిసి ఏడాది గడుస్తున్నా.. నేటికీ బిల్లులు రాలేదని రోజూ మదన పడేవాడని కుటుంబీకులు తెలిపారు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం లేక పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు, గ్రామస్తులు వెంటనే ఆయన్ను తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా, వెంకటయ్య ఆత్మహత్యకు వ్యక్తిగత కారణాలు కూడా ఉన్నాయని పలువురు చర్చించుకున్నారు.

ఉద్యోగాల ఎర.. 'సైబర్' వెట్టిలో చెర!!

తెలంగాణ, ఏపీ సహా 150 మంది భారతీయులను నిర్బంధించి సైబర్ నేరాలు చేయిస్తున్న చైనా స్కామ్‌స్టర్లు

- బ్యాంకాక్‌లో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాల పేరిట ఆన్‌లైన్‌లో ప్రకటనలిచ్చి బురిడీ
- అక్కడికి వెళ్లాక పాస్‌పోర్టులు లాక్కున్న వైనం.. ఎన్‌ఆర్‌ఐలను మోసగించే 'ఉద్యోగం' చేయాలని హుకుం
- ఇంగ్లిష్ రాని వారికి హనీట్రాప్ 'పనుల' అప్పగింత.. నిరాకరిస్తే చిత్రహింసలు
- కాపాడాలంటూ 'సాక్షి'ని ఫోన్‌లో కోరిన కరీంనగర్‌కు చెందిన ఓ బాధితుడు
- ఆదుకోవాలంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు మొర


సాక్షి ప్రతినిధి, కరీంనగర్: చైనా స్కామ్‌స్టర్లు ఆన్‌లైన్‌లో విసిరిన 'ఉద్యోగాల' వలలో తెలంగాణ, ఏపీ సహా 150 మంది భారతీయులు చిక్కుకున్నారు. బందీలుగా మారి సైబర్ మోసాల వెట్టిచాకిరీలో విలవిల్లాడుతున్నారు. తమను కాపాడాలంటూ ఓ బాధితుడు 'సాక్షి'ని ఆశ్రయించడంతో ఈ దారుణం వెలుగుచూసింది.

విమాన టికెట్ పంపి మరీ..

కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం రంగపేట గ్రామానికి చెందిన కొక్కిరాల మధుకర్‌రెడ్డి ఉపాధి కోసం గతంలో దుబాయ్ వెళ్లి వచ్చాడు. 'బ్యాంకాక్‌లో రూ. లక్ష జీతంతో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం' అంటూ ఆన్‌లైన్‌లో వచ్చిన ప్రకటనను చూసి దరఖాస్తు చేసుకున్నాడు. ఉద్యోగానికి ఎంపిక చేశామని.. వచ్చి వెంటనే విధుల్లో చేరాలంటూ ప్రకటనదారుల నుంచి విమాన టికెట్ అందడంతో గతేడాది డిసెంబర్ 18న బ్యాంకాక్ వెళ్లాడు. తీరా అక్కడికెళ్లాక ఆయన పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. మధుకర్‌రెడ్డి పాస్‌పోర్టు లాక్కున్న సైబర్ నేరగాళ్లు ఆయన్ను సైబర్ నేరాలు చేసే 'పని' చేయాలని హుకుం జారీ చేశారు.

గత్యంతరం లేకపోవడంతో..

అమెరికాలో నివసించే భారతీయుల చేత క్రిప్టోకరెన్సీ పేరిట పెట్టుబడులు పెట్టించి వారిని మోసగించడమే చైనా సైబర్ నేరగాళ్లు మధుకర్‌రెడ్డి లాంటి బాధితులకు అప్పగించిన ఉద్యోగం. కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంగ్లిష్‌లో మాట్లాడగల నైపుణ్యం ఉన్న బాధితులకు ఈ పనులు అప్పగించారు. అవి రాని యువకులకు మాత్రం అమాయకులకు ఫోన్లు చేసి తీయగా మాట్లాడి (హనీట్రాప్) డబ్బు కాజేసే పనులు ఇచ్చారు. అయితే పాస్‌పోర్టులు లాక్కోవడంతో విధిలేక చైనా నేరగాళ్లు చెప్పినట్లు చేశారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఇటీవల బాధ్యతలు చేపట్టాక బ్యాంకాక్‌లో పరిస్థితులు మారడంతో స్కామ్‌స్టర్లు.. వారి మకాంను బ్యాంకాక్‌కు 574 కి.మీ. దూరంలోని వాయవ్య మయన్మార్‌లో ఉన్న


భారతీయులను బంధించిన థాయ్‌లాండ్ - మయన్మార్ సరిహద్దులోని భవనం. (ఇన్‌సెట్‌లో) మధుకర్‌రెడ్డి

ఇంగ్విన్ మయాంగ్ అనే చిన్న పట్టణంలోని ఓ భవంతికి మార్చారు. ఇంగ్విన్ మయాంగ్‌కు, థాయ్‌లాండ్ సరిహద్దుకు మధ్య కేవలం నది మాత్రమే అడ్డంకి.

కాపాడాలని వేడుకోలు..

అక్కడికి వెళ్లాక సైబర్ నేరగాళ్ల అరాచకాలు మితిమీరాయి. ఆహారం ఇవ్వకపోవడం.. తీవ్రంగా కొట్టడంతోపాటు తాగునీరు, విద్యుత్ లేని భవనంలో బాధితులను ఉంచారు. ఈ క్రమంలో ఓ ఫోన్‌ను సంపాదించిన మధుకర్‌రెడ్డి.. వాట్సాప్ కాల్ ద్వారా 'సాక్షి'ని ఆశ్రయించి సాయం చేయాలని కోరాడు. ఉద్యోగ ప్రకటనతో తాము మోసపోయామని, తమను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు. ఈ నెల 19 తర్వాత తమను కాల్చి చంపుతామని నేరగాళ్లు బెదిరిస్తున్నారని వాపోయాడు. తనతోపాటు తెలంగాణ, ఏపీ, బిహార్, రాజస్తాన్‌కు చెందిన దాదాపు 150 మందిని అక్రమంగా బంధించారని వివరించాడు. వెంటనే తమను విడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరాడు.

'పూలే విద్యానిధి'లో

బీసీ కోటా పెరిగేనా?

- 1,000 యూనిట్లకు పెంచాలంటూ ప్రతిపాదనలు
- ఆర్నెల్లుగా ముఖ్యమంత్రి కార్యాలయంలోనే ఫైల్ పెండింగ్
- 2023 ఆగస్టు నుంచి ఎంపిక ప్రక్రియకు బ్రేక్
- 8,500 దరఖాస్తులు పెండింగ్‌లోనే...

సాక్షి, హైదరాబాద్: 'మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి'లో బీసీ కోటా పెంపుపై ఇంకా రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయమూ తీసుకోలేదు. 2023–24 విద్యా సంవత్సరం నుంచి ఈ పథకం కింద దరఖాస్తులు స్వీకరిస్తున్న బీసీ సంక్షేమశాఖ, వాటిని పరిశీలించడానికే పరిమితమైంది. కోటా పెంపునకు సంబంధించి ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో అర్హుల ఖరారును వాయిదా వేస్తోంది. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరిపోతుండగా, 2023 ఆగస్టులో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏకంగా కోర్సు ముగింపు దశకు వచ్చేశారు. ఈ పథకం కింద దరఖాస్తులు సమర్పించి నెలలు గడుస్తున్నా, అర్హత తేల్చకపోవడంతో ఆయా విద్యార్థులు తమకు ఆర్థికసాయం అందుతుందా..లేదా? అనే సందిగ్ధంలో పడిపోయారు.

సీఎంవో నిర్ణయం కోసం..

ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఎంపికైన ఒక్కో లబ్ధిదారుకు గరిష్టంగా రూ.20 లక్షల సాయం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. సంక్షేమశాఖల ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తుండగా, బీసీ సంక్షేమశాఖలో ఈ పథకానికి విపరీతమైన డిమాండ్ ఉంది. దరఖాస్తుల సంఖ్య భారీగా ఉంటే.. అర్హులను మాత్రం అత్యంత పరిమిత సంఖ్యలో రాష్ట్ర ప్రభుత్వం గుర్తిస్తూ సాయం చేస్తోంది. ఏటా 300 మందికి ఈ పథకం కింద బీసీ సంక్షేమశాఖ ఆర్థిక సాయం అందిస్తోంది. జనాభాపరంగా బీసీలు ఎక్కువ మంది ఉన్నందున, కోటా పెంచాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ 2023 డిసెంబర్ నెలాఖరులో బీసీ కోటాను 300 నుంచి 1,000 యూనిట్లకు పెంచాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించగా, ప్రస్తుతం ఈ ఫైల్ సీఎం కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఒకేసారి మూడింతలు పెంచడంపైన సీఎంవో వర్గాలు తిరకాసు పెట్టడంతో యూనిట్ల పరిమితిని 800కు పరిమితం చేసేలా చర్చలు జరిగాయి. అయితే ఈ ఫైల్‌కు ఇప్పటివరకు మోక్షం కలగలేదు. దీంతో 2023 ఆగస్టు నుంచి ఇప్పటివరకు నాలుగు దశల్లో దాదాపు 8,500 దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. సీఎంవో నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చిన తర్వాతే ఎంపిక ప్రక్రియ ముందుకు సాగుతుందని అధికారులు చెబుతున్నారు.

నేడు తిరుపతిలో అంతర్జాతీయ దేవాలయాల సదస్సు

- హజరుకానున్న మహారాష్ట్ర, గోవా సీఎంలు, కేరళ గవర్నర్

తిరుపతి అర్బన్/ తిరుపతి మంగళం: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో సోమవారం నుంచి మూడ్రోజుల పాటు అంతర్జాతీయ దేవాలయాల సదస్సు జరగనుంది. మంగళం ఆశా కన్వెన్షన్‌లో ఈ మహాకుంభ్ కార్యక్రమం జరుగుతుంది. ఈ మేరకు ఆదివారం తిరుపతిలోని ఓ హోటల్‌లో మహారాష్ట్ర శాసనమండలి చీఫ్‌విప్ ప్రసాద్ లాడ్, టెంపుల్ కనెక్ట్ అండ్ ఐటీసీ ఎక్స్‌పో వ్యవస్థాపకుడు గిరేష్ కులకర్ణి, మహాకుంభ్ ప్రతినిధి నీత మీడియాకు సదస్సు వివరాలు వెల్లడించారు. దేవాలయ పరిపాలన, నిర్వహణకు సంబంధించి ఈ ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ (ఐటీసీ ఎక్స్‌పో) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 58 దేశాల్లో 1,581 భక్తి సంస్థల నుంచి హైబ్రిడ్ భాగస్వామ్యంతో ఈ ఐటీసీ నడుస్తోందన్నారు. సదస్సుకు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, కేరళ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, గోవా సీఎం ప్రమోద్ సావంత్, అలాగే ఏపీ సహా వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు మంత్రులు, విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే, సుప్రీంకోర్టు న్యాయవాది విష్ణు శంకర్ జైన్ తదితరులు హాజరుకానున్నారని వెల్లడించారు.

కూతురుతో చనువుగా ఉంటున్నాడని..

- యువకుడిని దారుణంగా నరికి చంపిన తండ్రి
- మృతదేహాన్ని ముక్కలుముక్కలు చేసి కాల్చివేత
- సంగారెడ్డి జిల్లాలో ఘటన


దశరథ్

నారాయణఖేడ్: తన కూతురుతో వివాహితుడైన యువకుడు చనువుగా ఉండటాన్ని ఆ తండ్రి జీర్ణించుకోలేకపోయాడు. కూతురుతో ఫోన్ చేయించి రప్పించి, అతడిని అత్యంత దారుణంగా నరికి చంపాడు. అంతటితో ఆగకుండా మృతదేహాన్ని ముక్కలుముక్కలుగా చేసి తగులబెట్టాడు. తర్వాత తానే హత్య చేశానంటూ పోలీసులకు లొంగిపోయాడు. సినిమాను తలపించేలా జరిగిన ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి.. నిజాంపేట మండలం నాగ్‌ధర్ పరిధిలోని రాంచందర్ తండాకు చెందిన అంగోతు దశరథ్ (26) సంగారెడ్డి సమీపంలోని ఓ చక్కెర కర్మాగారంలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దశరథ్ గతంలో ట్రాక్టర్ నడిపిన సమయంలో పరిచయమైన నిజాంపేట మండలం మేగ్యానాయక్ తండాకు చెందిన నేనావత్ గోపాల్ కూతురు (14 ఏళ్లు)తో కొంతకాలంగా సన్నిహితంగా ఉంటున్నాడు. బాలిక ఉండే హాస్టల్‌వద్దకు సైతం తరచూ వెళ్లి వచ్చే వాడని తెలిసింది. అయితే ఈ విషయాన్ని జీర్ణించుకోలేపోయిన బాలిక తండ్రి గోపాల్.. ఈ నెల 12వ తేదీన తన కూతురుతోనే ఫోన్ చేయించి దశరథ్‌ను రప్పించాడు. అతడిని మభ్యపెట్టి ఈదుల్ తండా సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి గుట్టలమధ్య దారుణంగా హత్య చేశాడు. తర్వాత దశరథ్ శవాన్ని బండరాళ్లతో కొట్టి కాళ్లు, చేతులు, ముక్కలుముక్కలుగా నరికి కాల్చివేశాడు. ఇదిలా ఉండగా పని ఉందంటూ బయటకు వెళ్లిన తన భర్త అటు స్వస్థలమైన రాంచందర్ తండాలోని ఇంటికి వెళ్లక.. ఇటు సంగారెడ్డిలోని తాము ఉంటున్న ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన దశరథ్ భార్య సోని ఈనెల 14న తన భర్త అదృశ్యమైనట్లు సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దశరథ్ జాడ తెలియక ఆయన కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్న సమయంలోనే అతడిని తానే హత్య చేసినట్లు ఒప్పుకుని గోపాల్, నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో శనివారం లొంగిపోయాడు. పోలీసులు విచారించగా, ఆదివారం ఈదుల్ తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో గుట్టలమధ్య హత్యచేసిన ప్రదేశాన్ని చూపించాడు. పోలీసులు దశరథ్ మృతదేహం అవశేషాలను స్వాధీనం చేసుకొని, వైద్య పరీక్షల అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆధార్ లేకపోతే వైద్యం చేయరా?

- ఉస్మానియా వైద్యులపై మంత్రి దామోదర ఆగ్రహం
- మహిళకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం
- వైద్యం నిరాకరణ అబద్ధం: ఆసుపత్రి సూపరింటెండెంట్


ప్రమీలను పరామర్శిస్తున్న న్యాయమూర్తి అబ్దుల్ జావీద్ పాషా

సాక్షి, హైదరాబాద్/అఫ్జల్‌గంజ్: ఆధార్ కార్డు లేదన్న కారణంతో ఒక మహిళకు వైద్యం నిరాకరించిన ఉస్మానియా ఆసుపత్రి వైద్యులపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో ఉన్న ఆ మహిళకు వెంటనే మెరుగైన వైద్యం అందించాలని ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా యడ్లపల్లి చెందిన ప్రమీల అనారోగ్యంతో ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లగా, ఆమెకు ఆధార్‌కార్డు లేదని వైద్యం చేసేందుకు నిరాకరించినట్లు మీడియాలో వచ్చిన వార్తలపై మంత్రి ఆదివారం స్పందించారు. అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన వారికి ఆధార్ లేకుంటే వైద్యం చేయరా? అని ప్రశ్నించారు. ఏదో ఉద్యోగంలా కాకుండా మానవత్వంతో రోగులకు చికిత్స అందించాలని హితవు పలికారు.

ఆధార్ లేకున్నా ఉస్మానియాలో వైద్యం: డాక్టర్ రాకేశ్

ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య సేవల కోసం ఆధార్‌కార్డు తప్పనిసరి కాదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్ తెలిపారు. ఆసుపత్రిలో నిత్యం సుమారు 3,000 మందికి ఓపీ వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆధార్ కార్డు లేదన్న కారణంతో ప్రమీల అనే మహిళకు వైద్యం నిరాకరించిన ఘటనపై ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆధార్‌కార్డు నమోదు చేయడం వల్ల రోగులకు భవిష్యత్తులో అందించే వైద్య సేవలు, మందుల పంపిణీ, ఇతర మెరుగైన వైద్య సేవలకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. ప్రమీళ ఈ నెల 8న ఉస్మానియాకు రాగా, అదే రోజు ఆధార్ కార్డు లేకున్నా వైద్యం అందించినట్లు తెలిపారు. ఆమె ఆసుపత్రి బయట ఉండడంతో ఆరోగ్యం క్షీణించిందని, ఆదివారం ఉదయం అఫ్జల్‌గంజ్ పోలీసులు ఆమెను తీసుకురావడంతో ఇన్‌పేషంట్‌గా చేర్చుకొని వైద్యం ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంనిలకడగా ఉందని చెప్పారు. ప్రమీలను నాంపల్లి క్రిమినల్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ జావేద్ పాషా ఆదివారం పరామర్శించారు.

క్యాన్సర్‌కు భయపడొద్దు

'పింక్ సఖి శారీ వాక్'లో సినీ నటి గౌతమి


మాట్లాడుతున్న సినీనటి గౌతమి

ఏయూ క్యాంపస్ (విశాఖ): కేన్సర్ వస్తే జీవితం ముగిసిపోయిందని భయపడవద్దని, ధైర్యంగా పోరాడాలని సినీనటి, లైఫ్ ఎగైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గౌతమి తాడిమల్ల పిలుపునిచ్చారు. కేన్సర్‌పై అవగాహన కోసం విశాఖ ఆర్కే బీచ్ వేదికగా దేశంలోనే తొలిసారిగా పింక్ సఖి శారీ వాక్ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీచ్‌రోడ్డులో రోహిత్ మెమోరియల్ ట్రస్ట్, రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. అతిథిగా నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, యాంకర్, సినీ నటి శిల్పా చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. మహిళలు వేలాది మంది వాక్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జుంబా డ్యాన్స్, ఫ్యాషన్ షో ఆకట్టుకున్నాయి.

భారత్‌కు 2.1 కోట్ల డాలర్ల... ఎన్నికల నిధులు ఆపేశాం



- మస్క్ నేతృత్వంలోని డోజ్ ప్రకటన
- మన ఎన్నికలపై అమెరికా జోక్యమా?
- యూపీఏ హయాంలోని నిర్వాకమే: బీజేపీ

వాషింగ్టన్: విదేశీ నిధులకు కత్తెర వేసే చర్యల్లో భాగంగా భారత్‌కు అందజేస్తున్న 2.1 కోట్ల డాలర్ల ఎన్నికల నిధులను నిలిపేస్తున్నట్టు అమెరికా చేసిన ప్రకటన కలకలం సృష్టిస్తోంది. భారత్, బంగ్లాదేశ్ సహా పలు దేశాలకు కోట్లాది డాలర్ల ఎన్నికల నిధులిచ్చే కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) ఆదివారం ప్రకటించింది. అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బును వృథా చేస్తున్న కార్యక్రమాలన్నీ రద్దు చేసినట్టు ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఆర్థిక వనరుల వృథాకు ముకుతాడు వేసేందుకు డోజ్‌ను అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం తెలిసిందే. ''భారత్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి 2.1 కోట్ల డాలర్ల చొప్పున ప్రత్యేకిస్తూ వస్తున్నాం. ఇకపై ఆ ఫండింగ్‌ను నిలిపేస్తున్నాం'' అని డోజ్ వెల్లడించడం రాజకీయంగా కలకలం రేపుతోంది. ట్రంప్‌తో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాలో భేటీ అయిన మూడు రోజులకే ఈ ప్రకటన రావడం గమనార్హం. అయితే భారత్‌కు ఇస్తున్నట్టు చెబుతున్న ఈ 2.1 కోట్ల డాలర్లను ఎప్పటినుంచి, ఎంత తరచుగా, ఎవరికి అందజేస్తూ వస్తోందన్న దానిపై స్పష్టత లేదు. ఈ వ్యవహారంపై బీజేపీ తక్షణం స్పందించింది. ఇది కచ్చితంగా భారత ఎన్నికల ప్రక్రియలో విదేశీ జోక్యమేనంటూ దుయ్యబట్టింది. ''ఓటింగ్ పెంచడానికి 2.1 కోట్ల డాలర్లా? దీని వల్ల ఎవరికి లాభం చేకూరుతూ వస్తున్నట్టు? కచ్చితంగా అధికార పార్టీకైతే కాదు!'' అంటూ పార్టీ ఐటీ విభాగ సారథి అమిత్ మాలవీయ ఆదివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ నిధులను కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వమే పొందిందని ఆరోపించారు. ''2012లో నాటి ప్రధాన ఎన్నికల అధికారి ఎస్.వై.ఖురేషీ నేతృత్వంలోని కేంద్ర ఎన్నికల సంఘం జార్జ్ సోరోస్‌కు చెందిన ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ తాలూకు ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఎలక్టోరల్ సిస్టమ్స్‌తో ఒప్పందం చేసుకుంది. అలా మన ఎన్నికల వ్యవస్థను విదేశాలకు అప్పగించడానికి కూడా వెనకాడలేదు! ఇప్పుడు వాళ్లే సీఈసీ నియామకంలో పారదర్శకత లేదని గగ్గోలు పెడుతున్నారు'' అని దుయ్యబట్టారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే శక్తులను ఈసీ వంటి సంస్థల్లోకి చొప్పించేందుకు యూపీఏ వీలు కల్పించిందని డోజ్ ప్రకటనతో స్పష్టమవుతోందన్నారు. బంగ్లాదేశ్‌ను రాజకీయంగా బలోపేతం చేయడానికి ఉద్దేశించిన 2.9 కోట్ల డాలర్లను కూడా నిలిపేస్తున్నట్టు డోజ్ పేర్కొంది. మరో 15 పై చిలుకు దేశాలకు ఇస్తున్న నిధులకూ మంగళం పాడుతున్నట్టు తెలిపింది.

హమాస్‌ను నిర్మూలించాల్సిందే

అమెరికా విదేశాంగ మంత్రి రుబియో



జెరూసలేం: హమాస్‌ను గాజా నుంచి తుడిచిపెట్టాల్సిందేనని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో స్పష్టం చేశారు. సైనికపరమైన లేదా ప్రభుత్వాన్ని నడిపే శక్తిగా హమాస్ ఎంతమాత్రం కొనసాగనివ్వబోమని చెప్పారు. ఆదివారం ఆయన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ''ప్రభుత్వంగా, పరిపాలనా శక్తిగా, హింసకు పాల్పడతామంటూ బెదిరించే వ్యవస్థగా హమాస్ ఉన్నంత కాలం శాంతి నెలకొనడం అసాధ్యం. అందుకే హమాస్‌ను నిర్మూలించకతప్పదు'' అని కుండబద్దలు కొట్టారు. హమాస్‌పై పోరుకు అరబ్ దేశాల సాయం కూడా కోరుతామన్నారు. ఎవరూ ముందుకు రాకుంటే సొంతంగా ఇజ్రాయెలే ఆ పని పూర్తి చేస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో హమాస్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల ఒప్పందం కొనసాగడంపై అనుమానంగా మారింది. దాని గడువు రెండు వారాల్లో ముగియనుంది. రెండో దశలో మిగతా బందీలను హమాస్ విడుదల చేయాల్సి ఉండటం తెలిసిందే. ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం గాజాపై దాడులకు దిగింది. వీటిలో తమ ముగ్గురు పోలీసులు చనిపోయినట్లు హమాస్ తెలిపింది.



శనివారం ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరగడానికి కొద్ది క్షణాల ముందు దృశ్యమిది



తొక్కిసలాట అనంతరం మెట్ల దారిపై చెల్లాచెదురుగా పడున్న చెప్పులు, బ్యాగులు

రెండు రైళ్లు.. ఒకే పేరు

ఢిల్లీ తొక్కిసలాటకు అదే కారణం

- అనౌన్స్‌మెంట్ వినగానే కుంభమేళా ప్రయాణికుల్లో హైరానా
- తమ రైలే అనుకుని ప్లాట్‌ఫాం మారేందుకు పరుగులు
- ఇరుకు మెట్లు, ఓవర్‌బ్రిడ్జిపై ఒకరి మీద ఒకరు పడి దుర్ఘటన
- 18కి పెరిగిన మృతులు, 30 మందికి గాయాలు
- మృతుల్లో 16 మంది మహిళలు, చిన్నారులే

న్యూఢిల్లీ: రెండు రైళ్లకు ఒకేలాంటి పేరు. ఇరుకైన ఓవర్ బ్రిడ్జి. సమాచార లోపం. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటకు ఇవే ప్రధాన కారణాలని తేలింది. మహా కుంభమేళాకు బయల్దేరిన ప్రయాణికుల్లో చాలామంది 14వ నంబర్ ప్లాట్‌ఫాంపై ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ కోసం భారీ సంఖ్యలో వేచి ఉన్నారు. 'ప్రయాగ్‌రాజ్ స్పెషల్' రైలు 12వ ప్లాట్‌ఫాంపైకి వచ్చినట్లు ప్రకటన రావడంతో తమ రైలే ప్లాట్‌ఫాం మారిందని భావించారు. భారీ జనసందోహం నడుమ ఏమాత్రం ఆలస్యమైనా రైలు అందదేమోనని భయపడ్డారు. 12వ ప్లాట్‌ఫాంకు చేరేందుకు ఉన్నపళంగా పరుగులు తీశారు. ఓవర్ బ్రిడ్జిపైకి దారితీసే మెట్ల మార్గంపైకి వేలాదిగా ఎగబడ్డారు. దానికి తోడు ఓవర్ బ్రిడ్జి కూడా సన్నగా ఉంది. వాటిపై ప్రయాణికులు పరస్పరం నెట్టేసుకుంటూ దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఆ క్రమంలో ఒకరిపై ఒకరు పడిపోయారు. చాలామంది ఊపిరాడక కన్నుమూశారు. పోలీసులు హెచ్చరిస్తున్నా అరుపులు కేకలతో ఏమీ విన్పించలేదు. ఈ దారుణంలో మృతుల సంఖ్య ఆదివారం 18కి పెరిగింది. వారిలో 11 మంది మహిళలు, నలుగురు చిన్నారులున్నారు. 30 మంది గాయపడ్డారు. తొక్కిసలాట తర్వాత మెట్ల మార్గం, ఓవర్ బ్రిడ్జిపై ఎక్కడ చూసినా చెప్పులు, చిరిగిన బ్యాగులే కనిపించాయి. రెండు రైళ్లకు ప్రయాగ్‌రాజ్ పేరుండడం అయోమయానికి దారి తీసిందని పోలీసులు ఆదివారం ధ్రువీకరించారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించారు. రైల్వే శాఖ కూడా విచారణకు ఆదేశించింది. వాస్తవానికి న్యూఢిల్లీ స్టేషన్ నుంచి శనివారం నాలుగు రైళ్లు ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరాల్సి ఉంది. వాటిలో మూడు ఆలస్యమయ్యాయి. స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ రాజధాని ఎక్స్‌ప్రెస్ కూడా ఆలస్యమయ్యాయి. దాంతో ఆ ఐదు రైళ్లలో వెళ్లాల్సిన వారంతా ప్లాట్‌ఫాంలపైనే ఉండిపోవడంతో స్టేషన్ కిక్కిరిసిపోయింది.

ఆదివారమూ అదే రద్దీ

దుర్ఘటన జరిగినా న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో ఆదివారం కూడా ప్రయాణికుల రద్దీ విపరీతంగా కొనసాగింది. ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లడానికి వేలాది మంది తరలివచ్చారు. రైళ్లు ఎక్కడానికి పడరాని పాట్లు పడ్డారు. అధికారులు సైతం నియంత్రించలేని పరిస్థితి నెలకొంది.సమాచార లోపానికి తోడు ప్రయాణికులు గందరగోళానికి గురికావడం వల్లే ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

విచారణకు కమిటీ

తొక్కిసలాటపై దర్యాప్తు కోసం ప్రత్యేక విచారణ ఏర్పాట్లు చేసినట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ప్రిన్సిపల్ స్టేషన్‌లోని వీడియో ఫుటేజీ అందజేయాలని అధికారులను ఆదేశించింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు,తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వల్పంగా గాయపడినవారికి రూ.లక్ష పరిహారం ప్రకటించింది.

వైష్ణవ్ రాజీనామా చేయాలి

తొక్కిసలాటకు నైతిక బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తక్షణం రాజీనామా చేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ ఆదివారం డిమాండ్ చేశారు. లేదంటే కేంద్రమే ఆయన్ను తొలగించాలన్నారు. రైల్వేస్టేషన్‌కు వేలాది మంది జనం తరలివచ్చినా భద్రతా ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. ''దేశంలో ఇప్పుడు రెండు హిందూస్తాన్‌లు ఉన్నాయి. ఒక హిందూస్తాన్‌లో పాలకులు తమ మిత్రులకు స్వయంగా కుంభమేళాలో పుణ్యస్నానాలు చేయిస్తున్నారు. మరో హిందూస్తాన్‌లో సామాన్యులు ఇలా రైల్వేస్టేషన్లలో బలైపోతున్నారు. కుంభమేళాలో వీఐపీ సంస్కృతి నడుస్తోంది'' అని ఆక్షేపించారు.

రాష్ట్రపతి, ప్రధాని సంతాపం

ఢిల్లీ రైల్వేస్టేషన్ ఘటనపై పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ప్రధాని మోదీ తదితరులు కూడా సంతాపం ప్రకటించారు.



తొక్కిసలాటలో తమవారిని కోల్పోయి హృదయ విదారకంగా రోదిస్తున్న ప్రయాణికులు

మూడో విమానం వచ్చింది

ఈసారి 112 మంది వలసదారులు

చండీగఢ్: భారత వలసదారులతో కూడిన మూడో విమానం అమెరికా నుంచి వచ్చింది. ఆ దేశానికి చెందిన సీ–17 సైనిక విమానం ఆదివారం రాత్రి 10 గంటల తర్వాత పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో దిగింది. అందులో భారత్‌కు చెందిన 112 మంది అక్రమ వలసదారులు తిరిగొచ్చారు. వీరిలో 44 మంది హరియాణా, 33 మంది గుజరాత్, 31 మంది పంజాబ్, ఇద్దరు యూపీకి చెందినవారు. కాగా ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ నుంచి ఒక్కొక్కరున్నారు. వీరిలో 19 మంది మహిళలు, 14 మంది మైనర్లు. మైనర్లలో ఇద్దరు నవజాత శిశువులున్నారు. వారికోసం విమానాశ్రయానికి వచ్చిన కుటుంబీకులతో ఉద్విగ్న వాతావరణం ఏర్పడింది. భారత అక్రమ వలసదారులను అమెరికా ఇప్పటిదాకా రెండు విమానాల్లో తిప్పి పంపించడం తెలిసిందే. అక్రమ వలసలపై కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్కుపాదం మోపుతున్నారు.

ఢిల్లీ సస్పెన్స్‌కు... నేటితో తెర!

సీఎం అభ్యర్థిని తేల్చనున్న బీజేపీ

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 27 ఏళ్ల తర్వాత విజయకేతనం ఎగరేసిన బీజేపీ సోమవారం ముఖ్యమంత్రి అభ్యర్థిని ఖరారు చేయనుంది. దేశ రాజధాని ఢిల్లీ సీఎం కుర్చీపై ఎవరు కూర్చుంటారనే సస్పెన్స్‌కు తెరపడనుంది. కొత్త ప్రభుత్వం 18న కొలువు తీరుతుందని భావిస్తున్నారు. సీఎం అభ్యర్థులపై గత కొద్ది రోజులుగా ఢిల్లీలో చర్చోపచర్చలు సాగుతున్నాయి. పర్వేశ్ వర్మ, ఆశిష్ సూద్, రేఖా గుప్తా తదితరుల పేర్లు వినిపిస్తున్నప్పటికీ పార్టీ అగ్ర నాయకత్వం మాత్రం దీనిపై పెదవి విప్పడం లేదు. ఇటీవల ఎన్నికల్లో మాజీ సీఎం, ఆప్ చీఫ్ కేజ్రీవాల్‌ను పర్వేశ్ వర్మ మట్టి కరిపించారు. ఢిల్లీ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఆశిష్ సూద్‌కు అగ్ర నేతలతో సన్నిహిత సంబంధాలున్నాయి. మహిళా నేతల్లో రేఖా గుప్తాకు మంచి పేరుంది. బీజేపీ సీనియర్ నేత, ఢిల్లీ అసెంబ్లీలో మాజీ ప్రతిపక్ష నేత విజేందర్ గుప్తా. బ్రాహ్మణ వర్గానికి చెందిన పలుకుబడి కలిగిన సతీశ్ ఉపాధ్యాయ, వైశ్య వర్గం నుంచి జితేంద్ర మహాజన్, మరో మహిళా నేత శిఖా రాయ్ తదితరులు పేర్ల వినిపిస్తున్నాయి. అయితే, మహిళా నేతను, అందులోనూ కొత్త వారిని సీఎంగా ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటూ పార్టీ నేతలు అంటున్నారు. అదే సమయంలో, కీలక మంత్రి పదవులకు 15 ఎమ్మెల్యేల పేర్లతో జాబితా తయారైనట్లుగా కూడా చెబుతున్నారు. అయితే, డిప్యూటీ సీఎం ఉండే అవకాశం లేదంటున్నారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశమై అభ్యర్థిని ఖరారు చేస్తారని భావిస్తున్నారు.

ఏటా రూ.9 లక్షల కోట్ల వస్త్ర ఎగుమతులు

- గడువు కంటే ముందే లక్ష్యం సాధిస్తాం
- 'భారత్ టెక్స్'లో ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం

న్యూఢిల్లీ: ఇండియా నుంచి ప్రతిఏటా రూ.9 లక్షల కోట్ల విలువైన వస్త్రాలను విదేశాలకు ఎగుమతి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. 2030ని డెడ్‌లైన్‌గా విధించింది. అయితే, గడువు కంటే ముందే అనుకున్న లక్ష్యం సాధిస్తామన్న విశ్వాసం తనకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆదివారం 'భారత్ టెక్స్–2025' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వస్త్రాల ఎగుమతిలో ప్రస్తుతం మన దేశంలో ప్రపంచంలో ఆరో స్థానంలో ఉందని తెలిపారు. మనం ప్రతిఏటా రూ.3 లక్షల కోట్ల విలువైన వస్త్రాలు ఎగుమతి చేస్తున్నామని వెల్లడించారు. దీన్ని మూడు రెట్లు పెంచాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యలతో వస్త్ర టెక్స్‌టైల్ రంగం గణనీయమైన ప్రగతి సాధించిందని హర్షం వ్యక్తంచేశారు. ఈ రంగంలో విదేశీ పెట్టుబడులు రెండు రెట్లు పెరిగాయని చెప్పారు. మనం ఇలాగే కష్టపడి పనిచేస్తే గడువు కంటే ముందే ఏటా రూ.9 లక్షల కోట్ల విలువైన వస్త్రాలను ఎగుమతి చేయగలమని స్పష్టంచేశారు. టెక్స్‌టైల్ రంగంలో ఒక యూనిట్ ఏర్పాటు చేయడానికి రూ.75 కోట్లు అవసరమని, దీంతో 2,000 మందికి ఉపాధి లభిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ రంగంలో అడుగుపెడుతున్న ఔత్సాహికులకు రుణ సదుపాయం కల్పించాలని బ్యాంక్‌లకు సూచించారు. వస్త్ర పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన కార్మికులకు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 5ఎఫ్ విజన్‌ను ప్రధానమంత్రి ప్రతిపాదించారు. ఫామ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారిన్. ఈ విజన్‌తో రైతులకు, నేత కార్మికులకు, డిజైనర్లకు, వ్యాపారులకు నూతన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఉద్ఘాటించారు. వస్త్ర పరిశ్రమకు కావాల్సిన నూతన పరికరాల తయారీ కోసం ఐఐటీల వంటి విద్యా సంస్థలతో కలిసి పనిచేయాలని వ్యాపారులకు సూచించారు. భారత్ టెక్స్ ఇప్పుడు అంతర్జాతీయ కార్యక్రమంగా మారిందన్నారు. ఇందులో 120 దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. హై–గ్రేడ్ కార్బన్, ఫైబర్ తయారీ దిశగా మన దేశం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

బైదూ, ఓపెన్‌ఏఐ సేవలు ఫ్రీ

డీప్‌సీక్ దెబ్బకు దిగొస్తున్న దిగ్గజాలు





వాషింగ్టన్: కృత్రిమ మేధ చాట్‌బాట్ సేవలరంగంలో తొలిసారిగా భిన్నమైన పరిస్థితి నెలకొంది. వందలా కోట్లు వెచ్చించి అభివృద్ధి చేసిన తమ అత్యాధునిక ఏఐ చాట్‌బాట్ సేవలను 'ప్రీమియం' వంటి ఖరీదైన చందాలు కట్టేవారికే అందిస్తున్న బైదూ, ఓపెన్‌ఏఐ వంటి దిగ్గజ సంస్థలు ఇప్పుడు 'ఉచిత' జపం చేస్తున్నాయి. చైనా ఏఐ సంచలనం డీప్‌సీక్ తమ అత్యాధునిక ఏఐ చాట్‌బాట్ సేవలను ప్రపంచవ్యాప్తంగా ఉచితంగా అందిస్తుండటంతో అవి కూడా అదే బాట పట్టాల్సిన అనివార్య పరిస్థితులు తలెత్తాయి.

ఏప్రిల్ ఒకటి నుంచి ఉచితం!

బీజింగ్ కేంద్రంగా పనిచేస్తున్న చైనాకు చెందిన ఇంటర్నెట్ దిగ్గజం బైదూ 'ఎర్నీ బాట్' పేరుతో ఏఐ చాట్‌బాట్ సేవలను అందిస్తుండటం తెలిసిందే. ఇది ఏఐ పెయింటింగ్ వంటి అత్యాధునిక సేవలను చందా కట్టిన ప్రీమియం కస్టమర్లకే అందిస్తోంది. ఈ సేవలను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అందరికీ ఉచితంగా అందిస్తామని బైదూ గురువారం వీచాట్ వెబ్‌సైట్‌లో ప్రకటించింది. అంతకు కొన్ని గంటల ముందే మరో దిగ్గజ ఏఐ సంస్థ 'ఓపెన్‌ఏఐ' కూడా ఉచిత సేవల అంశాన్ని ప్రకటించింది. తమ అధునాతన ఏఐ మోడల్ జీపీటీ–5ను ఉచితంగా అందిస్తామని సంస్థ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ''జీపీటీ–5ను ఇక అందరూ ఉచితంగా పొందొచ్చు. ఈ సేవల కోసం ఇప్పటికే చందా కట్టినవారికి మరింత అత్యాధునిక స్థాయి ఏఐ సేవలను అందిస్తాం'' అని స్పష్టం చేశారు. తర్వాత బైదూ మరో ప్రకటన చేసింది. జూన్ చివరికల్లా నూతన తరం ఏఐ మోడల్‌ను తెస్తామని తెలిపింది. ఇది డీప్‌సీక్ ఓపెన్ సోర్స్ మోడల్ తరహాలో ఉంటుందని భావిస్తున్నారు. డీప్‌సీక్ ఆర్1 ఏఐ మోడల్ ఉచితంగా అత్యాధునిక ఏఐ చాట్‌బాట్ సేవలను అందిస్తుండటంతో పోటీలో నిలదొక్కుకునేందుకు ఇతర అగ్రగామి సంస్థలు తప్పనిసరి పరిస్థితుల్లో ఉచితాల బాట పడుతున్నాయని ఏఐ నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే పలు సంస్థలు తమ బేసిక్ చాట్‌బాట్ సేవలను ఉచితంగా అందిస్తున్నా ఖరీదైన సేవలను ఉచితం చేస్తుండటం ఇదే తొలిసారి కావడం విశేషం.

జులైలో బ్రెజిల్‌లో బ్రిక్స్ శిఖరాగ్రం



సావోపాలో: అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి బ్రిక్స్ తదుపరి శిఖరాగ్రం జులై 6, 7వ తేదీల్లో బ్రెజిల్‌లోని రియోడిజనిరోలో జరగనుంది. ఈ విషయాన్ని దేశ విదేశాంగ మంత్రి మౌరో వియెరా ప్రకటించారు. ప్రపంచ పాలన సంస్కరణలు, గ్లోబల్ సౌత్ దేశాల మధ్య సహకారంపై దృష్టి సారించనున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే శిఖరాగ్రానికి భాగస్వామ్య దేశాలను కూడా ఆహ్వానించామని, సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయంతో మిగతా దేశాలు కూడా సమావేశాల్లో పాల్గొనవచ్చన్నారు. 2025 జనవరి నుంచి బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్ స్వీకరించడం తెలిసిందే. బ్రెజిల్, రష్యా, ఇండియా చైనాలతో 2009లో బ్రిక్‌గా ఏర్పాటై, 2010లో దక్షిణాఫ్రికా చేరికతో బ్రిక్స్‌గా మారింది. గతేడాది ఇరాన్, ఈజిప్టు, ఇథియోపియా, యూఏఈలను చేర్చుకుని ఈ కూటమిని విస్తరించారు. సౌదీ అరేబియాను కూడా కూటమి దేశాలు ఆహ్వానించాయి. బ్రిక్స్‌లో సభ్యత్వం కోసం తుర్కియే, అజర్‌బైజాన్, మలేసియా దరఖాస్తు చేసుకున్నాయి. మరికొన్ని దేశాలు ఆసక్తికనబరుస్తున్నాయి. ఇటీవలే ఇండోనేసియా 11వ సభ్య దేశంగా చేరింది. నైజీరియాకు భాగస్వామ్య దేశంగా గుర్తింపునిచ్చారు.

హిందూ సమాజం బాధ్యతగల సమాజం

- దేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని ఐక్యతగా భావిస్తుంది
- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలు



బర్ధమాన్(పశ్చిమబెంగాల్): హిందూ సమాజాన్ని ఏకం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ సమాజ్ (ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భగవత్ చెప్పారు. దేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని ఐక్యతగా భావించే బాధ్యతగల సమాజం హిందూ సమాజమని చెప్పారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బర్ధమాన్‌లోని ఎస్ఏఐ మైదానంలో ఆదివారం జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ''మీరు కేవలం హిందూ సమాజంపై మాత్రమే దృష్టిపెట్టారెందుకని అంటూ ఎంతో మంది తరచుగా నన్ను అడుగుతుంటారు. దేశంలో బాధ్యత కలిగిన సమాజం హిందూ సమాజమన్నదే వారికి నా సమాధానం. హిందూ సమాజాన్ని సంఘ్ సంఘటితం చేయాలని భావిస్తోంది. ఎందుకంటే దేశంలో బాధ్యత కలిగిన వారు హిందువులు' అని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోని భిన్నత్వాన్ని అంగీకరించాల్సిన ముఖ్యమైన విషయమన్నారు. 'భారత్‌లోనే ఉండిపోవాలని కోరుకున్న వారు సహజంగానే ఇక్కడి ప్రకృతికి అనుగుణంగా ఉండటానికి అలవాటుపడిపోయారు'' అని ఆయన వివరించారు.

'నియర్' వెరీ డియర్



పాతికేళ్ల క్రితం గ్రహశకలంపై దిగిన నాసా స్పేస్‌క్రాఫ్ట్

- ప్రస్తుతం భూమికేసి దూసుకొస్తున్న మరో గ్రహశకలం
- 'నియర్' అనుభవంతో దాన్ని అడ్డుకునే పనిలో నాసా

సరిగ్గా 24 ఏళ్ల క్రితం భూమి నుంచి ప్రయోగించిన ఒక అంతరిక్ష నౌక అనూహ్యంగా ఒక గ్రహశకలంపై దిగింది. దానికి ఆ సామర్థ్యం ఏమాత్రమూ లేకపోయినా రాతితో కూడిన నేలపై అతి సున్నితంగా ల్యాండైంది. అన్ని ప్రతికూలతలను తట్టుకుంటూ అక్కడి నుంచి రెండు వారాల నిక్షేపంగా పనిచేసింది. సదరు అస్టరాయిడ్‌కు సంబంధించిన విలువైన డేటాను భూమికి చేరవేసింది. గ్రహంపై కాకుండా ఓ గ్రహశకలంపై కాలుమోపిన తొలి స్పేస్‌క్రాఫ్ట్‌గా చరిత్ర సృష్టించింది. ఇదంతా అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా అప్పట్లో ప్రయోగించిన నియర్ ఎర్త్ అస్టరాయిడ్ రెండీవ్ (నియర్) స్పేస్‌క్రాఫ్ట్ గురించే. '2024 వైఆర్4' అనే గ్రహశకలం భూమి వైపుగా శరవేగంగా దూసుకొస్తున్న నేపథ్యంలో నాసా సైంటిస్టులు నాటి నియర్ ఘనతను మరోసారి గుర్తు చేసుకుంటున్నారు. వైఆర్4 భూమిని ఢీకొనే అవకాశాలు 2 శాతం దాకా ఉన్నట్టు వారు అంచనా వేస్తున్నారు. ఇది బహుశా 2032లో జరిగే చాన్సుందట. భూమికేసి రాకుండా దాన్ని దారి మళ్లించాలని భావిస్తున్నారు. ఆ ప్రయత్నాల్లో నాడు 'నియర్' అందించిన వివరాలు ఎంతగానో ఉపయోగపడవచ్చని చెబుతున్నారు.

అలా జరిగింది...

భూమికి 35.5 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న '433 ఏరోస్' అనే ఎస్–క్లాస్ గ్రహశకలం లక్షణాలు, అందులోని ఖనిజాలు, అయస్కాంత క్షేత్రం తదితరాలను అధ్యయనం చేయాలని నాసా భావించింది. దాని చుట్టూ కక్ష్యలో పరిభ్రమించే లక్ష్యంతో నియర్ స్పేస్‌క్రాఫ్ట్‌ను 1996 ఫిబ్రవరి 17న ప్రయోగించింది. అంతరిక్షంలో వెళ్లిన ఏడాదికి అది అస్టరాయిడ్ ఉపరితలానికి 1,200 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంది. అక్కణ్నుంచి మరింత ముందుకెళ్లి ఏరోస్ చుట్టూ కక్ష్యలోకి తిరగాల్సి ఉండగా నియర్ జాతకమే తిరగబడింది. 1998 డిసెంబర్ 20న సాంకేతిక లోపం తలెత్తింది. ఇంజన్ బర్న్ కారణంగా నియర్ అనుకున్నట్టుగా పనిచేయలేని పరిస్థితి! దాంతో బ్యాకప్ ఇంధనం సాయంతో దాన్ని ఏకంగా అస్టరాయిడ్‌పైనే దించాలని నాసా నిర్ణయించింది. ఆ ఆదేశాలకు అనుగుణంగా నియర్ 2001 ఫిబ్రవరి 12న ఏరోస్‌కు అత్యంత సమీపానికి చేరుకుంది. చివరికి నెమ్మదిగా ఏరోస్‌పై దిగి చరిత్ర సృష్టించింది. ఒక అంతరిక్ష నౌక గ్రహశకలాన్ని తాకడం అదే మొదటిసారి. అలా నియర్ కాస్తా సైంటిస్టులకు వెరీ డియర్‌గా మారిపోయింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

అమెరికాలో వరదలు

తీవ్రమైన మంచు, వణికిస్తున్న చలి

లూయిస్‌విల్లే: ప్రకృతి వైపరీత్యాలు అమెరికాను వణికిస్తున్నాయి. ఆగ్నేయాన భారీ వర్షాలు, ప్రమాదకరమైన వరదలు అతలాకుతలం చేస్తుండగా ఈశాన్య ప్రాంతంలో తీవ్రంగా మంచు కురుస్తోంది. మైదాన ప్రాంతాల్లో చలి వణికిస్తోంది. కెంటకీలోని క్లే కౌంటీలో సంభవించిన వరదల్లో శనివారం ఒకరు ప్రాణాలు కోల్పోయారు. వరద హెచ్చరికల నేపథ్యంలో జాక్సన్‌లోని కెంటకీ రివర్ మెడికల్ సెంటర్‌ను మూసివేశారు. కెంటకీలో నివాస భవనాలు, కార్లు వరదల్లో చిక్కుకుపోగా వర్జీనియాలోని రోడ్లను బురద కమ్మేసింది. టెన్నెస్సీ, అర్కా న్సాస్‌లోనూ అధికారులు వరద ప్రమాద హెచ్చరికలను జారీ చేశారు. 10 దక్షిణాది రాష్ట్రాల్లో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. న్యూఇంగ్లండ్, న్యూయార్క్‌ల్లో చాలాప్రాంతాలను భారీగా మంచు కప్పేసింది. నెబ్రాస్కా, అయోవా, విస్కాన్సిన్, మిషిగన్, డెన్వర్‌లో ఉష్ణోగ్రతలు మైనస్ 10 డిగ్రీలకు పడిపోయాయి. మొంటానా, డకోటా, మిన్నెసోటాల్లో మైనస్ 51 డిగ్రీల వరకు పడిపోయతాయని అధికారులు చెప్పారు.

మహా కుంభ్‌కు అర్థమే లేదు: లాలు



పట్నా: మహాకుంభ్ మేళాపై ఆర్‌జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు వివాదంగా మారాయి. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో 18 మంది వరకు కుంభమేళాకు వెళ్లి వస్తున్న వారు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై ఆదివారం ఆయన స్పందించారు. కుంభమేళాకు అర్థం లేదన్నారు. 'తొక్కిసలాట ఘటన చాలా ఆవేదన కలిగించింది. మహా కుంభ మేళా భక్తుల కోసం కేంద్ర ప్రభుత్వం అరకొర ఏర్పాట్లు చేసినట్లు దీనిని బట్టి అర్థమవుతుంది. రైల్వే శాఖ పూర్తిగా విఫలమైంది. ఇందుకు బాధ్యత వహిస్తూ ఆ శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి'అని లాలు డిమాండ్ చేశారు. మహా కుంభ్‌ను పురస్కరించుకుని ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానాలాచరించేందుకు కోట్లాదిగా జనం తరలివెళ్లడంపై ఆయన..'కుంభ మేళాకు అర్థమే లేదు. అది కేవలం అర్థం లేని కార్యక్రమం'అని వ్యాఖ్యానించారు. దీనిపై బీజేపీ బిహార్ ప్రతినిధి మనోజ్ శర్మ తీవ్రంగా మండిపడ్డారు. హిందూమతంపై ఆర్‌జేడీ వైఖరేంటో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చన్నారు. బుజ్జగింపు రాజకీయాల కోసమే లాలు ఇలాంటి మాటలు మాట్లాడారన్నారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం ; 17 ; ఫిబ్రవరి ; 2025



ఆర్టీసీలో ఐ టిమ్స్

సిటీ బస్సుల్లో డిజిటల్ చెల్లింపులను అమల్లోకి తేనున్నారు. ఇంటెలిజెంట్ టికెట్ ఇష్యూయింగ్ మిషన్స్ (ఐ టిమ్స్)ను ప్రవేశపెట్టనున్నారు.

-8లో



మార్చి.. ఏమార్చి..

కొందరు తమ వాహనాల్లో ఇష్టారీతిన మార్పులు చేర్పులు చేస్తున్నారు. ఆర్టీఏ నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు.

- సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/17.0

నగర పరిధిలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 36, కనిష్టంగా 17 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.





బాలోత్సవం.. నృత్య నీరాజనం

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన తెలంగాణ బాలోత్సవం.. ప్రజాపాటకు నృత్య నీరాజనం కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

నడి రోడ్డుపై కత్తులతో పొడిచి చంపారు

- అన్నను హత్య చేసిన తమ్ముళ్లు
- మేడ్చల్ బస్టాండ్ సమీపంలో దారుణం
- అడ్డుకునే ప్రయత్నం చేయని స్థానికులు
- సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టులు



నడి రోడ్డుపై ఉమేష్‌ను కత్తులతో పొడుస్తున్న సోదరులు

మేడ్చల్/ మేడ్చల్ రూరల్: అది జాతీయ రహదారి.. ఆదివారం సాయంత్రం కావస్తోంది.. జన సంచారం.. వందలాది వాహనాలు వస్తూ పోతున్నాయి. ఓ వ్యక్తి ప్రాణ భయంతో పరుగెత్తుకుంటూ వస్తున్నాడు. అతడిని కొందరు వ్యక్తులు వెంబడించారు. అందరూ చూస్తుండగానే కత్తులతో పొడిచి దారుణంగా హత మార్చారు. ఈ దారుణాన్ని అక్కడున్న వారు ఆపే ప్రయత్నం చేయకపోగా.. తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం సోమారంపేటకు గుగులోతు గన్యా మేడ్చల్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉమేష్ (25), రాకేష్ ఉన్నారు. వీరు మేడ్చల్ ఆర్టీసీ కాలనీలో నివాసముంటున్నారు. పెద్ద కుమారుడు ఉమేష్ నిత్యం మద్యం తాగి వచ్చి భార్య ప్రియాంకను, సోదరుడు రాకేష్‌ను, ఇంట్లోని పిల్లలను వేధింపులకు గురి చేస్తుండేవాడు. దురలవాట్లకు బానిసైన అతడిని దుబాయ్‌కి పంపించే ఏర్పాట్లు చేస్తుండగా.. వాటిని కూడా చెడగొట్టాడు. ఈ క్రమంలో ఆదివారం సైతం మద్యం తాగి ఇంటికి వచ్చిన ఉమేష్.. కుటుంబ సభ్యులతో ఘర్షణకు దిగాడు. అందరినీ చంపేస్తానంటూ బెదిరించాడు. ఇంట్లోనే ఉన్న సోదరుడు రాకేష్‌తో, చిన్నాన్న కుమారుడు లక్ష్మణ్‌లతో ఉమేష్ వాగ్వాదానికి దిగాడు. వారిని బీరు సీసాతో బెదిరించాడు. రాకేష్, లక్ష్మణ్‌లు అతడిని ప్రతిఘటించారు. దీంతో ఉమేష్ సమీపంలోని జాతీయ రహదారి వైపు పరుగెత్తాడు. రాకేష్, లక్ష్మణ్‌లు బస్టాండ్ సమీపంలో ఉమేష్‌ను పట్టుకుని రోడ్డుపై పడుకోబెట్టి కత్తితో పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉమేష్ మృతదేహంపై 12 కత్తిపోట్లు ఉన్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. మృతుడికి భార్య ప్రియాంక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా.. హత్య ఘటన వీడియోల్లో ఇద్దరు మాత్రమే కనిపిస్తున్నా.. మొత్తం ఐదుగురు పాల్గొన్నట్లు తెలుస్తోంది. రాకేష్, లక్ష్మణ్‌తో పాటు వీరి కుటుంబ సభ్యులు నవీన్, నరేష్, సురేష్‌లు ఉన్నట్లు సమాచారం. ఉమేష్‌ను కత్తులతో దారుణంగా పొడుస్తున్నా.. అక్కడున్నవారు కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. తమ మొబైల్ ఫోన్లలో హత్య చేస్తున్న దృశ్యాలను చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. తోటి మనిషి కత్తి పోట్లకు గురవుతున్నా.. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నా.. ఎవరూ స్పందించకపోవడం మానవత్వం కనుమరుగవుతోందనడానికి మచ్చుతునకగా చెప్పవచ్చు.




రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

ఏజెన్సీ బురిడీ.. మీటర్ దోపిడీ

ఏఎంఆర్‌ఎంలపై అదనపు బాదుడు

నగర శివారులోని ఓ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌కు మల్టీ స్టోరీడ్ బిల్డింగ్ (ఎంఎస్‌బీ) కేటగిరీ కింద నల్లా కనెక్షన్ మంజూరైంది. తక్షణమే జలమండలి ఎంప్యానల్‌మెంట్‌లోని ఏజెన్సీ ఒకటి 100 ఎంఎం సామర్థ్యం గల ఏఎంఆర్ మీటర్లు అమర్చేందుకు వాటి చార్జీలు, 18 శాతం జీఎస్టీతో కలిపి మొత్తం రూ.1,28,748కు కొటేషన్ అందించింది. ఇన్‌స్టలేషన్ నుంచి ఐదేళ్ల పాటు మెటీరియల్స్ వర్క్‌మెన్ షిప్ లోపాలకు గ్యారంటీ అని ఏజెన్సీ హామీ ఇచ్చింది. మరో ఏజెన్సీ ఒక ఏడాది గ్యారంటీతో చార్జీలు, జీఎస్టీతో కలిపి రూ.37,760తో కూడిన కొటేషన్ సమర్పించింది. కనెక్షన్ మంజూరు చేసిన జలమండలి అధికారులు తాము సిఫారసు చేసిన ఏజెన్సీ ద్వారా ఏఎంఆర్ మీటర్లు అమర్చుకోవాలని సూచించారు. రెండు ఏజెన్సీల మీటర్లు కూడా అంతర్జాతీయ ప్రమాణాల గుర్తింపు (ఐఎస్ఓ) ఉన్నవే. కానీ.. మీటర్ల ధరలో మాత్రం రూ.99,988 భారీ వ్యత్యాసం. ఇదో రకమైన దోపిడీకి మచ్చుతునక. ఏఎంఆర్ మీటర్ల ధర ఎక్కువ కోట్ చేసిన సదరు ఎంప్యానల్ ఏజెన్సీ జలమండలి అధికారుల అండదండలతో కేవలం మూడేళ్లలో సుమారు 18,540 మీటర్లను అమర్చినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ప్రకారం మీటర్ల ధర వ్యత్యాసాన్ని లెక్కిస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. - సాక్షి, సిటీబ్యూరో

- వాటర్‌బోర్డు ఎంప్యానల్‌మెంట్‌లో 15 ఏజెన్సీలు
- ఒక ఏజెన్సీకే ప్రాధాన్యం.. ఆ మీటర్లకే సిఫారసు
- జలమండలి కీలక విభాగంలో తిష్ట వేసిన బోర్డు డైరెక్టర్
- మేనేజర్ స్థాయి ఉద్యోగి బినామీ కంపెనీకి వత్తాసు
- మూడేళ్లలో జరిగిన అవతకవకలకు కళ్లు బైర్లు కమ్మాల్సిందే..



జలమండలి అండదండలతో నల్లా కనెక్షన్లకు అమర్చే ఏఎంఆర్ మీటర్లలో దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. బహిరంగ మార్కెట్ ధర కంటే రెండు నుంచి నాలుగింతలు అదనంగా బాదేస్తున్నారు. మూడేళ్లుగా ఒక ఏజెన్సీ చేతివాటం సాఫీగా సాగుతుండటంతో మీటర్ల ధర్పై బాదుడు పాపం తలా పిడికెడు అన్నట్లు మారింది. జలమండలిలో ఏళ్ల తరబడి ఒకే కీలక విభాగంలో తిష్ట వేసిన బోర్డు డైరెక్టర్ కనుసన్నల్లోనే మేనేజర్ స్థాయి ఉద్యోగి బినామీ కంపెనీ ఏర్పాటు చేసి ఎంప్యానల్‌మెంట్ ద్వారా ఏఎంఆర్ మీటర్ల దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. బోర్డు ఎంప్యానల్‌మెంట్‌లో పలు ఏజెన్సీలు ఉన్నా ఒకే ఏజెన్సీకి ప్రాధాన్యం ఇవ్వడం, దానిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా.. నోటీసులతోనే సరిపెట్టి.. చర్యల విషయంలో వెనుకంజ వేయడం అనుమానాలకు బలం చేకూర్చుతోంది.

ప్రతి నీటి బొట్టునూ లెక్కించేందుకు..

జలమండలి ఒక అంగుళం (25 ఎంఎం), ఆపై పరిమాణం నల్లా కనెక్షన్లకు ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) విధానం అమలు చేస్తోంది. ప్రధాన ఆదాయ మార్గాలైన పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య, బహుళ అంతస్తుల, గృహ సముదాయాల నల్లా కనెక్షన్లదారులకు సరఫరా జరిగే ప్రతి నీటి బొట్టునూ లెక్కించేందుకు ఏఎంఆర్ మీటర్లను అమర్చింది. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఎంఆర్ మీటరింగ్ వ్యవస్థ పని చేసేలా ఏర్పాట్లు చేసింది. కొత్త కనెక్షన్ ఇచ్చే సమయంలో నల్లాకు ఏఎంఆర్ మీటర్ అమర్చుతారు. మీటర్ల కోసం ఎనిమిదేళ్ల క్రితం ఏజెన్సీలతో జలమండలి ఎంప్యానల్ చేసుకుంది. నల్లా కనెక్షన్లకు ఏఎంఆర్ మీటర్లు నేరుగా అమర్చడం, మరమ్మతుల బాధ్యతలు అప్పగించింది. మూడేళ్ల క్రితం ఒక ఏజెన్సీ నాసిరకం మీటర్లు అమర్చడం వివాదాస్పదం కావడంతో దానిని బ్లాక్ లిస్టులో పెటారు. అప్పట్లో సదరు డైరెక్టర్ సహకారంతో ఎంప్యానల్‌మెంట్ జాబితాలో చోటు దక్కించుకున్న సదరు ఏజెన్సీ నాణ్యత పేరిట ఏఎంఆర్ మీటర్ల ధర అడ్డగోలుగా పెంచేసి వసూళ్లకు దిగినట్లు సమాచారం.

ఐదేళ్ల హామీ సాకుతో..

నల్లా కనెక్షన్లకు ఏఎంఆర్ మీటర్లు అమర్చే సాకుతో అదనపు చార్జీలు బాదేస్తున్న ఏజెన్సీ తమ మెటీరియల్‌కు ఐదేళ్ల గ్యారంటీ అంటూ వినియోగదారులకు బలవంతంగా అంటగడుతోంది. వాస్తవంగా నల్లా కనెక్షన్‌కు కొత్త మీటరు అమర్చేందుకు వాటర్ బోర్డులో 15 ఏజెన్సీలు ఎంప్యానల్‌మెంట్ చేసుకున్నాయి. వినియోగదారుడు ఎంప్యానల్‌మెంట్ ఏజెన్సీల మీటర్లు మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సంబంధిత బోర్డు అధికారులు కమీషన్లకు కక్కుర్తి పడి కేవలం ఒక ఏజెన్సీ మీటర్లకే ప్రాధాన్యమిస్తూ సిఫారసు చేయడం విస్మయానికి గురి చేస్తోంది.



ఎస్ఎస్ఆర్ రేట్లను పరిశీలిస్తాం..

నల్లా కనెక్షన్లకు ఏఎంఆర్ మీటర్ల అమర్చేందుకు ఏజెన్సీల ఎస్ఎస్ఆర్ రేట్లను పరిశీలిస్తాం. ఎంఆర్‌పీ కంటే అదనంగా వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

- మయాంక్ మిట్టల్, ఈడీ, జలమండలి

ఏఎంఆర్ మీటర్ల ధరల్లో వ్యత్యాసం ఇలా..

ఏఎంఆర్ మీటర్ సైజు (ఎంఎం)	బహిరంగ మార్కెట్‌లో మీటర్ ఎంఆర్‌పీ (రూ)	వాటర్ బోర్డు సిఫారసు చేసే ఒక ఏజెన్సీ ధర (రూ)	ఏజెన్సీ అమర్చిన మీటర్ల సంఖ్య
25	13,500	28,855	13,660
40	14,500	31,187	1,883
50	26,999	72,318	1,425
63	27,749	81,132	09
75	27,749	93,022	346
80	27,749	93,022	35
100	37,499	1,28,748	627
150	44,999	1,64,637	299
200	52,499	1,98,627	153
250	1,20,000	2,91,367	32
300	1,30,000	4,04,103	59
400	1,50,000	4,45,044	02
450	1,60,000	4,89,376	03
600	2,00000	5,66,865	07

వడివడిగా..

నార్త్‌సిటీ మెట్రో సర్వే వేగవంతం



భూ సామర్థ్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది..

- మేడ్చల్, శామీర్‌పేట్ మార్గంలో..
- ఈ నెలాఖరులోగా ట్రాఫిక్ సర్వే, భూ సామర్థ్య పరీక్షలు పూర్తి
- డీపీఆర్ దిశగా కార్యాచరణ

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రెండో దశ 'బి' విభాగం కింద ప్రతిపాదించిన నార్త్‌సిటీ కారిడార్‌లపై హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఆర్ఎల్) కార్యాచరణను వేగవంతం చేసింది. మూడు నెలల్లో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందించేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఈ దిశగా రెండు కారిడార్‌లలో క్షేత్రస్థాయిలో ట్రాఫిక్ సర్వే, భూసామర్థ్య పరీక్షలను ప్రారంభించారు. ఈ నెలాఖరులోగా ఈ రెండు పనులు పూర్తి చేసి డీపీఆర్‌ను తయారు చేయనున్నారు. .

మూడు సర్వేలు ముఖ్యం..

జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు 24 కిలోమీటర్లు, జేబీఎస్ నుంచి శామీర్ పేట్ వరకు 21 కి.మీ మెట్రో కారిడార్‌ల డీపీఆర్‌ల కోసం క్షేత్రస్థాయిలో సర్వే పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ రెండు కారిడార్‌లలో డీపీఆర్‌లను తయారు చేసేందుకు మూడు సర్వేలు ఎంతో ముఖ్యమైనవి. ట్రాఫిక్ సర్వే, భూసామర్థ్య పరీక్షలు (జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్), పర్యావరణ ప్రభావ అధ్యయనం (ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్) పనులను ప్రస్తుతం ప్రారంభించినట్లు హెచ్ఏఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు.

- ట్రాఫిక్ సర్వేలో భాగంగా ఈ రెండు మార్గాల్లో ప్రయాణికుల రాకపోకలు, రోజువారీ ప్రయాణాల సంఖ్య, భవిష్యత్‌లో పెరగనున్న ప్రయాణాలపై అంచనాలు, ప్రధాన కూడళ్లలో ప్రయాణికుల రద్దీ తదితర అంశాలతో పాటు రెండు రూట్లలో ఏయే ప్రాంతాల నుంచి ప్రయాణికులు, వాహనాలు వచ్చి చేరుతున్నాయనే అంశాన్ని కూడా అధ్యయనం చేయనున్నారు.
- మరోవైపు పాదచారుల సంఖ్య, వాహన ప్రయాణాలకు పట్టే సమయం, వాహన ప్రయాణాల్లో ఎంత శాతం మెట్రో రైలుకు మారే అవకాశం ఉంది అనే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ప్రయాణికుల అవసరాల మేరకు ఎక్కడెక్కడ మెట్రోస్టేషన్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుందనేది ట్రాఫిక్ అధ్యయనంలో అంచనా వేస్తారు. మెట్రో స్టేషన్లు ఏర్పాటయ్యే ప్రదేశాల ప్రయాణ సాంద్రత వంటి అంశాలను పరిశీలించనున్నారు.

భూసామర్థ్యంపై అధ్యయనం..

క్షేత్రస్థాయి సర్వేలో భాగంగా భూసామర్థ్య పరీక్షలను చేపట్టారు. ఈ రెండు రూట్లలో వివిధ రకాల మట్టి, రాతి పొరల నమూనాలు, వివిధ నిర్మాణాలకు అవసరమైన భూమి సామర్థ్య నిర్ధారణ, భూగర్భంలో నిక్షిప్తమైన నీటి స్థాయిల అంచనాలు, భూకంపాలు ఏర్పడే అవకాశాలు వంటి విషయాలను పరిశీలించనున్నారు. ఈ అధ్యయనం మేరకు మెట్రో స్తంభాలు, స్టేషన్లు, ఇతర నిర్మాణాలను ఎంత బలంగా డిజైన్ చేయాలనేది నిర్ధారిస్తారు.

- ప్రస్తుతం జేబీఎస్ – మేడ్చల్ మార్గంలో 25 చోట్ల, జేబీఎస్ – శామీర్‌పేట్ మార్గంలో 19 చోట్ల భూ సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటిలో మేడ్చల్ మార్గంలో 14 చోట్ల, శామీర్ పేట్ మార్గంలో 11 చోట్ల ఇప్పటికే పరీక్షలు పూర్తయ్యాయి. ఈ నెలాఖరు వరకు నార్త్‌సిటీ అధ్యయనం పూర్తి చేసి మార్చి నెలాఖరు వరకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ మార్గంతో సహా ఈ మూడు మెట్రో మార్గాల డీపీఆర్‌లను సంపూర్ణ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ అనుమతికి అందజేయనున్నట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

కాలుష్య కారకాల నిర్ధారణ..

మెట్రో ప్రాజెక్ట్ పర్యావరణ ప్రభావ అధ్యయనంలో భాగంగా ప్రతిపాదిత మార్గంలో గాలి పరిశుభ్రత, గాలిలో ఉన్న ధూళికణాల శాతం, కాలుష్య కారకాల నిర్ధారణ, శబ్ద కాలుష్యం, నీటి వనరులు, వృక్ష, జంతు జీవాల జీవ వైవిధ్యం, జీవనాధార భృతులపై ప్రాజెక్టు చూపే ప్రభావం వంటి అంశాలను పర్యావరణ అధ్యయనంలో పరిశీలించనున్నారు. కారిడార్‌లలో మెట్రో వస్తే ఏ మేరకు వాహన కాలుష్యం తగ్గుముఖం పట్టనుందనే అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ మేరకు రెండు మార్గాల్లో వాహనాల రద్దీని కూడా అంచనా వేయనున్నారు.

సమన్వయంతో హెచ్-సిటీ పనులు వేగవంతం

గచ్చిబౌలి: హెచ్- సిటీ పనుల వేగవంతానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సూచించారు. ఆదివారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలో చేపడుతున్న హెచ్–సిటీలో ప్రతిపాదించిన ఫ్లై ఓవర్లు, రోడ్ల విస్తరణతో పాటు జంక్షన్ల విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జంక్షన్ల వద్ద స్థల సేకరణ వేగవంతంగా చేపట్టాలన్నారు. సంబంధిత విభాగాల అధికారులు బస్సులో ప్రయాణించి యుటిలిటీ విద్యుత్, వాటర్ వర్క్స్, టెలిఫోన్ వైర్లను వెంటనే తొలగించాలని సూచించారు. ఖాజాగూడ, సైబరాబాద్ కమిషనరేట్, గచ్చిబౌలి, ట్రిపుల్ ఐటీ, విప్రో జంక్షన్లు, డీఎల్ఎఫ్ రోడ్డు, మసీద్ బండ, చందానగర్ రైల్వే స్టేషన్, లింగంపల్లి ఆర్‌టీబీ, శ్రీదేవి టాకీస్, గంగారం రోడ్డు, ఆల్విన్ క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాలలో హెచ్‌సిటీలో ప్రతిపాదిత పనులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పురపాలక శాఖ డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డెవిస్, చీఫ్ ఇంజినీర్ భాస్కర్ రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు శేఖర్, పాండ్యన్, వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, టీజీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



శేరిలింగంపల్లిలో ప్రతిపాదిత పనులను పరిశీలిస్తున్న ఇలంబర్తి, సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు

క్రైమ్ నంబర్స్ 35

నగరంలో మోల్హు ముఖియాపై రెండు కేసులు



- 2024లో దోమలగూడలో మర్డర్ ఫర్ గెయిన్
- ఇటీవల నారాయణగూడలో 'కేడియా దోపిడీ'
- ఈ రెండింటికీ ఒకే రకమైన ఎఫ్ఐఆర్ నంబర్లు
- నేపాల్ సరిహద్దుల్లో ఈ గ్యాంగ్ లీడర్ రాహుల్



పోలీసుల కస్టడీలో మోల్హు.., మహేష్

సాక్షి, సిటీబ్యూరో: 2024 జనవరి 31న దోమలగూడ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ వృద్ధురాలిని దారుణంగా చంపిన బిహారీ గ్యాంగ్ రూ.కోటి విలువైన సొత్తు, నగదు దోచుకుపోయింది. 2025 ఫిబ్రవరి 11 తెల్లవారుజామున నారాయణగూడ ఠాణా పరిధిలో కేడియా ఆయిల్స్ అధినేత ఇంటిని కొల్లగొట్టిన బిహారీ ముఠా రూ.40 కోట్ల సొత్తు, నగదు ఎత్తుకుపోయింది. నగర కమిషనరేట్‌లోనే ఉన్న మధ్య, తూర్పు మండలాల్లోని వేర్వేరు ఠాణాల్లో, వేర్వేరు సమయాల్లో నమోదైన ఈ రెండు కేసుల్లో బిహారీలే నిందితులు.. ఓ కీలక నిందితుడు రెండింటిలోనూ ఉన్నాడు.. అంతే కాదు వీటి క్రైం నంబర్లు 35 కావడం యాదృచ్ఛికం. మొదటి కేసు ఇండియన్ పీనల్ కోడ్‌లోని (ఐపీసీ) 302, 394 సెక్షన్ల కింద నమోదు కాగా... రెండోది జరిగే నాటికి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) అమలులోకి రావడంతో అందులోని 331 (2), 331 (4), 305 సెక్షన్ల కింద రిజిస్టర్ అయింది.

బిహార్‌లో మధుబని జిల్లా బిరోల్‌కు చెందిన మహేష్ కుమార్ ముఖియా, మోల్హు ముఖియాలు 2024 జనవరి 31న దోమలగూడలో పంజా విసిరారు. వృద్ధురాలు స్నేహలత దేవికి ఉరి బిగించి చంపిన ఈ ఇద్దరు.. ఇంట్లో ఉన్న రూ.కోటి విలువైన నగలు, నగదు తీసుకుని ఉడాయించారు. దీనిపై అదే రోజు దోమలగూడ పోలీసుస్టేషన్‌లో 35/2024 నంబర్‌తో ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదైంది. పోలీసు పరిభాషలో దీన్ని క్రైం నంబర్‌గానూ పరిగణిస్తారు. ఈ ఉదంతం జరిగిన ఎనిమిది నెలలకు మహేష్ చిక్కినా.. మోల్హు పరారీలోనే ఉన్నాడు. ఆపై ఈ నెల 11 తెల్లవారుజామున సుశీల్ ముఖియా, బసంతిలతో కలిసి హిమాయత్‌నగర్‌లోని కేడియా ఇంటిని కొల్లగొట్టాడు. దీనిపై అదే రోజు నారాయణగూడ ఠాణాలో 35/2025 నంబర్‌తో కేసు నమోదైంది.

ప్రధాన సూత్రధారి రాహుల్..

బిరోల్‌కు చెందిన ముఖియాలతో కూడిన అనేక ముఠాలు దేశ వ్యాప్తంగా ఇలాంటి నేరాలు చేస్తున్నాయని పోలీసులు గుర్తించారు. అయితే వీరంతా పాత్రధారులే అని, ప్రధాన సూత్రధారి మాత్రం అదే ప్రాంతానికి చెందిన రాహుల్ అని పేర్కొంటున్నారు. ఓ ఉన్నతాధికారి 'సాక్షి'తో మాట్లాడుతూ.. 'ఈ నేరాలు చేసే వారికి అంత ఖరీదైన సొత్తు విక్రయించే సామర్థ్యం ఉందు. ఆ పరిచయాలన్నీ రాహుల్‌కే ఉంటాయి. వీరంతా సొత్తు తీసుకువెళ్లి అతడికి అప్పగించి వచ్చేస్తారు. దాన్ని విక్రయించి సొమ్ము చేసే అతగాడు ఎక్కువ వాటా తీసుకుని మిగిలింది నేరంలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారి కుటుంబీకులకు అందిస్తాడు. ప్రస్తుతం రాహుల్ నేపాల్ సరిహద్దుల్లో ఉన్నట్లు తెలుస్తోంది' అని పేర్కొన్నారు.

అప్పుడు చేసి ఇప్పుడు చిక్కాడు..

దోమలగూడ కేసులో వాంటెడ్‌గా ఉన్న మోల్హు నారాయణగూడ కేసులో పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ కేసు దర్యాప్తు నేపథ్యంలో ఆ కేసు వివరాలు వెలుగులోకి వచ్చాయి. తాజాగా నమోదైన కేసు నారాయణగూడది కావడంతో పోలీసులు మోల్హును ఇందులోనే అరెస్టు చూపారు. నాంపల్లి కోర్టులో హాజరుపరిచి మిగిలిన ఇద్దరితో కలిపి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తులో భాగంగా తొలుత నారాయణగూడ కేసులోనే న్యాయస్థానం అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. ఆపై ప్రిజనర్స్ ట్రాన్సిట్ (పీటీ) వారెంట్ ద్వారా దోమలగూడ కేసులో అరెస్టు, కోర్టు అనుమతితో కస్టడీ వంటి చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే నారాయణగూడ కేసులో పది రోజుల పోలీసు కస్టడీకి అనుమతించాలని కోరుతూ న్యాయస్థానంలో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు.

ఆర్టీసీలో ఐ టిమ్స్

- వచ్చే నెల నుంచి అమలుకు చర్యలు
- గ్రేటర్‌లో సుమారు 6500 ఐ టిమ్స్ వినియోగం
- టికెట్ కొనుగోళ్లకు డిజిటల్ చెల్లింపులు



సాక్షి, సిటీబ్యూరో: సిటీబస్సుల్లో డిజిటల్ చెల్లింపులను అమలులోకి తేనున్నారు.ఈ మేరకు అన్ని బస్సుల్లో త్వరలో ఇంటెలిజెంట్ టికెట్ ఇష్యూయింగ్ మిషన్స్ (ఐ టిమ్స్)ను ప్రవేశపెట్టనున్నారు. ప్రయాణికులు ప్రస్తుతం సిటీ బస్సుల్లో పయనించేందుకు టికెట్ కొనుగోళ్ల కోసం నగదు చెల్లించాల్సి వస్తోంది. దైనందిన జీవితంలోని అన్ని రంగాల్లో డిజిటల్ కరెన్సీ నిత్యకృత్యంగా మారిన ప్రస్తుత తరుణంలో ఈ నగదు చెల్లింపు వల్ల ప్రయాణికులు తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో చిల్లర సమస్య కూడా తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ఫోన్‌పే, గూగుల్‌పే తదితర సదుపాయాలను వినియోగించుకుని టికెట్‌లు తీసుకొనే సదుపాయాన్ని ప్రవేశపెట్టాలనే ప్రతిపాదన చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం బస్‌పాస్‌ల కౌంటర్‌లలో మాత్రం ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో బస్సులతో పాటు టికెట్ రిజర్వేషన్ కేంద్రాలు, అధీకృత టికెట్ బుకింగ్ ఏజెన్సీల్లోనూ డిజిటల్ చెల్లింపులకు అవకాశం కల్పించాలని ఆర్టీసీ భావిస్తోంది. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 28 డిపోల్లో వినియోగించేందుకు సుమారు 6500 ఐ టిమ్స్‌ను కొనుగోలు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఐటిమ్స్ పరీక్షలు తుది దశలో ఉన్నాయని, కొద్దిపాటి మార్పుల అనంతరం మార్చి నుంచి ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.

ఆటోమెటిక్‌గా చెల్లింపులు..

ఐటిమ్స్‌లో ఉన్న సాంకేతిక వ్యవస్థల ఆధారంగా ఎప్పటికప్పుడు లొకేషన్ నిర్ధారణ అవుతుంది. ప్రయాణికులు కోరిన చోటికి వెళ్లేందుకు అయ్యే చార్జీని కూడా ఈ లొకేషన్ ప్రకారం సిద్ధంగా ఉంచుతారు. ప్రయాణికులు బస్సెక్కిన వెంటనే రానున్న లొకేషన్‌కు అనుగుణంగా టిక్కెట్ ఇష్యూ అవుతుంది.ఆ మేరకు ఫోన్ పే లేదా గూగుల్ పే చేస్తే చాలు. కండక్టర్‌లు లేని దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో కూడా డ్రైవర్లు ఐటిమ్స్‌ను వినియోగించి టికెట్‌లు ఇచ్చే విధంగా సాంకేతిక వ్యవస్థను రూపొందించినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం నగరంలోని సుమారు 1150 రూట్లలో ప్రతి రోజు సుమారు 2800 బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. సుమారు 22 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. సుమారు 14 లక్షల మంది మహిళాప్రయాణికులు మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకుని ఉచిత ప్రయాణం చేస్తున్నారు.

నైజీరియన్ డిపోర్టేషన్

ఎఫ్ఆర్ఆర్ఓ సహకారంతో పంపిన హెచ్-న్యూ



సాక్షి, సిటీబ్యూరో: వీసా గడువు ముగిసినా నగరంలోనే అక్రమంగా నివసిస్తున్న నైజీరియన్ ఇకేచుకు సిల్వెస్టర్ మాంబా హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) అతడి దేశానికి డిపోర్టేషన్ విధానంలో బలవంతంగా తిప్పి పంపింది. ఫారెనర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) సహకారంతో ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర ఆదివారం ప్రకటించారు. ఇకేచుకు సిల్వెస్టర్ 2012లో బిజినెస్ వీసాపై ముంబై వచ్చాడు. తొలినాళ్లల్లో వస్త్ర వ్యాపారం చేపట్టిన అతను... ముంబైలో తక్కువ ధరకు వస్త్రాలు కొనుగోలు చేసి తన దేశానికి ఎగుమతి చేసేవాడు. పాస్‌పోర్టు గడువు ముగిసినా రెన్యువల్ చేయించుకోకుండా అక్కడే ఉండిపోయాడు. దీంతో ముంబైలోని తలోజా పోలీసులు 2019లో ఇతడిని పట్టుకుని పాస్‌పోర్టు యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అప్పట్లో రెండేళ్లు జైల్లో జైల్లో ఉన్న ఇతగాడు బయటకు వచ్చిన తర్వాత నవీ ముంబైలోని ఉల్వేలో ఉన్న స్నేహితుడి ఇంటికి మకాం మార్చాడు. డ్రగ్స్ దందాలో ఉన్న అతడితో కలిసి ఇతనూ పెడ్లర్‌గా మారాడు. ఇందులో భాగంగా నగరానికి చేరుకున్న ఇకేచుకు సిల్వెస్టర్ హుమాయున్‌నగర్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతూ ఈ నెల 5న హెచ్-న్యూకు చిక్కాడు. విచారణ నేపథ్యంలో వీసా గడువు ముగిసినా ఇక్కడే ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో అతడిని డిటెన్షన్ సెంటర్‌కు తరలించిన హెచ్-న్యూ అధికారులు డిపోర్టేషన్ ప్రక్రియ ప్రారంభించారు. ఇన్‌స్పెక్టర్ జీఎస్ డేనియేల్, ఎస్సై వెంకట రాములు తమ బృందాలతో ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. ఎట్టకేలకు ఎఫ్ఆర్ఆర్ఓ నుంచి ఉత్తర్వులు పొంది నైజీరియాకు డిపోర్టేషన్ చేశారు. ఇటీవల కాలంలో అనేక మంది విదేశీయులు మెడికల్, స్టూడెంట్, బిజినెస్ వీసాలపై వచ్చి ఇక్కడే తిష్ట వేస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. ఇలాంటి వారిలో అనేక మంది డ్రగ్స్ దందాలోకి దిగుతున్నారని, వీరిపై సమాచారం తెలిస్తే 8712661601కు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

వన మహోత్సవానికి కార్యాచరణ

షాద్‌నగర్: పుడమి తల్లిని మరింత పచ్చగా మార్చేందుకు.. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం వన మహోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మొక్కలు నాటేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో పదివేల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించడంతో ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలతో నర్సరీల్లో బ్యాగుల్లో మట్టి నింపడం, విత్తనాలు నాటడం వంటి పనులు చేపడుతున్నారు.

వేడిని తట్టుకునేందుకు..

నర్సరీల్లో పెంచే ప్రతీ మొక్కను బతికించుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వేసవి కాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో నర్సరీల్లో పెంచే మొక్కలు ఎండకు ఎండిపోకుండా గ్రీన్‌నెట్.. వాటి కింద మొక్కలను పెంచుతున్నారు. వర్షాకాలం ప్రారంభం అయిన వెంటనే గుంతలు తీసి నాటేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోంది.

విభజించు.. మోసగించు!

- సైబర్ నేరగాళ్ల కొత్తపంథా
- వర్గాల వారీగా గుర్తించి వల
- ఏమరపాటుగా ఉంటే ఖాతాలు ఖాళీ



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్ల మోసాలపై ప్రజల్లో అవగాహన వచ్చేలోగా.. వారు కొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఒకప్పుడు బ్యాంకు వివరాల అప్డేట్, క్రెడిట్ కార్డు, వర్క్ ఫ్రమ్ హోమ్ పేర్లతో వల వేసేవారు. ఇప్పుడు రూటు మార్చి వ్యక్తులు, వారి వయస్సుల ఆధారంగా దోచేస్తున్నారు. వృద్ధులైతే కరెంటు, నల్లా బిల్లులు కట్టలేదంటూ.. మహిళలు, గృహిణులకు తక్కువ ధరతో గృహోపకరణాలు, యువకులైతే క్రిప్టో కరెన్సీ పెట్టుబడులకు లాభాలంటూ వల విసిరి నిండా ముంచుతున్నారు.

డేటాతోనే అసలు గుట్టంతా..

సైబర్ నేరాలకు మూలం ప్రజల వ్యక్తిగత వివరాలు అంగట్లో సరకులా మారడమే. ప్రజల డేటా విభజించుకుని దాని ఆధారంగా మోసాలు చేస్తున్నారు. వీటికితోడు గూగుల్లో తప్పుడు ప్రకటనలు, నకిలీ వెబ్‌సైట్లు భారీగా పుట్టుకొస్తున్నాయి. ఏ అంశంపై సెర్చ్ చేసినా దానికి సంబంధించిన ప్రకటనలు తెరపైకి వస్తుంటాయి. ప్రత్యేక సందర్భాల్లో కొన్ని సంస్థలకు వ్యక్తిగత వివరాలు అందిస్తుంటాం. ఇవన్నీ నేరగాళ్లకు చేరుతున్నాయి. ఇవే వివరాలతో మోసగాళ్లు ఫోన్‌లో సంప్రదించి డబ్బు కొల్లగొడుతున్నారు.

మోసాల్లో వీరే ఎక్కువ..

ఇటీవలి కాలంలో నగరంలో డ్రగ్స్ పార్సిల్ వచ్చిందంటూ కస్టమ్స్, సీబీఐ, ఎన్సీబీ అధికారులమంటూ ఫోన్లు చేసి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ తరహా మోసాలపై ఒక్క సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే ఈ ఏడాది దాదాపు 200 వరకు ఫిర్యాదులు అందాయి. బాధితుల్లో యువతే ఎక్కువ. తక్కువ ధరకు గృహోపకరణాలు, ఇంట్లో ఉంటూ ఉద్యోగం తదితర మోసాల బాధితుల్లో మహిళలే ఎక్కువగా ఉన్నారు. కస్టమర్ కేర్, క్రిప్టో కరెన్సీ, పెట్టుబడికి రెండింతల లాభాలు, లోన్ యాప్ మోసాల్లో 20 40 ఏళ్ల లోపు వారు అధికం. సైబర్ మోసాల బారిన పడితే ఆలస్యం చేయకుండా 1930 టోల్ ఫ్రీకి, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం పోలీసులు సూచిస్తున్నారు.

చెరువులో ఇద్దరు యువకుల గల్లంతు

శామీర్‌పేట్: గండి చిత్తారమ్మ దర్శనానికి వచ్చిన ఇద్దరు యువకులు మద్యం మత్తులో ఈత కొట్టేందుకు చెరువులో దిగి నీటిలో మునిగి గల్లంతైన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరంలోని జగద్గిరిగుట్టకు చెందిన పాలసంతల బాలు (25), సందీప్ సాగర్(27), సందీప్, సాయిచందర్ , నాగారం ప్రాంతానికి చెందిన బాలక్రిష్ణ, నితీష్‌కుమార్ స్నేహితులు. వీరందరూ కలిసి ఆదివారం ఉదయం శామీర్‌పేట మండలం, పొన్నాల్ గ్రామ పరిధిలోని గండి చిత్తారమ్మతల్లి ఆలయానికి దర్శనం కోసం వచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న తర్వాత అక్కడే కోడిని కోసి ఆలయ సమీపంలోని చెరువు గట్టున వంటలు చేసుకుని మద్యం సేవించారు. అనంతరం బాలు, సందీప్‌సాగర్, బాలకృష్ణ సరదాగా ఈత కొట్టేందుకు చెరువులోకి దిగారు. బాలకృష్ణ తిరిగి రాగా బాలు, సందీప్ సాగర్ నీటిలో గల్లంతయ్యారు. దీనిని గుర్తించిన వారి స్నేహితుల కేకలు విని స్థానికులు పోలీసులకు సామాచారం అందించారు.



గండి చిత్తారమ్మ ఆలయం వద్ద చివరగా దిగిన ఫొటో



బాలు (ఫైల్)



గాలింపు చేపడుతున్న పోలీసులు

దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న శామీర్‌పేట పోలీసులు గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది సహాయంతో చెరువులో గాలింపు చేపట్టారు. చీకటి పడటంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. సోమవారం ఉదయం గాలింపు చేపట్టనున్నట్లు తెలిపారు. మిగిలిన నలుగురు స్నేహితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీరిలో ఒకరు మినహా మిగతా ఐదుగురు 10వ తరగతి వరకు ఒకే స్కూల్‌లో చదివినట్లు తెలిపారు.

ఆన్‌లైన్ గేమ్‌లో పరిచయం.. ఆపై అత్యాచారం..

- నగ్నఫొటోలతో బాలికను బ్లాక్ మెయిల్ చేసిన పూణె వాసి
- టెలిగ్రామ్‌లో చాటింగ్.. అర్ధరాత్రి నిర్మానుష్య ప్రాంతంలో లైంగికదాడి
- పోలీసుల దర్యాప్తు.. పోక్సో కేసు నమోదు..

ఫిలింనగర్: ఆన్‌లైన్ గేమ్ నగరానికి చెందిన ఓ బాలిక పాలిట శాపంగా మారింది. ఆన్‌లైన్ గేమ్ ద్వారా పరిచయమైన ఓ వ్యక్తి మాయ మాటలతో ఆ చిన్నారిని లొంగదీసుకున్నాడు. ఆన్‌లైన్ చాటింగ్‌లో తియ్యటి కబుర్లతో ఆమెను ఆకట్టుకుని ఫొటోలు షేర్ చేయించుకున్నాడు. అందులో బాలిక నగ్న ఫొటోలు కూడా ఉండడంతో తల్లిదండ్రులతో పాటు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరించి పూణే నుంచి హైదరాబాద్ వచ్చి తన వాంఛను తీర్చుకుని వెళ్లేవాడు. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షేక్‌పేట్ ప్రాంతానికి చెందిన బాలిక 2021లో ఏడో తరగతి చదివే సమయంలో ప్రతిరోజూ సాయంత్రం 'ఎమాంగ్ అజ్' యాప్‌లో ఆన్‌లైన్ గేమ్ ఆడుతుండేది. ఈ క్రమంలోనే 'రూథ్‌లెస్' పేరిట ప్రొఫైల్ ఉన్న ఓ వ్యక్తి ఆమెకు పరిచయం అయ్యాడు. అతని ద్వారా పూణె ఎంఐటీ విశ్వవిద్యాలయంలో ఎంసీఏ చివరి సంవత్సరం చదువుతున్న ఖుష్ దేవ్ (21) సదరు బాలికకు పరిచయం అయ్యాడు. వారు యాప్ ద్వారా చాట్ చేయడం ప్రారంభించారు. మొదట్లో ఒకరికొకరు స్నేహితుల్లా ఉండేవారు. ఆ తర్వాత 2023లో ఆమెకు టెలిగ్రామ్ లింక్ షేర్ చేసి ఆ యాప్ ద్వారా చాట్ చేయమని అడిగాడు. దీంతో టెలిగ్రామ్ ద్వారా చాట్ చేసుకునేవారు. చాట్ చేసే క్రమంలో బాలిక ఫొటోలను షేర్ చేయాల్సిందిగా ఖుష్‌దేవ్ అడగ్గా ఆమె నిరాకరించింది. రోజంతా ఆమెను బలవంతం చేయడంతో ఆమె తన ఫొటోలను, వీడియోలను పంపింది.

నగ్న ఫొటోలతో బెదిరింపులు..

వాటిలో నగ్న ఫొటోలు కూడా ఉండటంతో అప్పటి నుంచి ఆ ఫొటోలను ఆమె తల్లిదండ్రులు, బంధువులకు, సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించసాగాడు. తనను కలవాల్సిందిగా బ్లాక్ మెయిల్ చేశాడు. దీంతో గత ఏడాది అక్టోబర్ 6న టోలిచౌకీలోని ఓ పార్కులో కలిసింది. అప్పటి నుంచి ప్రతిరోజూ తనను కలవాల్సిందిగా డిమాండ్ చేస్తూ వచ్చాడు. తల్లిదండ్రులు తనను బయటకు పంపడం లేదని చెప్పినా రాత్రిపూట అందరూ నిద్రపోయిన తర్వాత ఇంటికి వచ్చి కలుస్తానని చెప్పాడు.

అర్ధరాత్రి అత్యాచారం..

ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 24న బాలిక తన అమ్మమ్మ ఇంటికి వెళ్లగా, 25న తెల్లవారుజామున అక్కడికి వచ్చిన ఖుష్‌దేవ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో కలుసుకున్నారు. ఇదే అదునుగా మరుసటి రోజు అర్ధరాత్రి సమయంలో బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పడానికి బాలిక భయపడింది. ఈ విషయాన్ని ఆమె తన స్నేహితురాలికి చెప్పడంతో ఆమె టీచర్ దృష్టికి తీసుకెళ్లింది. టీచర్ ద్వారా ప్రిన్సిపాల్‌కు, ఆమె ద్వారా తల్లిదండ్రులకు విషయం తెలియగా వారు ఫిలింనగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు నిందితుడు ఖుష్‌దేవ్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 65(1), 351 (2), సెక్షన్ 5 రెడత్ విత్ 6, పోక్సో చట్టం-2012, సెక్షన్ 67 ఐటీ చట్టం-2008 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

5.5 కేజీల గంజాయి పట్టివేత

ఉప్పల్: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకున్న ఘటన ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓం కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో అల్వాల్, వెంకటాపురానికి చెందిన అభిషేక్ కుమార్ సింగ్ గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. నిందితుడిని అదుపులలోకి తీసుకుని అతడి నుంచి 5.5 కేజీల గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఇంటి బాల్కనీలో గంజాయి మొక్క పెంపకం

బంజారాహిల్స్: ఇంటి బాల్కనీలో గంజాయి మొక్క పెంచుతున్న ఆటోడ్రైవర్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ వెంకటగిరి బేగ్ రెసిడెన్సీలో నివాసం ఉంటున్న ఆటోడ్రైవర్ మహమ్మద్ అర్షద్ అలీ తన ఇంటి బాల్కనీలో గంజాయి మొక్క పెంచుతున్నట్లు సమాచారం అందింది. దీంతో ఆదివారం దాడి చేసిన పోలీసులు కుండీలో పెంచుతున్న గంజాయి మొక్కను గుర్తించారు. కొన్ని నెలలుగా దీనిని పెంచుతున్నట్లు నిందితుడు అంగీకరించడంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సర్కార్ బడి.. జ్ఞాపకాల జడి

- ప్రభుత్వ పాఠశాలలో 50 ఏళ్ల సంబరం
- అంగరంగ వైభవంగా స్వర్ణోత్సవాలు
- సందడి చేసిన అప్పటి విద్యార్థులు
- చేవెళ్ల పాఠశాలలో అపూర్వ ఘట్టం



అప్పటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు


చేవెళ్ల: వారంతా సర్కార్ బడిలో ఓనమాలు దిద్దారు.. అంచలంచెలుగా ఎదిగి జీవితంలో స్థిరపడ్డారు.. 50 ఏళ్ల కాలంలో కలిసి చదువుకున్న వారంతా ఒక్కచోట చేరారు.. జ్ఞాపకాల జడిలో తడిసి ముద్దయ్యారు.. వయసును మరిచి, హోదాలను పక్కన పెట్టి ఆటపాటలతో సందడి చేశారు.. ఈ అ'పూర్వ' ఘట్టానికి చేవెళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా మారింది. ఈ పాఠశాలలో 1955 నుంచి 2005 వరకు 50 ఏళ్ల కాలంలో కలిసి చదువుకున్న వివిధ బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు ఆదివారం స్వర్ణోత్సవాలను సంబరంగా జరుపుకున్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు.

అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి..

వేడుకలకు 1955 నుంచి 1980 వరకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించి, ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల్లో ప్రభుత్వ ఉద్యోగాలు చేసి ఉద్యోగ విరమణ చేసిన వారిని సైతం సత్కరించారు. చాలాకాలం తర్వాత అంతా కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ వేడుక తమ జీవితంలో ఒక జ్ఞాపకంగా మిగిలిపోతుందని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి కలిసి కృషి చేస్తామని ప్రకటించారు. ఆరు నెలలుగా 1981-82 బ్యాచ్ విద్యార్థులు చేసిన కృషితో పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఇలాంటి వేడుక ఎప్పుడూ చూడలేదని పూర్వ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఆ నాడు తాము చదువులు చెప్పిన విద్యార్థులు నేడు మహావృక్షాలుగా ఎదగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థి శ్రీనివాస్‌గౌడ్ తన ఆర్కెస్ట్రా బృందంతో ఆలపించిన పాటలు అలరించాయి. వేడుకకు సహకారం అందించిన దాతలు కృష్ణారెడ్డి, దేవర వెంకట్ రెడ్డి, ఆగిరెడ్డిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు బుగ్గారెడ్డి, మల్లయ్యగౌడ్, ఖుర్షీద్ అలీ, నర్సింలు, గాంధీ, పద్మ, సులోచన, భానుమతి, నిర్వాహకులు ఆర్.శ్రీనివాస్, బురాన్ ప్రభాకర్, గోపాలచారి, షఫీ, వెంకట్‌రెడ్డి, మాణిక్యం, పెంటయ్య, ఖాజాపాషా, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ఆటపాటల్లో పూర్వ విద్యార్థినులు

పెళ్లి పేరుతో టోకరా

- స్నాప్ చాట్‌లో పరిచయం
- ఆమె పేరుతో రుణం
- కారు, బైక్ కొనుగోలు
- నిందితుడిపై కేసు నమోదు

అమీర్‌పేట: స్నాప్ చాట్ ద్వారా పరిచయమైన ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించిన ఓ యువకుడు ఆమె పేరిట రుణం తీసుకుని తప్పించుకొని తిరుగుతున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎస్ఆర్‌నగర్‌కు చెందిన యువతికి కూకట్‌పల్లి సమీపంలోని గోపాల్‌నగర్‌కు చెందిన ధీరజ్‌రెడ్డి (26)తో స్నాప్ చాట్ ద్వారా పరిచయం ఏర్పడింది. నీవు నాకు నచ్చావని, ఇంట్లో పెద్దవారితో చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. అనంతరం సదరు యువతి పేరున ఆన్‌లైన్ యాప్ ద్వారా రుణాలు తీసుకున్నాడు.అలాగే కారు, స్కూటీతో పాటు ఐపాడ్ ఇంటి వస్తువులు కొనుగోలు చేశాడు. ఆ తర్వాత గత నవంబర్ నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో బాధితురాలు ఇటీవల ధీరజ్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఈ విషయాన్ని అతడి తల్లిదండ్రులకు చెప్పింది. సానుకూలంగా స్పంచిందినట్లు నటించిన వారు అప్పటికి ఆమెకు నచ్చజెప్పి పంపారు. మర్నాడు ఆమె వారికి ఫోన్ చేయగా బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో నగదు చోరీ

వెంగళరావునగర్ : ఆర్టీసీ బస్సులో నగదు చోరీకి గురైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతల్ ప్రాంతానికి చెందిన పి.అరుణ, శివప్రసాద్ దంపతులు శనివారం ప్లాట్ కొనుగోలు చేసేందుకు నగదు తీసుకుని ఆర్టీసీ అమీర్‌పేటకు బస్సులో వచ్చారు. అమీర్‌పేటలోని రియల్ ఎస్టేట్ కార్యాలయం వద్ద బ్యాగ్‌లో చూసుకోగా అందులో ఉన్న రూ.1.40 లక్షలు నగదు కనిపించలేదు. దీంతో బస్సులో నగదు చోరీకి గురైనట్లుగా భావించినా వారు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.4 లక్షల విలువైన మత్తు పదార్థాల పట్టివేత



పోలీసుల అదుపులో నిందితులు

ఉప్పల్: గంజాయి, డ్రగ్స్ విక్రయ కేంద్రంపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ఆదివారం దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 4 లక్షల విలువైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లాకు చెందిన జగదీశ్ రెడ్డి, కడప ప్రాంతానికి చెందిన అక్బస్ హూస్సేన్, కర్నూలు జిల్లాకు చెందిన అజయ్ కుమార్ చిలుకానగర్ శ్రీనివాస్ హైట్స్ సమీప కాలనీలో ఉంటూ డ్రగ్స్ దందా చేస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుభాష్ బృందం వారి స్థావరంపై దాడి చేసి 18 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, 53 గ్రాముల ఓజీ కుష్, 1.24 కేజీల గంజాయి, విదేశీ మద్యం బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో ఎస్సై చంద్ర, వెంకట్, రవి, శ్రీను, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య



ప్రవళిక (ఫైల్)

కీసర: ఉరివేసుకుని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కీసర దాయరలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి కీసర దాయరకు చెందిన ప్రవళిక(23) నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. ఆదివారం మధ్యాహ్నం ఆమె తల్లిదండ్రులతో పాటు, సోదరుడు బయటికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ప్రవళిక ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

తాగునీటి పైపులైన్‌ పనులు త్వరగా చేపట్టాలి



పైపులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ దేదీప్య విజయ్‌

వెంగళరావునగర్‌: వేసవి దృష్ట్యా తాగునీటి పైపులైన్ల పనులను త్వరగా చేపట్టాలని కార్పొరేటర్‌ దేదీప్య విజయ్‌ జలమండలి అధికారులకు సూచించారు. వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని జవహర్‌నగర్‌, మసీదుగడ్డ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఆమె పర్యటిస్తూ స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ హయాంలో జవహర్‌నగర్‌, మసీదుగడ్డ ప్రాంతాల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు రూ.50 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. పనులు ప్రారంభించేలోపుగా ఎన్నికల కోడ్‌ రావడంతో నిలిచిపోయాయని, అనంతరం వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎక్కడా కూడా పనులు చేపట్టడం లేదన్నారు. అధికారులను ఇదే విషయంపై ప్రశ్నిస్తే మంత్రి రావాలని, వాటర్‌వర్క్స్‌ ఎండీ డేట్‌ఫిక్స్‌ చేయాలని చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. వెంటనే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్‌, శ్యాంరావు, బాలకృష్ణ, పవన్‌ ముదిరాజ్‌, ఆంజనేయులు యాదవ్‌, బాలు, యాదగిరి పాల్గొన్నారు.

కేసీఆర్‌ పుట్టిన రోజును ఘనంగా నిర్వహిస్తాం

బంజారాహిల్స్‌: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కేసీఆర్‌ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం ఆయన మాజీ మంత్రి మహమూద్‌ అలీతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. 71 కిలోల భారీ కేక్‌ కటింగ్‌ ఉంటుందని ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్సీ, మాజీ మంత్రి హరీష్‌ రావు, కవిత, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు.



తెలంగాణ భవన్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న తలసాని, మహమూద్‌ అలీ

తైక్వాండోలో ప్రతిభ చాటిన చిన్నారులు



సనత్‌నగర్‌: జెక్‌కాలనీలోని మహాత్మాగాంధీ పార్కులో ఈగల్‌ తైక్వాండో అకాడమీలో శిక్షణ పొందుతున్న బాలబాలికలకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బెల్టులు, పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కాలనీ రెసిడెంట్స్‌ వెల్ఫేర్‌ ఫెడరేషన్‌ సలహాదారు, గ్రీన్‌సిటీ అధినేత కొండ్రాజు సుబ్బరాజు తైక్వాండో శిక్షణలో క్రీడాకారులకు అవసరమైన క్రీడా పరికరాలను అందజేశారు. అనంతరం వివిధ స్థాయిల్లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులకు పసుపు, ఆకుపచ్చ, నీలి రంగు బెల్టులను ప్రదానం చేశారు. కాలనీ ప్రతినిధులు చింతిరెడ్డి అనంతరెడ్డి, వెల్లంకి శారద, శివారెడ్డి, ఆర్‌.బాషా, తైక్వాండో కోచ్‌ దేవేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

సనత్‌నగర్‌: హెచ్‌ఆర్‌సీ ఆస్పత్రి ఆధ్వర్యంలో సనత్‌నగర్‌ జెక్‌కాలనీలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. శిబిరం ద్వారా రుమటాలజీ, డెర్మటాలజీ, జనరల్‌ మెడిసిన్‌, ఆర్థోపెడిక్స్‌, గైనకాలజీ, ఫిజియోథెరపీ విభాగాల్లో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.అలాగే రక్త పోటు, మధుమేహం, థైరాయిడ్‌, బీఎండీ పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించారు. ఆస్పత్రి ఎండీ రాజ్‌కిరణ్‌ పర్యవేక్షణలో వైద్య నిపుణులు, సిబ్బంది శిబిరాన్ని నిర్వహించారు. జెక్‌కాలనీ ఫెడరేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు మల్లు ప్రసాద్‌, రాజశేఖర చందు, శివారెడ్డి, వెంకట్‌ సోమ, తదితరులు ఈ వైద్య శిబిరానికి సహకారం అందించారు.



ఉచిత వైద్య శిబిరం

కుటుంబ సర్వేకు మళ్లీ అవకాశం

ఈ నెల 28 వరకు వార్డు కార్యాలయాల్లో వివరాలు ఇవ్వొచ్చు

బంజారాహిల్స్‌: గతేడాది నెలన్నర ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. సమగ్ర కుటుంబ సర్వేలో దరఖాస్తు చేసుకోని వారు ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు తమ వివరాలు ఇచ్చేందుకు అవకాశం కల్పించిన ప్రభుత్వం ఇందుకోసం జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయాల్లో ఏర్పాట్లు కూడా చేసింది. ఆదివారం ఖైరతాబాద్‌ నియోజకవర్గ పరిధిలోని అన్ని వార్డు కార్యాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించారు. అయితే ఈ సారి ఎన్యుమరేటర్లు ఇంటింటా తిరిగి వివరాలు సేకరించడం లేదు. గతంలో ఇంటింటికి వెళ్లినప్పుడు తాళాలు వేసిఉన్న, సొంతూళ్లు, విధులకు వెళ్లిన వారు ఈ సారి ప్రజాపాలన కేంద్రాలకు వెళ్లి తమ వివరాలు అందించాల్సి ఉంటుంది.

అందుబాటులో అధికారులు

కుటుంబ సర్వే కోసం కార్యాలయాలకు వెళ్లకుండా టోల్‌ఫ్రీ నెంబర్‌ ద్వారా సమాచారం ఇవ్వడానికి కూడా అవకాశం కల్పించారు. టోల్‌ ఫ్రీ నెంబర్‌కు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫోన్‌ చేసేలా అవకాశం కల్పించారు. ఖైరతాబాద్‌ నియోజకవర్గం పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్‌, తదితర డివిజన్లకు సంబంధించి వార్డు కార్యాలయాలు, సర్కిల్‌ కార్యాలయాల్లోనూ ప్రజాపాలన కేంద్రాలను ఏర్పాటు చేశామని ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని సర్కిల్‌-18 డీసీ ప్రశాంతి తెలిపారు.

టోల్‌ఫ్రీ 040-21111111 ద్వారా..

గతేడాది నవంబర్‌లో జరిగిన ఇంటింటి కులగణనలో సర్కిల్‌-17 పరిధిలో 43,500 దరఖాస్తులు రాగా, సర్కిల్‌-18 పరిధిలో 48,623 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో నమోదుచేసి సంబంధిత శాఖకు అందజేయగా ఇటీవల రేషన్‌ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలను సర్కిల్‌ కార్యాలయాలకు పంపించగా ఆ సర్వే కూడా పారదర్శకంగా వివరాలు నమోదు చేసి మళ్లీ ప్రభుత్వానికి పంపించారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా ఇంకా రాకపోయినా రేషన్‌ కార్డుల జాబితా మాత్రం ఇప్పటికే వచ్చింది.

◆ ఇదిలా ఉండగా టోల్‌ఫ్రీ నెంబర్‌ 040-21111111 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను ఏ రోజుకారోజు సంబంధిత అధికారులు ఆయా సర్కిల్‌ కార్యాలయాలకు పంపించనున్నారు. ఒకేసారి ఈ ఫారాలను ఇంటింటికి వెళ్లి సర్వే చేయనున్నారు. ఈ టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌ చేసి పేరు, అడ్రస్‌, పిన్‌కోడ్‌, వార్డు పేరు, వ్యక్తిగత ఫోన్‌ నెంబర్‌ వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది. వీటి ఆధారంగా ఆయా ఎన్యుమరేటర్లు ఆ ఇళ్లకు వెళ్లి సర్వే చేసేందుకు అవకాశం కల్పించారు.

ప్రజాపాలన కేంద్రాలివే

డివిజన్‌	కేంద్రం
బంజారాహిల్స్‌	బంజారాహిల్స్‌ రోడ్‌ నెం. 12లోని సీఎంటీసీ బిల్డింగ్‌
వెంకటేశ్వరకాలనీ	ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ సర్కిల్‌-18 కార్యాలయం
జూబ్లీహిల్స్‌	జూబ్లీహిల్స్‌ క్లబ్‌ ఎదురుగా ఉన్న వార్డు కార్యాలయం
షేక్‌పేట	షేక్‌పేటలోని స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌ భవనం
సోమాజిగూడ	సోమాజిగూడ వార్డు కార్యాలయం
ఖైరతాబాద్‌	ఖైరతాబాద్‌ వార్డు కార్యాలయం

● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారిణి



బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌-12లోని విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన సాయిబాబాకు మాఘ మాస మహోత్సవాల్లో భాగంగా ఆదివారం నారికేళ జలంతో అభిషేకం నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.
–బంజారాహిల్స్‌

నకిలీ సిమ్‌కార్డులతో మోసం కేసులో పలువురి రిమాండ్‌

పంజగుట్ట: అమాయకుల వ్యక్తిగత గుర్తింపు పత్రాలను సేకరించి వాటి ఆధారంగా సిమ్‌కార్డులను జారీ చేసిన వ్యక్తితో పాటు వాటిని కొనుగోలు చేసి పలువురిని బెదిరించడమే కాకుండా బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్న మరో ఇద్దరిని పంజగుట్ట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేటలో భవానీ కమ్యూనికేషన్‌ పేరిట దుకాణం నిర్వహిస్తున్న సంతోష్‌కుమార్‌ గ్రామస్తుల గుర్తింపు పత్రాలను ఉపయోగించి ఆరోగ్యశ్రీ నల్లగొండ జిల్లా మేనేజర్‌ వంశీకృష్ణ, పర్శరాములుకు సిమ్‌కార్డులు జారీ చేశాడు. వారు సదరు సిమ్‌కార్డులను ఉపయోగించి సిద్దిపేటకు చెందిన చక్రధర్‌గౌడ్‌ అనే వ్యక్తికి బెదిరింపు సందేశాలను పంపించారు. సిద్దిపేట నియోజకవర్గంలో సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనరాదంటూ హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వంశీకృష్ణను అవినీతి ఆరోపణలపై ఆరోగ్యశ్రీ శాఖ నుంచి తొలగించారు. అయినప్పటికీ 2023 జూన్‌లో మళ్లీ విధుల్లోకి చేరాడు. డిసెంబర్‌ 2023 వరకు అప్పటి ఆరోగ్య మంత్రి హరీష్‌రావు క్యాంప్‌ కార్యాలయంలో పనిచేశాడు. నకిలీ సిమ్‌కార్డులతో మోసాలకు పాల్పడుతున్న సంతోష్‌కుమార్‌, పర్శరాములు, వంశీకృష్ణను ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

మత సామరస్యానికి ప్రతీక గ్యార్వీ ఉత్సవాలు

సనత్‌నగర్‌: గ్యార్వీ ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు. బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలో ఆరీఫ్‌. ఆధ్వర్యంలో జరిగిన గ్యార్వీ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఐక్యతను పెంపొందించడంలో గ్యార్వీ ఉత్సవాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సయిద్‌ అలీ ముస్తఫా జిలానీ, బీఆర్‌ఎస్‌ నాయకులు శ్రీహరి, నరేందర్‌రావు, షేక్‌ అబ్బాస్‌, సాబేర్‌ అలీ, వాహిద్‌ తదితరులు పాల్గొన్నారు.



గ్యార్వీ ఉత్సవాల్లో సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

ఛత్రపతి శివాజీ మహారాజ్‌ శోభాయాత్ర రద్దు

జియాగూడ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నెల 19న జరగాల్సిన ఛత్రపతి శివాజీ మహారాజ్‌ శోభాయాత్రను రద్దు చేస్తున్నట్లు ఛత్రపతి శివాజీ మహారాజ్‌ సేవాదళ్‌ అధ్యక్షులు జి.శంకర్‌, ప్రధాన కార్యదర్శి జి.చంద్రకాంత్‌ తెలిపారు. ఈ మేరకు ఆదివారం కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్‌ సునీల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.... 144 ఏళ్ల తర్వాత వచ్చిన మహా కుంభమేళకు పెద్ద ఎత్తున భక్తులు వెళుతున్న నేపథ్యంలో ఈ ఏడాది శోభాయాత్రను విరమించుకున్నట్లు తెలిపారు. వచ్చే సంవత్సరం యాధావిధిగా శివాజీ మహారాజ్‌ శోభాయాత్రను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అనిల్‌ కుమార్‌, ఠాకూర్‌ విశాల్‌సింగ్‌, వికాస్‌, సహకార్యదర్శులు జి.ప్రశాంత్‌, శివరామకృష్ణ, బీజేపీ నాయకుడు గుర్రం శివశంకర్‌ తదితరులు పాల్గొన్నారు.



కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్‌ సునీల్‌కు వినతి పత్రం అందజేస్తున్న సేవాదళ్‌ ప్రతినిధులు

పాతబస్తీలో జోరుగా మెట్రో పనులు

- మెట్రో పనులను ఆపాలంటూ హైకోర్టులో పిల్‌
- పురాతన కట్టడాలకు ఆటంకాలు కలిగే అవకాశం అంటూ పిల్‌
- తదుపరి విచారణ ఈ నెల 17 కు వాయిదా వేసిన హైకోర్టు
- సీఎం ఆదేశాల మేరకు... చకచకా కూల్చివేతలు
- ఎంజీబీఎస్‌ నుంచి చాంద్రాయణగుట్ట వరకు వేగంగా మెట్రో పనులు



చార్మినార్‌: పాతబస్తీలో మెట్రో పనుల్లో వేగం పెరిగింది. దారుషిఫా నుంచి మొఘల్‌పురా వరకు ప్రధాన రోడ్డులోని ఇరువైపుల పురాతన కట్టడాలను సైతం తొలగిస్తున్నారు. ప్రస్తుతం నిరంతరాయంగా ఈ కూల్చివేతల పనులు కొనసాగుతున్నాయి. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే పాతబస్తీలో మెట్రో పనులు ప్రారంభమవుతాయని కాంగ్రెస్‌ అధిష్టానం ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉండి వెంటనే పనులను ప్రారంభించాలని మెట్రో ఎండీకి చెప్పడం.. పవర్‌ పాయింట్‌ ప్రజంటేషన్‌ జరగడం.. నిధులను కేటాయించడం.. శంకుస్థాపన చేయడంతో కూల్చివేతలు చకచకా జరిగిపోతున్నాయి. దీనికి తోడు హైదరాబాద్‌ ఎంపీ అసదుద్దీన్‌ ఓవైసీతో పాటు మజ్లిస్‌ పార్టీ ఫ్లోర్‌ లీడర్‌ అక్బరుద్దీన్‌ ఓవైసీలు కూడా పాతబస్తీలో మెట్రో రైలు పనులను వెంటనే చేపట్టాలని కోరడంతో రోడ్డు విస్తరణ పనులు మొదలై జోరుగా కొనసాగుతున్నాయి.



మెట్రో రైలు కోసం పురానీహవేలీ చౌరస్తాలో కొనసాగుతున్న కూల్చివేతలు

పురాతన కట్టడాలకు నష్టం కలుగుతుందంటూ పిల్‌..

దారుషిఫా నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపట్టిన కూల్చితలలో చరిత్రాత్మకమైన కట్టడాలున్నాయని.. మెట్రో కూల్చివేతలతో వాటికి ముప్పు వాటిల్లనుందని.. వాటిని పరిరక్షించిన అనంతరమే కూల్చివేతలు కొనసాగించాలని కోరుతూ ఆక్ట్‌ పబ్లిక్‌ వెల్ఫేర్‌ ఫౌండేషన్‌(ఏపీడబ్ల్యూఎఫ్‌) ఆధ్వర్యంలో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్‌) దాఖలైంది.

◆ చార్మినార్‌ నుంచి ఫలక్‌నుమా వరకు జరిగే మెట్రో రైల్‌ ఫేజ్‌-2 కూల్చివేతల్లో హెరిటేజ్‌ కట్టడాలున్నాయంటూ ఫౌండేషన్‌ అధ్యక్షులు మహ్మద్‌ రహీం ఖాన్‌ హైకోర్టులో వేసిన తన పిల్‌ ద్వారా వివరించారు. తెలంగాణ హెరిటేజ్‌ ఆక్ట్‌ 2017తో పాటు ఆన్‌సెంట్‌ మానుమెంట్స్‌ అండ్‌ ఆర్కియాలజికల్‌ సైట్స్‌ అండ్‌ రిమేన్స్‌(ఎఎంఎఎస్‌ఆర్‌) ఆక్ట్‌ 1958 ప్రకారం ముందుగా హైకోర్టు గానీ నిపుణుల బృందంతో గానీ సర్వే నిర్వహించి రిపోర్టు వచ్చేంత వరకు ప్రస్తుతం జరుగుతున్న కూల్చి వేతలను నిలిపివేయాలని కోరారు.

◆ పురానీహవేలీ, అజాఖానా-ఇ-జహ్రా, జమా మసీద్‌, దారుషిఫా, మొఘల్‌పురా తదితర హెరిటేజ్‌ కట్టడాలకు నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటూ వీటి పరిస్థితి ఏమిటంటూ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ సుజయ్‌ పాల్‌, జస్టిస్‌ రేణుకా యారా తదితరుల డివిజన్‌ విచారణ చేపట్టి తదుపరి విచారణను ఈనెల 17వ తేదీకి వాయిదా వేసింది.

ఎంజీబీఎస్‌ నుంచి చాంద్రాయణగుట్ట వరకు..

ఫలక్‌నుమా నుంచి ఎంజీబీఎస్‌ ద్వారా సికింద్రాబాద్‌ జేబీఎస్‌ వరకు ఉండే ఈ మెట్రో కారిడార్‌ పనుల్లో కేవలం ఫలక్‌నుమా నుంచి ఇమ్లిబన్‌ వరకు మాత్రమే పనులు ఇంకా ప్రారంభం కాలేదు. అయితే ఇప్పుడు ఫలక్‌నుమా వరకు కాకుండా చాంద్రాయణగుట్ట వరకు మెట్రో కారిడార్‌ను పొడిగించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎట్టకేలకు పురానీహవేలీ, మీరాలం మండి, దారుషిఫా, ఎతేబార్‌ చౌక్‌, శాలిబండ, శంషీర్‌గంజ్‌ ద్వారా ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట వరకు మెట్రో పనులు వేగంగా జరుగనున్నాయి.

◆ ఇందులో భాగంగా ప్రస్తుతం దారుషిఫా నుంచి మొగల్‌పురాలోని బీబీబజార్‌ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సముదాయాలను తొలగిస్తున్నారు. ప్రస్తుతం పురానీహవేలీ చౌరస్తాలో రోడ్డు విస్తరణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. చాంద్రాయణగుట్ట నుంచి ఆర్జీఐఏ వరకు మెట్రో కారిడార్‌ కొనసాగనుంది.

గ్రేటర్‌లోని అన్ని కారిడార్లలో లాగే పాతబస్తీలో సైతం..

గ్రేటర్‌లోని అన్ని కారిడార్లలో పరుగులు తీసినట్లే.. ఇక నుంచి పాతబస్తీలో కూడా మెట్రో రైలు పరుగులు తీయనుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన పాతబస్తీ ప్రజల కళ నెరవేరే రోజు వచ్చేసింది. కాంగ్రెస్‌ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటోంది. ఎట్టకేలకు మెట్రో కోసం ఎదురు చూసిన పాతబస్తీ ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.2వేల కోట్ల వ్యయంతో ఫలక్‌నుమాలో మెట్రో పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.

◆ సీఎం ఆదేశాల మేరకు పాతబస్తీలో నిర్మించనున్న మెట్రో కోసం రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. ప్రత్యేక తెలంగాణ వచ్చినప్పటి నుంచి రెండు సార్లు కేసీఆర్‌ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఈసారి కాంగ్రెస్‌ ప్రభుత్వం రావడంతో... ఇక పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్ట్‌ పనులకు మోక్షం కలుగుతుందని భావించిన పాతబస్తీ ప్రజల ఆశలు నెరవేరుతున్నాయి. ఇక, హెరిటేజ్‌ కట్టడాల పరిరక్షణ పేరుతో హైకోర్టులో పిల్‌ దాఖలు కావడంతో అందరి దృష్టి హైకోర్టు పై పడింది.

వెలగని లైట్లు.. కమ్ముకున్న చీకట్లు!

● ధరణినగర్‌లో నెల రోజులుగా వెలగని వీధి దీపాలు



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ధరణినగర్‌లోని వివిధ వీధుల్లో వీధి లైట్లు వెలగడం లేదు. కాలనీలో వీధి దీపాలు సుమారు నెల రోజుల నుంచి వెలగకపోవడంతో కాలనీలోని అంతర్గత రహదారులు చీకటిమయంగా ఉంటున్నాయి. దొంగల బెడద, కుక్కల బెడద, పోకిరీల బెడదతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. ధరణినగర్‌కు ఆనుకుని పరికి చెరువు నాలా ప్రవహిస్తూ ఉంటుంది. నాలాలో విషపురుగులు, సర్పాలు సంచరిస్తుంటాయి. కొద్ది రోజుల క్రితమే ఆల్విన్‌కాలనీ పరిసర ప్రాంతాల్లోని కాలనీల్లో కొండ చిలువ వంటి భారీ పాములు కనిపించిన సంఘటనలు ఉన్నాయి. పాములను పట్టుకునే వారిని పిలిపించారు. స్థానికంగా కూడా దొంగల బెడద ఎక్కువగా ఉంటుంది. ఇదే ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు, పాలప్యాకెట్లు, నూతనంగా నిర్మించే ఇళ్లల్లో చొరబడి ఎలక్ట్రికల్‌, కలర్స్‌ డబ్బాలు, ఇతర విలువైన సామాగ్రిని అపహరించిన ఘటనలు కూడా ఉన్నాయి. వీధి దీపాలు వెలగక పోవటంతో సీసీ కెమెరాల్లో కూడా ఏమీ కనిపించక పోవటంతో అటు వైపు వచ్చిన వారిని కూడా గుర్తించటం కష్టంగా ఉంటుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. కాలనీలోని శ్రీకనకదుర్గమ్మ దేవాలయం ప్రాంగణం, హైటెన్షన్‌ రోడ్డు, కాలనీ ప్రధాన రహదారులు, వీధుల్లో లైట్లు కూడా వెలగక పోవటంతో కాలనీ వీధులన్నీ రాత్రి చీకటిగా మారుతున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

గౌలిపురా: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ మృతి చెందిన సంఘటన భవానీనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేందర్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి తలాబ్‌ కట్టా సిద్ధిఖ్‌నగర్‌ ప్రాంతంలో రమాదేవి (48), నర్సయ్య దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ నెల 9న రోడ్డుపై తీవ్ర గాయాలతో పడి ఉన్న రమాదేవిని అబ్దుల్‌ కరీం అనే వ్యక్తి ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమాదేవి ఈ నెల 14న మృతి చెందినట్లు వైద్యులు భవానీనగర్‌ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్లాక్‌ ఫిల్మ్‌ల తొలగింపు



బ్లాక్‌ఫిల్మ్‌ తొలగిస్తున్న ట్రాఫిక్‌ పోలీసులు

బంజారాహిల్స్‌: నిబంధనలకు విరుద్ధంగా కారు అద్దాలకు ఏర్పాటు చేసిన బ్లాక్‌ ఫిల్మ్‌లను బంజారాహిల్స్‌ ట్రాఫిక్‌ పోలీసులు తొలగించారు. స్పెషల్‌ డ్రైవ్‌లో భాగంగా బంజారాహిల్స్‌లో వెస్ట్‌ జోన్‌ ట్రాఫిక్‌ హరిప్రసాద్‌ కట్టా పర్యవేక్షణలో పోలీసులు కారు అద్దాలకు ఏర్పాటుచేసిన బ్లాక్‌ ఫిల్మ్‌లను తొలగించి జరిమానా విధించారు. కార్ల యజమానులు బ్లాక్‌ ఫిల్మ్‌లు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని తనిఖీల్లో పట్టుబడితే జరిమానాలు విధిస్తామన్నారు.

ఓపెన్‌ జిమ్‌ ప్రారంభం



ఓపెన్‌ జిమ్‌ ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌

కాచిగూడ: హిమాయత్‌నగర్‌లోని మెల్కోటే పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్‌ జిమ్‌ను ఆదివారం స్థానిక కార్పొరేటర్‌ మహాలక్ష్మీ రామన్‌ గౌడ్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యాయామం చేసి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామన్‌గౌడ్‌, భూషణ్‌ రావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వెంగళరావునగర్‌: అప్పుల బాధ తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మధురానగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన కె. సూర్యనారాయణ (45) నానక్‌రామ్‌గూడలో ఉంటూ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 16న ఆదివారం ఉదయం కొడుకు వరసైన భరత్‌కుమార్‌కు ఫోన్‌ చేసి యాదగిరినగర్‌లో దుర్గాప్రసాద్‌ అనే వ్యక్తి ఇంట్లో ఉన్నానని చెప్పాడు. తాను తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని దుర్గాప్రసాద్‌ వేధిస్తూ కడుపులో కొట్టాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆందోళన చెందిన భరత్‌కుమార్‌ హుటాహుటిన యాదగిరినగర్‌కు వచ్చాడు. అప్పటికే సూర్యనారాయణ కాలిన గాయాలతో దుర్గాప్రసాద్‌ ఇంటి ముందు పడి ఉన్నాడు.108కు ఫోన్‌చేసి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సూర్యనారాయణ మృతిచెందాడు. భరత్‌కుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థి అదృశ్యం



గణేష్‌

బంజారాహిల్స్‌: తెలంగాణ సోషల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ స్పోర్ట్స్‌ అకాడమీలో జూడోగేమ్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థి అదృశ్యమైన ఘటన ఫిలింనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..షేక్‌పేటలోని స్పోర్ట్స్‌ అకాడమీలో తొమ్మిదో తరగతి చదువుతున్న గణేష్‌ ఈ నెల 14న కనిపించకపోవడంతో అక్కడున్న సీసీ కెమెరాలను పరిశీలించగా 13న రాత్రి స్టేడియం వెనుక వైపు నుంచి గోడ దూకి వెళ్లిపోయిన దృశ్యాలు కనిపించాయి. ఈ విషయాన్ని గణేష్‌ తండ్రికి తెలుపగా 13న రాత్రి 9.30 గంటలకు తనకు వేరే ఫోన్‌ నుంచి మాట్లాడి రూ.200 ఫోన్‌ పే చేయాలనడంతో పంపించానని చెప్పారు. అకాడమీ ప్రిన్సిపాల్‌ బాలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అగ్ని ప్రమాదంలో ఆటోలు దగ్ధం

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్‌ నెం-11లోని షా బిల్డింగ్‌ వెనుకాల ఉన్న వీధిలో బంజారా లేక్‌ను ఆనుకొని ఉన్న స్థలంలో మంటలు చెలరేగి పార్కింగ్‌ చేసి ఉన్న రెండు ఆటోలు కాలిపోయాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్‌ సిబ్బంది మంటలను ఆర్పేశారు. మంటలు చెలరేగడానికి కారణాలపై ఆరా తీస్తున్నారు.

సిటీ కాలేజీలో అత్యుత్తమ విద్యాబోధన

దూద్‌బౌలి: పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ప్రభుత్వ సిటీ కళాశాల జూనియర్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ అంజన్‌ కుమార్‌ అన్నారు. ప్రభుత్వ సిటీ జూనియర్‌ కళాశాలలో రాబోయే విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం ప్రిన్సిపాల్‌, ఉపాధ్యాయులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. కళాశాల చుట్టుపక్కల ప్రాంతాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ సిటీ జూనియర్‌ కళాశాలలో ప్రవేశం పొందాలన్నారు. 100 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ కళాశాలలో ఎంతో మంది ప్రముఖులు, రాజకీయ నాయకులు ప్రభుత్వ అధికారులు చదువుకున్నారని, వారందరూ ఉన్నతస్థానాల్లో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ తో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



చాంద్రాయణగుట్ట కుమ్మర్‌వాడీ బస్తీలో మహిళ వివరాలను నమోదు చేయిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

చాంద్రాయణగుట్ట: మొదటి దఫా కులగణనలో పేర్లు నమోదు చేసుకోని బీసీలు రీ సర్వే లో తమ వివరాలు అందజేయాలని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ సూచించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కూడా ప్రజలకు అవగాహన కల్పించి పేర్లు నమోదు చేయించేలా చూడాలన్నారు. కులగణన రీ సర్వే ప్రారంభమైన నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఆయన బీసీ సంక్షేమ శాఖ అధికారులు, జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి చాంద్రాయణగుట్ట కుమ్మర్‌వాడీ బస్తీలో పర్యటించారు. 200 ఇళ్లను పరిశీలించగా, అందులో 71 కుటుంబాలు పేర్లను నమోదు చేసుకోలేదన్న విషయం తేలింది. సర్వేకు సంబంధించిన స్టిక్కర్లు అతికించినా పేర్ల నమోదుకు ఎన్యూమరేటర్లు రాలేదని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీసీ కమిషన్ ఈ నెల 28వ తేదీ వరకు రోజుకు నాలుగు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పర్యటిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఆశన్న, నర్సింహులు, సుశాంత్, సునీల్ బాబు, ఆంజనేయులు, టీపీసీసీ కార్యదర్శి బి.వెంకటేష్ ముదిరాజ్, చాంద్రాయణగుట్ట కాంగ్రెస్ ఇన్‌చార్జి బోయ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం

సర్ సీవీ రామన్ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి తుమ్మల



సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు మార్కులు, డిగ్రీలతోపాటు నైపుణ్యాలు అవసరమని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యారంగ అభివృద్ధి కోసం ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, స్కిల్ ఇండియా యూనివర్సిటీని స్థాపిస్తున్నారని అన్నారు. ప్రముఖ సామాజిక సేవా సంస్థ సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలోని 32వ సర్ సీవీ రామన్ టాలెంట్ సెర్చ్ పరీక్ష విజేతలకు లలిత కళాతోరణం వేదికగా ఆదివారం మంత్రి తుమ్మల, సినీనటుడు రావు రమేష్ కలిసి సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డులను ప్రదానం చేశారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను కూడా సత్కరించారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలో దాదాపు వెయ్యి పాఠశాలల నుంచి 10 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇలాంటి అవార్డులతో విద్యార్థులు మరింత ముందుకు సాగుతూ దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని మంత్రి సూచించారు. సుచిరిండియా ఫౌండేషన్ అధినేత డా.లయన్ కిరణ్ ఆధ్వర్యంలో సర్ పీవీ రామన్ టాలెంట్ సెర్చ్ పరీక్ష నిర్వహించడం మంచి సంకల్పమని కొనియాడారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని డా.లయన్ కిరణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల, రావు రమేష్ చేతుల మీదుగా టేబుల్ బుక్‌ను ఆవిష్కరించారు.

చికెన్ చిన్నబోయె... ఫిష్ ఖుష్



పేట్‌బషీరాబాద్‌లో చేపల దుకాణం వద్ద...

బర్డ్ ఫ్లూ నేపథ్యంలో నగరంలో చికెన్ షాపులు వెలవెలబోయాయి. మరోవైపు మటన్, చేపల దుకాణాలకు గిరాకీ భారీగా పెరిగింది. ఆదివారం ఉదయం ఎక్కడ చూసినా మటన్, చేపల దుకాణాల వద్ద మాంసాహారులు పెద్ద ఎత్తున క్యూ కట్టారు. ఇదే అదునుగా మటన్, చేపలపై కిలోకు 20 నుంచి 30 రూపాయిలు పెంచి విక్రయించారు. -సుభాష్‌నగర్/బంజారాహిల్స్



పంజగుట్టలోని మటన్ షాపు వద్ద...

టన్నెల్ నిర్మాణం.. ఇక అంతేనా?

ప్రశ్నార్థకంగా మారిన నాలెడ్జి సిటీ మరో మార్గం

- దాబా కూడలిలో గుట్ట తొలచి టన్నెల్‌కు ప్రతిపాదన
- ప్రభుత్వం మారడంతో తలెత్తుతున్న అనుమానాలు



దాబా కూడలి(ఖాజాగూడ ఎక్స్‌రోడ్)లో ఒకవైపు ఉన్న గుట్టకింద టన్నెల్ ప్రతిపాదన చేసిన స్థలం ఇదే (ఫైల్)

రాయదుర్గం: 'దాబా కూడలి'.. దీన్నే 'ఖాజాగూడ ఎక్స్‌రోడ్' అని కూడా అంటారు. ఈ కూడలిలో మూడు వైపులా రోడ్లున్నా నాలుగో వైపు భారీ రాతి, మట్టి, చెట్లతో కూడిన గుట్ట శతాబ్దాలుగా కొనసాగుతోంది. ఇది నగరం నుంచి గచ్చిబౌలి, రాయదుర్గం, నానక్‌రాంగూడలోని ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ, బయో డైవర్సిటీ పార్కు, మాదాపూర్ వెళ్లే వారికి ప్రధాన కూడళ్లలో ఒకటిగా కొనసాగుతోంది. దీంతో ఇది ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. దీనికి సుమారు వెయ్యి నుంచి 1,400 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని గత ప్రభుత్వంలో అంచనా కూడా వేశారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడంతో ఈ ప్రతిపాదనపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

నగరంలో మొదటిగా...

హైదరాబాద్ నాలెడ్జి సిటీతో రోడ్డు మార్గంగా కలిపేదిగా ఈ టన్నెల్ మారేది. నగరంలో ఇదో అత్యుత్తమ టన్నెల్‌గా మారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది. గత ప్రభుత్వం మూడున్నరేళ్ల క్రితం ఈ ప్రతిపాదన చేసింది. ఈ టన్నెల్‌తో హైదరాబాద్ నాలెడ్జి సిటీని పాత ముంబై జాతీయ రహదారిని కలపాలని అప్పట్లో అధికారులు భావించారు. ప్రధానంగా ట్రాఫిక్‌ను ఈ దారిన మళ్లిస్తే ఎంతో మేలు చేకూరేదని అంచనా. హైదరాబాద్ నాలెడ్జి సిటీని పాత ముంబై జాతీయ రహదారిని కలుపుతూ గుట్ట సమీపంలోంచి ఇప్పటికే ఒక లింకురోడ్డు ఏర్పాటు చేసినా, మరో లింకు రోడ్డుగా గుట్టను తొలచి కింద నుంచి టన్నెల్‌గా మార్చి మరో రోడ్డు వేయాలని ప్రతిపాదించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేసినా రాష్ట్రంలో ఆర్థిక సమస్యల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని దాదాపు విరమించుకొన్నట్లేనని పలువురు భావిస్తున్నారు.



సుందరీకరించిన దాబా కూడలిని ఇటీవల ప్రారంభించిన మేయర్, పీఏసీ చైర్మన్, కార్పొరేటర్ (ఫైల్)

సుందరీకరణ చేసిన జీహెచ్ఎంసీ..


దాబా కూడలిని సుందరీకరించడంతో ఆకర్షణీయంగా మారిందని చెప్పక తప్పదు. దాబా కూడలి నుంచి నానక్‌రాంగూడలోని ఓఆర్ఆర్ అండర్ బ్రిడ్జి వరకున్న రోడ్డును రూ.45 కోట్లతో మోడల్ రోడ్డుగా మార్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ కూడలిని సుందరీకరించి మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభింపచేసిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ప్రతిపాదనపై దృష్టి పెడితే నగరంలో మరో ప్రత్యేక ఆకర్షణీయమైన ప్రాంతం మారుతుందని స్థానికులు భావిస్తున్నారు.

నగరంలో నేడు

- జాతీయ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సప్తకళాకారుల పేరిట పురస్కారాలు, ఆత్మీయ సత్కార కార్యక్రమం చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభలో సాయంత్రం 4.30 గంటలకు జరుగుతుంది.
- హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో అల్ ఇండియా సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్-2025 పోటీలు జరుగుతాయి.
- శ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీ రామానుజాచార్య 108 దివ్యదేశాల తృతీయ బ్రహ్మోత్సవాలు సమతా కుంభ్ - 2025 శంషాబాద్‌లోని శ్రీరామ నగరం ముచ్చింతల్‌లో ఉదయం 11.30 గంటలకు డోలోత్సవం, సామూహిక ఉపనయనాల కార్యక్రమాలు జరుగుతాయి.
- హైదరాబాద్ బర్డ్ అట్లాస్(హెచ్‌బీఏ) ఆధ్వర్యంలో ప్రత్యేక బర్డ్ వాచర్స్ డ్రైవ్ కేబీఆర్ పార్క్‌సహా నగరంలోని 108 ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి ఉదయం 9 గంటలకు జరుగుతుంది.
- డీడీ కాలనీ, శివం రోడ్‌లోని సాయిబాబా ఆలయం వద్ద ఉదయం 8 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ రీ సర్వేపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఘనంగా వృక్షార్చన



వృక్షార్చన కార్యక్రమంలో మొక్కలు నాటుతున్న సంతోష్ కుమార్..

బంజారాహిల్స్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఆదివారం బంజారాహిల్స్‌లోని వెంగళరావు పార్కులో మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో వృక్షార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 40 మంది మాజీ కార్పొరేషన్ల చైర్మన్లతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు బాంధవుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున మొక్కలు నాటుతున్నామని తెలిపారు. కేసీఆర్ పదేళ్లలో తెలంగాణను ఆకుపచ్చ తెలంగాణగా మార్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజక వర్గ బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, విప్లవ్‌కుమార్, అహ్మద్, రాంచందర్, నర్సింహ్మా, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

'ఎగ్జిబిషన్' పన్ను స్వాహా!

- వాణిజ్య పన్నుల శాఖకు షాపుల ద్వారా అందని ట్యాక్స్
- ఎగ్గొట్టడానికి వ్యాపారులకు మార్గం చూపిన అధికారులు
- తాత్కాలిక జీఎస్టీ నెంబర్ తీసుకొన్న దాఖలాలు లేవు



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఖజానాకు గండి పడింది. ఇటీవల నగరంలో నిర్వహించిన ఎగ్జిబిషన్ షాపుల పన్ను జమ కాలేదు. ప్రభుత్వ ఖజానాకు పన్ను ఎగ్గొట్టేవిధంగా అబిడ్స్ డివిజన్ వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిఏటా ఎగ్జిబిషన్ ప్రారంభం కంటే ముందే షాపుల నిర్వాహకులు తాత్కాలిక జీఎస్టీ రిజిస్ట్రేషన్ నెంబర్ తీసుకోవాలి. జీఎస్టీ యాక్ట్ 16ఏ ప్రకారం ఏదైనా వ్యాపారం తక్కువ రోజుల కోసం చేయాలనుకునే వారు తప్పక జీఎస్టీ తీసుకోవాలి. ఎగ్జిబిషన్ స్టాల్స్ వ్యాపార లావదేవీలపై పన్నులు చెల్లించాలి. ఈసారి దాని ఊసేలేదు. అబిడ్స్ డివిజన్ వాణిజ్య పన్నుల శాఖ పరిధిలోకి ఈ ఎగ్జిబిషన్ వస్తుంది. ఈ విషయాల పర్యవేక్షణ కోసం అధికారులకు ఇక్కడ తాత్కాలికంగా విధులు కేటాయిస్తారు. ఎగ్జిబిషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వ్యాపారుల నుంచి పన్ను వసూలు చేయకుండా ఎగ్గొట్టే మార్గాలు చూపిస్తున్నారని ఓ వ్యాపారి 'సాక్షి'కి తెలిపారు. తమకు ముడుపులు ఇస్తే అంతా చూసుకుంటామని వ్యాపారులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తెలుస్తోంది. ఎగ్జిబిషన్ ద్వారా ప్రతి ఏటా కోట్ల రూపాయల పన్ను ప్రభుత్వ ఖజానాకు వసూలు అవుతుంది. కానీ, ఈ ఏడాది ఆబిడ్స్ వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ అంతా గోప్యతను పాటిస్తున్నారు. ఈ విషయమై జేసీని సంప్రదించగా స్పందించడంలేదు.

ఉన్నతాధికారుల కోసమేనా...

ఎగ్జిబిషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పన్ను వసూలు చేయకుండా వ్యాపారుల నుంచి ముడుపులు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించగా ఉన్నతాధికారులకు మామూళ్లు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ఉన్నతాధికారులకు మామూళ్లు ఇవ్వడం కోసం తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని, అడ్డదారులు తొక్కాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఎగ్జిబిషన్ డ్యూటీలు కేటాయించే ముందు తమ వాటా తప్పక ఇవ్వాలని చెప్పి మరీ కింది స్థాయి అధికారులను, సిబ్బందిని పంపుతున్నారు. ఉద్యోగం పణంగా పెట్టి వ్యాపారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసి ఉన్నత అధికారులకు ఇవ్వాల్సి పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఏదిఏమైనా వాణిజ్య పన్నుల శాఖ అధికారుల నిర్వాకంతో ప్రభుత్వ ఖజానాకు భారీగానే గండి పడిందని చెప్పవచ్చు.

ఉత్తమ వైద్యసేవలకు 'వన్ అపోలో'

ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ శోభనా కామినేని



నార్సింగిలో వన్ అపోలో క్లినిక్, ఫార్మసీని ప్రారంభించిన శోభనా కామినేని

మణికొండ: ప్రజలకు నమ్మకం, ఉత్తమ వైద్యసేవలను సులభంగా, తక్షణమే అందించేందుకు 'వన్ అపో'లో సరికొత్త రూపంలో రిటైల్ హెల్త్‌ను అందిస్తుందని అపోలో హెల్త్ లిమిటెడ్ సంస్థ ప్రమోటర్, ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ శోభనా కామినేని అన్నారు. నార్సింగిలో ఆమె ఆదివారం 6,500వ అపోలో ఫార్మసీ, క్లినిక్, డయాగ్నస్టిక్స్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కొత్తగా వస్తున్న వన్ అపోలోలో మందులు, పరీక్షలు, డాక్టర్ల సంప్రదింపులు ఒకేచోట లభిస్తాయన్నారు. వచ్చే రెండేళ్లలో వెయ్యి ఫార్మసీలు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్స్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఉన్న ఫార్మసీలను కొన్నింటిని ఇదే తరహాలో 'వన్ అపోలో'గా మార్పు చేస్తామన్నారు. కొత్త హబ్ ద్వారా అపోలో సేవలు మరింత చేరువ అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అపోలో హెల్త్ కంపెనీ లిమిటెడ్ సీఈఓ పి.జయకుమార్, అపోలో ఫార్మసీ సీఈఓ శ్రీరాం అయ్యర్‌లతో పాటు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సంజీవరెడ్డి కార్మిక పక్షపాతి

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



సంజీవరెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మహేష్ కుమార్ గౌడ్ తదితరులు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: కార్మిక పక్షపాతిగా మాజీమంత్రి సంజీవరెడ్డి చెరగని ముద్ర వేస్తూ ఎల్లప్పుడు కార్మికుల శ్రేయస్సు కోసం పనిచేస్తున్నారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఐఎన్‌టీయూసీ, వీఎస్‌టీ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్‌టీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. మహేష్‌కుమార్ గౌడ్‌తోపాటు సీనియర్ నేతలు ఆర్‌సీ కుంతియా, వి.హనుమంతరావు, ఐఎన్‌టీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు అశోక్ సింగ్, లక్ష్మి వెంకటేశం, కనీస వేతనాల బోర్డ్ చైర్మన్ జనక ప్రసాద్ హాజరై సంజీవరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంజీవరెడ్డి శాసన సభ్యులుగా, కార్మిక మంత్రిగా పనిచేశారని కొనియాడారు. మోదీ ప్రభుత్వం 10 ఏళ్లుగా పారిశ్రామికవేత్తలైన అదాని, అంబానీలను పెంచి పోషిస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, బాబర్ సలీం పాషా, సత్యజిత్ రెడ్డి, రాజు, ఎల్‌డి పాల్, నగేష్, ఎ.ఆర్ శ్రీనివాసులు, డి. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో పెరగనున్న పీహెచ్‌డీ సీట్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ సీట్ల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి. కేటగిరీ-2లోని 45 సబ్జెక్టుల్లో 456 పీహెచ్‌డీ సీట్ల భర్తీకి ఎంట్రన్స్ టెస్ట్-2025 నోటిఫికేషన్ వెలువడిన విషయం విదితమే. యూజీసీ నిబంధనల ప్రకారం ఉద్యోగ విరమణకు మూడేళ్ల ముందు ప్రొఫెసర్లకు గైడ్‌షిప్ రద్దు చేయడంతో సుమారు 50 మందికి పీహెచ్‌డీ గైడ్‌షిప్ అర్హత లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ల రిటైర్‌మెంట్ వయస్సు 65 పెంచడంతో అధ్యాపకులకు పీహెచ్‌డీ గైడ్‌షిప్ లభించే అవకాశం ఉంది. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు పీహెచ్‌డీ సీట్ల సంఖ్యను పెంచాలని వీసీ ప్రొ.కుమార్‌కు వినతి పత్రాలు అందచేశారు. ఈ నేపథ్యంలో 400 పీహెచ్‌డీ సీట్లు పెరిగే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

మన సంస్కృతిని కాపాడుకోవాలి



బాలోత్సవంలో మాట్లాడుతున్న అశోక్ తేజ

సుందరయ్య విజ్ఞానకేంద్రం: మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో 'ప్రజాపాటకు నృత్య నీరాజనం'పేరిట సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రాసిన రెండు వందల సినిమా పాటలకు వచ్చిన ఆనందం తెలంగాణ బాలోత్సవానికి రాసిన రెండు పాటల వల్లే కలిగిందని చెప్పారు. బాలల వ్యక్తిత్వ వికాసానికి బాలోత్సవం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు అమ్మపెట్టిన బాక్స్‌నే ఆహారంగా తీసుకోవాలని, ఇతర ప్రాంతాల్లో చాక్లెట్లు, బిస్కెట్లు వంటి ఆహార పదార్థాలను తీసుకోవద్దని సూచించారు. నేటి సమాజం అంపశయ్యపై ఉందని, దానిని నుంచి తప్పించేందుకు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షులు కె.సుజావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎస్.సోమయ్య, రమణి సిద్ది, ఇందిరా పరాశరం, నాట్యగురువులు రేణుక ప్రభాకర్, ప్రసూన, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్.. ట్రాఫిక్...



నగరం నుంచి గచ్చిబౌలి వైపు వచ్చే మార్గంలో రాయదుర్గంలోని మల్కంచెరువు నుంచి దాబా కూడలి వరకు ఉన్న రోడ్డుపై వాహనాలు స్తంభించాయి. ఆదివారం కొద్దిసేపు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ ప్రాంతం నుంచి వాహనాలు ఒకే సమయంలో భారీగా రావడంతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ఆ తర్వాత సాఫీగా వాహనాల రాకపోకలు సాగడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. - రాయదుర్గం

సంపద వృద్ధిలో నిర్మాణ రంగ కార్మికులే కీలకం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలో పాల్గొన్న అతిథులు

గచ్చిబౌలి: భవన నిర్మాణ రంగ కార్మికులు దేశ సంపద వృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నాలుగో జిల్లా మహాసభలను ఆదివారం జూబ్లీహిల్స్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు భద్రత, ప్రాణాలకు విలువ లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలపై రాబోయే కాలంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. బహుళ అంతస్తులు, ఫ్లైఓవర్లు నిర్మించిన కార్మికులు దేశ సంపద వృద్ధిలో భాగస్వాములని, వీరి శ్రమను ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పెన్షన్ స్కీములు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఉజ్జిని రత్నాకర్‌రావు మాట్లాడుతూ లేబర్ అడ్డాల దగ్గర మౌలిక వసతుల్లేక ఎండ వచ్చినా వాన వచ్చినా అలాగే గంటలకొద్దీ నిలబడాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేశారు. లేబర్ అడ్డాల వద్ద షెడ్ల నిర్మాణం, టాయిలెట్ల వసతి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.చంద్రయ్య., జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు దాసరి ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌గౌడ్, రామస్వామి రామకృష్ణ, మల్లేష్, శేఖర్‌రెడ్డి, చందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డుల ప్రదానం

వివిధ రాష్ట్రాలకు చెందిన 30 మంది ప్రముఖులకు సత్కారం



అవార్డులు అందుకున్న వారితో విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం, విశ్వగురు సీఈఓ సత్యవోలు రాంబాబు, ఇతర ప్రముఖులు..

సనత్‌నగర్: ప్రముఖ సాంస్కృతిక, సామాజిక చైతన్య సంస్థ 'విశ్వగురు వరల్డ్ రికార్డ్స్'ఆధ్వర్యంలో 'స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డ్స్'ప్రదానోత్సవం ఆదివారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో ఘనంగా జరిగింది. విభిన్న రంగాల్లో సేవలందిస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన 30 మంది ప్రముఖులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సీఈఓ డాక్టర్ సత్యవోలు రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపునకు నోచుకోకుండా ఉన్నవారిని గుర్తించి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సత్యవోలు రాంబాబు 'విశ్వగురు'సంస్థను స్థాపించి అవార్డులను ప్రదానం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఇలాంటి సంస్థలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సాలార్‌జంగ్ మ్యూజియం మాజీ డైరెక్టర్ నాగేంద్రరెడ్డి, తెలంగాణ పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్స్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ డీఎస్ రవితేజ, రైల్వే పోలీసు డీఎస్పీ శ్రీనివాస్, డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, కృష్ణాది శేషు, విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ డైరెక్టర్ సత్యవోలు పూజిత తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న వారు వీరే..

అపోలో ఆస్పత్రులకు చెందిన ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వీవీఏ రంగారెడ్డి, రాజన్న సిరిసిల్లా జిల్లా ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సురేంద్రబాబు, నందకిశోర్, రాజశేఖర్‌రెడ్డి, కిషోర్ కుమార్, రంగయ్య, సామాజిక సేవా విభాగంలో చిత్తూరు జిల్లాకు చెందిన విజయలక్ష్మి, వపర్ లిఫ్టర్ ప్రదీప్‌కుమార్, విద్యారంగం నుంచి రవి చుక్కా, జానపద గాయకుడు (బలగం సినిమా) నక్కా శ్రీకాంత్‌తోపాటు ఆయా రంగాల ప్రముఖులు యుద్ధనపూడి హేమలత, దుర్గాభవానీ, శ్రీనివాసరావు, జక్కా శ్రీకృష్ణ, రామమూర్తి, ఖాదర్‌బాబు, శివకుమార్, గంజి శ్రీకాంత్, బ్రహ్మశ్రీ నిశాంత్‌శర్మ, మూర్తి, లక్ష్మి సుశీల, చలసాని లోహిత, ఆరుట్ల పారిజాత, కోటా చంద్రశేఖర్, తల్లం బ్రహ్మయ్య, మాడుగుల సురేష్, విజయ్‌కుమార్, రవికాంత్ ఉన్నారు.

ఒకప్పుడు ఓ మామూలు కారు కొంటే, ఉంటే గొప్ప.. ఇప్పుడు ఖరీదైన కారు కొంటే.. అది అందరికన్నా భిన్నంగా ఉంటేనే గొప్ప.. రూ.లక్షలు, కోట్లు పెట్టి కారు కొనడం మాత్రమే కాదు దానిని మరింత స్టైల్‌గా చూపించాలనే తాపత్రయంతో కొందరు రకరకాలుగా అలంకరణలు చేస్తున్నారు. బైకర్స్ సైతం అంతే.. ఖరీదైన బైక్స్ కొనడంతో పాటు 'మోడిఫైడ్' మోజులో పోలీసు కేసుల బారిన పడుతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో







స్టైల్స్.. స్మైల్స్..

టాలీవుడ్ బ్యూటీ, బిగ్‌బాస్ ఫేం తేజస్విని మదివాడ ఫ్యాషన్ స్టోర్‌లో సందడి చేశారు. కూకట్‌పల్లిలోని నెక్సస్ మాల్లో ఏర్పాటైన మహిళల వెస్ట్రన్ దుస్తులకు పేరొందిన ప్రముఖ బ్రాండ్ లాటిన్ క్వార్టర్స్ నూతన స్టోర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నవ్వులు చిందిస్తూ మాల్లో సందర్శకులకు సెల్ఫీలు ఇస్తూ హుషారు నింపారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్, పేజ్ త్రీ సోషలైట్స్ పాల్గొన్నారు.

- సాక్షి, సిటీబ్యూరో



మార్చి.. ఏమార్చి..

ఇష్టారీతిన ఎడా పెడా మార్పు చేర్పులు

ఆర్టీయే నిబంధనలు పాటించని నగరవాసులు | రంగు మార్చిన బెంజ్ కారు ఓనర్‌పై ఇటీవల చర్యలు | చట్టం, నిబంధనలకు లోబడే మార్పులుండాలి : పోలీసులు

గత నెల 11న మితిమీరిన వేగంతో కారు నడుపుతున్నందుకు ఓ మెర్సిడీస్ బెంజ్ కారుపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆ కారు యజమాని అంతటితో సరిపుచ్చలేదు. ఒరిజినల్ రంగు అయిన పోలార్ వైట్ కలర్ నుంచి మెర్సిడీస్‌ను మల్టీకలర్ వాహనంగా మార్చినందుకు మరో కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ కారు యజమానితో పాటు మోడిఫికేషన్ చేసిన సదరు వర్క్‌షాపుపై కూడా మోటారు వాహన చట్టం సెక్షన్ 182–ఎ(1) కింద అభియోగాలు నమోదయ్యాయి. ఇక బైకర్స్ పైన ఇలాంటి కేసులకు కొదవే లేదు.



తప్పు మాత్రమే కాదు ముప్పు కూడా..

'అనేక మంది వాహనదారులు చట్టాన్ని పాటించడం లేదు. ఇష్టానుసారం వాహనాల ఫీచర్లను మార్చుకుంటున్నారు. అలాంటి మార్పు చేర్పులు తప్పు మాత్రమే కాదు, ముప్పు కూడా' అని నేషనల్ రోడ్ సేఫ్టీ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ కమల్ అంటున్నారు. వాహన తయారీదారులు నిర్దిష్ట మోడల్‌ను ఉత్పత్తి చేయడానికి అధికారుల నుంచి చట్టపరమైన అనుమతులు తీసుకుంటారు. అలా తయారైన మోడల్‌ను ట్యాంపరింగ్ చేయడం వల్ల వాహనం దాని ఒరిజినల్ కొలతలు, ఏరోడైనమిక్‌లను కోల్పోవచ్చు. తద్వారా అది నడిపేవారితో పాటు ఇతరులకూ ప్రమాదకరంగా మారవచ్చు' అని నిపుణులు అంటున్నారు. 'వాహనం రంగు మార్చడానికి చట్టపరమైన అనుమతి పొంది, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌లో కొత్త రంగు ప్రతిబింబించాలి. బైకర్స్ తమ సైలెన్సర్‌లు, టెయిల్ ల్యాంపులను మారుస్తారు, ఈ మార్పులు ఇతరులకు అసౌకర్యాన్ని కలిగిస్తాయి' అని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ రోడ్ సేఫ్టీ ముఖ్య కార్యకర్త వినోద్ చెబుతున్నారు.

- ఏదైనా వాహనం ఇంటీరియర్స్ లేదా ఎక్స్‌టీరియర్స్ సవరించడం చట్టవిరుద్ధం.

తస్మాత్ జాగ్రత్త..

- వాహన మార్పుల వల్ల వాహనానికి ఏదైనా నష్టం జరిగితే తయారీదారు వారంటీ చెల్లదు.
- కార్ల యజమానులు తరచూ చేసే మార్పుల్లో లేతరంగు విండోస్ ఒకటి. దీని వల్ల విండోస్ 25% కంటే తక్కువ లైట్ ట్రాన్స్‌మిషన్ స్థాయిని కలిగి ఉండటం వల్ల ఇతర వాహనాలను గమనించే సామర్థ్యాన్ని అడ్డుకుంటుంది.
- మార్పుల వల్ల కొన్ని వాహనాల పనితీరు మందగిస్తుంది.
- కొందరు యజమానులు తమ వాహనాన్ని వీలైనంత మేర మోడిఫై చేస్తుంటారు. దీనివల్ల భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది.
- సస్పెన్షన్ అప్‌గ్రేడ్‌లు, టర్బోచార్జ్ జోడించడం, స్పోర్ట్స్ సీట్లను ఇన్‌స్టాల్ చేయడం వంటి మార్పులు చేస్తుంటారు. ఇవి వాహన పనితీరును దెబ్బతీస్తాయి.


మనం కొన్న కారే కానీ..

ఎంత చెట్టుకు అంత గాలి అన్నట్టే ఎంత డబ్బు ఉంటే అంత కారు కొనుక్కోవచ్చు తప్పులేదు. కానీ.. ఎంత ఖర్చు పెట్టి కొన్న కారైనా, బైక్ అయినా మన ఇష్టం వచ్చినట్టు మార్పులు, చేర్పులు చేసుకుంటామంటే చట్టం ఒప్పుకోదు. వాహనం రంగు కావచ్చు, రూపంలో కావచ్చు.. ఏవైనా మార్పు చేర్పులను చేయాలంటే ప్రాంతీయ రవాణా కార్యాలయం వాటిని ఆమోదించాలి. సరైన విధంగా డాక్యుమెంట్ చేయాలని అధికారులు చెబుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసుల బారిన పడక తప్పదని హెచ్చరిస్తున్నారు.

చట్టం ఏం చెబుతోంది..?

వాహనంలో అనధికారిక మార్పులు చేసినట్లు తేలితే.. ఒక సంవత్సరం వరకూ జైలు శిక్షతో పాటు రూ.లక్ష వరకూ జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. ఆర్‌టీఏ నుంచి అనుమతి లేకుండా మార్పులు చేసిన వాహనాలను సీజ్ చేసే అధికారం ఉందని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేస్తున్నారు. వాహనాల రూపాన్ని, పనితీరును మెరుగుపరచడానికి కొన్నింటికి మాత్రమే అనుమతులు ఉంటాయి. దాని లోబడి అలాంటి మార్పులు చేసుకోవచ్చు. కార్లు లేదా మోటార్ సైకిళ్లకు అదనపు పరికరాలను అమర్చడం లేదా ధ్వనులను మార్పు చేయడం వంటివి మోటారు ట్రాఫిక్ చట్టాల ఉల్లంఘన కిందకే వస్తుందని అధికారులు చెబుతున్నారు.





ఎలాంటి మార్పులూ చేయకూడదు..



ఓ వాహనాన్ని తయారీదారుడు మార్కెట్‌లోకి పంపేముందు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకుంటాడు. భద్రతతో పాటు ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆ వాహనం బరువు, రూపం, తదితరాలను ఖరారు చేస్తారు. అలా వచ్చిన వాహనానికి ఎలాంటి మార్పులూ చేయకూడదు. దీంతో పాటు నెంబర్ ప్లేట్స్, సైలెన్సర్స్ మార్చడం వంటివి చేయకూడదు. విండ్ షీల్డ్స్, విండో గ్లాసులకు బ్లాక్ ఫిల్మ్స్ తగిలించకూడదు. వీటిలో ఎటువంటి ఉల్లంఘనకు పాల్పడినా మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు ఉంటాయి. తీవ్రతను బట్టి జరిమానా, కేసు, ఛార్జిషీట్ వంటి చర్యలు ఉంటాయి.

- జి.శంకర్‌రాజు, ఏసీపీ, నార్త్ జోన్ ట్రాఫిక్ విభాగం

మిస్టర్ అండ్ మిస్ హెచ్‌సీయూగా

సుమిత్ర, అమృత్ కుమార్

ఘనంగా 'వైఐఎస్‌ఎస్ యూత్ ఫెస్టివల్–2025

'సే నో టు డ్రగ్స్' ప్రధాన థీమ్‌తో ఆకట్టుకున్న ప్రదర్శనలు





రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో యూత్ ఫెస్టివల్–2025 ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పోటీ పడ్డారు. 'సే నో టు డ్రగ్స్' అనే నినాదంతో నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్‌సీయూ క్యాంపస్‌లో యూత్ ఫర్ ఇన్‌క్లూజివ్ అండ్ సస్టైయినబుల్ సొసైటీ(వైఐఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోటీల్లో ప్రధాన ఆకర్షణగా మిస్టర్ అండ్ మిస్–హెచ్‌సీయూ–2025 నిలిచింది. ఇందులో మిస్–హెచ్‌సీయూ–2025గా ఎం సుమిత్ర (ఎంఏ ఫిలాసఫీ), మిస్టర్–హెచ్‌సీయూ–2025గా అమృత్‌కుమార్ (ఎంఏ మ్యూజిక్) ఎంపికయ్యారు. వీరికి నిర్వాహకులతోపాటు ప్రముఖ వక్త బాలలత అవార్డులను అందించారు. వివిధ ప్రాంతాల భాషలకు చెందిన గీతాలాపనలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత కిన్నెర మొగులయ్య ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మాదకద్రవ్యాలను వినియోగించకుండా అందరూ సామాజిక స్పృహను పెంపొందించేందుకు కృషి చేయాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ డిప్యూటీ చీఫ్ వార్డెన్ ముతమిలారసన్, అఖిల భారత ఓబీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు జి కిరణ్‌కుమార్, శివయాదవ్, లక్కీ, మేఘనా పాల్గొన్నారు.





ఉత్సాహంగా రన్–2025

మూడు వేల మంది రన్నర్లు హాజరు

విజేతలకు మెడల్స్ అందజేసిన అతిథులు

రాయదుర్గం : ఆహ్లాదకర వాతావరణంలో హైదరాబాద్ రన్నర్స్ క్లబ్ రన్–2025 ఉత్సాహంగా సాగింది. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో హైదరాబాద్ రన్నర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించారు. మాదాపూర్ డీసీపీ డాక్టర్ జి వినీత్, శ్రీరామ్‌లైఫ్ సీఓఓ అతుల్‌శర్మ, అన్విత గ్రూప్ డైరెక్టర్ విజయ్ రాజు హైదరాబాద్ రన్నర్స్ క్లబ్ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. నగరంలోని దాదాపు అన్ని వయసుల వారు కలిపి దాదాపు మూడువేల మంది రన్నర్లు ఇందులో పాల్గొనడం విశేషం. విజేతలకు అతిథులతో పాటు టెన్నిస్ క్రీడాకారిణి రిషితారెడ్డి బసిరెడ్డి మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ రన్నర్స్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామ్ కటికినేని, హైదరాబాద్ రన్నర్స్ కార్యదర్శి అరుణ్ కుమార్ కాలియప్పన్, కోశాధికారి రఘు పీతాంబరన్, క్లబ్ రన్–2025 రేస్ డైరెక్టర్ అజిత్ మిశ్రా, ఇతర సభ్యులు, హెచ్‌సీయూ విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



విజేతలు వీరే..

హాఫ్ మారథాన్ – (21.1 కిలోమీటర్లు)
విజేత పురుషుల విభాగం
అవిక్‌పాల్ – 1.18 నిమిషాల 57 సెకన్లు
విజేత స్త్రీల విభాగం
నెలిస్వే మాగోంగో – 1.38 నిమిషాల 39 సెకన్లు

10 కిలోమీటర్ల రేసు విజేతలు..
విజేత పురుషుల విభాగం
చౌదరి బాల్మీకి – 38 నిమిషాల 5 సెకన్లు
విజేత స్త్రీల విభాగం
కిటు షియోరాన్ 49 నిమిషాల 32 సెకన్లు

కేబీఆర్ పార్కులో బర్డ్ వాక్

బంజారాహిల్స్: జీవ వైవిధ్యంలో పక్షుల పాత్ర కీలకమని, వాటిని కాపాడడం, వాటికి అనువైన ఆవాసాల కల్పన ప్రతి ఒక్కరి బాధ్యత అని హైదరాబాద్ బర్డ్ అట్లాస్ (హెచ్‌బీఏ) సంస్థ ప్రతినిధి వికాస్ పవార్ అన్నారు. హెచ్‌బీఏ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకూ హెచ్‌బీఏ బర్డ్ వాచర్స్ క్లబ్ ప్రతినిధులు, ఔత్సాహిక పక్షి ప్రేమికులు బర్డ్ వాకింగ్ నిర్వహించారు. ఈ నెల 3 నుంచి 23 వరకు నగరంలోని గుర్తించిన 180 ప్రాంతాల్లో బర్డ్ వాచర్స్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ డ్రైవ్‌లో పాల్గొనే వారు ఆయా ప్రాంతాల్లో కనిపించే పక్షులను రికార్డు చేస్తారని తెలిపారు. కేబీఆర్ పార్కులో 30కి పైగా పక్షి జాతులను గుర్తించామని, రెండు రకాల సన్ బర్డ్స్, బుల్‌బుల్స్, పారాకీట్స్ కనిపించాయని తెలిపారు. పక్షుల పరిరక్షణకు ఓ డాక్యుమెంటరీని రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.



పర్యావరణ పరిరక్షణకు.. 'నేను సైతం'

- స్కూల్ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ చిత్రలేఖన పోటీలు
- మార్చి 15 దరఖాస్తుకు చివరి తేదీ
- మార్చి 22న విజేతలకు బహుమతుల ప్రదానం
- ఏప్రిల్ 22న చిల్డ్రన్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్

కాచిగూడ: మనిషి జీవితం సాఫీగా సాగాలంటే ప్రకృతి కూడా అంతే సాఫీగా ఉండాలి. అందులో ఏ కాస్త పొరపాటు జరిగినా, ప్రకృతి సమతుల్యత దెబ్బతిన్నా మానవ జీవనం అస్తవ్యస్తమవుతుంది. ఈ విషయం తెలిసిన మనిషి మాత్రం ప్రకృతిని, పర్యావరణాన్ని తన అవసరార్థం దెబ్బతీస్తూనే ఉన్నాడు. రోజురోజుకూ పెరుగుతున్న వాయుకాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం ఇందుకు నిదర్శనమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణకు.. 'నేను సైతం' అంటూ ప్రముఖ పర్యావరణ పరిరక్షణ సంస్థ (ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) ముందుకు వచ్చింది.

అంతర్జాతీయ చిత్రలేఖన పోటీలు..

పర్యావరణ పరిరక్షణ పట్ల పిల్లల్లో అవగాహన కల్పించేందుకు, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల్లో బాధ్యతను పెంచేందుకు అంతర్జాతీయ స్థాయిలో పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తోంది. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఇంటా చర్చ జరగాలనే ఉద్దేశంతో ఈ చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు నారాయణగూడలోని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్పీహెచ్ రంగయ్య తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై మార్చి 15 లోగా చిత్రాలను గీసి ఆన్‌లైన్‌ద్వారా పంపించాలని సూచించారు.



రెండు విభాగాల్లో పోటీలు..

మార్చి 3న ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం, మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. రెండు విభాగాల్లో పోటీలు జరుగుతాయి. 13 ఏళ్ల లోపు విద్యార్థులు జూనియర్, 17 ఏళ్ల లోపు విద్యార్థులు సీనియర్ విభాగంలో బొమ్మలు వేయాల్సి ఉంటుంది. పెయింటింగ్ పంపిన 24 గంటల్లో విద్యార్థి గీసిన చిత్రం, తన పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో కూడిన 'పార్టిసిపేషన్ సర్టిఫికెట్' పంపనున్నారు. ఏప్రిల్ 22న ఆయా పెయింటింగ్స్‌తో ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. బహుమతులతో పాటు 'పర్యావరణ బాల వీర సైనిక అవార్డు' ప్రత్యేక సర్టిఫికెట్‌ను అందజేయనున్నారు. వివరాలకు 8333949623లోగానీ, వెబ్‌సైట్: art.epdcindia.com లో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా...

కులగణనపై తీర్మానించి పార్లమెంట్‌కు పంపుతాం

- సంజయ్, కిషన్‌రెడ్డి ఆమోదింపజేసి చట్టం చేయించాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ: బీసీ కులగణనను మళ్లీ చేయించి.. అసెంబ్లీలో తీర్మానించాక పార్లమెంట్‌కు పంపుతామని, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి పార్లమెంట్‌లో చట్టం చేయించాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ఆయన ఆదివారం నల్లగొండలోని క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీసీలపై బీజేపీ కపట ప్రేమ ప్రదర్శిస్తోందని ఆరోపించారు. బీసీని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పిన బీజేపీ.. కిషన్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని చేసిందన్నారు. నాడు దివంగత సీఎం వైఎస్సార్ హైదరాబాద్ చుట్టూ నిర్మించిన అవుటర్ రింగ్‌రోడ్డు, రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టు, పీవీ ఫ్లైఓవర్ నిర్మాణాల కారణంగా బహుళ జాతి సంస్థలు హైదరాబాద్‌కు వచ్చాయని గుర్తు చేశారు. రీజనల్ రింగ్ రోడ్డు కూడా నిర్మితమైతే.. హైదరాబాద్ మరింత అభివృద్ధి అవుతుందని మంత్రి అభిప్రాయ పడ్డారు. మిగిలిన టెండర్లకు త్వరలో డీపీఆర్‌లు సిద్ధమవుతున్నాయని చెప్పారు. నల్లగొండ జిల్లాలో సాగు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఎస్ఎల్‌బీసీ టెండర్‌ను రెండేళ్లలో పూర్తి చేయిస్తామని, టన్నెల్ పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. అమెరికా నుంచి రాబిన్స్ బోరింగ్ కంపెనీ నుంచి మరో బేరింగ్ మెషీన్ మద్రాస్ పోర్టుకు వచ్చిందని వెల్లడించారు. దానిని కూడా పీఏపల్లి నుంచి బిగించి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

భర్త కులమే భార్యకు వర్తిస్తుంది

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: హిందూ సంప్రదాయంలో భర్త కులమే భార్యకు వర్తిస్తుందన్న విషయం బీజేపీ నేతలు గ్రహించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హితవు పలికారు. మోదీ పుట్టుకతో బీసీ కాదని సీఎం రేవంత్ అన్నందుకు.. సోనియాగాంధీ మతం, రాహుల్‌గాంధీ కులం గురించి బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. త్యాగాల చరిత్ర కలిగిన సోనియా కుటుంబం గురించి మాట్లాడే అర్హత.. పదవుల కోసం పాకులాడే రాష్ట్ర బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు లేదని మండిపడ్డారు. ఆయన ఆదివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. బండి సంజయ్.. గాంధీ కుటుంబ చరిత్ర గురించి తెలుసుకోవాలని హితవు పలికారు. తాను రెడ్డి కులస్తుడినని, భార్య గౌడ్ అని, తనను వివాహం చేసుకున్న తర్వాత ఆమెను కూడా రెడ్డి అనే పిలుస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ బ్రాహ్మణుడు అని, మహాత్మా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీలు జంధ్యం వేసుకునే వారని, రాహుల్ కూడా పెళ్లి చేసు కుంటే జంధ్యం వేసుకుంటారని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

మహిళా సంక్షేమం గాలికి..


సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో శ్రామిక వర్గాలు, రైతు, వ్యవసాయ కూలీలకు, మధ్య తరగతి ప్రజలకు శఠగోపం పెట్టిందని, మహిళా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్‌లో 'కేంద్ర బడ్జెట్–వివిధ రంగాలపై ప్ర భావం' అనే అంశంపై నిర్వహించిన సెమినా ర్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈనెల 18, 19 తేదీల్లో గల్లీ నుంచి ఢిల్లీ వరకు నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నామని తెలిపారు. రైతాంగానికి బడ్జెట్‌లో ఉపశమనం కల్పించలేదన్నారు. బీజేపీకి 8 మంది ఎంపీలను గెలిపించినా రాష్ట్రానికి మొండిచేయి చూపా రని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

మూడు నెలల్లో చాలా చేశాం

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు కమిషన్‌కు పూర్తి స్థాయిలో స భ్యుల నియామకం జరి గి మూడు నెలలే అయి నా.. చాలా చేశామని, ఇంకా చాలా చేయాల్సి ఉందని కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి తెలి పారు. కేవలం మూడు నెలల్లో ప్రభుత్వానికి అనేక అంశాల్లో సలహాలిచ్చా మని పేర్కొ న్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి సమా చారం సేకరించామని, నివేదికలు సమర్పించామని ఆది వారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సాగునీ రు, విత్తనాలు, భూమి హక్కులు, పంట రుణాలు, రైతు ఆత్మహత్యలపై మేధోమథనం చేసి ప్రభుత్వానికి సలహాలు ఇచ్చామని పేర్కొన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు, పత్తి రైతుల మార్కెట్ సమస్య, రైతులకు పరిహారం లాంటివి కమిషన్ కృషితోనే పరిష్కారమయ్యాయని ఆయన స్పష్టం చేశారు.

అటు ఆందోళన.. ఇటు నిరాశ!

మానసిక సమస్యలతో కార్పొరేట్ ఉద్యోగులు సతమతం

- 2023తో పోలిస్తే 2024లో ఆత్మహత్యల ప్రమాదం 22 శాతం పెరుగుదల
- ఎమోషనల్ వెల్‌బీయింగ్-2024 నివేదికలో వెల్లడి

70 శాతం మందికి ఆర్థిక ఇబ్బందులే ప్రధాన కారణం



సాక్షి, అమరావతి : దేశంలో కార్పొరేట్ రంగంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల్లో మానసిక సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 2023తో పోలిస్తే 2024లో 15 శాతం మేర మానసిక సమస్యలు పెరిగాయి. ఈ విషయం స్టేట్ ఆఫ్ ఎమోషనల్ వెల్‌బీయింగ్–2024 నివేదికలో వెల్లడైంది. 2024 జనవరి నుంచి నవంబర్ మధ్య ఉద్యోగులకు నిర్వహించిన 83 వేల కౌన్సెలింగ్ సెషన్స్, 12 వేల ఎలక్టివ్ స్క్రీనింగ్, 42 వేల అసెస్‌మెంట్ డేటాబేస్ ఆధారంగా పని ప్రదేశాల్లో మానసిక ఆరోగ్య సవాళ్లపై చేపట్టిన అధ్యయనం ఆధారంగా నివేదికను విడుదల చేశారు. కార్పొరేట్ రంగంలో పనిచేస్తున్న 25 ఏళ్లలోపు ఉద్యోగుల్లో 90 శాతం మంది ఆందోళన, 92 శాతం మంది నిరాశ సమస్యలతో సతమతమవుతున్నారు. 45 ఏళ్లు పైబడిన వారిలో నిరాశ 69 శాతం, ఆందోళన 67 శాతం మేర ఉంటోంది.

2023తో పోలిస్తే గతేడాది పురుష ఉద్యోగుల మానసిక సమస్యల్లో 7 శాతం మేర వృద్ధి నమోదైంది. గతేడాది కౌన్సెలింగ్ తీసుకున్న వారిలో 52 శాతం మహిళలు, 47 శాతం పురుష ఉద్యోగులున్నారు. కాగా, కౌన్సెలింగ్ పొందిన వారిలో 70 శాతం మందికి మానసిక సమస్యలకు ప్రధాన కారణంగా ఆర్థిక ఇబ్బందులే. అదే మహిళల్లో 60 శాతం మందిలో రిలేషన్‌షిప్ సంబంధిత సమస్యలున్నట్టు వెల్లడైంది. ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యల కారణంగా ఉద్యోగుల్లో ఆత్మహత్యల ఆలోచనలు పెరుగుతున్నట్టు గుర్తించారు. 2023తో పోలిస్తే 2024లో ఆత్మహత్యల ప్రమాదం 22 శాతం పెరిగింది.

వయస్సుల వారీగా ఆందోళన, నిరాశ సమస్యలు ఇలా (శాతంలో)

వయస్సు	ఆందోళన	నిరాశ
25 ఏళ్ల లోపు	90	92
25-30	89	91
31-35	85	86
36-45	79	80
45+	67	69

ఒక తప్పు చేయాలంటే.. మూడు చేద్దామంటున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

'లైఫ్ ఆఫ్ కర్మయోగి' పుస్తకాన్ని సీఎం రేవంత్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుత సివిల్ సర్వెంట్ల ధోరణి బాగోలేదంటూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ ప్రసంగం ఆయన మాటల్లోనే...

''ప్రజాప్రతినిధులు తమ వద్దకు వచ్చిన వాళ్లను సంతోషపెట్టాలనో, తమ సంతోషం కోసమో కొన్ని ఆదేశాలిస్తుంటారు. వాటిని విశ్లేషించాల్సిన బాధ్యత అధికారులదే. సీఎం, మంత్రులకు కేటాయించే బాధ్యతలకు వారి చదువులు, నేపథ్యంతో సంబంధం ఉండదు. ఇంజనీరింగ్ నేపథ్యం ఉన్నవారికి వైద్యారోగ్య శాఖ, ఏమీ చదువుకోని వారికి విద్యాశాఖ, బాగా చదువుకున్న వారికి కార్మిక శాఖ ఇవ్వొచ్చు. అందుకే మాకు అవగాహన, నిర్ణయాలు తీసుకోవడంలో తోడ్పాటు కోసం అధికారులను ఇస్తారు. ఆ అధికారులు ఏ ఫైల్ వచ్చినా నోట్ ఫైల్ తయారు చేసి, మాకు వివరించాలి. కానీ ఇవ్వాళ, రేపు అదేమీ ఉండటం లేదు.

శిక్షణలోనే సివిల్ పంచాయితీలు..

ఎందరో అధికారులు ఎన్నో త్యాగాలు చేసి దేశానికి సేవచేశారు కాబట్టే మన దేశం ఇంతగా బలపడింది. నేడు వస్తున్న కొత్త తరం ఐఏఎస్, ఐపీఎస్‌లు రాజకీయ నాయకులనే కాదు, సమాజంలో ఉన్న చెడులన్నింటినీ కూడా ఆదర్శంగా తీసుకుంటున్నారు. కొత్త ఐఏఎస్, ఐపీఎస్‌లు శిక్షణలో ఉన్నప్పుడే పోలీసుస్టేషన్లకు వెళ్లి డ్రెస్ వేసుకుని కూర్చుని, సివిల్ పంచాయతీలు తెంచడానికి ప్రయత్నిస్తుండటం దురదృష్టకరం. కొందరిలోనైనా మార్పు రావాలనే ఈ వేదిక మీద పంచుకుంటున్నాను.

ఏసీ అనే జబ్బు ఏమో..

ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల క్షేత్రస్థాయి పర్యటనలను వారి సర్వీస్ బుక్స్‌లో రికార్డు చేయాలని సీఎస్‌ను పదేపదే కోరుతున్నాను. అసలిప్పుడు అధికారులు ఏసీ రూమ్‌ల నుంచి బయటికి వెళ్లడానికే వెనకాడుతున్నారు. నాకు తెలియదు.. అది ఏసీ అనే జబ్బు ఏమో. ఐఏఎస్, ఐపీఎస్ ఒక జిల్లాకు నేతృత్వం వహించినప్పుడు ప్రజల దగ్గరికి వెళితే వచ్చే అనుభవమే గొప్పది. ఆ తర్వాత ఒకరి తర్వాత ఒకరు పంపించే ఫైళ్లు చూడటమే ఉంటుంది.

అధికారుల తీరుతో సంతోషంగా లేను

నేను జెడ్పీటీసీగా ఉన్నప్పుడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఒక మూల నుంచి మరో మూలకు అంబాసిడర్ కారులో చేరాలంటే ఏడెనిమిది గంటలు పట్టేది. ఆ రోజుల్లో ఐఏఎస్‌లు, ఐపీఎస్ అధికారులు అచ్చంపేట అడవుల్లోకి వెళ్లి ఆదివాసీల సమస్యలు తెలుసుకుని, తిరిగి వచ్చేందుకు రోజులు పట్టేది. అప్పట్లో నేతల కంటే అధికారులే ప్రజలతో మమేకమయ్యేవారు. కలెక్టర్ వద్దకు వెళ్తే తమ సమస్య పరిష్కారం అవుతుందన్న గొప్ప నమ్మకం ప్రజల్లో ఉండేది. శిక్షణ ఐపీఎస్‌లకు కానిస్టేబుల్ డ్యూటీలు వేసి నైట్ పెట్రోలింగ్ వంటి క్షేత్రస్థాయి విధుల్లో ఉండే సాధకబాధకాలపై అవగాహన కల్పించేవారు. ఇప్పుడు వ్యవస్థ ఎక్కడికి పోతోందో నాకు తెలియదుగానీ.. జరుగుతున్న పరిణామాలు, అధికారుల వ్యవహార శైలితో నేను సంతోషంగా లేను. నేను అందరి గురించి మాట్లాడటం లేదు.

నిబద్ధత గల అధికారులకు గుర్తింపు ఉంటుంది

అధికారుల ఆలోచనలో మార్పు రావాలి. నిబద్ధత గల అధికారికి తప్పకుండా గుర్తింపు ఉంటుంది. వచ్చీ రాగానే పోస్టింగ్ రాకపోవచ్చు. రాష్ట్రానికి, ప్రజలకు ఏమైనా చేయాలనుకున్నప్పుడు నిబద్ధత గల అధికారి ఎక్కడ ఉన్నాడో వెతికి మరీ పోస్టింగ్ ఇస్తాం. మా పనితీరు బాగుండాలంటే అధికారుల పనితీరు బాగుండాలి. మేం విధాన నిర్ణయాలు చేయగలం. అమలు చేయాల్సింది అధికారులే. సీనియర్, రిటైర్డ్ ఐఏఎస్‌లతో సమావేశాలు నిర్వహించి వారి అనుభవాలను ఇప్పటి అధికారులకు తెలియజేయానికి ఏర్పాట్లు చేయాలి. ప్రజలకు ఉపయోగపడే, పేదోడికి సహాయపడాలనే ఆలోచన చేయాలి. ఏ విధంగా అడ్డు వేయాలి, ఏవిధంగా ఇబ్బంది పెట్టాలి, ఏ విధంగా నెగిటివ్ కామెంట్స్ రాయాలనే ఆలోచన తగ్గించుకుని సానుకూల దృక్పథం చూపితే చాలా కాలం గుర్తుండిపోతారు.

ఈ పుస్తకం నుంచి ఎంతో నేర్చుకోవచ్చు

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణనాయుడు తన జీవిత కాల అనుభవాలన్నీ నిక్షిప్తం చేసి తీసుకొచ్చిన ఈ పుస్తకం దేశానికి సేవలు అందించబోయే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, రాజకీయ నాయకులకు బైబిల్, ఖురాన్, భగవద్గీత వంటిది. ఆరు దశాబ్దాల తన అనుభవాలను ఒక పుస్తకంలో నిక్షిప్తం చేయడం క్లిష్టమైన పని. ఇందులో గోపాలకృష్ణ విజయవంతం అయ్యారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ నుంచి ప్రస్తుత ప్రధాని మోదీ వరకు అందరితో తనకున్న అనుభవాలను ఆయన పుస్తకరించారు. కొత్తగా సర్వీస్‌లో చేరే అధికారులు ఇలాంటి అనుభవాలను చదవడం ద్వారా ఎంతో నేర్చుకోవచ్చు.

వారి బాటలో నడవాలి..

మాజీ ఐఏఎస్ శంకరన్ అణగారిన వర్గాల పట్ల నిబద్ధతతో పనిచేసి గొప్ప పేరు సాధించారు. మరో మాజీ ఐఏఎస్ టీఎన్ శేషన్ దేశంలో ఎన్నికల సంఘం ఒకటి ఉందని అందరికీ తెలియజేసిన గొప్ప అధికారి. ఆర్బీఐ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా మన్మోహన్ సింగ్ తీసుకున్న నిర్ణయాలే నేడు దేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోవడానికి బాటలు వేసింది. వారి అనుభవాల నుంచి నేటి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నేర్చుకోవాలి..'' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

పదేళ్లలో బాగుపడ్డది కేసీఆర్ కుటుంబమే

- ఎంతో ఆశపడిన ప్రజలకు భంగపాటే మిగిలింది
- రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి ఫామ్‌హౌస్‌లో కూర్చున్నాడు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్ గౌడ్

నాంపల్లి/ మహేశ్వరం: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబమే బంగారుమయం అయ్యిందని, ప్రజలకు భంగపాటే మిగిలిందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రజలు కోరుకున్న దిశగా పాలన సాగలేదని అన్నారు. ఆది వారం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో జరిగిన రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ బంగారు తెలంగాణ చేస్తామని గొప్పలు చెప్పి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభు త్వం తెచ్చిన ధరణితో నిరుపేదలు బాధలు పడ్డారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణిని రద్దుచేసి భూ భారతిని అం దుబాటులోకి తెచ్చా మని తెలిపారు. 'కేసీఆర్ ఉద్యమ నాయకుడే. నేను కూడా ఆయనను అభిమానిస్తా.. కానీ, అధికారంలోకి రా గానే ఉద్యోగులను, నిరుద్యోగులను, రైతులను, సామా న్యులను నట్టేట ముంచేశారు. కమీషన్ల కోసమే రూ.1.20 లక్షల కోట్లతో పనికిరాని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు' అని విమర్శించారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని మహేశ్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. ఉద్యోగుల కోసం గాంధీభవన్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, ఎలాంటి సమస్య వచ్చినా విన్నవించుకోవచ్చని సూచించారు.

రాహుల్‌గాంధీ ప్రధాని కావటం ఖాయం

దేశ భవిష్యత్తు రాహుల్‌గాంధీయేనని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. రాహుల్ ప్రధాని కావడం ఖాయమని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం గట్టుపల్లి గ్రామ శివారులోని కోరుపోలు చంద్రారెడ్డి రిసార్ట్స్‌లో శనివారం యూత్ కాంగ్రెస్ నాయకులకు 'యువ క్రాంతి బునియాది' పేరిట నిర్వహించిన శిక్షణ తరగతులను మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓపిక, నిబద్ధత, క్రమశిక్షణ గల కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో పదవులు వరిస్తాయని, దానికి ఉదాహరణ తానేనని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కార్పొరేషన్ చైర్మన్ శివసేనారెడ్డి, యూత్ కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి సురభి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ హిందువే కాదు

- ఆయన తండ్రి ఫిరోజ్ జహంగీర్‌ఖాన్ ఒక పార్శీ
- రాజీవ్‌గాంధీ భార్య సోనియా ఇటలీ క్రైస్తవురాలు
- మరి రాహుల్‌గాంధీ హిందువు ఎట్ల అవుతారు?
- కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్న



కరీంనగర్ టౌన్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హిందువే కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో స్వదేశీ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వదేశీ మేళా' ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తండ్రి కులమే కొడుకుకు వర్తిస్తుందని, రాజీవ్‌గాంధీ హిందువు అయినందున ఆయన కుమారుడు రాహుల్‌గాంధీ కూడా హిందువేనని కాంగ్రెస్ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాజీవ్‌గాంధీ హిందువు ఎలా అవుతారని ప్రశ్నించారు. రాజీవ్‌గాంధీ తండ్రి ఫిరోజ్ జహంగీర్ ఖాన్ పార్శీ మతస్తుడని, పర్షియాలోని ముస్లిం సంతతికి చెందిన వాళ్ల పూర్వీకులు ఇండియాకు వచ్చి పార్శీలుగా మారారని తెలిపారు. ఫిరోజ్ జహంగీర్ ఖాన్ మతమే రాజీవ్‌గాంధీకి వర్తిస్తుంది కాబట్టి రాజీవ్ అసలు హిందువు కానేకాదని స్పష్టంచేశారు. రాహుల్‌గాంధీ కుటుంబానికి కులం, మతం, జాతి, దేశం లేదని.. ప్రధాని మోదీ మాత్రం పక్కా ఇండియన్ అని పేర్కొన్నారు. బీసీ కుల గణన పేరుతో హిందువులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని బండి విమర్శించారు.


టెక్ ఇన్నోవేషన్ సదస్సుకు కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: బెంగళూరులో నిర్వహించనున్న టెక్ ఇన్నోవేషన్ సమిట్–2025కు ముఖ్య అతిథిగా హాజరు కావాలని నిర్వాహకులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆహ్వానించారు. ఫిబ్రవరి 27, 28 తేదీల్లో ఎంట్రప్రెన్యూర్ ఇండియా ఈ సదస్సును నిర్వహించనుంది. సదస్సు తొలిరోజు 'డ్రైవింగ్ డిజిటల్ ఇండియా.. ఇన్నోవేషన్స్, స్ట్రాటజీస్ ఫర్ టెక్నికల్లీ అడ్వాన్స్‌డ్ ఫ్యూచర్' అనే అంశంపై కేటీఆర్ కీలకోపన్యాసం చేస్తారు.

'మిగులు' రాష్ట్రంగానే అప్పగించాం

మా పదేళ్ల పాలన తరువాత కూడా మిగులు బడ్జెట్ రాష్ట్రమే

- ప్రజల దశాబ్దాల కష్టాలు తీర్చేందుకే అప్పులు తెచ్చాం
- తెచ్చిన అప్పు ప్రతి పైసా రాష్ట్రాభివృద్ధికే ఖర్చు చేశాం
- పదేళ్లలో రూ.125 లక్షల కోట్ల అప్పు చేసింది బీజేపీ సర్కారే
- ఆ అప్పులన్నీ కార్పొరేట్ శక్తుల రుణాల మాఫీకే
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కేటీఆర్ కౌంటర్
- రాష్ట్ర అప్పులపై కేంద్ర మంత్రికి బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి పదేళ్లు పాలించిన బీఆర్ఎస్.. అధికారం నుంచి దిగిపోయేనాడు కూడా మిగులు బడ్జెట్ రాష్ట్రంగానే కాంగ్రెస్‌కు అప్పగించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యే సమయంలో రాష్ట్రానికి రూ.70 వేల కోట్ల వరకు అప్పు ఉందని.. అప్పులను మిగులు బడ్జెట్‌తో ముడిపెట్టడం సమంజసం కాదని అన్నారు. పదేళ్లలోనే రూ.125 లక్షల కోట్ల అప్పు చేసిన బీజేపీ ప్రభుత్వానికి అప్పులపై మాట్లాడే నైతిక హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల కుప్ప అయిందన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలను తిప్పికొడుతూ.. ఆదివారం కేటీఆర్ బహిరంగ లేఖ విడుదల చేశారు.

తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చాం

'గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుగా తెచ్చిన ప్రతి పైసాను పెట్టుబడిగా వినియోగించి మా ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తెచ్చింది. సమైక్య రాష్ట్రంలో తీవ్ర విధ్వంసానికి గురైన తెలంగాణ ముఖచిత్రాన్ని, తెలంగాణ ప్రజల బతుకు చిత్రాన్ని సమూలంగా మార్చి దేశంలోనే అగ్రగామిగా నిలిపాం. అప్పులున్నంత మాత్రాన ఒక రాష్ట్రం వెనకబడినట్టు కాదు. తెచ్చిన అప్పుతో తాగు, సాగునీటి కష్టాలను శాశ్వతంగా తొలగించే ప్రాజెక్టులను నిర్మించాం. భారీ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు నిధులను ఉపయోగించాం' అని వివరించారు. కేంద్ర ప్రభుత్వం లాగా తెచ్చిన అప్పులతో కార్పొరేట్ శక్తుల లక్షల కోట్ల రుణాలు మాఫీ చేయలేదని అన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

కేంద్ర బడ్జెట్లో, రైల్వే కేటాయింపుల్లో బీజేపీ ప్రభుత్వం తెలంగాణ పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ఖజానా నింపే స్థాయికి తెలంగాణను తీర్చిదిద్దితే, బహుమానంగా అవమానాలు మిగిలిస్తున్నారా? అని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌లో పసుపు బోర్డుకు ఒక్క పైసా కేటాయించలేదని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సొంత ఖర్చులతో చేపట్టిన మిషన్ భగీరథ ద్వారా వందశాతం ఇళ్లకు మంచినీళ్లిస్తే, దాన్ని కూడా జల్ జీవన్ మిషన్ కింద 38 లక్షల నల్లా కనెక్షన్లు ఇచ్చామని కేంద్రం ఖాతాలో వేసుకోవడం విడ్డూరంగా ఉందని కేటీఆర్ విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లాలో మూతపడ్డ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను తెరిపించాలని కోరినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా దక్కిందేమీ లేదని అన్నారు.

స్వల్పకాలంలోనే కాంగ్రెస్‌కు ప్రజావ్యతిరేకత

- ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రధానిపై సీఎం విమర్శలు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

హనుమకొండ: స్వల్పకాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను కూడగట్టుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆయన ఆదివారం హనుమకొండలో విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ 10 ఏళ్లలో ప్రజావ్యతిరేకతను కూడగట్టుకుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోపే అది సాధించిందని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమల్లో విఫలమైన రేవంత్ రెడ్డి.. ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు గడ్డు పరిస్థితులు తప్పవని స్పష్టం చేశారు. అడుగడుగునా ఆ పార్టీ ఎమ్మెల్యేలను నిలదీసే పరిస్థితులు ఎంతో దూరంలో లేవని పేర్కొన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల పాలు చేసి దివాళా తీయించిందని, అదే బాటలో రేవంత్ ప్రభుత్వం నడుస్తోందని దుయ్యబట్టారు. రాహుల్‌ది ఏ కులమో ఆయన చెప్పాలని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కోరారు. త్వరలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి నియామకం జరుగుతుందని వెల్లడించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ అభివృద్ధికి రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, మరో రూ.10 లక్షల కోట్లు రుణాల రూపంలో ఇచ్చిందని కిషన్‌రెడ్డి వివరించారు.

మోదీని సీఎం రేవంత్ అవమానించలేదు

- పుట్టుకతో బీసీ కాదని మాత్రమే అన్నారు: ఎంపీ మల్లు రవి
- 2001లోనే మోదీ బీసీ అయ్యారు: చనగాని దయాకర్



మల్లు రవి



చనగాని దయాకర్

సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోదీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏకోశానా అవమానించలేదని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అభిప్రాయపడ్డారు. మోదీ పుట్టుకతో బీసీ కాదని, అందుకే ఆయనకు బీసీల అణచివేత, వారికి ఎదురయ్యే అవమానాలు అర్థం కావనే విషయాన్ని మాత్రమే రేవంత్‌రెడ్డి చెప్పారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోదీ నిజంగానే బీసీ అయి, బీసీలపై ప్రేమ ఉంటే జనగణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎవరూ దైవాంశ సంభూతులు కాదని, ప్రజల మద్దతు ఉన్న వారే నాయకులు అవుతారన్న విషయాన్ని బీజేపీ నేతలు గుర్తెరగాలని మల్లు రవి హితవు పలికారు.

రేవంత్ చెప్పింది అక్షరాలా వాస్తవం

నరేంద్ర మోదీ ఎలా బీసీ అయ్యారనే విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పింది అక్షర సత్యమని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ పేర్కొన్నారు. 'మండల్ కమిషన్ 1981లో 3,460 కులాలను ఓబీసీ జాబితాలో పేర్కొంది. ఆ జాబితాలో మోదీ కులం లేదు. 1994లో మోదీ కులాన్ని ఆ రాష్ట్రంలో బీసీల జాబితాలో చేర్చినా, కేంద్ర జాబితాలో చేరింది మాత్రం 2001లో వాజ్‌పేయి హయాంలోనే' అని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోదీ కులం మొదటి నుంచి వ్యాపార కులమేనని, ఇప్పటికి కూడా ఆ ఇంటి పేరు ఉన్న వారు వ్యాపారులుగానే ఉన్నారు తప్ప చాయ్‌వాలాలు ఎవరూ లేరని వెల్లడించారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కులగణన జరిగిందన్నారు.

చిన్నప్పటి నుంచే పర్యావరణ స్పృహ కల్పించాలి

కామన్‌వెల్త్ ఆఫ్ నేషన్స్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్



నందిగామ: తరగతి గదుల్లో విద్యార్థులకు చిన్నప్పటి నుంచే పర్యావరణ స్పృహ అనే విత్తనాలు నాటాలని కామన్‌వెల్త్ ఆఫ్ నేషన్స్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతి వనంలో ఆదివారం హార్ట్‌ఫుల్ నెస్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సస్టెయినబిలిటీ ఇన్ క్లాస్‌రూమ్స్' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తరగతి గదుల్లోనే పర్యావరణ పరిరక్షణ గురించి వివరించి, వారిలో ఒక చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. కన్హాలో పర్యావరణ పరిరక్షణకు సంస్థ తీసుకుంటున్న చర్యలు అమోఘమని కితాబిచ్చారు. శ్రీరామచంద్ర మిషన్ సంస్థ గురూజీ కమ్‌లేశ్ పటేల్ కృషితో ఈ ప్రాంతమంతా ఒక ఆధ్యాత్మిక సుసంపన్నత అభయారణ్యంగా మారిందన్నారు. కార్యక్రమంలో భారత్‌లో ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్ పోలిష్‌చుక్, ఆయన సతీమణి కాటెరినా బిలా, రాయబార కార్యాలయం సాంస్కృతిక విభాగం రెండో కార్యదర్శి వోలోడిమిర్ ప్రితులా, యువజన అభివృద్ధి, సామాజిక విధాన అభివృద్ధి సలహాదారు సుశీల్‌రామ్, కమ్యూనికేషన్ విభాగం డైరెక్టర్ సత్‌బింద్రా, కామన్‌వెల్త్ సెక్రటరీ జనరల్ ప్రత్యేక రాయబారి ప్రొఫెసర్ ప్రజాపతి త్రివేది, వినోద్ కుమార్, పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు టీపీసీసీ ఓబీసీ సెల్ సమావేశం

- హాజరుకానున్న ఏఐసీసీ చైర్మన్ అజయ్‌సింగ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్
- బీసీల కులగణనపై పార్టీ నేతలకు మరోమారు వివరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఓబీసీ సెల్ విస్తృత స్థాయి సమా వేశం సోమవారం జరగనుంది. గాంధీభవన్‌లో ఉదయం 11 గంటలకు జరగనున్న ఈ సమా వేశానికి ఓబీసీ సెల్ జాతీయ చైర్మన్ కెప్టెన్ అజయ్ సింగ్, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌లు హాజరు కానున్నట్టు టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ఆదివారం వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు.. పార్టీ బీసీ నేతలకు మరోమారు ప్రభుత్వం కులగణన చేసిన తీరుపై వివరణ ఇవ్వనున్నారు. కులగణన ద్వారా బీసీలపై కాంగ్రెస్ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా.. పార్టీ బీసీ నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. కాగా, హైదరాబాద్‌కు వచ్చిన ఓబీసీ సెల్ జాతీయ చైర్మన్, హరియాణా మాజీ మంత్రి కెప్టెన్ అజయ్‌సింగ్ యాదవ్‌ను బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కలిశారు. పార్క్‌హయత్ హోటల్‌లో ఆదివారం ఉదయం సింగ్‌తో మంత్రి కాసేపు మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు.

సాగర్ ఫారెస్ట్‌లో చెలరేగిన మంటలు

వందల ఎకరాల్లో తగలబడిన అడవి



మంటలను అదుపులోకి తెస్తున్న అధికారులు

తిరుమలగిరి (నాగార్జునసాగర్): నాగార్జునసాగర్ ఫారెస్ట్‌లో ఆదివారం ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో వందల ఎకరాల్లో అడవి దగ్ధమైంది. నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలంలోని మూలతండా సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఉదయం ఫారెస్ట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అటుగా వెళ్తున్న స్థానికులు చూసి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. అప్పటికే మంటలు పెద్ద ఎత్తున అడవిచుట్టూ అంటుకున్నాయి. ఫారెస్ట్ సెక్షన్ అధికారి రమేశ్ తన బృందంతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అలాగే మండలంలోని జమ్మనకోట తండా సమీపంలోని ఫారెస్ట్‌లో కూడా శనివారం రాత్రి పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు రమేశ్ తెలిపారు. వరుసగా రెండు రోజులు సాగర్ ఫారెస్ట్ దగ్ధం కావడం గమనార్హం. అటుగా వెళ్తున్న బాటసారులు బీడీ కాల్చుకున్న నిప్పును అడవిలోకి విసరడంతోనే ఈ ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

సన్నిధి

- యాదగిరి నర్సన్న విమాన గోపురం
- పూర్తి కావొచ్చిన బంగారు తాపడం
- 23న మహాకుంభ సంప్రోక్షణ
- 19 నుంచి హోమాలు, ప్రత్యేక పూజలు
- లక్షకు పైగా భక్తులు వస్తారని అంచనా



మన గుడి - మన ఉత్సవం

మహాకుంభ సంప్రోక్షణకు సర్వం సిద్ధం



యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయ విమానగోపుర మహాకుంభ సంప్రోక్షణకు ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. ఈనెల 19 నుంచి 23 వరకు జరిగే మహాక్రతువుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండురోజుల్లో ఆలయ విమాన గోపుర స్వర్ణతాపడం పనులు పూర్తికానున్నాయి. 108 మంది రుత్విక్కులతో పూజలు నిర్వహిస్తారు. దేశంలోని పుణ్య నదుల నుంచి పవిత్ర జలాలను తెస్తున్నారు. ఇందుకోసం కొండపైన హోమగుండాలు కూడా సిద్ధమవుతున్నాయి.


మహాకుంభ సంప్రోక్షణకు ఈనెల 23న జరిగే మహా కుంభాభిషేకం జరుగుతుంది. ఉదయం 11.34 గంటలకు నిర్ణయించిన ముహూర్తంలో ఈకార్యక్రమం జరుగుతుంది. పీఠాధిపతి వానమామలై రామానుజ జియర్ స్వామి పర్యవేక్షణలో మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమం జరుగుతుంది. కొండపైన ఐదు హోమగుండాలు ఏర్పాటు చేశారు. 19 నుంచి 22 వరకు 108 మంది రుత్విక్కులతో సుదర్శన హోమం, నారసింహ హోమం నిర్వహిస్తారు. రామాయణ, భారత, భాగవత కథలను పారాయణం చేస్తారు.

మహాకుంభాభిషేక, సంప్రోక్షణ వివరాలు

19వ తేదీ బుధవారం:
ఉదయం గం. 7.45కు భగవద్ అనుజ్ఞ స్వస్తి వాచన, శ్రీ విశ్వక్సేనారాధాన, పుణ్యాహవాచన, రక్షాబంధన, ఋత్విగ్వరణం, మృత్సంగ్రహణ, పర్యగ్నీకరణ, తిరువీధి సేవ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధనతో ఆరంభం అవుతాయి. సాయంత్రం 6:00 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ, ద్వారాది కుంభార్చన, బింబ, కుంభ, మండల అగ్ని ఆరాధన, మూర్తి మంత్ర హోమాలు వారణానువాక హోమం, జలాధివాసం, నిత్యపూర్ణాహుతి, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి, తిరువీధి సేవ, ఆలయంలోకి వేంచేపు జరుగుతాయి. గురు, శుక్ర వారాలలో వివిధ కార్యక్రమాల అనంతరం 22 వ తేదీ శనివారం తిరువీధిసేవ,చతుస్థానార్చన, విమాన అధిష్టాన పరివార విశేష హోమం, ఏకాశీతి కలశ స్నపనం, మూల మంత్రమూర్తి మంత్ర హవనం, నిత్యపూర్ణాహుతి నివేదన, నీరాజన మంత్ర పుష్పం, శాత్తుమరై. సాయంత్రం 6:00 గంటలకు నిత్య పూర్ణాహుతి నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి తిరువీధి సేవ ఆలయంలోకి వేంచేపుతో ముగుస్తాయి.

ఈనెల 19 నుంచి 23 వరకు పంచకుండాత్మక సుదర్శన నారసింహ మహాయాగం జరిపి దివ్యవిమాన గోపురాన్ని శ్రీ స్వామివారికి అంకితం చేస్తారు.

23వ తేది ఉదయం 11.54 గంటలకు స్వర్ణ విమానగోపురానికి కుంభాభిషేకం చేస్తారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దివ్యవిమానం బంగారు తాపడంలో 40 రకాల విగ్రహాలు బంగారు పూతతో చెక్కారు. విమాన గోపురంపై బంగారు రేకులపై పంచనారసింహ క్షేత్రంలో స్వామివారి వివిధ రూపాలను చెక్కారు. శ్రీవిష్ణుమూర్తి దశావతారాలు, నర్సింహస్వామి వారి వివిధ రూపాలను వివిధ ఎత్తులతో చెక్కారు. అలాగే స్వామివారి గరుడ విగ్రహాలు నాలుగు, సింహాలు 8 ఇలా మొత్తం స్వర్ణతాపడంపై పొందుపరిచారు. కాగా దేశంలోనే అతి పెద్ద స్వర్ణ విమాన గోపురంగా తీర్చిదిద్దుతున్నారు. స్వామివారి విమానగోపురంతోపాటు ఆలయంపై ఉన్న 39 కలశాలకు కూడా బంగారు తాపడం చేశారు. ఈ సందర్భంగా రోజూ 2000 మందికి అన్నప్రసాద వితరణ చేస్తారు.



ఏర్పాట్లు పూర్తి

శ్రీ లక్ష్మి నర్సింహస్వామి దేవాలయం విమాన రాజగోపురానికి బంగారు తాపడం పనులు పూర్తి అయ్యాయి. దేవస్థానం పీఠాధిపతి పర్యవేక్షణలో మహాకుంభాభిషేకం కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 108 మంది రుత్విక్కులు ప్రత్యేక పూజలు చేస్తారు. హోమగుండాలు ఏర్పాటు చేశాం. రామాయణ, మహాభారత, భాగవత ప్రబంధాల ప్రవచనాలు పారాయణ చేస్తారు. భక్తుల వసతుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.



– ఏ. భాస్కర్‌రావు,
దేవస్థానం ముఖ్య కార్యనిర్వహణాధికారి, యాదగిరిగుట్ట

ప్రత్యేక వసతులు, ఏర్పాట్లు...

మహాకుంభ సంప్రోక్షణకు దేశం నలుమూలల నుంచి లక్షకు పైగా భక్తులు వస్తారని దేవస్థానం అధికారులు అంచనా వేసి ఇందుకోసం ప్రత్యేక వసతులు, ఏర్పాటు చేస్తున్నారు. 23న సుమారు లక్షమంది భక్తులకు పులిహోర ప్రసాదం ఉచితంగా అందించేందుకు దేవస్థానం నిర్ణయించింది. మహాకుంభ సంప్రోక్షణతోపాటు మార్చి1 నుంచి ప్రారంభమయ్యే యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ప్రచార కార్యకమంలో భాగంగా దేవస్థానం హైదరాబాద్, వరంగల్, సిద్దిపేట, జనగామ, ఆలేరు, భువనగిరి, శంషాబాద్, మహరాష్ట్రలోని షోలాపూర్‌లో స్వాగత తోరణాలు ఏర్పాటు ఏర్పాటు చేస్తోంది. శ్రీస్వామివారి విమాన గోపురం బంగారు తాపడం పనులకు దేవస్థానం 68కిలోల బంగారం వాడుతుంది. 50.5 ఫీట్ల పంచతల రాజగోపురానికి చుట్టుమొత్తం10,759 చదరపు అడుగల మేర స్వర్ణతాపడం పనులు చేపట్టారు. దేవాలయం పునర్నిర్మాణం ప్రారంభించినపుడే విమాన గోపురానికి బంగారు తాపడం చేయాలని నిర్ణయించారు. ముందుగా11వేల కిలోల రాగితో రేకులను తయారు చేశారు. ఒక చదరపు అడుగు రేకుకు 6 గ్రాముల బంగారం ఖర్చు చేస్తున్నారు.

ఐదు యజ్ఞకుండాలు: కొండ పైన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐదు హోమ కుండాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పెద్దకుండానికి అనుబంధంగా మరో నాలుగు హోమగుండాలు ఏర్పాటు చేశారు. ప్రతిరోజు శ్రీ సుదర్శన నారసింహ, శ్రీ లక్ష్మి హవన హోమాలు చేస్తారు. చివరి రోజైన ఈనెల 23న విమాన రాజగోపురానికి 25 కలశాలతో అభిషేకం, మూలమూర్తి హవనం చేస్తారు. ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు చేసి విమాన గోపురానికి ప్రాణం పోస్తారు. ఇందులో 108 మంది పారాయణదార్లు పాల్గొంటారు. వివిధప్రాంతాల నుంచి రుత్వికులు వస్తారు. ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించడానికి దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది.

– యంబ నర్సింహులు,
సాక్షి ప్రతినిధి, యాదాద్రి.

ఆత్మబోధిని

ఇక దుఃఖించవద్దు!

మానవుడు ఆనంద స్వరూపుడు. మనిషిలో అపరిమితమైన ఆనందం ఉంటుంది. ఈ ఆనందాన్ని ఆస్వాదించాలంటే మనిషి సత్యంతో సంగమించగలగాలి. ఎప్పుడైనా ఏ విషయంలోనైనా దుఃఖం ఏర్పడినప్పుడు, ఎందుకు నేను దుఃఖపడుతున్నాను..?? అనే ప్రశ్నను వేసుకొని, లోతైన విచారణ చేయగలిగితే, దుఃఖం వెనుక ఉన్న కారణం అవగతం అవుతుంది. ఎంతటి కష్టానికైనా దుఃఖించకుండా ఉండగల సామర్థ్యం మనిషి యోగిగా మారినప్పుడు మాత్రమే కలుగుతుంది. ఆ స్థితప్రజ్ఞ స్థితిని సాధనే ప్రసాదిస్తుంది. మనసును ఎంత సమాధాన పరుచుకున్నా, సాధన లేనిదే దుఃఖం అనే బీజం నశించడం అసంభవం. మా అమ్మగారి మహా ప్రస్థానం ఒకప్పుడు నన్ను తీరని దుఃఖంలో ముంచి వేసింది. అదే సమయంలో భగవద్గీతలో కృష్ణ భగవానుల బోధ నాకు బాసటగా నిలిచింది.

తం విద్యాద్ దుఃఖసంయోగవియోగం యోగసంజ్ఞితం
స నిశ్చయేన యోక్తవ్యో యోగో?నిర్విణ్ణచేతసా

''దుఃఖానికి కారణమైన అన్నింటి నుండి ముక్తిని ఇచ్చేదే యోగం. దీనిని నిశ్చయంతో, ఓర్పుతో అభ్యాసం చేయాలి'' అని కృష్ణ భగవానులు గీతలో బోధించారు. కృష్ణ భగవానులు నిర్దేశించిన మార్గంలో ప్రయాణించడం వల్ల ధ్యానసాధన మొదలు పెట్టిన కొద్దికాలానికే నాకు అవగాహన పెరిగింది. దుఃఖం నుండి యోగమే నన్ను ఆనందం వైపు నడిపించింది. చాలామంది జీవితంలో ఏర్పడే అనేకమైన అనుభవాల వల్ల దుఖార్తులై తమ శేష జీవితమంతా దుఃఖంలోనే గడిపేస్తుంటారు. దుఃఖం అనేది జీవితంలో మీకు కలిగే ఒక అనుభవమే అని గుర్తించండి. మీకు కలిగే బాధలో నుంచి అవగాహన అనే వెలుగు దిశగా అడుగులు వేయండి. అవగాహనను మీ బలంగా మార్చుకోండి. దుఃఖం నుండి మనో నిబ్బరంతో బయట పడి, ఆనందాన్ని ఆశ్రయించండి. దుఃఖస్థితి నుంచి దుఃఖరాహిత్యానికి కృషి చేయండి.



ఎక్కడి విషయాలను అక్కడే వదిలేసి ముందుకు సాగండి. దుఃఖం వల్ల మనిషి శక్తి హీనుడు అవుతాడు. నిజానికి కొద్ది పాటి దుఃఖమే మిమ్మల్ని మరింత దుఃఖంలోకి నెట్టివేస్తుంది. అందుకే ఎల్లప్పుడూ మీరు ఆనంద స్వరూపులు అనే అవగాహనతో ఉండండి. దుఃఖం అన్నది మీ శరీరానికే అనే జ్ఞానాన్ని పెంచుకోండి. ఆత్మ తత్వమే ఆనంద తత్వం అని తెలుసుకొని, జీవితాన్ని ఆనందమయంగా మార్చుకోండి.



గురుమా ఆత్మానందమయి
సుషుమ్న క్రియా యోగ గురువులు

సాక్షి సినిమా



● రష్మిక

బ్యాక్ టు షూట్

'బ్యాక్ టు షూట్' అంటూ దాదాపు నెల రోజుల తర్వాత రష్మికా మందన్నా షూటింగ్ లొకేషన్లోకి అడుగు పెట్టారు. గత నెల జిమ్‌లో వర్కవుట్ చేస్తున్నప్పుడు అనుకోకుండా ఆమె కాలికి గాయం అయిన విషయం తెలిసిందే. దాంతో కొన్ని వారాలు ఆమె షూటింగ్స్‌కి బ్రేక్ ఇచ్చారు. గాయం తగ్గిపోవడంతో షూట్‌కి రెడీ అయ్యారు. సల్మాన్ ఖాన్ సరసన నటిస్తున్న హిందీ చిత్రం 'సికందర్' షూట్‌లోకి ఎంటర్ అయ్యారు. ఈ సినిమాకి సంబంధించి నైట్ షూట్ జరుగుతోంది. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇక 'సికందర్' కాకుండా హిందీలో 'థామా', తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 'కుబేర', తెలుగు చిత్రం 'గర్ల్ ఫ్రెండ్' వంటివి రష్మిక సైన్ చేశారు. నెల రోజుల బ్రేక్ తీసుకున్నారు కాబట్టి ఇక ఈ చిత్రాల షూటింగ్‌తో బిజీగా ఉంటారు.



● నాగచైతన్య

వంద కోట్ల తండేల్

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదలైంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 100 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిందని చిత్రబృందం ప్రకటించింది. ''ఈ సినిమా కోసం నాగచైతన్య కంప్లీట్‌గా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. విడుదలైన తొలి రోజే ఆన్‌లైన్‌లో పైరసీ వెర్షన్ రిలీజ్ కావడం, ఫిబ్రవరి వంటి ఆఫ్-సీజన్ రిలీజ్ కావడం వంటి అవాంతరాలను దాటుకుని కూడా 'తండేల్' మూవీ రూ. 100 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించింది. ఓవర్‌సీస్ లోనూ వన్ మిలియన్ మార్క్‌ను చేరుకుంది. గీతా ఆర్ట్స్‌లో వన్నాఫ్ ది బిగ్గెస్ట్ హిట్స్‌గా నిలవడం సంతోషంగా ఉంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఇక నాగచైతన్య కెరీర్‌లో రూ. వంద కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిన తొలి చిత్రంగా 'తండేల్' నిలిచింది.

ప్రేమకథ షురూ



● అజయ్ భూపతి, అంజి

అభినవ్ మణికంఠ, దివిజా ప్రభాకర్, తన్మయి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ప్రేమకథా చిత్రం 'హే చికితా'. ధన్‌రాజ్ లెక్కల దర్శకత్వంలో ఎన్. అశోక ఆర్ఎస్ఎస్, 'గరుడవేగ' అంజి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను దర్శకుడు అజయ్ భూపతి విడుదల చేశారు. ''ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించాం. తెలంగాణ, ఆంధ్రాలోని పలు లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతాం'' అని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, కెమేరా: 'గరుడవేగ' అంజి.

ఎమోషనల్ బ్యూటీ



● అంకిత్, నీలఖి

అంకిత్ కొయ్య, నీలఖి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బ్యూటీ'. వర్థన్ దర్శకత్వంలో వానరా సెల్యులాయిడ్, జీ స్టూడియోస్, మారుతీ టీమ్ ప్రొడక్ట్ పతాకాలపై అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కేఆర్ బన్సాల్ ఈ సినిమాను నిర్మించారు. ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. ''ఓ అందమైన ప్రేమకథతో పాటు మిడిల్ క్లాస్ ఎమోషన్స్‌ను ప్రేక్షకులు ఈ మూవీలో చూస్తారు'' అని తెలిపింది యూనిట్. ఈ సినిమాకు సంగీతం: విజయ్ బుల్గానిన్.

కాలేజీ మ్యాజిక్



● 'మ్యాజిక్' పోస్టర్

'డోన్ట్ నో వై... ఇంకా ఉన్నా... నేనే ఇష్టం లేని ప్రాణాలేమో పోనే పోవే..' అంటూ మొదలవుతుంది 'మ్యాజిక్' సినిమాలోని 'డోన్ట్ నో వై...' పాట. సారా అర్జున్, అన్మోల్ కజాని, ఆకాశ్ శ్రీనివాస్, సిద్దార్థ్ తణుకు ప్రధాన పాత్రధారులుగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతున్న తెలుగు, తమిళ చిత్రం 'మ్యాజిక్'. ఈ మూవీని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని 'డోన్ట్ నో వై..' పాట లిరికల్ వీడియో విడుదలైంది. ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అందించగా, ఐశ్వర్యా సురేష్ బింద్రాతో కలిసి ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ ఆలపించారు. ''కాలేజ్ ఫెస్ట్ కోసం పాట చేయడానికి ఓ నలుగురు యువతీ యువకులు చేసే ప్రయత్నమే ఈ సినిమా'' అని యూనిట్ తెలిపింది.

ప్రముఖ నిర్మాత-నటి-గాయని
కృష్ణవేణి కన్నుమూత



తెలుగు సినిమా స్వర్ణయుగం నుండి ప్రపంచ స్థాయికి ఎదగడం వరకూ చూసిన నాటి తరం ప్రముఖ నిర్మాత-నటి-గాయని చిత్తజల్లు కృష్ణవేణి (101) ఇక లేరు. పదిహేను రోజులుగా ఆమె హైదరాబాద్‌లోని సిటీన్యూరో ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు తుది శ్వాస విడిచారు.

ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా పంగిడి గ్రామంలో 1924 డిసెంబరు 24న కృష్ణవేణి జన్మించారు. చిన్నతనంలోనే నాటకాల్లో ప్రహ్లాదుడు, ధ్రువుడు వంటి వేషాలు వేసి, బహుమతులు అందుకున్నారామె. కాగా ప్రముఖ దర్శక-నిర్మాత సి. పుల్లయ్య బాలనటీనటులతో 'సతీ అనసూయ' చిత్రానికి శ్రీకారం చుట్టిన సమయంలో రాజమండ్రిలో 'తులాభారం' నాటకం చూశారు. ఆ నాటకంలో కృష్ణవేణి నటన నచ్చి, 'సతీ అనసూయ'కు అవకాశం ఇచ్చారు. అలా 'సతీ అనసూయ' (1936) సినిమాతో కృష్ణవేణి తొలిసారి వెండితెరపై కనిపించారు. బాల నటిగా కొన్ని చిత్రాల్లో నటించారు. సినిమాల్లో నటించడానికి మద్రాసు వెళ్లారామె. కృష్ణవేణి హీరోయిన్‌గా నటించిన తొలి చిత్రం 'కచదేవయాని' (1938) విజయం సాధించడంతో ఆమెకు మంచి గుర్తింపు, పేరు దక్కాయి. కాగా ప్రముఖ నిర్మాత మీర్జాపురం రాజు (మేకా రంగయ్య) బేనర్‌లో ఆమె 'జీవన జ్యోతి' సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా చేశారు. నటిగా కృష్ణవేణిని బాగా ఎస్టాబ్లిష్ చేసిన సినిమా అది. ఆ చిత్రం తర్వాత మీర్జాపురం రాజుతో ఆమె పెళ్లయింది. వారిది ప్రేమ వివాహం. ఆ తర్వాత జయా పిక్చర్స్‌పై తన భర్త తీసిన సినిమాలకు నిర్వహణ బాధ్యతలు చూసుకునేవారు. అలా నిర్మాణరంగంవైపు వచ్చారామె. ఇక వివాహం తర్వాత జయా పిక్చర్స్‌ని శోభనాచల స్టూడియోస్‌గా మార్చారు. ఈ బేనర్ నిర్మించిన 'దక్షయజ్ఞం (1941), గొల్లభామ (1947), లక్ష్మమ్మ (1950)' వంటి చిత్రాల్లో మాత్రమే నటించారు కృష్ణవేణి. ఒకవైపు నటిస్తూనే 'బాల మిత్రుల కథ, కీలు గుర్రం' వంటి సినిమాల్లో పాటలు కూడా పాడారు. కాగా 'తిరుగుబాటు' సినిమాలో కృష్ణవేణి చేసిన వ్యాంప్ క్యారెక్టర్ అప్పట్లో చర్చనీయాంశమైంది. ఇక 1942లో మీర్జాపురం రాజా-కృష్ణవేణి దంపతులకు కుమార్తె రాజ్యలక్ష్మి అనురాధ జన్మించారు.

సినీ నిర్మాత, నటి, గాయని, రఘుపతి వెంకయ్య అవార్డుగ్రహీత కృష్ణవేణి మృతిపై మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. అనేక భాషల్లో నటించి, బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరొంది, నటిగా తనదైన ముద్ర వేసిన కృష్ణవేణి మృతి సినీ రంగానికి తీరని లోటు అని పేర్కొన్నారు. పలు గొప్ప చిత్రాలు తీసి, నిండు నూరేళ్లు సంపూర్ణంగా జీవించి, పరమపదించిన ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు వైఎస్ జగన్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

''అలనాటి నటీమణి, సినీ నిర్మాత కృష్ణవేణి మృతి నన్ను బాధించింది. పరిపూర్ణ జీవితం గడిపిన కృష్ణవేణిగారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను'' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ''మన దేశం' చిత్రంతో ఎన్టీఆర్‌ను చిత్ర రంగానికి పరిచయం చేసి, కళారంగానికి వారు చేసిన సేవ మరువలేనిది. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను'' అన్నారు.



● కృష్ణవేణి

కృష్ణవేణి కాశీ మజిలీ కథలతో పాటు చాలా పుస్తకాలు చదివేవారు. వాటిలో సినిమా తీయడానికి పనికొస్తాయనిపించే పాయింట్స్ తీసుకుని, కథ తయారు చేయించేవారు. స్టోరీ సిట్టింగ్స్, మ్యూజిక్ సిట్టింగ్స్ నుంచి షూటింగ్ షెడ్యూల్స్ ప్లాన్ చేసి, షూటింగ్ స్పాట్‌లో ఉండటంవరకూ అన్నీ దగ్గరుండి చూసుకునేవారు కృష్ణవేణి.

ఒకవైపు అనురాధ ఆలనా పాలనా, మరోవైపు సినిమాల నిర్మాణ పనులు చూసుకోవాల్సి రావడం... వంటి కారణాల చేత కృష్ణవేణి నటించడం తగ్గించారు. ఆమె హీరోయిన్‌గా నటించిన ఆఖరి చిత్రం 'సాహసం' (1952). అప్పట్లో అత్యధిక పారితోషికం అందుకున్న హీరోయిన్‌గా కృష్ణవేణికి పేరుంది. 'ధర్మాంగద' చిత్రానికి గాను ఆమె రూ. 45 వేలు పారితోషికం అందుకున్నారట.

ఎన్టీఆర్‌ని పరిచయం చేసిన నిర్మాతగా...

'మన దేశం' చిత్రం ద్వారా ఎన్టీఆర్‌ని పరిచయం చేసిన నిర్మాతగా కృష్ణవేణి బాగా పాపులర్ అయ్యారు. పూర్తి స్థాయి నిర్మాతగా ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో కృష్ణవేణి నిర్మించిన 'మన దేశం' ఘనవిజయం సాధించింది. ఈ సినిమాలో ఆమె హీరోయిన్‌గానూ చేశారు. ఇదే చిత్రంతో గాయనిగా పి. లీలను పరిచయం చేశారు. అలాగే 'వరూధిని' చిత్రం తర్వాత, ఊరికి వెళ్లిపోయిన ఎస్వీ రంగారావును పిలిపించి, 'మన దేశం'కు అవకాశం కల్పించారామె. అలాగే ఘంటసాల వెంకటేశ్వరరావుకు పూర్తి స్థాయి సంగీతదర్శకునిగా తొలి అవకాశం కల్పించింది కూడా కృష్ణవేణియే కావడం మరో విశేషం.

'దాంపత్యం' (1957) నిర్మాతగా కృష్ణవేణికి ఆఖరి చిత్రం. నటిగా, నిర్మాతగా, గాయనిగా తన కంటూ ప్రత్యేక ప్రతిభను చాటుకున్నారామె. కృష్ణవేణి 2004లో ప్రతిష్ఠాత్మక రఘుపతి వెంకయ్య అవార్డు అందుకున్నారు. 2022లో 'సాక్షి ఎక్సలెన్స్' అవార్డుల్లో భాగంగా 'జీవిత సాఫల్య పురస్కారం' అందుకున్నారు. ఇక ఆమె కుమార్తె అనురాధ తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో 17 సినిమాలు నిర్మించారు. కన్నడంలో 'భక్త కుంబార' (1974) నిర్మాతగా ఆమె తొలి చిత్రం. అదే సినిమాని తెలుగులో నాగేశ్వరరావు హీరోగా 'చక్రధారి'గా రీమేక్ చేశారు. 'రాముడే రావణుడైతే, శ్రీవారి ముచ్చట్లు, రాముడు కాదు కృష్ణుడు, అనుబంధం, ఆలయ దీపం, ఇల్లాలే దేవత' వంటి తెలుగు చిత్రాలతో పాటు తమిళ, కన్నడ భాషల్లోనూ సినిమాలు నిర్మించారామె. తెలుగులో తీసిన 'మా పెళ్లికి రండి' నిర్మాతగా ఆమె చివరి చిత్రం. ప్రపంచంలో అత్యధిక చిత్రాలు నిర్మించిన మహిళా నిర్మాతగా లిమ్కా బుక్ రికార్డ్‌ని సొంతం చేసుకున్నారామె.

కృష్ణవేణి మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. ఫిల్మ్‌నగర్‌లోని ఆమె భౌతికకాయాన్ని సందర్శించిన సినీ ప్రముఖులు సినీ పరిశ్రమకు ఆమె అందించిన సేవలను కొనియాడారు. ఆదివారం సాయంత్రం మహాప్రస్థానంలో ఆమె అంత్యక్రియలు ముగిశాయి. కృష్ణవేణికి కూతురు అనురాధా దేవి, మనుమలు, మనవరాళ్లు ఉన్నారు. ఆమె చిన్న మనమరాలు అర్చన అంత్యక్రియలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించారు.



భారత హాకీ జట్లకు మిశ్రమ ఫలితాలు

భువనేశ్వర్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ హాకీ లీగ్‌లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌ల్లో భారత జట్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ముందుగా భారత మహిళల జట్టు 'షూటౌట్'లో 1-2తో ఇంగ్లండ్ జట్టు చేతిలో ఓడిపోగా... అనంతరం భారత పురుషుల జట్టు 2-0 గోల్స్ తేడాతో స్పెయిన్ జట్టుపై విజయం సాధించింది. భారత జట్టు తరఫున మన్‌దీప్ సింగ్ (32వ నిమిషంలో), దిల్‌ప్రీత్ సింగ్ (39వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. ఇంగ్లండ్-భారత్ మహిళల జట్ల మధ్య మ్యాచ్‌లో నిర్ణీత సమయం ముగిశాక రెండు జట్లు 2-2తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున నవ్‌నీత్ కౌర్ (53వ నిమిషంలో), రుతుజా (57వ నిమిషంలో)... ఇంగ్లండ్ తరఫున పెయిజ్ గిలోట్ (40వ నిమిషంలో), టెసా హొవార్డ్ (56వ నిమిషంలో) ఒక్కో గోల్ నమోదు చేశారు. విజేతను నిర్ణయించేందుకు 'షూటౌట్' నిర్వహించారు. తొలి ఐదు షాట్‌లు ముగిశాక రెండు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఆ తర్వాత ఆరో షాట్‌లో రెండు జట్ల క్రీడాకారిణులు విఫలమయ్యారు. ఏడో షాట్‌లో భారత ప్లేయర్ లాల్‌రెమ్‌సియామి గురి తప్పగా... ఇంగ్లండ్ ప్లేయర్ సోఫీ హామిల్టన్ బంతిని లక్ష్యానికి చేర్చడంతో భారత్‌కు ఓటమి ఖరారైంది.

షమీ, అర్ష్‌దీప్



మన 'చాంపియన్స్' కసరత్తు షురూ

నెట్స్‌లో చెమటోడ్చిన భారత క్రికెటర్లు

దుబాయ్: పాక్ ఆతిథ్యమివ్వబోయే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌ల్ని దుబాయ్‌లో ఆడేందుకు వచ్చిన టీమిండియా కసరత్తు మొదలుపెట్టింది. ఆదివారమే అయినా, అక్కడికి చేరుకొని గంటల వ్యవధిలోనే భారత క్రికెటర్లు సాధన మొదలుపెట్టారు. ప్రామాణిక నిర్వాహక విధానం (ఎస్‌ఓపీ)లో భాగంగా కొత్తగా వచ్చిన హర్షిత్ రాణా నుంచి స్టార్ అయిన కెప్టెన్ రోహిత్ శర్మ వరకు అందరూ జట్టు కసరత్తులో పాల్గొనే పద్ధతిని నిక్కచ్చిగా అమలు చేశారు. ప్రాక్టీస్‌లో ప్రత్యామ్నాయ (ఆప్షనల్) సెషన్ అంటూ లేకుండా ఆటగాళ్లందరూ నెట్స్‌లో శ్రమించారు. అయితే అందరికంటే ఎక్కువగా అనుభవజ్ఞుడైన సీమర్ మొహమ్మద్ షమీ కఠోరంగా ప్రాక్టీస్ చేశాడు. గాయం తర్వాత సుదీర్ఘ విరామానంతరం అతను ఇటీవలే ఇంగ్లండ్‌తో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్‌లతో అంతర్జాతీయ క్రికెట్లో పునరాగమనం చేశాడు. ముందుగా శారీరక కసరత్తు చేసిన షమీ ఆ వెంటనే బౌలింగ్ ప్రాక్టీస్‌కు ఉపక్రమించాడు. బ్యాటర్లు నెట్స్‌లో దిగకముందే అతను లైన్ అండ్ లెంత్‌పై దృష్టిపెట్టి మరీ సాధన చేశాడు. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కచ్చితత్వమైన లెంత్ ప్రాక్టీస్‌కు సహకరించాడు. హార్దిక్ పాండ్యా, శ్రేయస్ అయ్యర్‌లిద్దరూ కుల్దీప్ యాదవ్ స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కొనే పనిలో పడ్డారు. ఈ క్రమంలో పాండ్యా బాదిన షాట్ పక్కనే ఉన్న రిషభ్ పంత్ మోచేతికి తగిలింది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు బ్యాటింగ్ చేయగా, ఫీల్డింగ్ కోచ్ దిలీప్... హర్షిత్, వరుణ్ చక్రవర్తి, పంత్‌లతో ఫీల్డింగ్ డ్రిల్స్ చేయించాడు.

గార్డ్‌నర్ ఆల్‌రౌండ్ 'షో'

గుజరాత్ జెయింట్స్‌ను గెలిపించిన కెప్టెన్

- రాణించిన డియాండ్ర, ప్రియ
- యూపీ వారియర్స్ ఓటమి

వడోదర: ఈ సీజన్ డబ్ల్యూపీఎల్ ఆరంభ మ్యాచ్‌లో 200 పైచిలుకు స్కోరు చేసినా గెలువలేకపోయిన గుజరాత్ జెయింట్స్... కెప్టెన్ ఆష్లీ గార్డ్‌నర్, డియాండ్ర డాటిన్‌ల ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రెండో మ్యాచ్‌లో బోణీ కొట్టింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 143 పరుగులు చేసింది. కెప్టెన్ దీప్తి శర్మ (27 బంతుల్లో 39; 6 ఫోర్లు) మెరుగ్గా ఆడింది. స్పిన్నర్ ప్రియా మిశ్రా 3 వికెట్లు తీయగా... ఆష్లీ గార్డ్‌నర్, పేసర్ డియాండ్ర 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. అనంతరం గుజరాత్ 18 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 144 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆష్లీ గార్డ్‌నర్ (32 బంతుల్లో 52; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), డియాండ్ర డాటిన్ (18 బంతుల్లో 33 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచేశారు. సోఫీ ఎకిల్‌స్టోన్ (4-0-16-2) చక్కని స్పెల్ వృథా అయ్యింది. **నేడు జరిగే మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తలపడుతుంది.**

దీప్తి ఒక్కరే మెరుగ్గా...

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూపీ ఇన్నింగ్స్ రెండో ఓవర్ నుంచే కష్టాల్లో కూరుకుపోయింది. జట్టు స్కోరు 22 వద్ద ఓపెనర్లు కిరణ్ నవ్‌గిరే (15), వృందా (6) పెవిలియన్ చేరారు. ఈ దశలో ఉమా ఛెత్రి (27 బంతుల్లో 24; 4 ఫోర్లు), దీప్తి శర్మ మూడో వికెట్‌కు 51 పరుగులు జోడించారు. ఇన్నింగ్స్ కుదుట పడుతున్న సమయంలో 73 పరుగుల వద్ద ఉమా, పరుగు వ్యవధిలో ప్రియా స్పిన్ మ్యాజిక్‌కు తాలియా (0), గ్రేస్ (4) అవుటవ్వడంతో 78 పరుగులకే 5 వికెట్లను కోల్పోయింది. ఈ దశలో ధాటిగా ఆడిన దీప్తి జట్టు స్కోరును 100 పరుగులు దాటించింది. కానీ తర్వాత 16 పరుగుల వ్యవధిలో మళ్లీ 3 వికెట్లు కూలడంతో యూపీ ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది.

దూకుడుగా ఆడి...

కష్టమైన లక్ష్యం కాకపోయినా... ఓపెనర్ బెత్ మూనీ (0), వన్‌డౌన్ బ్యాటర్ హేమలత (0) డకౌట్లతో 2 పరుగులకే 2 వికెట్లను కోల్పోయిన గుజరాత్ ఆరంభంలోనే కష్టాల్లో పడింది. 4 ఓవర్లలో జట్టు స్కోరు 15/2. పవర్‌ప్లేలో మిగిలినవి రెండే ఓవర్లు. సైమా ఠాకూర్ వేసిన ఐదో ఓవర్లో ఆష్లీ గార్డ్‌నర్ 2 సిక్స్‌లు, వొల్వార్ట్ మరో సిక్స్ బాదడంతో 20 పరుగులు వచ్చాయి. ఇక్కడి నుంచి మ్యాచ్ స్వరూపం మారింది. వోల్వార్ట్ (22; 2 ఫోర్లు, 1 సిక్స్) అవుటైనా... ధనాధన్ షోతో గార్డ్‌నర్ 28 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకుంది. జట్టు స్కోరు 86 వద్ద ఆమె నిష్క్రమించినా... హర్లీన్ డియోల్ (30 బంతుల్లో 34 నాటౌట్; 4 ఫోర్లు), డియాండ్ర జోడీ ఐదో వికెట్‌కు అజేయంగా 58 పరుగులు జోడించి మ్యాచ్‌ను 18 ఓవర్లలోనే ముగించింది.

స్కోరు వివరాలు

యూపీ వారియర్స్ ఇన్నింగ్స్: నవ్‌గిరే (ఎల్బీడబ్ల్యూ) (బి) డాటిన్ 15; వృందా (బి) గార్డ్‌నర్ 6; ఉమా (సి) ప్రియా (బి) డాటిన్ 24; దీప్తి (సి) గార్డ్‌నర్ (బి) ప్రియా 39; తాలియా (ఎల్బీడబ్ల్యూ) (బి) ప్రియా 0; గ్రేస్ (బి) ప్రియా 4; శ్వేత (బి) గార్డ్‌నర్ 16; అలానా కింగ్ (నాటౌట్) 19; సోఫీ (బి) కశ్వీ 2; సైమా (రనౌట్) 15; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం** (20 ఓవర్లలో 9 వికెట్లకు) 143. **వికెట్ల పతనం:** 1-22, 2-22, 3-73, 4-74, 5-78, 6-101, 7-111, 8-117, 9-143. **బౌలింగ్:** సయాలీ 2-0-20-0, డియాండ్రా 4-0- 34-2, ఆష్లీ గార్డ్‌నర్ 4-0-39-2, కశ్వీ 4-0- 15-1, తనూజ 2-0-10-0, ప్రియా 4-0- 25-3. **గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్:** వొల్వార్ట్ (బి) సోఫీ 22; బెత్ మూనీ (సి) తాలియా (బి) గ్రేస్ హారిస్ 0; హేమలత (బి) సోఫీ 0; ఆష్లీ గార్డ్‌నర్ (సి) నవ్‌గిరే (బి) తాలియా 52; హర్లీన్ (నాటౌట్) 34; డియాండ్ర (నాటౌట్) 33; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం** (18 ఓవర్లలో 4 వికెట్లకు) 144. **వికెట్ల పతనం:** 1-1, 2-2, 3-57, 4-86. **బౌలింగ్:** గ్రేస్ హారిస్ 1-0-1-1, సోఫీ 4-0-16-2, క్రాంతి గౌడ్ 2-0-15-0, సైమా 1-0-20-0, దీప్తి శర్మ 4-0-32-0, అలానా కింగ్ 3-0-38-0, తాలియా 3-0-21-1.



ఆష్లీ గార్డ్‌నర్

కోల్‌కతా X బెంగళూరు

మార్చి 22న ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభం

మే 25న కోల్‌కతాలో ఫైనల్

- క్వాలిఫయర్-1, ఎలిమినేటర్ మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యం
- విశాఖపట్నంలో రెండు మ్యాచ్‌లు ఆడనున్న ఢిల్లీ క్యాపిటల్స్



న్యూఢిల్లీ: వేసవిలో క్రీడాభిమానులను అలరించేందుకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సిద్ధమైంది. ఐపీఎల్ 18వ సీజన్‌కు సంబంధించి పూర్తి షెడ్యూల్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆదివారం అధికారికంగా ప్రకటించింది. మార్చి 22న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్), రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్ల మధ్య మ్యాచ్‌తో ఐపీఎల్ టోర్నీకి తెర లేవనుంది. మే 25వ తేదీన కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లోనే జరిగే ఫైనల్‌తో టోర్నీకి తెర పడుతుంది. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో మొత్తం 9 మ్యాచ్‌లు (7 లీగ్ మ్యాచ్‌లు, రెండు ప్లే ఆఫ్ మ్యాచ్‌లు)... విశాఖపట్నంలో రెండు మ్యాచ్‌లు (ఢిల్లీ క్యాపిటల్స్) జరుగుతాయి.

- 13 వేదికల్లో 10 జట్ల మధ్య 65 రోజులపాటు నిర్వహించే ఐపీఎల్ 18వ సీజన్‌లో మొత్తం 74 మ్యాచ్‌లు జరుగుతాయి. ఇందులో 70 లీగ్ మ్యాచ్‌లు... నాలుగు ప్లే ఆఫ్ (క్వాలిఫయర్-1, ఎలిమినేటర్, క్వాలిఫయర్-2, ఫైనల్) మ్యాచ్‌లు ఉన్నాయి. మొత్తం 10 జట్లు సొంత నగరాలతో పాటు... మూడు ఫ్రాంచైజీలు (ఢిల్లీ, రాజస్తాన్, పంజాబ్) తమ హోం మ్యాచ్‌లను రెండో వేదికపై కూడా ఆడాలని నిర్ణయించుకున్నాయి.
- ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తమ సీజన్‌ను విశాఖపట్నంలో మొదలు పెడుతుంది. వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా జరిగే రెండు మ్యాచ్‌ల్లో (మార్చి 24న లక్నో సూపర్ జెయింట్స్‌తో; మార్చి 30న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో) ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు బరిలో దిగుతుంది. రాజస్తాన్ రాయల్స్ రెండు మ్యాచ్‌లను గువాహటిలో, పంజాబ్ కింగ్స్ జట్టు తమ మూడు మ్యాచ్‌లను ధర్మశాలలో ఆడనున్నాయి. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఒకే రోజు రెండు మ్యాచ్‌ల చొప్పున 12 సార్లు జరగనున్నాయి.
- సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ తొలి మ్యాచ్‌ను మార్చి 23న హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో రాజస్తాన్ రాయల్స్ జట్టుతో ఆడనుంది. ఈ సీజన్‌లో మొత్తం హైదరాబాద్ వేదికగా 9 మ్యాచ్‌లు జరగనున్నాయి. మే 20న క్వాలిఫయర్-1, మే 21న ఎలిమినేటర్ మ్యాచ్‌లకు కూడా హైదరాబాద్ ఆతిథ్యమివ్వనుంది. క్వాలిఫయర్-2తో పాటు తుదిపోరు కోల్‌కతాలో జరగనున్నాయి.
- లీగ్‌లో 10 జట్లు అయినప్పటి నుంచి జట్లను ఈసారి కూడా రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్-1లో కోల్‌కతా నైట్‌రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, రాజస్తాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్... గ్రూప్-2లో సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లున్నాయి. లీగ్ దశలో ప్రతి జట్టు మొత్తం 14 మ్యాచ్‌లు ఆడుతుంది. గ్రూప్‌లోని ఒక జట్టు తమ గ్రూప్‌లోని మిగతా నాలుగు జట్లతో రెండుసార్లు చొప్పున ఆడుతుంది. రెండో గ్రూప్‌లోని నాలుగు జట్లతో ఒక్కోసారి, మిగిలిన మరో జట్టుతో రెండుసార్లు తలపడుతుంది.
- 'డబుల్ హెడర్' ఉన్న రోజు తొలి మ్యాచ్ మధ్యాహ్నం గం. 3:30 నుంచి... రెండో మ్యాచ్ యధావిధిగా రాత్రి గం. 7:30 నుంచి జరుగుతాయి. ఒకే మ్యాచ్ ఉన్న రోజు మ్యాచ్ రాత్రి గం. 7:30 నుంచి జరుగుతుంది.

ఐపీఎల్ 2025 పూర్తి షెడ్యూల్
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- ఇంగ్లిష్

లైఫ్ సైన్సెస్‌లో పీజీకి మార్గం.. గ్యాట్ బి

గ్యాట్-బి.. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ! జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ టెస్ట్ స్కోర్ ఆధారంగా.. దేశంలోని ప్రముఖ యూనివర్సిటీల్లో.. లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ విభాగాల్లో పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు పొందే అవకాశం లభిస్తుంది! నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. ప్రతి ఏటా గ్యాట్-బిని నిర్వహిస్తోంది. ఇటీవల 2025 విద్యాసంవత్సరానికి సంబంధించి ఈ ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. గ్యాట్-బితో ప్రయోజనాలు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, ప్రవేశం లభించే కోర్సులు, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

- » ఎన్‌టీఏ ఆధ్వర్యంలో గ్యాట్-బీ నిర్వహణ
- » డీబీటీ ఆర్‌సీబీ గుర్తింపు ఉన్న సంస్థల్లో పీజీ
- » ప్రవేశం లభిస్తే స్టయిఫండ్ అందుకునే అవకాశం
- » దేశ వ్యాప్తంగా 79 యూనివర్సిటీల్లో 1,331 సీట్లు

డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ.. జాతీయ స్థాయిలో బయో టెక్నాలజీ అనుబంధ లైఫ్ సైన్సెస్ విభాగంలో ఉన్నత విద్య, పరిశోధనల దిశగా చర్యలు చేపడుతున్న విభాగం. విద్యార్థులకు ఉన్నత అవకాశాలపై అవగాహన కల్పించేందుకు.. ఆయా కోర్సులను పర్యవేక్షించేందుకు.. రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీను నెలకొల్పింది. జాతీయ స్థాయిలో ఈ సెంటర్ గుర్తింపు పొందిన యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లలో.. బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ విభాగాల్లో పీజీ ప్రవేశాలకు, అదే విధంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ పరిధిలోని పరిశోధన కేంద్రాల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్‌ఎఫ్)కు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయో టెక్నాలజీ పేరుతో ప్రత్యేక ఎంట్రన్స్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నారు.

మొత్తం 1,331 పీజీ సీట్లు

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయో టెక్నాలజీ(గ్యాట్-బి)లో స్కోర్ ఆధారంగా.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ నెలకొల్పిన రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ గుర్తింపు పొందిన యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో బయో టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ స్పెషలైజేషన్లలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో 79 యూనివర్సిటీల్లో అగ్రి బయోటెక్, ప్లాంట్ బయో టెక్నాలజీ, ప్లాంట్ మాలిక్యులర్ బయాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్, బయో మెడికల్ టెక్నాలజీ, కంప్యుటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్ తదితర స్పెషలైజేషన్లతో మొత్తం 1,331 పీజీ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో

తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బయో టెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 30 సీట్లు అందుబాటులో ఉంటాయి. ఉస్మానియా యూనివర్సిటీలో మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనెటిక్స్ స్పెషలైజేషన్‌లో 10 సీట్లు ఉన్నాయి. గ్యాట్-బి స్కోర్ ఆధారంగా ఆయా యూనివర్సిటీల నిబంధనల మేరకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అర్హతలు

లైఫ్ సైన్సెస్, వెటర్నరీ సైన్స్, ఎంబీబీఎస్, ఫార్మసీ, అగ్రికల్చర్ తదితర సబ్జెక్ట్‌లతో 55 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. అర్హత కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

స్టైఫండ్

- గ్యాట్-బి స్కోర్ ద్వారా ఆయా యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో సీటు సొంతం చేసుకుంటే.. కోర్సు ఆధారంగా నిర్దిష్ట మొత్తంలో స్టైఫండ్ కూడా అందిస్తారు.
- ఎమ్మెస్సీ బయో టెక్నాలజీ, అనుబంధ విభాగాల విద్యార్థులకు నెలకు రూ.5 వేలు చొప్పున; ఎమ్మెస్సీ అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ విద్యార్థులకు నెలకు రూ.7.5 వేలు చొప్పున; ఎంటెక్/ఎంవీఎస్సీ స్పెషలైజేషన్ల విద్యార్థులకు నెలకు రూ.12 వేలు చొప్పున రెండేళ్ల వ్యవధికి ఈ స్టయిఫండ్ లభిస్తుంది.

240 మార్కులకు పరీక్ష

- గ్యాట్ బి పరీక్షను రెండు సెక్షన్లుగా, ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో 240 మార్కులకు నిర్వహిస్తారు.
- సెక్షన్-ఎలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, బయాలజీ సబ్జెక్ట్‌ల నుంచి 60 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 60 మార్కులు ఉంటాయి.
- సెక్షన్-బిలో బేసిక్ బయాలజీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ అనుబంధ విభాగాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 60 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున 180 మార్కులకు సెక్షన్-బిని నిర్వహిస్తారు.
- సెక్షన్-ఎలో ప్రతి తప్పు సమాధానికి అర మార్కు, సెక్షన్-బిలో ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు చొప్పున నెగెటివ్ మార్కులు ఉంటాయి.



- సెక్షన్-ఎలో ప్రశ్నలు ఇంటర్మీడియెట్ స్థాయి సిలబస్‌కు సరితూగే విధంగా, సెక్షన్-బి ప్రశ్నలు బ్యాచిలర్ డిగ్రీ స్థాయి సిలబస్‌తో ఉంటాయి.

బ్యాచిలర్ స్థాయి నైపుణ్యాలు

పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో, బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉండే గ్యాట్-బిలో విజయానికి అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న స్పెషలైజేషన్ ఆధారంగా బ్యాచిలర్ స్థాయిలో సంబంధిత సబ్జెక్ట్‌లపై పట్టు సాధించాలి. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలు అభ్యర్థుల్లో ఆయా అంశాలపై పూర్తి అవగాహనను పరీక్షించే విధంగా ఉంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు బ్యాచిలర్ స్థాయి పుస్తకాల్లోని అంశాలను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. ప్రాథమిక భావనలకు సంబంధించి పూర్తి అవగాహన పెంచుకోవాలి. జీప్యాట్, గేట్, గ్యాట్-బి, బీఈటీల పాత ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

భవిష్యత్తు అవకాశాలు

గ్యాట్-బి స్కోర్‌తో పీజీ పూర్తి చేసుకున్న వారికి.. సదరు స్పెషలైజేషన్‌ను అనుసరించి బయో టెక్నాలజీ సంస్థలు, ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ కంపెనీలు, ఫార్మాస్యుటికల్ సంస్థలు, హెల్త్‌కేర్ ఇండస్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్‌లోని సంస్థల్లో ప్రొడక్షన్, మానిటరింగ్ విభాగాల్లో కొలువులు లభిస్తున్నాయి. ప్రారంభంలోనే సగటున నెలకు రూ.50 వేల వరకు వేతనం అందుకునే అవకాశం ఉంది. ఈ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లు, యూనివర్సిటీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సైతం జరుగుతున్నాయి. ఇలా క్యాంపస్ డ్రైవ్స్ ద్వారా ఫార్మా, బల్క్‌డ్రగ్ ప్రొడక్షన్ సంస్థలు, బయెటెక్ సంస్థలు, అగ్రికల్చరల్ సీడ్ ప్రొడక్షన్ సంస్థలు నియామకాలు చేపడుతున్నాయి. పీహెచ్‌డీ పూర్తి చేసుకున్న వారికి ఐఐసీటీ, సీసీఎంబీ వంటి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని రీసెర్చ్ ల్యాబ్స్‌లో రీసెర్చ్ అసోసియేట్ హోదాలో కొలువులు లభిస్తున్నాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, మార్చి 3
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** 2025, మార్చి 5, 6 తేదీల్లో
- **పరీక్ష తేదీ:** 2025, ఏప్రిల్ 20
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/DBT

విద్య, ఉద్యోగ సమాచారం

తపాలా శాఖలో 21,413 గ్రామీణ డాక్ సేవక్ పోస్టులు

దేశవ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలో గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్)- బ్రాంచ్ పోస్ట్ మాస్టర్(బీపీఎం)/అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్/డాక్ సేవక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 21,413.
- » **సర్కిల్ వారీగా ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్-1,215, అస్సాం-555, బీహార్-783, ఛత్తీస్‌గఢ్-638, ఢిల్లీ-30, గుజరాత్-1,203, హర్యానా-82, హిమాచల్‌ప్రదేశ్-331, జమ్మూ-కశ్మీర్-255, జార్ఖండ్-822, కర్ణాటక-1,135, కేరళ-1,385, మధ్యప్రదేశ్-1,314, మహారాష్ట్ర-1,498, నార్త్ ఈస్టర్న్-1,260, ఒడిశా-1,101, పంజాబ్-400, రాజస్థాన్-2718, తమిళనాడు-2,292, తెలంగాణ-519, ఉత్తరప్రదేశ్-3,004, ఉత్తరాఖండ్-568, పశ్చిమ బెంగాల్-923.
- » **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. ఇందులో మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష తప్పనిసరిగా ఉండాలి. అంటే ఏపీ, తెలంగాణకు చెందిన వారు తెలుగు సబ్జెక్టు పదో తరగతి వరకు చదవడం తప్పనిసరి. కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు సైకిల్ తొక్కటం వచ్చి ఉండాలి.
- » **వయసు:** 18 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది.
- » **వేతనం:** నెలకు బీపీఎం పోస్టులకు రూ.12,000 నుంచి రూ.29,380, ఏబీపీఎం/డాక్ సేవక్ పోస్టులకు రూ.10,000 నుంచి రూ.24,470.
- » **ఎంపిక విధానం:** అభ్యర్థులు పదో తరగతిలో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా ఏదైనా ఒక పోస్టల్ సర్కిల్‌కు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.02.2025.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.03.2025
- » **దరఖాస్తు సవరణ తేదీలు:** 06.03.2025 నుంచి 08.03.2025 వరకు
- » **వెబ్‌సైట్:** https://indiapostgdsonline.gov.in

ఎయిమ్స్ బీబీనగర్‌లో 75 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) బీబీనగర్‌లో వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్(నాన్ అకడమిక్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 75.
- » **విభాగాలు:** అనెస్థీషియాలజీ, అనాటమీ, బయోకెమిస్ట్రీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ, జనరల్ మెడిసిన్ అండ్ సూపర్ స్పెషాలిటీస్, జనరల్ సర్జరీ అండ్ సూపర్ స్పెషాలిటీస్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మైక్రోబయాలజీ, ఓబీజీవై, ఆర్థోపెడిక్స్, ఆప్తాల్మాలజీ, పీడియాట్రిక్స్ అండ్ నియోనెటాలజీ, పాథాలజీ, ఫార్మకాలజీ, ఫిజియాలజీ, ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్, సైకియాట్రీ, రేడియో డయాగ్నోసిస్, ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్ అండ్ బ్లడ్ బ్యాంక్.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ/ ఎంఎస్/డీఎం /ఎంసీహెచ్, ఎంఎస్సీ/ఎంబయోటెక్ పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 28.02.2025 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరి తేది:** 28.02.2025.
- » **ఇంటర్వ్యూ తేదీలు:** 05.03.2025, 06.03.2025, 07.03.2025.
- » **ఇంటర్వ్యూ వేదిక:** రెండో ఫ్లోర్, ఆడిటోరియం, ఎయిమ్స్ బీబీనగర్.
- » **వెబ్‌సైట్:** https://aiimsbibinagar.edu.in

ఐవోసీఎల్ పైప్‌లైన్స్ విభాగంలో 457 అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్).. పైప్‌లైన్స్ విభాగంలో ఐదు రీజియన్‌లలో టెక్నికల్/నాన్-టెక్నికల్ ట్రేడుల్లో అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

-మొత్తం ఖాళీల సంఖ్య: 457

- » **పైప్‌లైన్ రీజియన్లు:** వెస్ట్రన్, నార్తర్న్, ఈస్ట్రన్, సదరన్, సౌత్ ఈస్ట్రన్.
- » **ట్రేడులు:** మెకానికల్, ఎలక్ట్రికల్, టెలికమ్యూనికేషన్-ఇన్‌స్ట్రుమెంటేషన్, అసిస్టెంట్ హ్యూమన్ రిసోర్స్, అకౌంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్.
- » **అర్హత:** 12వ తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 28.02.2025 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** విద్యార్హతలు, వైద్య పరీక్షలు, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధరంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.02.2025.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.03.2025.
- » **వెబ్‌సైట్:** www.apprenticeshipindia.gov.in/ https://nats.education.gov.in/

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
17-2-2025

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సూచీ		
సెన్సెక్స్ ▽	200	75,939
నిఫ్టీ ▽	102	22,929

విదేశీ సూచీలు


సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	20,037	△	91
డోజోన్స్	44,541	▽	171
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,732	▽	32
డాక్స్	22,513	▽	98
షాంఘై	3,346	△	14
నికాయ్	39,149	▽	312

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.99	88.67
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.01	111.94
€	యూరో	ఎస్‌బీఐ	88.90	91.31
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	46.00	67.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.77	57.57
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.50	67.15
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.25	23.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.75	24.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.07	12.90

గృహ రుణం.. దిగొస్తుంది భారం!



కొండెక్కి కూర్చున్న రుణ రేటును కిందికి దింపే దిశగా ఆర్‌బీఐ తొలి అడుగు వేసింది. రెపో రేటును పావు శాతం తగ్గించి రుణ గ్రహీతలకు తీపి కబురందించింది. చూడ్డానికి స్వల్ప మొత్తమే అయినా.. గృహ రుణ గ్రహీతలకు లక్షల్లో మిగలనున్నాయి. తమ వంతు కృషిని కొంచెం జోడిస్తే మరింత ఆదా చేసుకోవచ్చు. రుణానికి త్వరగా గుడ్‌బై చెప్పొచ్చు. తాజా రేటు తగ్గింపుతో మిగిలేదెంత? దీనికి అదనంగా మిగుల్చుకునేందుకు అందుబాటులో ఉన్న ఆప్షన్లు ఏవి? ఈ వివరాలను అందించే కథనమే ఇది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

తాజాగా పావు శాతం తగ్గిన రెపో రేటు • ఈ మేరకు తగ్గనున్న భారం • ఈఎంఐ తగ్గించుకోవడం ఒక ఆప్షన్
త్వరగా తీరాలంటే ఎప్పటి మాదిరే చెల్లించాలి • దీర్ఘకాలంలో గణనీయమైన ఆదా • కొత్త వారికీ మిగులు • రుణం బదిలీని పరిశీలించొచ్చు

వడ్డీ భారం తగ్గేది ఇలా..

ఏడాది క్రితం 50 లక్షల గృహ రుణాన్ని 9 శాతం వడ్డీ రేటుపై 20 ఏళ్ల కాల వ్యవధి కోసం తీసుకున్నారని అనుకుందాం. ఈఎంఐని ఇంతకుముందు మాదిరే కొనసాగించేట్టు అయితే.. పావు శాతం తగ్గింపు, అర శాతం రేటు తగ్గింపుతో ఎంత ప్రయోజనం లభిస్తుందో చూద్దాం. (టేబుల్ 2)

ప్రభావం ఏ మేరకు?

25 బేసిస్ పాయింట్లు (0.25 శాతం) తగ్గింపు చిన్న మొత్తమే అయినా దీర్ఘకాలంలో చెప్పుకోతగ్గ మొత్తం ఆదా కానుంది. నెలవారీ చెల్లించే ఈఎంఐ ఇంతకుముందు మాదిరే కొనసాగించుకుంటూ వెళితే, పావు శాతం రేటు తగ్గింపు వల్ల రుణం త్వరగా తీరిపోతుంది. ఒకవేళ రెపో రేటు తగ్గింపును ఈఎంఐలో సర్దుబాటు చేసుకుంటే.. అప్పుడు నెలవారీ చెల్లించే ఈఎంఐ తగ్గుతుంది. రుణ కాల వ్యవధి ఇంతకు ముందే మాదిరే కొనసాగుతుంది. ఈఎంఐ తగ్గించడం లేదంటే అదే ఈఎంఐ కొనసాగించి, రుణ కాల వ్యవధి త్వరగా ముగించడం.. ఈ రెండు ఆప్షన్లను బ్యాంక్‌లు కల్పిస్తాయి. రుణ గ్రహీత తనకు అనుకూలమైన ఆప్షన్ ఎంపిక చేసుకోవచ్చు. ఉదాహరణకు 20 ఏళ్ల కాలానికి రూ.30 లక్షల గృహ రుణాన్ని 9 శాతం రేటుపై తీసుకున్నారని అనుకుందాం. సవరణ తర్వాత 8.75 శాతం తగ్గుతుంది. దీంతో రూ.26,992 ఈఎంఐ కాస్తా రూ.26,551కు దిగొస్తుంది. ఈఎంఐలో రూ.480 (1.8 శాతం) మిగులుతుంది. (టేబుల్ 1)

ఈఎంఐ తగ్గేది ఇలా..

బ్యాంక్	రుణం మొత్తం	కాల వ్యవధి	ప్రస్తుత వడ్డీ రేటు (%)	తగ్గింపు తర్వాత కొత్త రేటు (%)	ప్రస్తుత ఈఎంఐ	కొత్త ఈఎంఐ (రూ.లలో)
ఎక్స్ బ్యాంక్	50,00,000	30 ఏళ్లు	8.75	8.5	39,335	38,446
వై బ్యాంక్	50,00,000	30 ఏళ్లు	9.55	9.3	42,225	41,315

రుణ వ్యవధి తగ్గింపు ఇలా..

వడ్డీ రేటు (శాతంలో)	చెల్లించాల్సిన మొత్తం వడ్డీ (రూ.లలో)	ఆదా అయ్యే మొత్తం (రూ.లలో)	రుణం తీరిపోయే కాలం ఎన్ని నెలల ముందు
9 (ఇంతకుముందు వరకు)	57,96,711	0	240 నెలలు 0
8.75 (తగ్గింపు తర్వాత)	53,60,243	4,36,467	230 నెలలు 10 నెలలు
8.50 (మరో పావు శాతం తగ్గితే)	49,77,144	8,19,567	222 నెలలు 18 నెలలు



అమలుకు ఎంత సమయం?

బ్యాంక్‌లు 2019 అక్టోబర్ నుంచి అన్ని ఫ్లోటింగ్ రేటు రిటైల్ రుణాలను (గృహ రుణాలు సహా) ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్‌తో అనుసంధానించాయి. చాలా బ్యాంక్‌లు రెపో రేటునే ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్‌గా అనుసరిస్తున్నాయి. కనుక రెపో రేటులో మార్పులు రుణాలపై వేగంగా ప్రతిఫలించనున్నాయి. బ్యాంక్‌లు వడ్డీ రేట్లను ప్రతి త్రైమాసికానికి ఒకసారి సమీక్షించాలని ఆర్‌బీఐ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఎంసీఎల్‌ఆర్ ఆధారిత రుణాలు, దీనికంటే ముందున్న బేస్ రేటు ఆధారిత రుణాలపై రేటు తగ్గింపు అమల్లోకి రావడానికి 3 నెలల నుంచి 6 నెలల సమయం తీసుకోవచ్చు. ''రెపో లింక్డ్ రుణాలపై ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపు వేగంగా అమల్లోకి వస్తుంది. కొత్తగా రుణాలు తీసుకునే వారికీ ఈ మేరకు తక్కువ రేటుపై రుణాలు లభిస్తాయి. ఇప్పటికే తీసుకున్న రుణాలపై రేటు తగ్గింపు అన్నది సమీక్షించే తేదీపైనే ఆధారపడి ఉంటుంది. అప్పటి వరకు ప్రస్తుతం మాదిరే రుణాలకు చెల్లింపులు కొనసాగించాలి'' అని పైసాబజార్ సీఈవో, సహ వ్యవస్థాపకుడు నవీన్ కుక్రెజా తెలిపారు.

ఇలా చేస్తే అధిక ప్రయోజనం..

- క్రెడిట్ స్కోరు పెంచుకునేందుకు ప్రయత్నించాలి. మెరుగైన క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి బ్యాంక్‌లు గృహ రుణాలను 0.25 శాతం తక్కువకే ఇస్తుంటాయి.
- గృహ రుణాన్ని వీలైనంత తక్కువ కాలానికి ఎంపిక చేసుకోవాలి. 20 ఏళ్ల కాలం మించకుండా చూసుకోవాలి. కొత్త పన్ను విధానంలో గృహ రుణంపై ఎలాంటి పన్ను ప్రయోజనాల్లేవు.
- భవిష్యత్తులో రేట్లు తగ్గే అవకాశాలే ఎక్కువ. కనుక రెపో ఆధారిత రుణం తీసుకోవడమే మంచిది.
- వీలైనంత అధిక డౌన్ పేమెంట్ ముందే సమకూర్చుకుని, రుణం మొత్తాన్ని తగ్గించుకోవాలి.
- రుణ కాలవ్యవధి మరో 15 ఏళ్లు మిగిలి ఉంటే, ప్రస్తుత రుణ రేటు కంటే తక్కువ రేటుపై ఆఫర్ చేస్తున్న బ్యాంక్‌కు బదిలీ చేసుకోవడం వల్ల పెద్ద మొత్తం ఆదా అవుతుంది.
- ఏటా వీలైనంత మేర ఈఎంఐ పెంచి చెల్లించడం వల్ల రుణాన్ని వేగంగా ముగించేయొచ్చు.

కొత్తగా రుణం తీసుకునే వారికీ ఊరట



ఈ ఏడాది ఆర్‌బీఐ మరో 25–50 బేసిస్ పాయింట్ల వరకు రెపో రేటును తగ్గించొచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. అర శాతం రేటు తగ్గడం వల్ల మిగిలే ప్రయోజనం ఎంతన్నది పైనున్న టేబుల్–2లో గమనించొచ్చు. ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణం డేటాపైనే భవిష్యత్తు రేట్ల తగ్గింపు ఆధారపడి ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ''మరో 50–75 బేసిస్ పాయింట్ల తగ్గింపు అన్నది ద్రవ్యోల్బణం స్థిరత్వం, అంతర్జాతీయ ద్రవ్య పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది'' అని పీఎల్ క్యాపిటల్ (ప్రభుదాస్ లీలాధర్) ఇనిస్టిట్యూషనల్ రీసెర్చ్ ఎకనామిస్ట్ అర్ష మోగ్రా అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది మరో 50 బేసిస్ పాయింట్ల తగ్గింపును అంచనా వేస్తున్నట్టు ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్ సీఈవో సందీప్ బగ్లా తెలిపారు.

తక్కువ రేటు రుణానికి మారిపోవడమే



ఆర్‌బీఐ భవిష్యత్తులోనూ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలున్నాయి. ఎంసీఎల్‌ఆర్ విధానంలో ఉన్న వారికి ఈ రేటు తగ్గింపు ప్రయోజనం బదిలీ ఆలస్యంగా లభిస్తుంది. కనుక ఇప్పటికే ఎంసీఎల్‌ఆర్ ఆధారిత లేదా దీనికంటే ముందున్న బేస్ రేటు విధానంలో గృహ రుణాలు తీసుకున్నవారు రీఫైనాన్సింగ్ (వేరొక సంస్థకు మారిపోవడం) ఆప్షన్‌ను పరిశీలించొచ్చు. ప్రముఖ బ్యాంక్‌లు రెపో నుంచి ఆఫర్ చేస్తున్నాయి. గృహ రుణ కాల వ్యవధి ఇంకా దీర్ఘకాలం పాటు ఉంటే గనుక తక్కువ రేటుపై ఆఫర్ చేసే బ్యాంక్‌కు బదిలీ చేసుకోవడాన్ని పరిశీలించొచ్చు. దీని ద్వారా పెద్ద మొత్తమే ఆదా చేసుకోవచ్చు. లేదంటే ఇప్పటికే తీసుకున్న రుణాన్ని అదే బ్యాంక్ పరిధిలో రెపో రేటు విధానంలోకి మార్చి, రేటు తగ్గించాలని కూడా కోరొచ్చు. అన్ని బ్యాంక్‌లు కాకపోయినా కొన్ని బ్యాంక్‌లు ఇందుకు అనుమతించొచ్చు. రెపో ఆధారిత గృహ రుణ గ్రహీతలు సైతం మరింత తక్కువ రేటును ఆఫర్ చేస్తున్న బ్యాంక్/ఎన్‌బీఎఫ్‌సీకి మారిపోవడం ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించుకోవచ్చని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్ శెట్టి సూచించారు. 0.35–0.50 శాతం రేటు తక్కువ ఉన్నా కానీ, బదిలీని పరిశీలించొచ్చన్నారు.

బేరమాడడమే..

మెరుగైన క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి బ్యాంక్‌లు కొంత తక్కువ రేటును ఆఫర్ చేస్తుంటాయి. కనుక 760కు పైన క్రెడిట్ స్కోర్ ఉన్న వారు బ్యాంక్ అధికారితో సంప్రదించి రేటు తగ్గించుకోవడంలో సఫలం కావొచ్చు.



ఇప్పటికే తీసుకున్న రుణంపై రేటు తగ్గించే విషయంలోనూ రుణ గ్రహీతల డిమాండ్‌ను అధికారులు అంగీకరించొచ్చు. లేదంటే మరొక బ్యాంక్‌కు రుణాన్ని బదిలీ చేసుకుంటామంటే దానికి బదులు రేటు తగ్గింపునకు వారు మొగ్గు చూపించొచ్చు. ముఖ్యంగా బ్యాంక్‌లకు బదులు ఎన్‌బీఎఫ్‌సీలు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు తక్కువ రేటుపై రుణ బదిలీ చేసుకునే వారిని ప్రోత్సహిస్తుంటాయి. ఇందుకు కొంత ప్రాసెసింగ్ చార్జీలను భరించాల్సి రావచ్చు.

ఎప్పుడు తీసుకున్నారు..?

గృహ రుణాన్ని ఐదేళ్ల క్రితం తీసుకున్న వారితో పోల్చితే ఏడాది క్రితం తీసుకున్న వారికి .. తాజా రేటు తగ్గింపుతో మిగులు ఎక్కువగా లభిస్తుంది. ఉదాహరణ: రూ.75 లక్షల రుణాన్ని 20 ఏళ్లకు (240 నెలలు) 9 శాతం రేటుపై తీసుకున్నారు. దీనికి చెల్లించాల్సిన నెలవారీ ఈఎంఐ రూ.67,479. ఇలా 20 ఏళ్ల కాలలో మొత్తం చెల్లించాల్సింది రూ.1.62 కోట్లు. ఇందులో వడ్డీ రూ.87 లక్షలు. ఇప్పుడు రుణంపై వడ్డీ రేటు 9 శాతం నుంచి 8.75 శాతానికి దిగొచ్చింది. దీంతో గృహ రుణం తీసుకుని ఏడాది, రెండేళ్లు, మూడేళ్లు, నాలుగేళ్లు, ఐదేళ్లు పూర్తయిన వారు.. ఇంతకుముందు మాదిరిగా అదే ఈఎంఐని చెల్లిస్తూ వెళితే మిగిలిన కాలంలో ఎంత మిగులుతుంది, ఎంత తొందరగా రుణం ముగుస్తుందో టేబుల్‌లో చూడొచ్చు.



ఒక్కొక్కరికి ఒక్కో విధంగా...

ఇప్పటికే చెల్లించిన ఈఎంఐలు	20 ఏళ్లలో చెల్లించాల్సిన మొత్తం (రూ.కోట్లలో)	ఇందులో వడ్డీ మొత్తం (రూ.లక్షల్లో)	నికర వడ్డీ మిగులు (రూ.లక్షల్లో)	తగ్గిన కాల వ్యవధి
12 నెలలు	1.553	80.3	6.6	9 నెలలు
24 నెలలు	1.562	81.2	5.8	8 నెలలు
36 నెలలు	1.569	82	4.9	7 నెలలు
48 నెలలు	1.576	82.7	4.3	6 నెలలు
60 నెలలు	1.583	83.3	3.6	5 నెలలు

పాక్షిక చెల్లింపుతో ఇంకా ఆదా

గృహ రుణ చెల్లింపుల భారం తగ్గించుకునేందుకు అందుబాటులోని మార్గాల్లో పాక్షిక చెల్లింపులు ఒకటి. ఏటా ఆదాయం ఎంతో కొంత పెరుగుతుంటుంది. కనుక గృహ రుణ ఈఎంఐని ఏటా 5 శాతం పెంచి చెల్లిస్తూ వెళ్లాలి. దీని ఫలితం ఎలా ఉంటుందో అర్థం చేసుకునేందుకు చిన్న ఉదాహరణ చూద్దాం. రూ.75 లక్షల రుణాన్ని 9 శాతం రేటుపై 25 ఏళ్ల కాలానికి తీసుకున్నారు. దీనిపై నెలవారీ రూ.62,940 ఈఎంఐగా చెల్లిస్తున్నారు. ఇలా చెల్లించినట్టయితే కాల వ్యవధి పూర్తయ్యే నాటికి చెల్లించే మొత్తం రూ.1.89 కోట్లు. ఇందులో వడ్డీయే రూ.1.14 కోట్లు. ఇప్పుడు ఈఎంఐని ఏటా 5 శాతం పెంచి చెల్లించడం వల్ల 25 ఏళ్లకు బదులు 13 ఏళ్లకే రుణం తీరిపోతుంది. అసలు, వడ్డీ కలిపి చెల్లించే మొత్తం కూడా రూ.1.37 కోట్లకు తగ్గుతుంది. తద్వారా రూ.52 లక్షలు ఆదా అవుతాయి.

పన్ను ఆదాతో కలిపితే ఆదా ఎక్కువే

''రూ.25 లక్షల స్థూల ఆదాయం కలిగిన వ్యక్తి రూ.50 లక్షల గృహ రుణం తీసుకుని (20 ఏళ్ల కాలం, 9 శాతం రేటు) 2025 మార్చి నాటికి 12 ఈఎంఐలు చెల్లించినట్టయితే.. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.1.37 లక్షలను ఆదా చేసుకోవచ్చు. అంటే నెలవారీగా రూ.11,461. గృహ రుణం రేటును పావు శాతం తగ్గించడం, అధిక శ్లాబుల్లోని వారికి బడ్జెట్‌లో ప్రకటించిన పన్ను రాయితీలతో ఈ మొత్తం మిగలనుంది'' అని బ్యాంక్ బజార్ ఆదిల్ శెట్టి వివరించారు.

ఆటో రుణాలపై తక్కువే

రూ.10 లక్షల ఆటో రుణాన్ని ఐదేళ్ల కాలానికి 10 శాతం రేటుపై తీసుకుని రూ.21,247 ఈఎంఐ కింద చెల్లిస్తున్నారని అనుకుందాం. తగ్గింపు తర్వాత వడ్డీ రేటు 9.75 శాతానికి దిగొచ్చింది. ఇంతకుముందు మాదిరే రూ.21,247 ఈఎంఐ చెల్లిస్తూ వెళితే.. రుణం మూడు నెలల ముందుగా తీరిపోతుంది. వడ్డీ రూపంలో రూ.15,000 ఆదా అవుతుంది.

బంగారం లాభాలపై పన్ను ఎంత?

గోల్డ్ ఫండ్స్ లేదా ఈటీఎఫ్‌లలో పెట్టుబడులపై ఏ మేరకు పన్ను ఎలా విధిస్తారు?
– గిరిరాజ్


మీరు ఏ తరహా బంగారం సాధనంలో ఇన్వెస్ట్ చేశారన్న అంశంపైనే పన్ను ఆధారపడి ఉంటుంది. గోల్డ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్‌వోఎఫ్)లో పెట్టుబడులు పెట్టినట్టయితే.. వాటిని రెండేళ్ల పాటు కొనసాగించిన తర్వాత విక్రయిస్తే.. అప్పుడు దీర్ఘకాల మూలధన లాభాల పన్ను కిందకు వస్తుంది. లాభంపై 12.5 శాతం పన్ను చెల్లించాలి. రెండేళ్లలోపు విక్రయిస్తే వాటిని స్వల్పకాల మూలధన లాభాల పన్ను కింద పరిగణిస్తారు. ఈ మొత్తం వార్షిక ఆదాయానికి కలిపి, నిబంధనల మేరకు పన్ను చెల్లిస్తే సరిపోతుంది. గోల్డ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ అన్నవి గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెడుతుంటాయి. ఇవి మ్యూచువల్ ఫండ్స్ కనుక స్వల్ప మొత్తం నుంచి సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అదే గోల్డ్ ఈటీఎఫ్‌లు అయితే ఇవి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో ట్రేడ్ అవుతుంటాయి. ఏడాది తర్వాత పెట్టుబడులు విక్రయిస్తే వచ్చే లాభంపై 12.5 శాతం పన్ను పడుతుంది. ఏడాదిలోపు విక్రయించగా వచ్చిన లాభం ఇన్వెస్టర్ వార్షిక ఆదాయానికి కలుస్తుంది. గోల్డ్ ఈటీఎఫ్‌లలో ఎక్స్‌పెన్స్ రేషియో (ఫండ్స్ సంస్థ వసూలు చేసే చార్జీ) తక్కువగా ఉంటుంది. వ్యయాల పరంగా చౌక. కాకపోతే వీటిల్లో ఇన్వెస్ట్ చేసేందుకు డీమ్యాట్, ట్రేడింగ్ అకౌంట్ అవసరం అవుతాయి. గోల్డ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్‌లో అయితే డీమ్యాట్, ట్రేడింగ్ ఖాతాలు అవసరం లేకుండానే ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో రాబడులపై ఆర్‌బీఐ వడ్డీ రేట్ల ప్రభావం ఉంటుందా?
– ఇస్మాయిల్

ఆర్‌బీఐ రెపో రేటును 0.25 శాతం (25 బేసిస్ పాయింట్లు) తగ్గించడంతో 6.25 శాతానికి దిగొచ్చింది. దీనికి డెట్ మ్యూచువల్ ఫండ్స్ ఎలా స్పందిస్తాయో అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యం. వడ్డీ రేట్లు తగ్గినప్పుడు డెట్ మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని బాండ్లు (అధిక కూపన్ రేటుతో ఉన్నవి) మరింత విలువను సంతరించుకుంటాయి. ఎందుకంటే కొత్తగా జారీ చేసే బాండ్లతో పోల్చినప్పుడు అంతకుముందు కొనుగోలు చేసినవి ఎక్కువ వడ్డీ రేటును ఆఫర్ చేస్తాయి. ఫలితంగా ఆయా బాండ్ల ధరలు పెరుగుతాయి. దీంతో సంబంధిత డెట్ మ్యూచువల్ ఫండ్స్ ఎన్‌ఏవీ కూడా ఆ మేరకు లాభపడుతుంది. వడ్డీ రేట్ల క్షీణత ప్రభావం లాంగ్ డ్యురేషన్ ఫండ్స్‌పై ఎక్కువగా ఉంటుంది. అధిక రేటు బాండ్లలో చేసిన పెట్టుబడులతో లాంగ్ టర్మ్ డెట్ ఫండ్స్ ఎక్కువ లాభపడతాయి. దీనికి వ్యతిరేకంగా వడ్డీ రేట్లు పెరిగే క్రమంలో లాంగ్ డ్యురేషన్ ఫండ్స్‌పై ప్రతికూల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే కొత్తగా జారీ చేసే బాండ్లు అధిక రేటును ఆఫర్ చేస్తుంటాయి. దీంతో అప్పటికే ఫండ్స్ పోర్ట్‌ఫోలియోలో ఉన్న బాండ్లపై రేటు తక్కువగా ఉండడంతో అవి ఆకర్షణీయత కోల్పోతాయి. దీంతో ఆయా బాండ్ల ధరలు పడిపోతాయి. దీని ఫలితంగా వాటి ఎన్‌ఏవీ కూడా క్షీణిస్తుంది. ఈ ధరల ఆధారిత ప్రయోజనానికి అదనంగా.. డెట్ ఫండ్స్‌కు వాటి నిర్వహణలోని బాండ్ల రూపంలో వడ్డీ ఆదాయం కూడా వస్తుంటుంది. వడ్డీ రేట్లలో మార్పులు చోటుచేసుకున్నప్పుడు డెట్ ఫండ్స్ తిరిగి చేసే పెట్టుబడులపై ఆ మేరకు ప్రభావం ఉంటుంది. ఇవన్నీ ఆయా ఫండ్స్‌లో పెట్టుబడులపై రాబడులను ప్రభావితం చేస్తుంటాయి. డెట్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్లు ఈ అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
విదేశీ అంశాలు, ఎఫ్‌పీఐల చేతుల్లోనే
ఈ వారం 2 ఐపీవోలు 10 లిస్టింగ్‌లు

మహీంద్రా మాన్యులైఫ్ వేల్యూ ఫండ్

వేల్యూ ఇన్వెస్టింగ్ విధానంలో పెట్టుబడుల ద్వారా దీర్ఘకాలికంగా సంపద వృద్ధిని కోరుకునే ఇన్వెస్టర్ల కోసం మహీంద్రా మాన్యులైఫ్ ఎంఎఫ్ తాజాగా మహీంద్రా మాన్యులైఫ్ వేల్యూ ఫండ్‌ను ప్రవేశపెట్టింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 21 వరకు అందుబాటులో ఉంటుంది. ఫండమెంటల్‌గా పటిష్టమైన, ఉండాల్సిన విలువ కన్నా తక్కువ స్థాయిలో ట్రేడవుతున్న కంపెనీల షేర్లలో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. తద్వారా నిలకడగా మెరుగైన రాబడులను అందించేందుకు ప్రయత్నిస్తుంది. ఫండమెంటల్ రీసెర్చ్, వేల్యుయేషన్ ఆధారిత స్టాక్స్‌ను ఎంచుకునే విధంగా ఈ ఫండ్ నిర్వహణ ఉంటుందని చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ కృష్ణ సంఘవి తెలిపారు. పోటీ సంస్థలతో పోలిస్తే పైచేయి కలిగి ఉండి, భారీ వృద్ధి అవకాశాలు, పటిష్టమైన ఆర్థిక స్థితిగతులుండి తక్కువ ధరలో ట్రేడవుతున్న సంస్థల షేర్లతో వైవిధ్యభరితమైన పోర్ట్‌ఫోలియోను రూపొందించడం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నిలకడగా సంపద సృష్టికి వేల్యూ ఇన్వెస్టింగ్ విధానం సహాయకరంగా ఉంటుందని కంపెనీ ఎండీ ఆంథోనీ హెరెడియా తెలిపారు. మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకుంటూ, ప్రధాన స్టాక్స్‌తో పటిష్టమైన పోర్ట్‌ఫోలియోను నిర్మించుకోవాలనుకునే ఇన్వెస్టర్లకు ఇది అనువుగా ఉంటుందని పేర్కొన్నారు.

టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ స్మార్ట్ పెన్షన్ సెక్యూర్ ప్లాన్

జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్న నేపథ్యంలో రిటైర్మెంట్ ప్రణాళికలు కూడా మారుతున్నాయి. ఈ నేపథ్యంలోనే టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ కొత్తగా స్మార్ట్ పెన్షన్ సెక్యూర్ ప్లాన్‌ను ఆవిష్కరించింది. 45 ఏళ్లకే రిటైర్ అయినా అధిక స్థాయిలో ప్రయోజనాలు అందించే విధంగా ఇదొక వినూత్నమైన యూనిట్ లింక్డ్ పెన్షన్ ప్లాన్ అని సంస్థ తెలిపింది. ఇందులో రెండు ప్లాన్ ఆప్షన్లు ఉంటాయి. ఫండ్ స్విచింగ్, గణనీయమైన డెత్ బెనిఫిట్స్ అందించే స్మార్ట్ పెన్షన్ సెక్యూర్ ఒకటి కాగా, ప్రీమియం వెయివర్ ప్రయోజనాలను అందించే స్మార్ట్ పెన్షన్ సెక్యూర్ ప్లస్ ప్లాన్ మరొకటి. 35 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వరకు వయస్సు గలవారు దీన్ని తీసుకోవచ్చు. కనిష్టంగా పదేళ్ల నుంచి గరిష్టంగా 85 ఏళ్ల వరకు ప్రయోజనాలను పొందవచ్చు.

వన్97 కమ్యూనికేషన్స్ | బ్రోకరేజ్: జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 724 టార్గెట్: రూ. 1,250

ఎందుకంటే: పేటీఎమ్ బ్రాండుతో సేవలందిస్తున్న ఫిన్‌టెక్ దిగ్గజం వన్97 కమ్యూనికేషన్స్ ఈ ఏడాది అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో రూ. 1,830 కోట్ల ఆదాయం అందుకుంది. త్రైమాసికవారీగా(క్యూ2తో పోలిస్తే) 10 శాతంపైగా వృద్ధి ఇది. ఇందుకు పేమెంట్స్ స్థూల మెర్కండైజ్ విలువ(జీఎంవీ) త్రైమాసికవారీగా 13 శాతం పుంజుకోవడం తోడ్పాటునిచ్చింది. ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగం సాధించిన భారీ వృద్ధి సైతం ఇందుకు జత కలిసింది. అధిక టేక్(వడ్డీ) రేట్లతో మర్చంట్ రుణాల విడుదల త్రైమాసికవారీగా 16 శాతం జంప్‌చేయడం ఇందుకు సహకరించింది. వెరసి ఫైనాన్షియల్ సర్వీసుల విభాగంలో టేక్ రేట్ క్యూ2తో పోలిస్తే 1.88 శాతం మెరుగుపడింది. ఇందుకు మర్చంట్ రుణాల పంపిణీలో 80 శాతం(రూ. 3,100 కోట్లు) రుణాలు ఫస్ట్ లాస్ డిఫాల్ట్ గ్యారంటీ(ఎఫ్ఎల్‌డీజీ)లోనే నమోదుకావడం, మర్చంట్ రుణాల గరిష్ట మిక్స్, బలపడిన వసూళ్ల సామర్థ్యం సానుకూల ప్రభావం చూపాయి. ఇది మర్చంట్ రుణాలపై అధిక ప్రోత్సాహకాలకు దారిచూపింది. ఓవైపు వ్యక్తిగత రుణాలు త్రైమాసికవారీగా 12 శాతం క్షీణించాయి. అయితే ఇదే సమయంలో వేగంగా పెరుగుతున్న డిమాండ్ కారణంగా మర్చంట్ రుణాలలో 16 శాతం పురోగతి నమోదైంది. క్యూ2తో పోలిస్తే మార్కెటింగ్ సర్వీసుల ఆదాయం 12 శాతం క్షీణించింది. అయితే ఈవెంట్ల టికెటింగ్ బిజినెస్‌ను మినహాయిస్తే ఫ్లాట్‌గా నమోదైంది. ఫ్రంట్ ఎండెడ్ డిఫాల్ట్ లాస్ గ్యారంటీ(డీఎల్‌జీ) ఖర్చులను ఇతర ప్రత్యక్ష వ్యయాలలో నమోదు చేయడంతో కంట్రిబ్యూషన్ మార్జిన్లు త్రైమాసికవారీగా 1.3 శాతం క్షీణించాయి.

అసోసియేటెడ్ ఆల్కహాల్స్ | బ్రోకరేజ్: మోనార్క్ నెట్‌వర్త్ | కొనొచ్చు


ప్రస్తుత ధర: రూ. 1,143 టార్గెట్: రూ. 1,755

ఎందుకంటే: సుప్రసిద్ధ లిక్కర్ బ్రాండ్ల కాంట్రాక్ట్ తయారీ కంపెనీ అసోసియేటెడ్ ఆల్కహాల్స్ అండ్ బ్రూవరీస్ పటిష్ట కార్యకలాపాలు కలిగి ఉంది. బీ2బీ సరఫరాల విభాగాన్ని దాటి ప్రస్తుతం వినియోగదారు ఆధారిత ఫ్రాంచైజీవైపు అడుగులు వేస్తోంది. టకీలా తదితర ప్రీమియం విస్కీల తయారీలోకి సైతం విస్తరించింది. దేశవ్యాప్త కార్యకలాపాలపై దృష్టిపెట్టి సాగుతోంది. తద్వారా దేశీయంగా ప్రీమియం స్పిరిట్స్‌కు పెరుగుతున్న డిమాండును అందిపుచ్చుకునే ప్రణాళికలు అమలు చేస్తోంది. ధాన్యాలు పండే ప్రధాన ప్రాంతాలలో సమీకృత తయారీ ప్లాంట్లను కలిగి ఉండటం కంపెనీకి వ్యూహాత్మకంగా కలసి వస్తోంది. తయారీ వ్యయాలు ఆదాకావడంతోపాటు.. ఓవైపు లిక్కర్, మరోపక్క ఇథనాల్ తయారీకి వీలు చిక్కుతోంది. ఇటీవలే ప్రారంభించిన ఇథనాల్ తయారీ యూనిట్ కారణంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాలతో లబ్ధిని పొందనుంది. ఇది మరింత వృద్ధి బాటలో సాగేందుకు సహకరించనుంది. ప్రీమియం ధరల ప్రాడక్టుల తయారీపై పెట్టుబడులు, కార్యకలాపాల డైవర్సిఫికేషన్, పంపిణీ విస్తరణ వంటి అంశాలు కంపెనీ రీరేటింగ్‌కు దోహదం చేయనున్నాయి. 2000–2024 మధ్య కాలంలో రాడికో ఖైతాన్ తరహాలో కంపెనీ వేగంగా వృద్ధి సాధించేందుకు వీలున్నట్లు భావిస్తున్నాం. వెరసి 2024–27 మధ్య కాలంలో ఆదాయం వార్షికంగా 26 శాతం చొప్పున పురోగమించగలదని అంచనా. మెరుగైన నిర్వహణ సామర్థ్యం, ముడిసరుకుల వ్యయాలు తగ్గడం ఆదాయంలో వృద్ధికి సహకరించనున్నాయి. అయితే కొత్త ప్రాడక్టుల విడుదల ఆలస్యంకావడం, కొత్త మార్కెట్లలో బ్రాండ్ల అమ్మకాలు విస్తరించకపోవడం వంటివి కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

సీఈవో... జీతాలు అదరహో


- ఏడాదికి వందల కోట్ల రూపాయల వేతనం
- కోరినన్ని సదుపాయాలు, ప్రోత్సాహకాలు
- 2024లో రూ. 2.2 లక్షల కోట్ల వేతనం తీసుకున్న మస్క్
- స్టార్ బక్స్ సీఈవోకు నాలుగు నెలల్లో రూ.971 కోట్లు
- సత్య నాదెళ్లకు ఏటా రూ.2,661 కోట్లు
- సుందర్ పిచాయ్‌కి రూ.2,408 కోట్లు



కాలు బయటపెడితే ఖరీదైన కార్లు, చార్టర్డ్ విమానాల్లో ప్రయాణం.. రాత్రి పగలు అన్న తేడా లేకుండా నిత్యం కనిపెట్టుకొని ఉండే సేవకులు.. జీ హుజూర్ అనే యాజమాన్యాలు.. వీటన్నింటికీ మించి వందల కోట్ల రూపాయల వేతనాలు.. ప్రపంచ టాప్ కంపెనీల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల జీవితమిది. కంపెనీని లాభాల్లో నడిపించగలడు అని నమ్మితే ఎంత వేతనం, ఎన్ని సౌకర్యాలైనా ఇచ్చి సీఈవోగా నియమించుకునేందుకు కంపెనీలు వెనుకాడటంలేదు. అందుకే కొందరు సీఈఓలు కళ్లు చెదిరే వేతనాలు అందుకుంటున్నారు. అందుకు ఉదాహరణ స్టార్‌బక్స్ సీఈవో బ్రియాన్ నికోల్. ఆయన వారంలో మూడు రోజులే ఆఫీస్‌కు వస్తారు. అది కూడా 1,600 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఆఫీస్‌కు చేరుకుంటారు. ప్రయాణం, నివాసం.. ఇలా అన్ని ఖర్చులూ కంపెనీయే భరిస్తుంది. ఆయన ఏడాదికి 113 మిలియన్ డాలర్ల (రూ.971 కోట్లు) ప్యాకేజీ అందుకుంటున్నారు. బ్రియాన్ అమెరికాలోని టాప్–20 సీఈఓల్లో ఒకరు. –సాక్షి, బిజినెస్ డెస్క్

ఎందుకంత అధిక వేతనాలు?

భారత కంపెనీలు చాలా వేగంగా వృద్ధి చెందుతూ, అంతర్జాతీయంగా కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. ఫలితంగా అంతర్జాతీయ కంపెనీలకు పోటీగా దేశీ సీఈఓలకు సైతం అధికంగా పారితోషికాలు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని నిపుణులు చెబుతున్నారు. ఉద్యోగుల్లో టాప్ బాస్ అయిన సీఈఓనే కంపెనీ వ్యాపార విజయాలకు సూత్రధారి. కంపెనీలను విజయపథంలో నడపగలిగే సీఈఓలకు అంతర్జాతీయంగా అధికడిమాండ్ ఉంది. వారిని పారితోషికాలతో ప్రసన్నం చేసుకునేందుకు కంపెనీ బోర్డులు ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోవటంలేదు. సీఈఓల పారితోషికం షేర్ల కేటాయింపు రూపంలోనూ ఉంటుంది. షేర్ల ధరలు పెరగడం వారి పారితోషికాన్ని మరిన్ని రెట్లు చేయగలదు.



భారత్‌లో సగటు నెల వేతనం 10 కోట్లు

భారత్‌లో సీఈవోల సగటు నెల వేతనం రూ.10 కోట్లుగా ఉంది. అమెరికాలో ఇది 14-15 మిలియన్ డాలర్లు (రూ. 129 కోట్లు). అమెరికా కంపెనీల్లో సీఈఓ వేతనం సగటు ఉద్యోగి వేతనం కంటే 160-300 రెట్లు ఎక్కువగా ఉంది. మనదేశంలో నిఫ్టీ -50 కంపెనీల్లో సగటు ఉద్యోగి కంటే సీఈవో వేతనం 260 రెట్లు అధికం.

భారత్‌లో టాప్-10 సీఈఓల వార్షిక వేతనం (రూ. కోట్లలో)

పేరు	కంపెనీ	వేతనం	పేరు	కంపెనీ	వేతనం
అభయ్ భుటాడా	ఫిన్‌కార్ప్	241	వినయ్ ప్రకాశ్	అదానీ ఎంటర్‌ప్రైజెస్	89
థియరీ డెలాపోర్టే	విప్రో	167	కళానిధి మారన్	సన్‌టీవీ నెట్‌వర్క్	88
పవన్ ముంజాల్	హీరో మోటోకార్ప్	109	కావేరీ కళానిధి	సన్‌టీవీ నెట్‌వర్క్	88
సుధీర్‌సింగ్	కోఫోర్జ్	105	నవీన్ జిందాల్	జిందాల్ స్టీల్‌అండ్ పవర్	85
రాజీవ్ జైన్	బజాజ్ ఫైనాన్స్	101	సందీప్ కల్రా	పర్సిస్టెంట్ సిస్టమ్స్	77

నోట్: అభయ్ భుటాడా, థియరీ డెలాపోర్టే ఇప్పుడు ఆయా కంపెనీలతో లేరు

తెలుగు బిడ్డ సత్య నాదెళ్ల విజయపథం

హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన సత్య నాదెళ్ల మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివారు. యూఎస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్–మిల్‌వాకీలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ, యూనివర్సిటీ ఆఫ్ చికాగో నుంచి ఎంబీఏ పూర్తి చేసిన తర్వాత సన్ మైక్రో సిస్టమ్స్‌లో టెక్నికల్ స్టాఫ్ ఇంజనీర్‌గా పనిచేశారు. 1992లో మైక్రోసాఫ్ట్‌లో ప్రాజెక్ట్ మేనేజర్ బాధ్యతలు చేపట్టారు. అక్కడి నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ సీఈఓ అయ్యారు. 2014 ఫిబ్రవరిలో సంస్థ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన సత్య.. మైక్రోసాఫ్ట్‌ను మరిన్ని ఉన్నత శిఖరాలకు చేర్చారు. దీంతో 2021లో మైక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా పదోన్నతి పొందారు.



కంపెనీ	సీఈఓ వేతనం (రూ. కోట్లలో)	ఉద్యోగి సగటు వేతనం (రూ.లక్షల్లో)	ఎన్ని రెట్లు అధికం
ఇన్ఫోసిస్	66.25	9.63	677
ఎల్అండ్‌టీ	51.00	9.54	534
ఎయిర్‌టెల్	18.50	8.69	213
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	9.91	5.04	167
ట్రెంట్	7.09	2.07	178



‘రికార్డు’ స్థాయి నాట్యం

- 3 వేల మంది నాట్య ప్రదర్శన.. నాలుగు రికార్డుల నమోదు
- సమతాస్ఫూర్తి కేంద్రంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

శంషాబాద్ రూరల్ (హైదరాబాద్): మూడు వేల మంది చిన్నారులు.. నర్తించిన వివిధ నృత్య రూపకాలు నాలుగు రికార్డులను నమోదు చేశాయి. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ శివారులోని సమతాస్ఫూర్తి కేంద్రం ఇందుకు వేదికగా మారింది. సమతాకుంభ్–2025 తృతీయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఘంటసాల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో మూడు వేల మందితో మహాబృందం చేసిన నాట్యం ఆకట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల చిన్నారులు వివిధ నృత్య రూపకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇండియన్ వరల్డ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, నృత్య గోల్డెన్ స్టార్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను నమోదు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి చిన్నారులకు మంగళాశాసనాలు అందజేశారు.

ఉదయం 11కే మటన్ మాయం!

- ఒక్కసారిగా పెరిగిన మేక, గొర్రె మాంసం విక్రయాలు
- కిలోకు రూ.1,000కి పైగా ధర వసూలు చేసిన దుకాణదారులు
- బర్డ్‌ఫ్లూ, ఇతర వైరస్‌ల భయంతో చికెన్‌కు తగ్గిన డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ఆదివారం ఉదయం... 11.30 గంటల సమయం.. హైదరాబాద్‌లోని ఉప్పల్ ప్రాంతానికి చెందిన అరవింద్ మటన్ తీసుకురావడం కోసం బయల్దేరాడు.. తాను రెగ్యులర్‌గా వెళ్లే షాపు దగ్గరికి వెళ్లే సరికి మూసేసి ఉంది. దగ్గర్లోని మరో దుకాణానికి వెళితే బారెడంత క్యూ కనిపించింది. లేటవుతుందేమోనని మరో చోటికి వెళ్తే... మటన్ అయిపోయిందని చెప్పారు. దీనితో వెనక్కి వచ్చి క్యూలో నిలబడి అయినా తీసుకెళదామనుకుంటే... తన వంతు కూడా రాకముందే మటన్ అయిపోయిందంటూ దుకాణం కట్టేయడం మొదలుపెట్టారు.. అరవింద్ ఒక్కడికే కాదు, ఉప్పల్ ఒక్క ప్రాంతంలోనే కాదు.. ఆదివారం హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఇదే పరిస్థితి కనిపించింది. చెంగిచర్ల, జియాగూడ వంటి మటన్ మండీల్లోనూ మధ్యాహ్నానికే స్టాక్ ఖాళీ అయిపోయింది. మరోవైపు బర్డ్ ఫ్లూ, ఇతర వైరస్‌లతో కోళ్లు మృతిచెందుతున్నాయన్న వార్తలతో చికెన్ దుకాణాలు వెలవెలబోయాయి.

ధర విపరీతంగా పెరిగినా..

ఇటీవలి కాలంలో మటన్ ధరలు కిలో రూ.800 నుంచి రూ.900 వరకు చేరాయి. అలాంటిది డిమాండ్ పెరిగిపోవడంతో.. ఆదివారం చాలా చోట్ల కిలో రూ.1,000 నుంచి రూ.1,100 వరకు ధరతో విక్రయించారు. అయినా సరే మటన్ షాపుల వద్ద జనం కిటకిటలాడారు. కిలో తీసుకునే చోట అరకిలో, అరకిలో తీసుకునే చోట పావుకిలోనో, 400 గ్రాములో కొనుక్కుని వెళ్లారు.

ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు తగ్గడంతో..

సాధారణంగా మహారాష్ట్ర, రాజస్తాన్‌తోపాటు పలు ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు మేకలు, గొర్రెలు దిగుమతి అవుతాయి. అయితే బర్డ్ ఫ్లూ, ఇతర వైరస్‌ల ప్రభావం నేపథ్యంలో ఈ దిగుమతులు తగ్గిపోయాయి. వైరస్‌లు ఇతర ప్రాంతాలకు విస్తరించవద్దన్న ఉద్దేశంతో మేకలు, గొర్రెల రవాణాను నియంత్రిస్తున్నారని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీనితో రాష్ట్రంలోని జిల్లాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి అరకొరగా గొర్రెలు, మేకలను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడంతో.. ధరలు పెరిగాయని మీరాలం మండిలోని మక్బూల్, జియాగూడ మండిలో మేకల వ్యాపారి రమేశ్ తెలిపారు.

చికెన్‌కు తగ్గిన డిమాండ్

బర్డ్ ఫ్లూ, ఇతర వైరస్‌లతో పెద్ద సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయన్న వార్తలతో చికెన్‌కు డిమాండ్ ఒక్కసారిగా తగ్గిపోయింది. సాధారణంగా ప్రతి ఆదివారం కిటకిటలాడే చికెన్ సెంటర్లు... ఈ ఆదివారం వెలవెలబోయాయి. వైరస్ భయం కారణంగా ఎందుకైనా మంచిదంటూ.. చికెన్‌కు బదులు మటన్ తీసుకెళ్తున్నామని వినియోగదారులు చెబుతున్నారు. నిజానికి చికెన్‌ను 70 నుంచి 100 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద బాగా ఉడికించి తింటే ఎటువంటి హానీ ఉండదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఏసీబీ పేరిట ఫేక్‌కాల్స్

- ప్రభుత్వ ఉద్యోగులకు డబ్బులు డిమాండ్ చేస్తున్న కేటుగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలన్న ఏసీబీ డీజీ విజయ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ‘మీ పైన మాకు ఫిర్యాదు అందింది. మేం అడిగినన్ని డబ్బులు ఇస్తే.. మీపై ఏసీబీ కేసు నమోదు కాకుండా చూస్తాం’అంటూ ఏసీబీ అధికారుల పేరిట పలువురు ప్రభుత్వ ఉద్యోగులకు ఫేక్ ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. కొందరు వ్యక్తులు ఈ తరహా ఫేక్ ఫోన్‌కాల్స్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారుల పేరిట చేస్తున్నట్టు ఏసీబీ దృష్టికి వచ్చింది. దీనిపై ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ అప్రమత్తం అయ్యారు. డబ్బులు ఇస్తే కేసులు నమోదు చేయకుండా ఉంటామని ఏసీబీ అధికారుల పేరిట వచ్చే ఫేక్‌ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు. ఏసీబీ అధికారులు ఎవరూ ప్రభుత్వ ఉద్యోగులకు ఈ తరహా కాల్స్ చేయరని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఇలాంటి వ్యక్తుల ఉచ్చులో పడవద్దని సూచించారు. ఉద్యోగులతోపాటు సాధారణ ప్రజలు సైతం ఇలాంటి ఫేక్ ఫోన్‌కాల్స్ వచ్చినట్టు గుర్తిస్తే వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు లేదా స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అదేవిధంగా ఏసీబీ వాట్సాప్ నంబర్ 9440446106కు లేదా ఫేస్‌బుక్‌లో తెలంగాణ ఏసీబీ, లేదా ట్విట్టర్ @telanganaACBలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదుదారు వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
సోమవారం। 17-2-2025

ఇలాగేనా రెస్క్యూ?

సాక్షి, హైదరాబాద్: ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లాలోకి ఓ అడవిదున్న తప్పిపోయి వచ్చింది. అయితే దాన్ని సజీవంగా పట్టుకునేందుకు చేసిన రెస్క్యూ ఆపరేషన్ విఫలమైంది. పది రోజులపాటు ఈ దున్న కదలికలను ఆ జిల్లా పరిసరాల్లో అటవీశాఖ అధికారులు గుర్తించినా, జీవించి ఉండగా పట్టుకోలేకపోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోయే జాతికి చెందిన ఆ అడవిదున్న (ఇండియన్ బైసన్) మృతి చెందడం పట్ల పర్యావరణవేత్తలు, జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తంచేశారు. అరుదైన జంతువులు, వన్య ప్రాణులను రక్షించాల్సిన అటవీశాఖ సన్నద్ధత, సంసిద్ధత, పరిమితులను ఈ ఘటన స్పష్టం చేస్తోందంటున్నారు. గతంలోనూ ఓ చిరుత, కొన్ని జంతువుల రెస్క్యూలో అటవీ అధికారులు, సిబ్బంది విఫలమైన విషయాన్ని గుర్తుచేసుకుంటున్నారు. రెస్క్యూలో అటవీశాఖకు ఓ స్పష్టమైన విధానం, కార్యాచరణ లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు, ఆపదలో ఉన్న జంతువులు, వన్యప్రాణులను కాపాడేందుకు, వెంటనే స్పందించేందుకు క్విక్ రెస్పాన్స్ టీమ్ (క్యూఆర్‌టీ) ఏర్పాటు చేస్తున్నామంటూ గతంలో చేసిన ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

అటవీశాఖకు కొరవడిన స్పష్టమైన విధానం, కార్యాచరణ

- ఏవో తాత్కాలిక పద్ధతులతో నెట్టుకొస్తున్న వైనం
- ఇటీవల నల్లగొండ జిల్లాలో అడవిదున్నను కాపాడటంలో విఫలం
- అది అంతరించిపోయే జాతికి చెందినదిగా గుర్తింపు



చౌటుప్పల్ మండల పరిధిలోని చిన్నకోడూరులో సంచరిస్తున్న అడవిదున్న

అసలేం జరిగిందంటే..

మేత, నీటికోసం వెతుక్కుంటూ దారితప్పిన దున్న చౌటుప్పల్ మండలం చిన్నకోడూరు గ్రామ సరిహద్దుల్లో కొందరికి కనిపించింది. ఎక్కడ జనవాసాల్లోకి వస్తుందోననే భయంతో దాన్ని బైక్‌లు, ఇతర వాహనాలపై నాలుగు గంటలపాటు వెంబడించారు. అప్పటికే ఆకలి, దప్పికతో ఉన్న దున్న పరిగెడుతూ డీ హైడ్రేషన్‌కు గురైంది. నోటి నుంచి నురగలు కక్కుతూ దయనీయస్థితికి చేరింది. దాన్ని రక్షించి, వైద్యం అందించి సురక్షిత ప్రాంతానికి తరలించే రెస్క్యూ టీమ్ అక్కడికి ఆలస్యంగా చేరుకుంది. వరంగల్ జూ నుంచి రెస్క్యూ టీమ్, నెహ్రూ జూపార్కు నుంచి వచ్చిన వెటరేరియన్ మత్తుమందు ఇచ్చి దున్నను నిలువరించే ప్రయత్నం చేశారు. వాహనంలోకి ఎక్కించి దానిని చికిత్స కోసం తరలిస్తున్న క్రమంలో అది అప్పటికే చనిపోయినట్టు గుర్తించారు.



ఆత్మకూరు(ఎం) మండల పరిధిలోని పల్లెర్లలో అడవిదున్న

ఇప్పుడేం చేయాలి?

- రాష్ట్రంలో వన్యప్రాణులు, జంతువులకు సంబంధించి ఎక్కడైనా అనుకోని సంఘటన లేదా ఆపద ఎదురైనా, అడవుల్లో అగ్నిప్రమాదాల వంటి ఘటనలు జరిగినా త్వరితంగా స్పందించేలా బృందాలను వెంటనే ఏర్పాటు చేయాలి.
- పాతబడిన వాహనాలను తొలగించి, కొత్త వాహనాలను అందుబాటులోకి తేవాలి. ట్రాంకిలైజర్ గన్స్, ఇతర సామగ్రిని అందుబాటులో ఉంచాలి.
- రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను కవర్ చేసేలా రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేయాలి.
- జంతువుల తీరుపై వెటర్నరీ డాక్టర్లకు శిక్షణ ఇచ్చి తగిన సంఖ్యలో సిబ్బందిని నియమించాలి.

ఉన్నవి రెండు బృందాలే..

రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్క్, వరంగల్‌లోని కాకతీయ జూపార్క్‌లో తాత్కాలిక ఏర్పాట్లతో రెండు బృందాలు పనిచేస్తున్నాయి. వీటికి రెస్క్యూ వెహికిల్స్, వెటరేరియన్లు ఉన్నా రు. రాష్ట్రంలో ఎక్కడ వన్యప్రాణులు, అటవీ జంతువులను కాపాడాల్సి వచ్చి నా.. ఏ ప్రాంతానికి దగ్గరగా ఉంటే అక్కడి నుంచి వాహనం, సిబ్బందిని పంపిస్తున్నారు. అయితే ఈ బృందాలు పాతబడిన వాహనాలు, పరికరాలు, సామగ్రితోపాటు ఏవో తాత్కాలిక పద్ధతులతో నెట్టుకొస్తున్నాయి.



ఆలయ ముఖ మండపం వద్ద బారులు తీరిన భక్తులు

కిటకిటలాడిన యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో శ్రీస్వామి దర్శనానికి వచ్చారు. దీంతో స్వామివారి ధర్మదర్శనానికి 3 గంటలు, వీఐపీ దర్శనానికి 45 నిమిషాల సమయం పట్టింది. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.44,14,051 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.



అన్నారం అడవుల్లో అన్వేషిస్తున్న అటవీశాఖ ఉద్యోగులు

పెద్దపులి కోసం ముమ్మర గాలింపు

మహదేవపూర్, అన్నారం, బీరాసాగర్‌లో ట్రాకింగ్ కెమెరాల ఏర్పాటు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం, మహదేవపూర్ అడవుల్లో వారం రోజులుగా కలియతిరుగుతున్న పులి కోసం అటవీశాఖ ఉద్యోగులు గాలింపు ముమ్మరం చేశారు. మొదట కాటారం మండలం నస్తూర్‌పల్లి వద్ద పులి పాదముద్రలను స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. పులి రెండు రోజులుగా మహదేవపూర్‌లోని బీరాసాగర్, కుదురుపల్లి అటవీ ప్రాంతాల్లో తిరిగినట్లు స్థానికులు తెలిపారు. రోజుకో వైపు పులి (పగ్‌మార్క్) పాదముద్రలు లభిస్తుండడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం అన్నారం అడవుల నుంచి గుండ్రాత్‌పల్లి వద్ద పులి తిరిగినట్లు ఆధారాలు లభించడంతో.. అన్నారం, బీరాసాగర్, మహదేవపూర్ అడవుల్లో అక్కడక్కడా ట్రాకింగ్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు రేంజర్ రవికుమార్ తెలిపారు. మహదేవపూర్, కాటారం మండలాల రేంజ్ పరిధిలో ఆరు బృందాలు పులి కోసం అన్వేషిస్తున్నాయి. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పులి కనిపిస్తే తమకు తెలియజేయాలంటూ గ్రామాల్లో కార్యదర్శులతో టాంటాం చేస్తున్నారు.



చిరుధాన్యాలపై రైతుల అనాసక్తి

యాదాద్రి జిల్లాలో పడిపోతున్న సాగు విస్తీర్ణం

వరి, పత్తి పంటల సాగుకే రైతుల మొగ్గు

రామన్నపేట: గడ్డిజాతి పంటలైన చిరుధాన్యాల సాగు విస్తీర్ణం ఏటేటా పడిపోతోంది. ఆహారం, పశుగ్రాసం కోసం సాగుచేసే చిరుధాన్యాలను సిరిధాన్యాలు అని కూడా అంటారు. మంచిపోషకాలు కలిగిన చిరుధాన్యాలు వర్షాధార పంటలు. సజ్జలు, జొన్నలు, రాగులు, కొర్రలు, అరికెలు వంటి చిరుధాన్యాలు గోధుమలతో సరితూగుతాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో సాగునీటి వనరులు పెరగడంతో రైతులు వరిసాగుకే మొగ్గు చూపుతున్నారు. ఆ తరువాత వాణిజ్య పంట అయిన పత్తిని పెద్దమొత్తంలో సాగు చేస్తున్నారు.



గతంలో సగం చిరుధాన్యాలే

చిరుధాన్యాలను సాధారణంగా వానాకాలంలోనే సాగు చేస్తారు. స్వల్ప ఖర్చుతో సేంద్రియ పద్ధతుల్లో రసాయనాలు వాడకుండా పండించేవారు. 10–15 సంవత్సరాల క్రితం వరకు సాగులో సగం వరకు చిరుధాన్యాల పంటలే ఉండేవి. వీటిలో అధిక దిగుబడి ఇచ్చే వంగడాలు, నాణ్యమైన విత్తనాలు లేకపోవడం.. ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో సాగు విస్తీర్ణం ఏటా పడిపోతోంది. పిట్టల నుంచి కాపాడుకోవడం కష్టతరంగా మారడం, ఇటీవలి కాలంలో కోతుల బెడద ఎక్కువ అవడం, సాగునీటి వనరులు మెరుగు పడడం కూడా చిరుధాన్యాల సాగు తగ్గడానికి కారణంగా మారాయి.


ఆరోగ్యానికి మేలు

దశాబ్దం క్రితంవరకు సామాన్యుడి ఆహారంలో చిరుధాన్యాలతో వండే సజ్జగట్క, జొన్నగట్క, రొట్టెలు, రాగిజావను ఎక్కువగా ఉండేవి. వీటిలో అధిక పోషకాలు ఉండడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేసేవి. విటమిన్ బీ 12, బీ 17, బీ 6ను కలిగి ఉండడం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులకు చాలా మంచిది. ఇటీవ చిరుధాన్యాలను భుజించడం సర్వసాధారణమైంది. అయితే పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సాగు విస్తీర్ణం పెరగడం లేదు. పైగా ప్రతి ఏటా తగ్గుతూ వస్తుంది.



యాదాద్రి జిల్లాలో చిరుధాన్యాల సాగు వివరాలు (ఎకరాలలో)

పంట	2024	2023	2022	2021	2020
సజ్జ	0.27	–	–	2.10	–
జొన్న	436	68.18	86.19	691	2192
కొర్ర	2.12	0.20	–	0.10	39
మొక్కజొన్న	70	81.03	104	150	1,591
రాగులు	0.10	0.01	–	6.03	6
చిరుధాన్యం	2019	2018	2017	2016	
సజ్జ	4.35	16	65	110	
జొన్న	1,721	1,470	3,310	1,552	
కొర్ర	274	–	3	–	
మొక్కజొన్న	3,004	2,848	4,966	3,700	
రాగులు	1,937	–	3	–	



రాజన్న ఆలయ ప్రధాన ద్వారం ముందు, వేములవాడ మెయిన్‌రోడ్డు

పురాతన చిత్రాలతో పరవశం

దక్షిణకాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న క్షేత్రానికి సంబంధించిన పురాతన చిత్రాలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈనెల 25 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో.. దశాబ్దాల నాటి ఫొటోలు సోషల్‌మీడియాలో ఆకట్టుకుంటున్నాయి. నాటి ఆలయ గోపురం, ధర్మగుండం, దూరప్రాంతాల నుంచి బస్సులో వచ్చిన భక్తుల నలుపు తెలుపు చిత్రాలు చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు.


– వేములవాడ

ఆలయంలోని గండదీపం





నాటి రాజన్న ఆలయం



నాటి ధర్మగుండం చిత్రం





రాజకీయ వ్యవస్థలో రావాల్సిన మార్పుపై యువతతో జరిగిన చర్చను తాను ఎంజాయ్ చేసినట్లు పేర్కొన్న కేటీఆర్ 'ఎక్స్'లో ఈ చిత్రాలను పోస్ట్ చేశారు.




వర్ణాల పొద్దు


ఉదయాస్తమయాలు ఎప్పుడూ మనోహరమే. ప్రకృతి ప్రేమికులకు పరవశమే. పగలంతా వెలుగులు నింపే భానుడు.. సాయంసంధ్య వేళ కాషాయరంగులో నిష్క్రమించడం అద్భుతమే. పెద్దపల్లి శివారులో సూర్యాస్తమయమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





అలిపిరి..వాహన ఝరి



సెలవు రోజు కావడంతో ఆదివారం తిరుమలకు భక్తులు పోటెత్తారు. తిరుపతిలోని అలిపిరి భద్రతా కేంద్రం నుంచి గరుడ సర్కిల్ వరకూ కార్లు, ఇతర వాహనాలు పెద్ద సంఖ్యలో బారులు తీరాయి

- సాక్షి, ఫొటోగ్రాఫర్,తిరుపతి

జనసంద్రం..



విశాఖ ఆర్కేబీచ్‌కు ఆదివారం సాయంత్రం పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఎండలు మండిపోతుండటంతో సముద్ర తీరాన సేదతీరేందుకు నగరవాసులు ఆసక్తిచూపించారు.

- సాక్షి, ఫొటోగ్రాఫర్,విశాఖపట్నం

డాబా ఎక్కిన రొయ్య



అచ్చం రొయ్యను తలపిస్తున్న ఈ బొమ్మ.. కృష్ణా జిల్లా గంగూరులోని ఏపీ ఫిషరీస్ కమిషనరేట్ కార్యాలయం ఆవరణలోని ఓ భవనంపై ఏర్పాటు చేశారు. పది అడుగుల పొడవు గల ఈ టైగర్ రొయ్య బొమ్మ రహదారిపై వెళ్లేవారిని ఆకట్టుకుంటోంది.

- పెనమలూరు

ఏపీ పంచాయతీ సెక్రటరీల గ్రేడ్-6 కార్యవర్గం ఎన్నిక



భవానీపురం (విజయవాడ పశ్చిమ): ఏపీ పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-6 (డిజిటల్ అసిస్టెంట్‌లు) అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ప్రత్యక్ష పద్ధతిలో జరిగిన ఈ ఎన్నికలో గౌరవ అధ్యక్షుడిగా వేల్పుల అర్లయ్య, రాష్ట్ర అధ్యక్షులుగా మణి ఇందూరుపల్లి, జనరల్ సెక్రటరీగా జయ్యద్ రవూఫ్, కోశాధికారిగా రెడ్డి రాణి ఎన్నికయ్యారు. అలాగే, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుగా తిరుపతిరావు, అహ్మద్, శ్రీనివాసరావు, కిరణ్, గురునాథం, టీబీఎస్ ప్రసాద్, సంధ్య లక్ష్మి, రాంగోపాల్ వర్మ, ఎంవీ కళ్యాణ్ కుమార్, షరీఫ్ ఎన్నికయ్యారు.

ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాటపై సీపీఎం దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో కుంభమేళాకు వెళ్తున్న 18మంది మృతిచెందడం, పలువురు గాయపడటం పట్ల దిగ్భ్రాంతికి గురైనట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరుసగా ప్రమాదాల్లో భక్తులు మరణిస్తున్నా ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం గర్హనీయమన్నారు. చనిపోయినవారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు రేషనలైజేషన్ ప్రక్రియపై మంత్రి సమీక్ష

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్యను కుదించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టదలచిన రేషనలైజేషన్ ప్రక్రియపై సమీక్షించేందుకు సోమవారం మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో భేటీ కానున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు సంబంధించిన అన్ని ఉద్యోగ సంఘాల నుంచి ఒక్కో ప్రతినిధి చొప్పున హాజరుకావాలంటూ ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులు ఆయా సంఘాలకు సమాచారం ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో ఉదయం 10.30 గంటలకు మంత్రి చాంబర్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

వైజాగ్‌పై చంద్రబాబు సర్కారు శీతకన్ను!



విశాఖను అన్ని విధాలా నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం

విమాన సర్వీసుల్లోనూ కుయుక్తులు

విశాఖ నుంచి అంతర్జాతీయ సర్వీసులకు ఎయిర్‌లైన్స్ సంస్థల ఆసక్తి

విజయవాడ నుంచి నడపాలంటూ ప్రభుత్వం ఒత్తిడి

దుబాయ్‌కు విశాఖ నుంచి సర్వీసుకు సిద్ధమైన ఎమిరేట్స్

దానిని విజయవాడ నుంచి నడపాలంటున్న రాష్ట్ర ప్రభుత్వం

సందిగ్ధంలో ఎమిరేట్స్ సంస్థ.. అసలు సర్వీసే రద్దు చేసే అవకాశం

సాక్షి, విశాఖపట్నం: ఆర్థిక రాజధానిగా భాసిల్లుతూ.. నిన్నటివరకు కార్యనిర్వాహక రాజధానిగా ఎదిగిన విశాఖపట్నం నగరాన్ని నిర్వీర్యం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. ఓ పక్క విశాఖపై చాలా ప్రేమ ఉందని చెబుతూనే, మరోపక్క ఈ మహా నగరం అభివృద్ధిని అడ్డుకుంటోంది. అన్ని రకాల సౌకర్యాలను విశాఖపట్నం ప్రజల నుంచి దూరం చేసేందుకు కుయుక్తులు పన్నుతోంది. ఆర్‌బీఐ రీజనల్ కార్యాలయం ఏర్పాటవుతుందన్న తరుణంలో దాన్ని విజయవాడకు పట్టుకుపోయిన చంద్రబాబు సర్కారు.. చివరకు విమాన సర్వీసులనూ తరలించేస్తోంది. విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ సర్వీసులు నడిపేందుకు ఎయిర్‌లైన్స్ సంస్థలు ముందుకొస్తుంటే.. ఆ సర్వీసులను విజయవాడ నుంచి నడపాలంటూ ఒత్తిడి తెస్తోంది. దీంతో ఎటూ తేల్చుకోలేక విమానయాన సంస్థలు అసలు ఏపీ నుంచి సర్వీసులు నడపాలా వద్దా అన్న సందిగ్ధంలో పడుతున్నాయి. స్లాట్లపై నౌకాదళం ఆంక్షలతో పాటు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ వివక్షతో విశాఖ విమానాశ్రయం అభివృద్ధి కుంటుపడుతోంది. ప్రయాణికులతో పాటు కార్గోలోనూ అపారమైన వృద్ధి సామర్థ్యం ఉన్నా.. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం మానేసి.. కొత్త సర్వీసుల్ని కూడా విజయవాడకు మళ్లిస్తోంది.

ఎమిరేట్స్‌పై ఒత్తిడి?

మిడిల్ ఈస్ట్ దేశాలకు సర్వీసులు నడిపేందుకు విశాఖ ఉత్తమ ప్రాంతంగా విమానయాన సంస్థలు భావిస్తుంటాయి. వివిధ దేశాలకు ఎయిర్ కనెక్టివిటీ అవకాశాలు కూడా వస్తున్నాయి. మిడిల్ ఈస్ట్ దేశాల్లో ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థ ఎమిరేట్స్ కూడా ఏపీ నుంచి దుబాయ్‌కు సర్వీసు నడిపేందుకు తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం ఎయిర్‌పోర్టులను అధ్యయనం చేసింది. విశాఖే అనుకూలంగా ఉందని భావించింది. అయితే.. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ నుంచి కాకుండా విజయవాడ (గన్నవరం ఎయిర్‌పోర్టు) నుంచి దుబాయ్‌కి సర్వీసు నడపాలంటూ ఈ ఎయిర్‌లైన్స్‌పై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్ విజయవాడ నుంచి షార్జాకు ఓ సర్వీసు నడుపుతోంది. అక్కడి నుంచి గల్ఫ్ దేశాలకు రెండో సర్వీసు నడిపినా ఆక్యుపెన్సీకి అవకాశం లేదు. అయినా విశాఖపై కక్ష సాధింపుతో చంద్రబాబు ప్రభుత్వం విజయవాడ నుంచే నడపాలని అంటుండటంతో ఎమిరేట్స్ సంస్థ సందిగ్ధంలో పడింది. ప్రభుత్వం ఇలాగే ఒత్తిడి చేస్తే పూర్తిగా సర్వీసు రద్దు చేసే అవకాశం కూడా ఉందని ఎయిర్ ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమిరేట్స్ సంస్థ పరిస్థితిని చూసిన ఇతర సంస్థలు ఏపీ నుంచి సర్వీసులు నడపడానికి వెనక్కు తగ్గుతున్నట్లు తెలుస్తోంది.

అప్పట్లో దుబాయ్‌కి విజయవంతంగా సర్వీసు

కోవిడ్-19కి ముందు విశాఖ నుంచి ఎయిర్ ఇండియా సంస్థ దుబాయ్‌కు ఏడేళ్ల పాటు సర్వీసుని నడిపింది. 80 నుంచి 100 శాతం ఆక్యుపెన్సీతో ఈ సర్వీసు నడిచింది. ఇప్పుడూ ఇదే విధమైన డిమాండ్ ఉన్నప్పటికీ, దుబాయ్ సర్వీసును ప్రభుత్వం అడ్డుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 180 సీటర్ ప్యాసింజర్ విమానానికి 2 టన్నుల కార్గోని కూడా తీసుకెళ్లే సామర్థ్యం ఉంటుంది. ఈ సర్వీసు విశాఖ నుంచి నడిస్తే 100 శాతం ఆక్యుపెన్సీతో పాటు రొయ్యలు, ఔషధాలు, దుస్తులు, ఇతర కార్గో ఎగుమతులకు కూడా అవకాశం ఎక్కువ ఉంది. ఎయిర్‌లైన్స్ ఆపరేటర్లకు కార్గో అదనపు ఆదాయాన్నిస్తుంది. అందువల్ల విదేశీ సర్వీసులకు వైజాగ్ పూర్తి అనుకూలమని విమానయాన సంస్థలు భావిస్తున్నా, ప్రభుత్వం మోకాలడ్డడంపై విమర్శలు వస్తున్నాయి.



విశాఖపట్నం ఎయిర్‌పోర్టు

విద్యార్థుల విహారయాత్రకు గ్రీన్‌సిగ్నల్

- ప్రాథమిక పాఠశాలల నుంచి 3,892 మంది..
- ఉన్నత పాఠశాలల నుంచి 3,322 మంది ఎంపిక
- విద్యార్థులు, ఉపాధ్యాయుల ఎంపికపై మార్గదర్శకాలు జారీ



సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటనకు రాష్ట్ర విద్యాశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకుగాను ప్రాథమిక పాఠశాలలకు రూ.85.62 లక్షలు, ఉన్నత పాఠశాలలకు రూ.1.32 కోట్లు కేటాయించింది. ఈ విహారయాత్ర రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లో సాగుతుంది. దీనికిగాను రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల నుంచి 3,892 మంది, ఉన్నత పాఠశాలల నుంచి 3,322 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఈ విహారయాత్ర ఫిబ్రవరి 25లోగా ఏర్పాటుచేసుకోవాలంటూ ఆదేశాలు జారీచేసింది. విద్యార్థులు, ఉపాధ్యాయుల ఎంపికపై ఆదివారం మార్గదర్శకాలు విడుదల చేశారు. అవి..

- సైన్స్, గణితంలో మంచి ప్రతిభ ఉన్న/మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న ప్రతి పాఠశాలకు చెందిన ఒక విద్యార్థిని ఎంపిక చేయాలి.
- 26 జిల్లాల్లో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ 2024–25లో బహుమతులు పొందిన సెకండరీ స్కూల్ విద్యార్థులను ఈ విహారయాత్రకు ఎంపిక చేయాలి.
- టీచర్ ప్రాజెక్టు కేటగిరీలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులను ఎస్కార్ట్ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయాలి.
- ప్రతీ 10 మంది బాలురకు ఒక ఎస్కార్ట్ టీచర్‌ను.. అలాగే, ప్రతి 10 మంది బాలికలకు ఒక మహిళా ఎస్కార్ట్ టీచర్ ఉంటారు.

'క్లస్టర్' సమస్యలు పరిష్కరిస్తాం

ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వచ్చే సమావేశాల నాటికి పరిష్కరిస్తామని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన క్లస్టర్ సమావేశాలకు 81 శాతం మంది ఉపాధ్యాయులు హాజరైనట్లు పేర్కొన్నారు. సాయంత్రం ఉపాధ్యాయులు ముఖ హాజరు నమోదులో సమస్యలు తలెత్తినట్లు తమ దృష్టికి వచ్చిందని, భవిష్యత్‌లో సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే, మూడో శనివారం సెలవు అయితే నాలుగో శనివారం క్లస్టర్ సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా బేబి రాణి



నూతనంగా ఎన్నికైన బేబీ రాణి తదితరులు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వేముల బేబీ రాణి, రావులకొల్లు వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం ఆవిర్భావ దినోత్సవంలో అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకున్నారు. వేముల బేబీ రాణి మాట్లాడుతూ..బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ డిక్లరేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు, సుప్రీంకోర్టుతో పాటు అన్ని న్యాయస్థానాల్లో జడ్జీల పోస్టులను జనాభా ప్రాతిపదికన బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు.

బీజేపీ సమర్థక్ మంచ్ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకటప్పయ్య

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): బీజేపీ సమర్థక్ మంచ్ రాష్ట్ర అధ్యక్షుడిగా కాశీభొట్ల వెంకటప్పయ్య బాధ్యతలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని మమత హోటల్‌లో సమర్థక్ మంచ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. వెంకటప్పయ్యతో జాతీయ కార్యవర్గ సభ్యుడు పొనుగుపాటి చిన సుబ్బారావు పదవీ ప్రమాణం చేయించారు. అనంతరం వెంకటప్పయ్య కార్యవర్గాన్ని ప్రకటించారు. పెండెం శ్రీదేవి (జనరల్ సెక్రటరీ), బాల సుబ్రహ్మణ్యం (జనరల్ సెక్రటరీ), చాగంటి నరసింహరావు (ధార్మిక ప్రెసిడెంట్), రత్నప్రసాద్ (స్టేట్ మీడియా), సత్యనారాయణ రాజు (సీనియర్ స్టేట్ సిటిజన్), పట్నాల గణపతి (డిస్ట్రిక్ ప్రెసిడెంట్), పున్నాపు రంగనాథ్ (కాకినాడ ప్రెసిడెంట్), పి.రామారెడ్డి (స్టేట్ లీగల్ కన్వీనర్), సి.హెచ్.కృష్ణారావు (డిస్ట్రిక్ కన్వీనర్), బలమూడి ఎంఎల్ శర్మ (విశాఖ డిస్ట్రిక్ ప్రెసిడెంట్)ను ఎన్నుకున్నారు.

తెలుసుకుంటే లాభం... మలుచుకుంటే అధనం

గిరిజనుల ఆర్థిక పరిస్థితిలో మార్పు తేవాలి, వారి ఆదాయం రెట్టింపుకావాలన్న లక్ష్యంతో పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం పనిచేస్తోంది. ఇందుకోసం గిరిజనులకు అందుబాటులో ఉండే వనరుల వినియోగం, విలువ ఆధారిత ఉప ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో లభించే పనస పండ్లతో పసందైన వంటకాల తయారీ, మార్కెటింగ్‌పై శిక్షణ అందిస్తోంది. మార్చి నెలలో రెండో బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వనున్నారు. పనస పండ్ల లాభాలు తెలియజేసి, వాటి నుంచి అదనంగా ఆదాయం సమకూర్చుకునేలా శిక్షణ అందజేయనున్నారు.

పనస కాయలతో విలువ ఆధారిత ఉప ఉత్పత్తులు

తయారీ, మార్కెటింగ్ ద్వారా అధిక ఆదాయం

ఆ దిశగా శిక్షణ ఇస్తున్న పందిరిమామిడి కేవీకే

మార్చిలో మరో బ్యాచ్‌కు శిక్షణ

రంపచోడవరం: అల్లూరి సీతారామరాజు జిల్లాలో విరివిగా లభించే పనసకాయలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం గిరిజనులకు అవగాహన కల్పిస్తోంది. పనస తొనలతో వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేయడంలో ఇప్పటికే ఒక దఫా 30 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది మార్చిలో మరో బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చేందుకు కేవీకే ప్రణాళిక సిద్ధం చేసింది.

రెండు లక్షల చెట్లు

జిల్లాలో రెండు లక్షల వరకు పనస చెట్లు ఉన్నట్టు ఉద్యానవన శాఖాధికారుల అంచనా. మారేడుమిల్లి, వై.రామవరం, రంపచోడవరం, అడ్డతీగల, చింతూరు, పాడేరు,చింతపల్లి, అరకు తదితర 19 మండలాల్లో పనస చెట్లు ఎక్కువగా ఉన్నాయి. గిరిజనులు తోటలుగానే కాకుండా ఇళ్ల వద్ద, పంట పొలాల్లో కూడా పనసను పెంచుతారు. పనస కాయల దిగుబడి ఫిబ్రవరిలో ప్రారంభమై మే వరకు లభిస్తాయి. పనస మొదటి దశలో తొనలు, విత్తనాలు(పనస పిక్కలు) తయారు కావు. వీటిని ఎక్కువగా కూరలు, పచ్చళ్ల తయారీకి ఉపయోగిస్తారు. గింజలు అభివృద్ధి చెందే దశలో కూడా కూర పనసగా ఉపయోగిస్తారు. తొనలు వచ్చినా తీపి, వాసన లేకుండా ఉంటాయి. వీటిని చిప్స్ తయారీలో ఉపయోగిస్తారు. పనస తొక్కు పచ్చడి,బజ్జీలు, పకోడి, బిర్యానీ, హల్వా, చాక్లెట్స్,తాండ్ర, జామ్, జ్యూస్, ఐస్‌క్రీమ్, పనస పిక్కల పిండితో పూరీలు, అప్పడాలు తయారు చేయవచ్చు. కేవీకే శాస్త్రవేత్తలు వీటి తయారీపై ఇప్పటికే గిరిజన యువతకు శిక్షణ ఇచ్చారు.



పనస పకోడి

ఆర్థిక భరోసా

జిల్లాలో మేలుజాతి పనస ఉత్పత్తులు సీజన్‌లో లభిస్తాయి. అనేక పోషక విలువలు ఉన్న పనసను గిరిజనులు వారపు సంతల్లో, గ్రామాలకు వచ్చే వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కొనుగోలు దారులులేకపోతే పశువులకు ఆహారంగా వేస్తున్నారు. గిరిజన రైతులు గరిష్ట ధర పొందలేకపోతున్నారు. గతంలో కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ పొందిన పలువురు ఉప ఉత్పత్తులు తయారు చేసి వారపు సంతల్లో విక్రయిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు.



పనస చెట్టు

కరకరలాడే చిప్స్

పచ్చి పనస తొనలతో వీటిని తయారు చేస్తారు. అర కేజీ తొనల నుంచి పిక్కలు వేరు చేయాలి. తరువాత అర ఇంచీ మందంతో పొడవుగా కోయాలి. కోసిన పనస తొనల ముక్కలను గుడ్డలో కట్టి మరిగించిన నీళ్లలో రెండు నిమిషాల పాటు ఉంచి బయటకు తీయాలి.తరువాత వాటిని ఆరబెట్టుకోవాలి. ఒక పాత్రలో నూనె వేసి తగినంత పసుపు వేసి మరిగించాలి. నూనె బాగా మరిగిన తరువాత అరబెట్టుకొన్న పనస తొనల ముక్కలను వేయించాలి. వాటిపై ఉప్పు, కారం జల్లుకుంటే వేడి వేడి చిప్స్ రెడీ



పనస తొనలతో తయారు చేసిన చిప్స్

తాండ్ర తయారీ ఇలా



పిక్కలు వేరు చేసిన కేజీ పనస తొనలను వేడినీళ్లలో వేసుకుని మరిగించుకోవాలి. మెత్తబడిన పనస తొనలను మిక్సర్‌లో వేసుకొని గుజ్జుగా చేసుకోవాలి. ట్రేలలో సమాంతరంగా ఈ గుజ్జును వేసుకోవాలి. తేమ ఆరే వరకు ఎండలోగాని, డ్రయర్ల గాని ఉంచుకోవాలి. తేమ ఆరిపోతే తాండ్ర ట్రేలో నుంచి సులభంగా వస్తుంది. వీటితో పాటు మరికొన్ని విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ ఇవ్వనున్నారు.

పోషక విలువలెన్నో..

పనసలో మెండైన పోషక విలువలు ఉన్నాయి. విటమిన్లు, పీచుపదార్థం, ఖనిజ లవణాలు ఉన్నాయన్నారు. దీంతో పనస ఉప ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. గిరిజన యువత కొద్దిపాటి మెలకువలు పాటిస్తే పనసకాయలతో పచ్చడి, చిప్స్, పనస జ్యూస్, జామ్‌తోపాటూ పలు రకాల ఉత్పత్తులు తయారు చేయవచ్చని కేవీకే శాస్త్రవేత్తలు తెలిపారు.

నోరూరించే చాక్లెట్లు

పనస తొనలతో తయారు చేసే చాక్లెట్లు చాలా రుచిగా ఉంటాయి. వీటిని చాలా సులభంగా తయారు చేయవచ్చు. కేజీ పనస తొనలను వేడి నీటిలో ఉడికించి, గుజ్జుగా తయారు చేసుకోవాలి. గిన్నెలో నెయ్యి వేసుకుని పనసగుజ్జు, కరిగించిన పాలపొడి, వేయించిన కోకో పొడరు, పంచదార వేసి కాసేపు వేయించుకోవాలి. చల్లారిన తరువాత ముక్కలుగా చేసుకోవాలి. అంతే.. పనస చాక్లెట్లు సిద్ధమవుతాయి.

మార్చిలో మరోదఫా శిక్షణ



పందిరిమామిడి కేవీకేలో మార్చి నెలలో మారోమారు పనసతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నాం. ఈ ఏడాది ఏజెన్సీలో 25 ఎకరాల్లో పనస మొక్కలు నాటించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. జిల్లాలో అధిక సంఖ్యలో పనసపండ్లు లభిస్తున్నా గిరిజనులు పూర్తిస్థాయిలో ఆదాయం పొందలేకపోతున్నారు. పనసతో విలువ ఆధారిత ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. గిరిజన యువతను ఆ దిశగా ప్రోత్సహించేందుకు కేవీకే కృషి చేస్తోంది.

- క్రాంతి, ఉద్యానవన శాస్త్రవేత్త, కేవీకే, పందిరిమామిడి


ముదుమలై నేషనల్ పార్క్

నీలగిరి కొండల్లో విస్తరించిన ముదుమలై నేషనల్ పార్క్, నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ పులులను సంరక్షిస్తోంది. ఏనుగునెక్కి విహరించేటప్పుడు నీటి చెలమలో దాహం తీర్చుకుంటున్న పులి కనిపిస్తే ఏనుగెక్కిన ఆనందం ఎప్పటికీ మరపుకు రాని అందమైన జ్ఞాపకమే. ఈ నేషనల్ పార్క్‌లో ఏనుగులు, జింకలు, నెమళ్లు, అడవి గేదెలు, చిరుతలు, రకరకాల పక్షులు కనువిందు చేస్తాయి. ఎలిఫెంట్ సఫారీ చార్జ్ వెయ్యి రూపాయల్లోపు ఉంటుంది. దాదాపు మూడు కిలోమీటర్ల దూరం తిప్పి తీసుకొస్తారు. ఒక రైడ్‌లో నలుగురు వెళ్లవచ్చు. ఈ ఫారెస్ట్‌లో బన్యాన్ వంటి స్టాండర్డ్ రెస్టారెంట్‌లు కూడా ఉంటాయి.

● తమిళనాడు

ఆలయాల నిలయం

ముదుమలై నేషనల్ పార్క్‌లో ఎలిఫెంట్ సఫారీ
మెట్టుపాళయం నుంచి ఊటీకి టాయ్ ట్రైన్ జర్నీ
తంజావూరులో వెయ్యేళ్ల బృహదీశ్వర ఆలయం
తమిళనాడు రాజముద్రలో దాగిన మీనాక్షి గోపురం
దేశాన్ని- దీవిని కలుపుతున్న పంబన్ వంతెన
పోర్చుగీసు జ్ఞాపకం వేళాంగణి చర్చ్
శాంతి కపోతాన్ని తలపించే నాగోర్ దర్గా
సాహిత్యానికి గౌరవం కవి వళ్లువార్ విగ్రహం
కంచిపట్టు చీర కట్టిన కామాక్షి దర్శనం
ఇవన్నీ చూస్తే... తమిళనాడును చుట్టేసినట్లే.


బృహదీశ్వరాలయం

తమిళనాడు అంటేనే భారీ ఆలయాల నిలయం. కావేరీ నది దక్షిణ తీరాన విస్తరించిన తంజావూరు నగరంలోని గ్రంథాలయం సరస్వతీమహల్‌ను చూసిన తర్వాత బృహదీశ్వరాలయాన్ని చూడాలి. బృహదీశ్వరాలయం వెయ్యేళ్ల నాటి నిర్మాణం. చోళ చక్రవర్తి మొదటి రాజరాజ అభిరుచికి ప్రతీక. శిఖరం ఎత్తు 216 అడుగులు. శివలింగం ఎత్తు 29అడుగులు. నంది కూడా పెద్దదే. 2010లో తమిళ సంప్రదాయ శాస్త్రీయనాట్యం భరతనాట్య ప్రదర్శనలతో వెయ్యేళ్ల వేడుక చేసుకుంది. ఈ ఆలయంలో చోళుల నిర్మాణశైలి, నాయకరాజుల చిత్రకళాభిరుచి ప్రతిబింబిస్తాయి. ఈ ఆలయాన్ని కట్టినప్పుడు ఈ ఊరి పేరు గంగైకొండ చోళాపురం. 'గ్రేట్ లివింగ్ చోళా టెంపుల్స్'గా గుర్తింపు పొందిన ఈ ఆలయాన్ని యునెస్కో కూడా వరల్డ్ హెరిటేజ్ సైట్‌ల జాబితాలో చేర్చింది.


ఉలి చెక్కిన ఊరు

బంగాళాఖాతం తీరాన ఒక మహాశిల్పాల సముదాయమే మహాబలిపురం. ఇక్కడి శిల్పాలు, నిర్మాణాలన్నీ ఏడు-ఎనిమిది శతాబ్దాల నాటివి. పల్లవులు, చోళుల శిల్పకళాభిరుచికి ప్రతీకలివి. ఇక్కడ శిల్పచాతుర్యమే కాదు కవి చాతుర్యమూ ఎక్కువే. ఒక పెద్ద బండరాయికి 'కృష్ణుడి వెన్నముద్ద' అని పేరు పెట్టడమే కవి చాతుర్యం. టైగర్‌కేవ్, పాండవుల పంచ రథాలు, తీరాలయం, గంగావతరణం, అర్జునుని రథం, వరాహ గుహాలయం, త్రిమూర్తి గుహ, గణేశరథాలయం వంటివన్నీ అద్భుతాలు. ఇది కూడా యునెస్కో గుర్తించిన వరల్డ్ హెరిటేజ్ సైట్. ఇక్కడ మ్యూజియాలు, శిలాజాలను చూడాలంటే సగం రోజు కేటాయించాలి.




కంచికి చేరని కథ

ఏ కథ అయినా కంచికి చేరుతుందేమో కానీ కంచి కథ ఎప్పటికీ సమాప్తం కాదు. ఇక్కడ తయారయ్యే కంచి పట్టు చీరల మీద మనసు పడని మహిళలు ఉండరు. ఈ టూర్‌లో వరద రాజ పెరుమాళ్ ఆలయంలో బంగారు బల్లిని తాకి, నీటిలో దాక్కున్న అత్తి వరదరాజ స్వామిని దర్శించుకోవాలి. కంచి కామాక్షిని దర్శించుకున్న తర్వాత ఓ పట్టుచీర కొనుక్కుంటే కంచి పర్యటన పరిపూర్ణమవుతుంది.

నాగోర్ దర్గా... నాగపట్టణంలోని విశాలమైన నీటి తటాకం ఒడ్డున ఉంది. ఇది సుఫీ మత గురువు నాగోర్ సయ్యద్ అబ్దుల్ ఖాదిర్ షాహుల్ హమీద్ గౌరవార్థం నిర్మించిన దర్గా. తంజావూరు రాజు అచ్చుతప్ప నాయక్16వ శతాబ్దంలో దీనిని నిర్మించాడు. ఆ తర్వాత మరాఠా పాలకుడు ప్రతాప్‌సింగ్ శాంతికపోతాల్లాంటి తెల్లటి అందమైన మినార్‌లు కట్టించి మెరుగులు దిద్దాడు.


నాగోర్ దర్గా


మధుర మీనాక్షి



అర్జున్ సినిమాలో మీనాక్షి ఆలయాన్ని కళ్లారా చూశాం. అది సెట్టింగ్. ఇప్పుడు అసలు ఆలయాన్ని చూద్దాం. మీనాక్షీ సుందరేశ్వర ఆలయాన్ని 12వ శతాబ్దంలో పాండ్య చక్రవర్తి మొదటి సదాయవర్మన్ కులశేఖరన్ కట్టించాడు. వైష్ణవం-శైవాల మధ్య మైత్రీబంధానికి ప్రతీక ఈ ఆలయం. విష్ణుమూర్తి ఈ ఆలయంలో వధువు మీనాక్షి అమ్మవారి చేతిని వరుడు శివుడి చేతిలో పెడుతున్న శిల్పమే ఇందుకు నిదర్శనం. విష్ణువును అళగర్ అని వ్యవహరిస్తారు. ఈ ఆలయంలోని గోపురాల్లో పశ్చిమ గోపురాన్ని కూడా పరిశీలనగా చూడాలి. ఇది తమిళనాడు అధికార చిహ్నంలో భాగం.



మధురై ఆలయంలోకి కెమెరాలు, సెల్‌ఫోన్‌లను అనుమతించరు. కంటి నిండా చూసి మనోఫలకం మీద ముద్రించుకోవాల్సిందే. ఈ ఆలయాన్ని ప్రశాంతంగా చూడాలంటే మూడు గంటల సమయం పడుతుంది. ట్రిప్‌లో ఆ మేరకు సమయాన్ని కేటాయించుకోవాలి.

చల్లచల్లని ఊటీకి మెల్లమెల్లగా సాగే ప్రయాణం

నీలగిరి మౌంటెయిన్ రైల్వే అంటే వెంటనే గుర్తు రాదు, ఊటీకి టాయ్ ట్రైన్ అంటే టక్‌టక్‌మని శబ్దం చేస్తూ సాగే రైలు కళ్ల ముందు మెదలుతుంది. చల్లటి వాతావరణంలో పచ్చటి చెట్ల మధ్య కొండవాలులో నింపాదిగా ప్రయాణిస్తుందీ రైలు. గమ్యాన్ని చేరాలని తొందరపడడంలో అర్థం లేదు. ఎందుకంటే ప్రకృతి దృశ్యాలను ఆస్వాదిస్తూ ప్రయాణించాలి. ఈ ప్రయాణంలో నీలగిరుల్లో నివసించే తోడా గిరిజనుల ఇళ్లు కనిపిస్తాయి. తమ సంప్రదాయ శైలిలో నలుపు-తెలుపు- ఎరుపు రంగుల్లో ఎంబ్రాయిడరీ చేసిన దుస్తులు, జడలు కట్టిన జుట్టుతో కనిపించే తోడాలను చూడడం మరిచిపోవద్దు. మెట్టుపాళయం నుంచి ఉదకమండలం (ఊటీ) వరకు నడిచే ఈ నీలగిరి మౌంటెయిన్ రైల్వేకు 2005లో యునెస్కో గుర్తింపు వచ్చింది. ఊటీలో రాత్రి బస చేసేటట్లు టూర్ ప్లాన్ చేసుకోవాలి.






కవికి గౌరవం

తమిళనాడు టూర్‌లో కన్యాకుమారిని, మూడు సముద్రాల మీద సూర్యోదయం, సూర్యాస్తమయాలను చూడకుండా ఎవరూ వెనక్కు రారు. తమిళ కవి వళ్లువార్ విగ్రహం ఇది. తిరువళ్లువార్ జ్ఞాపకార్థం ఈ విగ్రహాన్ని ప్రధానభూభాగానికి అనుబంధంగా ఉన్న చిన్న దీవిలో ఏర్పాటు చేశారు. ఇక్కడ వివేకానంద రాక్ మెమోరియల్ కూడా చూడాలి.



ఆరోగ్య మాత వేలాంగణి

తమిళనాడు, నాగపట్టణం జిల్లాలో ఉంది ఈ చర్చ్. గోథిక్ శైలిలో ఉన్న అందమైన నిర్మాణం. ఇక్కడ మేరీమాతను ఆరోగ్యప్రదాయినిగా కొలుస్తారు. భారతీయులతోపాటు విదేశీయులు కూడా ఎక్కువగా వస్తారిక్కడికి. ఆరోగ్యమాతను ఏడాదికి రెండు కోట్ల మంది దర్శించుకుంటారు. ఇక్కడికి వెళ్లడానికి సమీప ఎయిర్‌పోర్ట్ తిరుచిరాపల్లి. ఈ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నాగపట్టణానికి సుమారు వంద మైళ్ల దూరంలో ఉంటుంది. కావేరి నది పాయ వెల్లయార్ నది వేలాంగణి గ్రామానికి దక్షిణంగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది. సాగరసంగమాన్ని కూడా వీక్షించవచ్చు.

పంబన్ బ్రిడ్జి- చలో రామేశ్వరం

భారతదేశం ప్రధాన భూభాగాన్ని, చిట్టచివరి ప్రదేశం రామేశ్వరాన్ని కలిపే వంతెన ఇది. పంబన్ దీవి మీదుగా మండపం నుంచి రామేశ్వరానికి చేరవచ్చు. ఇది మనదేశంలో తొలి సముద్రపు వంతెన. క్రీ.శ 1914, ఫిబ్రవరి 24లో ప్రారంభమైన నాటికి అత్యంత పొడవైన వంతెన కూడా ఇదే. ఇప్పుడు తొలి వంతెన హోదా మాత్రమే ఉంది. ఈ వంతెన మీద రైలు ప్రయాణం అంటే సముద్రం మీద రైలు ప్రయాణం అన్న మాట. అలలను దగ్గరగా చూస్తూ ఉప్పు గాలి ఒంటికి తాకుతుంటే సాగే ప్రయాణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇప్పుడు రోడ్డు మార్గం కూడా ఉంది. కాబట్టి ఈ వంతెన మీద ప్రయాణం, రామేశ్వరం యాత్రతో వచ్చే సంతృప్తిని ఆస్వాదించాల్సిందే.



– వాకా మంజులారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

టూర్ ప్యాకేజ్‌లిలా

ఎనిమిది రోజులు, ఏడు రాత్రులు ప్యాకేజ్‌లో ఒక్కొక్కరికి దాదాపు 45 వేలవుతుంది. డబుల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 40 వేలు, ట్రిపుల్ షేరింగ్‌లో 38 వేలవుతుంది.

లగ్జరీ ట్రైన్ గోల్డెన్ చారియట్ జువెల్స్, సౌత్ స్ప్లెండర్ విత్ కర్నాటక, తమిళనాడు ప్యాకేజ్, వేళాంకని విత్ పాండిచ్చేరి- తమిళనాడు ప్యాకేజ్, మామల్లపురం విత్ పాండిచ్చేరి, నవగ్రహ టెంపుల్ దర్శన్ టూర్ ప్యాకేజ్ వంటి రకరకాల ప్యాకేజ్‌లున్నాయి. 8 రోజుల తమిళనాడు టూర్ దాదాపు 20 వేలకు అటూ ఇటూగా తమిళనాడు టూరిజమ్ ప్యాకేజ్‌లున్నాయి.



ప్రతి సమస్య ఒక బహుమతిలాంటిదే. సమస్యలను ఎదుర్కొనకుండా మనం ఎదగలేము.
- టోనీ రాబిన్స్, మోటివేషనల్ స్పీకర్

విదేశీ అంశాలు, ఎఫ్‌పీఐల చేతుల్లోనే..

- డాలర్‌–రూపాయి మారకం, చమురు ధరలు సైతం
- ఈ వారం మార్కెట్‌ తీరుపై విశ్లేషకుల అంచనా
- ఎఫ్‌పీఐల అమ్మకాలు.. రూ. లక్ష కోట్లు



న్యూఢిల్లీ: కంపెనీల త్రైమాసిక ఫలితాల సీజన్‌ (క్యూ3) ముగియడంతో.. అంతర్జాతీయ అంశాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐలు) ట్రేడింగ్‌ తీరు ఈ వారం మార్కెట్‌ గమనాన్ని నిర్ణయించనున్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. విదేశీ ఇన్వెస్టర్లు నిరంతరాయంగా అమ్మకాలు చేస్తుండడం, క్యూ3లో కంపెనీల ఫలితాలు అంచనాలకు అనుగుణంగా లేకపోవడం గత వారం మార్కెట్‌ సెంటిమెంట్‌ను దెబ్బతీయడం గమనార్హం. దీంతో నిఫ్టీ కీలకమైన 22800 మద్దతు స్థాయికి సమీపానికి మరోసారి వచ్చింది. నిఫ్టీ, సెన్సెక్స్‌ వరుసగా ఎనిమిదో రోజూ (గత శుక్రవారం) నష్టాల్లో ముగిశాయి. ఇలా చాలా అరుదుగానే చూస్తుంటాం . ఎనిమిది రోజుల్లో కలిపి బీఎస్‌ఈ సెన్సెక్స్‌ 2,645 పాయింట్లు కోల్పోగా (3.36 శాతం), ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 810 పాయింట్లు (3.41 శాతం) నష్టపోయింది. ''డిసెంబర్‌ త్రైమాసికం ఫలితాలు ముగిసిపోయాయి. డొనాల్డ్‌ ట్రంప్‌ వాణిజ్య విధానాలతో నెలకొన్న అనిశ్చితుల మధ్య చోటుచేసుకునే అంతర్జాతీయ పరిణామాలపైకి ఇన్వెస్టర్ల దృష్టి మళ్లొచ్చు''అని మోతీలాల్‌ ఓస్వాల్‌ ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ వెల్త్‌ మేనేజ్‌మెంట్‌, రీసెర్చ్‌ హెడ్‌ సిద్ధార్థ్‌ ఖేమ్కా తెలిపారు. వీటికి అదనంగా డాలర్‌తో రూపాయి తీరు, బ్రెంట్‌ క్రూడ్‌ ధరలు సైతం ప్రభావం చూపించొచ్చని భావిస్తున్నారు. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల తీరు, కరెన్సీ మారకంపై మార్కెట్‌ దృష్టి సారించొచ్చని రెలిగేర్‌ బ్రోకింగ్‌ సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ అజిత్‌ మిశ్రా అభిప్రాయపడ్డారు. దేశీయంగా ఎలాంటి ముఖ్యమైన సంకేతాలు లేకపోవడంతో అంతర్జాతీయ పరిణామాలు దేశీయ మార్కెట్‌ తీరును నిర్ణయించొచ్చని ఏంజెల్‌ వన్‌ సీనియర్‌ అనలిస్ట్‌ ఓషో కృష్ణన్‌ పేర్కొన్నారు. ''మార్కెట్‌ పతనానికి ఎన్నో అంశాలు దారిచూపాయి. ముఖ్యంగా డొనాల్డ్‌ ట్రంప్‌ ప్రతీకార టారిఫ్‌లపై చేసిన ప్రకటన సెంటిమెంట్‌కు దెబ్బకొట్టింది. దీనికి అదనంగా క్యూ3 కార్పొరేట్‌ ఫలితాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం ఇన్వెస్టర్ల విశ్వాసంపై ప్రభావం చూపించింది''అని మాస్టర్‌ ట్రస్ట్‌ గ్రూప్‌ డైరెక్టర్‌ పునీత్‌ సింఘానియా తెలిపారు.

దిగ్గజ కంపెనీల మార్కెట్‌ విలువ ఆవిరి

విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడికి మార్కెట్‌ విలువ పరంగా టాప్‌–10లోని ఎనిమిది కంపెనీలు గడిచిన వారంలో రూ.2 లక్షల కోట్లకు పైన విలువను నష్టపోయాయి. అన్నింటిలోకి రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ ఎక్కువ నష్టాన్ని చూసింది. రూ.67,527 కోట్లు తగ్గి రూ.16,46,822 కోట్ల వద్ద స్థిరపడింది. టీసీఎస్‌ మార్కెట్‌ విలువ రూ.34,951 కోట్ల మేర తగ్గి రూ.14,22,903 కోట్ల వద్ద ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ రూ.28,382 కోట్లను నష్టపోయింది. మార్కెట్‌ విలువ రూ.12,96,708 కోట్లుగా ఉంది. ఐటీసీ రూ.25,430 కోట్ల నష్టంతో రూ.5,13,670 కోట్ల వద్ద స్థిరపడింది. ఇన్ఫోసిస్‌ మార్కెట్‌ విలువ 19,287 కోట్లు తగ్గిపోగా, ఎస్‌బీఐ రూ.13,431 కోట్లు, హిందుస్థాన్‌ యూనిలీవర్‌ రూ.10,714 కోట్లు, బజాజ్‌ ఫైనాన్స్‌ రూ.4,230 కోట్లు చొప్పున మార్కెట్‌ విలు వను కోల్పోయాయి. ఎయిర్‌టెల్‌ మార్కె ట్‌ విలువ రూ.22,426 కోట్లు పెరగడంతో రూ.9,78, 631 కోట్లకు చేరింది. అలాగే, ఐసీఐసీఐ బ్యాంక్‌ విలువ సైతం రూ.1,182 కోట్ల మేర లాభపడి రూ.8,88,815 కోట్లుగా ఉంది.

ఎఫ్‌పీఐల అమ్మకాలు రూ.21,272 కోట్లు

ఫిబ్రవరి మొదటి రెండు వారాల్లోనూ ఎఫ్‌పీఐలు పెద్ద మొత్తంలో విక్రయాలు చేపట్టారు. నికరంగా రూ.21,272 కోట్లను ఈక్విటీల నుంచి ఉపసంహరించుకున్నారు. జనవరిలోనూ వీరు రూ.78,027 కోట్ల మేర అమ్మకాలు చేపట్టడం గమనార్హం. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు వీరు భారత ఈక్విటీల నుంచి రూ.99,299 కోట్లను వెనక్కి తీసుకెళ్లిపోయారు. డెట్‌ విభాగంలో ఈ నెల మొదటి రెండు వారాల్లో నికరంగా రూ.1,296 కోట్లు ఇన్వెస్ట్‌ చేశారు. డాలర్‌ ఇండెక్స్‌ తగ్గుముఖం పట్టినప్పుడు ఎఫ్‌పీఐలు తిరిగి పెట్టుబడులతో రావొచ్చని జియోజిత్‌ ఫైనాన్షియల్‌ చీఫ్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ స్ట్రాటజిస్ట్‌ వీకే విజయ్‌కుమార్‌ తెలిపారు. ''స్టీల్‌, అల్యూమినియంపై ట్రంప్‌ టారిఫ్‌లు ప్రకటించడం, ప్రతీకార సుంకాల ప్రణాళికలతో మార్కెట్లో ఆందోళనలు చెలరేగాయి. దీంతో భారత‌సహా వర్ధమాన మార్కెట్లలో తమ పెట్టుబడులను ఎఫ్‌పీఐలు సమీక్షిస్తున్నాయి'' అని మార్నింగ్‌ స్టార్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ అసోసియేట్‌ డైరెక్టర్‌ హిమాన్షు శ్రీవాస్తవ వివరించారు.

ఈ వారం 2 ఐపీవోలు.. 10 లిస్టింగ్‌లు



ఈ వారం రెండు కొత్త ఐపీవోలు ప్రారంభం కానుండగా, మెయిన్‌బోర్డ్‌, ఎస్‌ఎంఈ విభాగంలో కలిపి 10 కంపెనీలు స్టాక్‌ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్‌ కానున్నాయి. మెయిన్‌ బోర్డ్‌లో 17న అజాక్స్‌ ఇంజనీరింగ్‌, 19న హెక్సావేర్‌ టెక్నాలజీస్‌, 21న క్వాలిటీ పవర్‌ లిస్ట్‌ కానున్నాయి. ఎస్‌ఎంఈ కంపెనీ హెచ్‌పీ టెలికామ్‌ ఐపీవో 20న ప్రారంభం కానుంది. ఒక్కో షేరు ధర రూ.108. ప్రమోటర్లే 34.28 కోట్ల షేర్లను ఆఫర్‌ చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌, ఛత్తీస్‌గఢ్‌, యూపీ, గుజరాత్‌ తదితర రాష్ట్రాల్లో యాపిల్‌ ఉత్పత్తులను ఈ సంస్థ పంపిణీ చేస్తుంటుంది. సివిల్‌ కన్‌స్ట్రక్షన్‌ కార్యకలాపాల్లోని బీజాసాన్‌ ఎక్స్‌ప్లోటెక్‌ అనే మరో ఎస్‌ఎంఈ ఐపీవో 21న మొదలు కానుంది. 34.24 లక్షల తాజా ఈక్విటీ షేర్ల జారీ రూపంలో కంపెనీ రూ.60 కోట్లు సమీకరించాలనుకుంటోంది.

వినియోగంతో వృద్ధికి దన్ను



- మిడ్‌, స్మాల్‌ క్యాప్‌ సెగ్మెంట్లలో సవాళ్లు
- ఐసీఐసీఐ ప్రుడెన్షియల్‌ ఏఎంసీ ఈడీ నరేన్‌

హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో: కోవిడ్‌ అనంతరం గత మూడేళ్లుగా ఇన్‌ఫ్రా, దాని అనుబంధ రంగాలు మెరుగ్గా రాణిస్తున్నా వినియోగ విభాగం మాత్రం నెమ్మదించిందని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్‌ ఏఎంసీ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ ఎస్‌. నరేన్‌ తెలిపారు. బడ్జెట్‌లో ప్రతిపాదనలతో వినియోగం మెరుగుపడి, వృద్ధికి ఊతం లభించగలదని ఆయన చెప్పారు. ఈక్విటీ మార్కెట్ల విషయానికొస్తే.. మిడ్‌, స్మాల్‌ క్యాప్‌లో పరిస్థితులు సవాళ్లతో కూడుకుని ఉంటున్నాయని వివరించారు. అయితే, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాలతో తలెత్తిన కరెక్షన్‌ కారణంగా లార్జ్‌ క్యాప్‌ స్టాక్స్‌ సముచిత వేల్యుయేషన్స్‌లో లభిస్తున్నాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు, లార్జ్‌ క్యాప్‌ ఆధారితమైన లేదా డైనమిక్‌గా నిర్వహించే లేదా మల్టీ అసెట్‌ ఫండ్స్‌ను పెట్టుబడులకు పరిశీలించవచ్చని చెప్పారు. వీటిల్లో సిస్టమాటిక్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ ప్లాన్‌ (సిప్‌) లేదా సిస్టమాటిక్‌ ట్రాన్స్‌ఫర్‌ ప్లాన్ల (ఎస్‌టీపీ) ద్వారా ఇన్వెస్ట్‌ చేయొచ్చని ఆయన సూచించారు. డెట్‌, కమోడిటీలు, రీట్స్‌, ఇన్విట్స్‌లోకి పెట్టుబడులను ఆకర్షించడంలో మల్టీ–అసెట్‌ ఫండ్స్‌ సఫలమవుతున్నాయని నరేన్‌ చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

17-2-2025

విశాఖ	465-00
చిత్తూరు	493-00
ఈస్ట్‌, వెస్ట్‌ గోదావరి	455-00
విజయవాడ	450-00
రిటైల్‌ ధర (డజను)	72.00
హైదరాబాద్‌	440-00
వరంగల్‌	442-00
రిటైల్‌ ధర	5.00

ఆర్బిట్రేజ్‌ ఫండ్స్‌తో మెరుగైన రాబడులు



కార్తీక్‌ కుమార్‌, ఫండ్‌ మేనేజర్‌, యాక్సిస్‌ మ్యుచువల్‌ ఫండ్‌

చాలా వేగంగా మారిపోయే పెట్టుబడుల ప్రపంచంలో, సాధారణంగా మనం ఊహించని సందర్భాల్లో అవకాశాలు వస్తుంటాయి. ధరలపరంగా ఉండే వ్యత్యాసాలను ఉపయోగించుకుని, లబ్ధిని పొందే వ్యూహమే ఆర్బిట్రేజ్‌. మార్కెట్లో ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకుని, మెరుగైన రాబడులను అందించే లక్ష్యంతో ఏర్పడ్డ కొత్త తరహా మ్యుచువల్‌ ఫండ్సే ఆర్బిట్రేజ్‌ ఫండ్స్‌. వీటితో ఇన్వెస్టర్లకు ప్రయోజనం ఏమిటి, ఇవి ప్రాచుర్యంలోకి పొందడం వెనుక కారణాలేంటి, ప్రస్తుతం భారత మార్కెట్లో నెలకొన్న పరిస్థితుల్లో ఆదరణ ఎందుకు పెరుగుతోంది అనే ప్రశ్నలన్నింటికీ సమాధానం తెలుసుకునేందుకు ఒకసారి ఆర్బిట్రేజ్‌ ఫండ్స్‌ కాన్సెప్ట్‌, పని తీరు, సామర్థ్యాల గురించి లోతుగా తెలుసుకుందాం.

ఆర్బిట్రేజ్‌ ఫండ్స్‌ ఇలా..

'అ' అనే కంపెనీ ఈక్విటీ షేర్లు, క్యాష్‌ మార్కెట్లో రూ. 100 వద్ద, ఫ్యూచర్‌ మార్కెట్లో రూ. 102 వద్ద (ధర ప్రీమియంలో వ్యత్యాసాల వల్ల) ట్రేడవుతున్నాయనుకుందాం. ఫండ్‌ మేనేజరు ' అ' కంపెనీ షేర్లను క్యాష్‌ మార్కెట్లో రూ. 100కు కొనుక్కుని,



వాటిని ఫ్యూచర్స్‌ మార్కెట్లో రూ. 102కు అమ్మాలని అనుకున్నారనుకుందాం. సాధారణంగా నెలాఖరున, ఫ్యూచర్‌ కాంట్రాక్టు ఎక్స్‌పైర్‌ అయిపోయే సమయానికి, క్యాష్‌ మార్కెట్‌, అటు ఫ్యూచర్స్‌ మార్కెట్‌ ధరలు ఒకే స్థాయికి సర్దుబాటు అవుతాయి. అప్పుడు ఫండ్‌ మేనేజరు తన ట్రేడింగ్‌ లావాదేవీని రివర్స్‌ చేసి, రెండు ధరల మధ్య వ్యత్యాసమైన రూ. 2 మొత్తాన్ని రాబడిగా పొందుతారు.

స్టాక్స్‌, డెరివేటివ్స్‌ మార్కెట్లలో ఇలాంటి వ్యూహాన్ని అమలు చేసే మ్యుచువల్‌ ఫండ్స్‌ను ఆర్బిట్రేజ్‌ ఫండ్స్‌గా పరిగణిస్తారు. మరింత సరళంగా చెప్పాలంటే ఒక అసెట్‌ స్పాట్‌ ధర (స్టాక్‌ మార్కెట్లో), దాని ఫ్యూచర్‌ ధర (డెరివేటివ్స్‌ మార్కెట్లో) మధ్య ఉండే వ్యత్యాసాన్ని ఉపయోగించుకుని ఈ ఫండ్స్‌ లబ్ధిని పొందుతాయి. అల్గోరిథంలు, నిపుణులైన ఫండ్‌ మేనేజర్ల సహాయంతో స్పాట్‌, ఫ్యూచర్స్‌ మార్కెట్లలో ధరల వ్యత్యాసాన్ని ఈ ఫండ్స్‌ నిరంతరం పరిశీలిస్తూ ఉంటాయి. అయితే, అవకాశాలు క్షణాల్లో ఆవిరైపోతాయి కాబట్టి, ఈ వ్యూహాన్ని అమలు చేయడమనేది చెప్పినంత సులువైన వ్యవహారం కాదు. ధరపరంగా వ్యత్యాసం చాలా తక్కువ పర్సెంటేజీ పాయింట్లలోనే ఉండొచ్చు, కానీ మార్కెట్లోని మిగతా వారు కూడా ఆ అవకాశాన్ని గుర్తించే ఆస్కారం ఉంది, కాబట్టి ఆ వ్యత్యాసం చాలా వేగంగా మాయమైపోవచ్చు. కనుక మిగతా వారికన్నా వేగంగా స్పందించాల్సి ఉంటుంది.

ఆర్బిట్రేజ్‌ ఫండ్స్‌ ఆకర్షణీయత

ఫ్యూచర్స్‌ అండ్‌ ఆప్షన్స్‌ (ఎఫ్‌అండ్‌వో) సెగ్మెంట్‌ను ప్రోత్సహించే విధంగా సెబీ ఇటీవలే కొన్ని చర్యలు ప్రకటించింది. 2024 నవంబర్‌ 29 నుంచి అదనంగా 45 సెక్యూరిటీల్లో ఎఫ్‌అండ్‌వో కాంట్రాక్టులను అనుమతించింది. అలాగే, మార్కెట్‌ వృద్ధికి అనుగుణంగా ఉండేలా 2024 నవంబర్‌ 20 నుంచి ఇండెక్స్‌ డెరివేటివ్స్‌ కాంట్రాక్టు సైజును రూ. 15 లక్షలకు పెంచింది. ఈ చర్యలన్నీ, దేశీయంగా డెరివేటివ్స్‌ మార్కెట్‌ను విస్తరించేందుకు, వైవిధ్యభరితంగా మార్చేందుకు, మరింత సమర్ధవంతంగా తీర్చిదిద్దేందుకు, రిటైల్‌ ఇన్వెస్టర్లు మరింతగా పాలుపంచుకునేలా ప్రోత్సహించేందుకు దోహదపడతాయి. కొత్త ఫ్యూచర్స్‌ అందుబాటులోకి రావడం వల్ల ఫండ్లు వివిధ రంగాలు, కంపెనీలు, మార్కెట్‌ క్యాప్‌లవ్యాప్తంగా తమ వ్యూహాలను మరింత వైవిధ్యంగా అమలు చేసేందుకు ఆస్కారం ఉంటుంది.

ఆర్బిట్రేజ్‌ ఫండ్స్‌లో పెట్టుబడులతో ప్రయోజనాలు

మిగతావాటితో పోలిస్తే తక్కువ రిస్కు: మార్కెట్‌ గమనంతో పట్టింపు లేకుండా ఈ విధానం చాలా సింపుల్‌గా ఉంటుంది. మార్కెట్లో స్ప్రెడ్లను గుర్తించి, తదుపరి ఎక్స్‌పైరీ వరకు 'లాకిన్‌' చేయడంపైనే ఫండ్‌ దృష్టి పెడుతుంది.

ఒడిదుడుకుల మార్కెట్లలో అనుకూలం: మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతున్నప్పుడు రాబడులను అంచనా వేయడమనేది చాలామటుకు మ్యుచువల్‌ ఫండ్‌ స్కీములకు కష్టమైన వ్యవహారంగా ఉంటుంది. మరోవైపు, మార్కెట్లు స్థిరంగా ఉన్నప్పుడైనా, ఒడిదుడుకుల్లో ఉన్నప్పుడైనా తక్కువ రిస్కుతో కూడుకున్న వ్యూహాలుగా ఆర్బిట్రేజ్‌ ఫండ్లు మెరుగ్గా రాణించగలుగుతాయి. మార్కెట్‌ ఒడిదుడుకుల్లో షేర్ల ధరలు గణనీయంగా హెచ్చుతగ్గులకు లోనవుతుంటాయి కాబట్టి, వివిధ మార్కెట్లలో వాటిని అప్పటికప్పుడు కొని అమ్మేయడం ద్వారా, ఆ పరిస్థితిని ఆర్బిట్రేజ్‌ ఫండ్స్‌ తమకు అనువైనదిగా మార్చుకుంటాయి.

పన్ను ప్రయోజనాలు: ఈ ఫండ్స్‌ స్వభావరీత్యా హైబ్రిడ్‌ ఫండ్సే అయినప్పటికీ ఈక్విటీ ట్యాక్సేషన్‌కి అర్హత ఉంటుంది. ఫండ్‌ మొత్తం అసెట్స్‌లో కనీసం 65 శాతాన్ని ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టడమే ఇందుకు కారణం. ఆర్బిట్రేజ్‌ ఫండ్‌ను ఏడాదికన్నా ఎక్కువ కాలం అట్టే పెట్టుకుంటే దీర్ఘకాలిక క్యాపిటల్‌ గెయిన్స్‌ (ఎల్‌టీసీజీ) కింద 12.5 శాతం పన్ను రేటే వర్తిస్తుంది (రూ. 1.25 లక్షల మినహాయింపునకు లోబడి). పన్ను ఆదా చేస్తూ, స్థిరమైన రాబడులను అందించే సాధనాలను కోరుకునే ఇన్వెస్టర్లకు, ఆర్బిట్రేజ్‌ ఫండ్‌లు ఆకర్షణీయమైన ఆప్షన్‌గా ఉండగలవు.

మార్కెట్లో ఒడిదుడుకులను అవకాశాలుగా మల్చుకునే అధునాతన వ్యూహాలతో ఆర్బిట్రేజ్‌ ఫండ్స్‌ పనిచేస్తాయి. హెచ్చుతగ్గులు, లిక్విడిటీ, నియంత్రణపరంగా స్థిరత్వం నెలకొన్న భారత మార్కెట్లో, పెట్టుబడిని కాపాడుకుంటూ స్థిరమైన వృద్ధి కోరుకునే ఇన్వెస్టర్లకు ఈ ఫండ్‌లు ఆకర్షణీయమైన ఆప్షన్‌. మార్కెట్‌ ఒడిదుడుకుల నుంచి రక్షణ కోసం హెడ్జింగ్‌ కోరుకునే ఇన్వెస్టర్లు, ఆర్బిట్రేజ్‌ ఫండ్‌లను తప్పక పరిశీలించవచ్చు.

డిజిటల్‌ ఇన్‌ఫ్రాపై పెట్టుబడులు పెట్టాలి

- నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి
- రిమోట్‌ వర్కింగ్‌పై నిపుణుల అభిప్రాయాలు

న్యూఢిల్లీ: ఐటీ రంగంలో రిమోట్‌ పని విధానంతో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో ప్రొఫెషనల్స్‌కు అవకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్‌ మౌలిక సదుపాయాలపై మరింతగా ఇన్వెస్ట్‌ చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు. అలాగే, అంతర్జాతీయ ప్రాజెక్టులను కూడా అందిపుచ్చుకునేలా ప్రొఫెషనల్స్‌ నైపుణ్యాలను మెరుగుపర్చడంపైనా, తగిన వేదికలను ఏర్పాటు చేయడంపైనా దృష్టి పెట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దేశ, విదేశ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాల్లో శిక్షణ కల్పించేందుకు జాతీయ స్థాయిలో అయిదు సెంటర్స్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. రిమోట్‌ ఐటీ వర్క్‌తో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని నిపుణులకు అవకాశాలు లభించడంతో ఆదాయ ఆర్జన సామర్థ్యాలు మెరుగుపడి, సమ్మిళిత వృద్ధికి దోహదపడుతుందని టెక్‌ మహీంద్రా సీవోవో అతుల్‌ సొనేజా తెలిపారు.

సామర్థ్యాల వెలికితీతకు అవకాశం..

చిన్న పట్టణాల్లోని ప్రతిభావంతుల సామర్థ్యాలను వెలికి తీసేందుకు డిజిటల్‌ ఇన్‌ఫ్రా, విశ్వసించతగిన ఇంటర్నెట్‌ కనెక్టివిటీ, కొత్త నైపుణ్యాల్లో శిక్షణా కార్యక్రమాలు అవసరమని జ్ఞానిడాట్‌ఏఐ సీఈవో గణేష్‌ గోపాలన్‌ చెప్పారు. సైబర్‌ సెక్యూరిటీ వ్యవస్థలను పటిష్టం చేయడం, పరిశ్రమలో భాగస్వామ్యాలను పెంపొందించడం మొదలైనవి చిన్న పట్టణాల్లోని ప్రొఫెషనల్స్‌ అంతర్జాతీయంగా పోటీపడేందుకు ఉపయోగపడగలవని వివరించారు.

అంకెలు మారాయి కానీ..

ప్రశ్న మారలేదు..

మూడు బడ్జెట్ల నుంచి ఇదే ప్రశ్న.. పాత విధానమా? కొత్త విధానమా? ఏది మంచిది. ఏది ఎక్కువ ఉపయోగకరం. ఏది ఎవరికి ఎక్కువ ప్రయోజనకరం. ఏది మంచిదని ప్రశ్నించే బదులు ఏది ఉపయోగం అనేది సరైన ప్రశ్న. మళ్లీ పాత ప్రశ్నే.

ఇరవై ఏళ్ల లేదా అంతకన్నా ముందు నుంచి అస్సెస్సీలతో సేవింగ్స్‌ చేయించి, అలా చేసినందుకు ఆ మేరకు మినహాయింపును ఇస్తూ వచ్చారు. ఏఏ సెక్షన్ల ప్రకారం సేవ్‌ చేస్తే మినహాయింపు వస్తుంది .. అని ఆలోచించి అడుగేసేవాళ్ళు. ఉద్యోగస్తులకు కంపల్సరీగా పీఎఫ్‌ తప్పదు. అంతే కాకుండా, ఇక్కడ 3 ఉ రూల్‌ ఫాలో అయ్యారు. డిపాజిట్‌ చేస్తే మినహాయింపు, విత్‌డ్రా చేస్తే మినహాయింపు, దాని మీద వడ్డీకి కూడా మినహాయింపు. ఇక్కడ ఉ అంటే ఎగ్జెంప్షన్‌.. అంటే మినహాయింపు. సంక్షేమం అనుకోండి, పొదుపు అనుకోండి, అలవాటు అనుకోండి, ఆకర్షణీయం అనుకోండి.. పీఎఫ్‌ను అతిగా ఆశ్రయించారు. ఇలాగే ఎన్నో పథకాలు. 80సీని ప్రోత్సహిస్తూ ఇరవై పైచిలుకు పథకాలను ప్రవేశపెట్టారు. లిమిట్‌ని పెంచుతూ, 10 సంవత్సరాల పాటు రూ. 1,50,000 గరిష్ట పరిమితిగా ఉంచారు. ప్రతి సంవత్సరం ఆ రూ. 1,50,000 పరిమితి పెరుగుతుందని అందరూ ఎదురు చూస్తూ వచ్చారు. కానీ నిరాశే. ఎటువంటి మార్పూ లేదు. కనీసం ద్రవ్యోల్బణానికి అనుగుణంగా కూడా మార్పులు తేలేదు. ఇది. అన్యాయమే. అలాగే ఉద్యోగస్తులకు ప్రత్యేకంగా ఇచ్చే వెసులుబాటైన స్టాండర్డ్‌ డిడక్షన్‌ మినహాయింపులో పెంపుదల.. రద్దు.. పునరుద్ధరణ .. పెంపుదల ఇలా మార్పులు తెచ్చారు. ఈ మినహాయింపుని అలాగే కొనసాగిస్తూ ద్రవ్యోల్బణానికి అనుగుణంగా మారిస్తే బాగుండేది. ఇలాంటివి ఎన్నో మినహాయింపులు ఉన్నాయి. పాతకాలం నాటి అంకెలు.. ఆంక్షలు.. వీటిని ఏమీ మార్చకపోవడాన్ని 'పాలసీ' అని సరిపెట్టుకోలేము. ప్రభుత్వపు అనిశ్చితి వైఖరి ఇది అనే చెప్పాలి.



కె.సీహెచ్‌. ఎ.వి.ఎస్‌.ఎన్‌ మూర్తి



కె.వి.ఎన్‌ లావణ్య

ట్యాక్సేషన్‌ నిపుణులు

గత నెలలో ట్రంప్‌ గెలుపు, తీసుకురాబోయే విప్లవాత్మక మార్పులు, వాటి తీవ్ర ప్రభావం మన ప్రజల మీద ఉంటుంది అని తెలిసినా స్పష్టత లేదు. అలాంటి పరిస్థితుల్లో వచ్చింది మన సీతమ్మగారి పద్దు. ఒక ప్రశ్న మాత్రం మారలేదు. అదేమిటంటే.. ఏది బెటర్‌? పాత విధానమా లేక కొత్త విధానమా?

అయితే, నిస్సందేహంగా ప్రభుత్వ జోరు, హోరు, వైఖరి, ధోరణి అంతా కొత్త విధానం వైపే మొగ్గు చూపుతోంది. 'పొమ్మనలేక పొగబెట్టినట్లు' పాత విధానాన్ని ప్రోత్సహించలేదు. అది ఉంటుందా అని అడిగితే కొనసాగిస్తున్నాం అని అన్నారు ఆర్థిక మంత్రి. అయితే, కొన్ని తేడాలు, సలహాలు, సూచనలను తెలుసుకోవాలి. అవేమిటంటే..

	పాత విధానం	కొత్త విధానం
1. బేసిక్‌ లిమిట్‌	రూ. 2,50,000	రూ. 12,00,000 రూ. 12,75,000 (ఉద్యోగులకు)
2. ట్యాక్స్‌ శ్లాబులు	5%, 20%, 30%	0, 5, 10, 15, 20, 25, 30%
3. మినహాయింపులు	హెచ్‌ఆర్‌ఏ, ఎల్‌టీఏ 80సీ, 80డీ, ఇంటి రుణంపై	ఏమీ లేవు, రూ. 75వేలు తప్ప వడ్డీ మొదలైనవి
4. ఆమోదిత ప్రమాణాలు	ఆచరించాలి	అక్కర్లేదు
5. డాక్యుమెంట్ల రుజువులు	అవసరం	అవసరం లేదు
6. ఎవరికి ఉపయోగం	మినహాయింపులు భారీగా ఉన్నవారికి	సేవింగ్స్‌ అక్కర్లేని వారికి ఎలా నిర్ణయించుకోవాలి..

భారీగా మినహాయింపు పొందాలనుకునే వారికి పాతది మంచిది. వినియోగం వైపు మొగ్గు చూపించే వారికి కొత్త విధానం ఆకర్షణీయంగా ఉంటుంది. నిలకడగా, నిర్దిష్టంగా, నిశ్చింతగా ఆలోచించే వారికి పాతది బెటరేమో? స్వతంత్రంగా వ్యవహరించాలి. సులువుగా ఉండాలి. అనువుగా ఉండాలి. కమిట్మెంట్‌ వద్దనే వారికి కొత్త విధానం బెటరు.

మీ ఆదాయాన్ని లెక్కించండి. కంపల్సరీ సేవింగ్స్‌ని పరిగణనలోకి తీసుకుని ఆలోచించండి. ఇప్పుడు మార్కెట్లో ఎన్నో రెడీమేడ్‌ కాల్క్యులేటర్స్‌ ఉన్నాయి. అప్పుడు సరైన విధానాన్ని ఎంచుకోండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్‌ పంపించగలరు.

మార్కెట్‌ పతనాల్లోనూ మెరుగైన పనితీరు

ఈక్విటీ మార్కెట్లు ఎప్పుడు ఎలా చలిస్తాయో ఎవ్వరూ చెప్పలేరు. అందుకే ఈ విషయంలో నిపుణులైన ఫండ్‌ మేనేజర్లను ఆశ్రయించడం మెరుగైన నిర్ణయం అవుతుంది. అది కూడా 10 ఏళ్లు అంతకుమించిన లక్ష్యాల కోసం ఈక్విటీ పెట్టుబడులు మెరుగైన రాబడులు ఇస్తాయని చారిత్రక గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. ఒకవైపు అమెరికా ఈక్విటీలు హద్దే లేదన్నట్టుగా నూతన గరిష్టాలను చూస్తుంటే.. దేశీ ఈక్విటీలు బేర్‌ గుప్పిట్లో చిక్కుకుని విలవిలలాడుతున్నాయి. ఈ తరుణంలో రెండు మార్కెట్లలోనూ పెట్టుబడులు పెట్టి, రిస్క్‌ను సాధ్యమైన మేర తగ్గించే విధంగా పనితీరు చూపించే పరాగ్‌ పారిఖ్‌ ఫ్లెక్సీక్యాప్‌ పథకాన్ని ఇన్వెస్టర్లు పరిగణనలోకి తీసుకోవచ్చు.

రాబడులు

దీర్ఘకాలంలో రిస్క్‌ను సర్దుబాటు చేసి, మెరుగైన రాబడిని ఇవ్వడంలో ఈ పథకానికి టాప్‌ రేటింగ్‌ను మార్నింగ్‌స్టార్‌ రీసెర్చ్‌ ఇచ్చింది. దేశీ ఈక్విటీలు ఇటీవలి నెలల్లో గణనీయమైన దిద్దుబాటుకు గురైనప్పటికీ.. ఈ పథకంలో స్థిరత్వాన్ని గమనించొచ్చు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఈ పథకం కేవలం 1.68 శాతం నష్టాన్నే ఇచ్చింది. ఏడాది కాలంలో రాబడి 16.88 శాతంగా ఉంది. మూడేళ్లలో 18 శాతం, ఐదేళ్లలో 24 శాతం, ఏడేళ్లలో 10 శాతం, పదేళ్లలో 18 శాతం చొప్పున వార్షిక రాబడిని ఈ పథకం ఇన్వెస్టర్లకు తెచ్చిపెట్టింది.

పెట్టుబడుల విధానం

బలమైన నిర్వహణ బృందం, పటిష్టమైన పెట్టుబడుల విధానం ఈ ఫండ్‌ ప్రత్యేకతలని మార్నింగ్‌స్టార్‌ రీసెర్చ్‌ సంస్థ చెబుతోంది. ఈ విభాగంలో తక్కువ చార్జ్‌ వసూలు చేసే (ఎక్స్‌పెన్స్‌ రేషియో) పథకంలో ఇది రెండోది. పోర్ట్‌ఫోలియో మేనేజర్లను మార్చకుండా, వారినే దీర్ఘకాలంగా కొనసాగించడం రాబడుల స్థిరత్వానికి నేపథ్యం. అత్యుత్తమ నాణ్యమైన కంపెనీల్లోనే ఈ పథకం ఇన్వెస్ట్‌ చేస్తుంటుంది. ఈ విషయంలో రాజీ పడదు. వ్యాల్యుయేషన్‌ (కంపెనీ మార్కెట్‌ విలువ) ఆకర్షణీయంగా, సహేతుకుంగా ఉంటేనే పెట్టుబడులను ఎంపిక చేసుకుంటుంది. ఖరీదైన వ్యాల్యుయేషన్‌కు వెళితే ఎక్స్‌పోజర్‌ తగ్గించుకుంటుంది. దేశీ స్టాక్స్‌తోపాటు విదేశీ స్టాక్స్‌లోనూ పెట్టుబడులు పెడుతుంటుంది. భారత్‌ తర్వాత అమెరికన్‌ ఈక్విటీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటుంది. మెగా, లార్జ్‌క్యాప్‌ కంపెనీలకు ఎక్కువ కేటాయింపులు చేస్తుంటుంది.



పరాగ్‌ పారిఖ్‌ ఫ్లెక్సీక్యాప్‌ ఫండ్‌



పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.89,703 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. చాలా పెద్ద సైజు పథకం ఇది. ఎక్కువ మంది ఇన్వెస్టర్లు ఈ పథకంలో పెట్టుబడులకు మొగ్గు చూపిస్తుండడంతో నిర్వహణ పెట్టుబడులు (ఏయూఎం) అంతకంతకూ పెరుగుతూ వస్తున్నాయి. పథకం ఎక్స్‌పెన్స్‌ రేషియో 0.63 శాతం. అమెరికా స్టాక్స్‌ విలువలు ఆల్‌టైమ్‌ గరిష్టంలో ట్రేడ్‌ అవుతున్నాయి. మన దగ్గరా స్టాక్స్‌ దిద్దుబాటుకు లోనవుతున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఏడాది ముందు నుంచే ఈ పథకం డెట్‌లో పెట్టుబడులు పెంచుకుంది. ప్రస్తుతం ఈక్విటీలకు 79.13 శాతం కేటాయించగా, డెట్‌ సాధనాల్లో 19.49 శాతం ఉంచింది. నగదు, నగదు సమానాలు 1.38 శాతంగా ఉన్నాయి. ఈక్విటీలు మరింత పడిపోతే అప్పుడు డెట్‌ పెట్టుబడులు కొంత వెనక్కి తీసుకుని ఇన్వెస్ట్‌ చేయొచ్చన్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్టు కనిపిస్తోంది. మొత్తం పెట్టుబడుల్లో 81.39 శాతం జెయింట్‌ కంపెనీలకే కేటాయించింది. లార్జ్‌క్యాప్‌ కంపెనీల్లో 12.41 శాతం ఇన్వెస్ట్‌ చేయగా, మిడ్‌క్యాప్‌లో 5.82 శాతం, స్మాల్‌క్యాప్‌లో కేవలం 0.38 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి. పోర్ట్‌ఫోలియో పెద్దదే అయినప్పటికీ మొత్తం స్టాక్స్‌ 63గానే ఉన్నాయి. బ్యాంకింగ్‌ అండ్‌ ఫైనాన్షియల్‌ రంగ కంపెనీల్లో 29.64 శాతం, టెక్నాలజీ కంపెనీల్లో 16.13 శాతం, కన్జ్యూమర్‌ డిస్క్రిషనరీ కంపెనీల్లో 11.95 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి.

టాప్‌ ఈక్విటీ హోల్డింగ్స్‌

కంపెనీ	పెట్టుబడులు శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌	8.11
బజాజ్‌ హోల్డింగ్స్‌	6.85
పవర్‌గ్రిడ్‌	6.24
కోల్‌ ఇండియా	6.15
ఐటీసీ 4.94	
ఐసీఐసీఐ బ్యాంక్‌	4.89
కోటక్‌ బ్యాంక్‌	4.19
మారుతి సుజుకీ	4.14
మెటా ప్లాట్‌ఫామ్స్‌	3.93
ఆల్ఫాబెట్‌ ఐఎన్‌సీ	3.71

ఫైనల్ బెర్త్ లక్ష్యంగా...



నేటి నుంచి రంజీ ట్రోఫీ సెమీఫైనల్స్

- నాగ్‌పూర్‌లో విదర్భతో ముంబై 'ఢీ'
- అహ్మదాబాద్‌లో కేరళతో గుజరాత్ పోరు
- ఉ. గం. 9:30 నుంచి జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

48 తొమ్మిది దశాబ్దాల చరిత్ర కలిగిన రంజీ ట్రోఫీలో ముంబై జట్టు ఇప్పటి వరకు 48 సార్లు ఫైనల్లోకి ప్రవేశించింది. ఇందులో 42 సార్లు విజేతగా నిలువగా... 6 సార్లు రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది.

ముంబై రంజీ జట్టు (ఫైల్)

నాగ్‌పూర్: దేశవాళీ ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ కీలక ఘట్టానికి చేరింది. సోమవారం నుంచి ప్రారంభం కానున్న సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో మాజీ చాంపియన్ గుజరాత్‌తో కేరళ జట్టు... విదర్భతో డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టు తలపడుతున్నాయి. గత ఏడాది టైటిల్ కోసం తుదిపోరులో పోటీపడిన విదర్భ, ముంబై ఈసారి సెమీఫైనల్లోనే అమీతుమీ తేల్చుకోనున్నాయి. రికార్డు స్థాయిలో ఇప్పటి వరకు 42 సార్లు రంజీ ట్రోఫీ విజేతగా నిలిచిన ముంబై మరోసారి ట్రోఫీ చేజిక్కించుకోవాలని చూస్తుంటే... ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న విదర్భ ముంబైకి చెక్ పెట్టాలని భావిస్తోంది.

అజింక్య రహానే, సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబే, శార్దుల్ ఠాకూర్ వంటి టీమిండియా ఆటగాళ్లు ఉన్న ముంబై ఫేవరెట్‌గా బరిలోకి దిగనుండగా... విదర్భ జట్టు సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్‌పై ఎక్కువ ఆధార పడుతోంది. ఈ సీజన్‌లో పరుగుల వరద పారిస్తున్న కరుణ్ నాయర్ సెమీఫైనల్లో ఎలాంటి ప్రదర్శన చేస్తాడనేది కీలకం. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి 'నాన్ ట్రావెలింగ్ రిజర్వ్'గా ఎంపికైన యశస్వి జైస్వాల్ ముంబై జట్టు తరఫున బరిలోకి దిగుతాడనుకుంటే... గాయం కారణంగా అతడు ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. జైస్వాల్ ప్రస్తుతం బీసీసీఐ పర్యవేక్షణలో బెంగళూరులో ప్రత్యేక చికిత్స తీసుకుంటున్నాడు.

జైస్వాల్ అందుబాటులో లేకపోయినా... ముంబై జట్టు బ్యాటింగ్ విభాగానికి వచ్చిన ఇబ్బందేమీ లేదు. ఆయుశ్ మాత్రే, ఆకాశ్ ఆనంద్, సిద్ధేశ్ లాడ్, రహానే, సూర్యకుమార్, దూబే, షమ్స్ ములానీ, శార్దుల్, తనుశ్ రూపంలో ముంబై జట్టుకు తొమ్మిదో స్థానం వరకు బ్యాటింగ్ సామర్థ్యం ఉంది. తాజా సీజన్‌లో అత్యధిక మ్యాచ్‌ల్లో లోయర్ ఆర్డర్ బ్యాటర్లే ముంబై జట్టును ఆదుకున్నారు. హరియాణాతో జరిగిన క్వార్టర్ ఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో 113 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ జట్టును షమ్స్ ములానీ, తనుశ్ కొటియాన్ ఎనిమిదో వికెట్‌కు 183 పరుగులు జోడించి పటిష్ట స్థితికి చేర్చారు. ఈ సీజన్‌లో వీరిద్దరితో పాటు శార్దుల్ బ్యాటింగ్‌లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఈ నేపథ్యంలో టాపార్డర్ కూడా రాణిస్తే ముంబైకి తిరుగుండదు.

జోరు మీదున్న కరుణ్ నాయర్..

ఫార్మాట్‌తో సంబంధం లేకుండా మైదానంలో అడుగు పెడితే సెంచరీ చేయడమే తన కర్తవ్యం అన్నట్లు విదర్భ ఆటగాడు కరుణ్ నాయర్ దూసుకెళ్తున్నాడు. విజయ్ హజారే టోర్నీలో వరుస సెంచరీలతో హోరెత్తించిన ఈ సీనియర్ బ్యాటర్ రంజీ క్వార్టర్ ఫైనల్లో తమిళనాడుపై కూడా భారీ శతకం నమోదు చేశాడు. నాయర్ మినహా విదర్భ జట్టులో స్టార్లు లేకపోయినా... సమష్టి ప్రదర్శనతో ఆ జట్టు వరుస విజయాలు సాధిస్తోంది. అథర్వ తైడె, ధ్రువ్ షోరే, ఆదిత్య ఠాక్రె, యశ్ రాథోడ్, కెప్టెన్ అక్షయ్ వాడ్కర్‌తో బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. ఈ సీజన్‌లో 728 పరుగులు చేసిన యశ్ రాథోడ్ విదర్భ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. కరుణ్ నాయర్ (591), అక్షయ్ వాడ్కర్



కరుణ్ నాయర్

(588) కూడా భారీగా పరుగులు సాధించి మంచి ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో హర్ష్ దూబే, యశ్ ఠాకూర్, ఆదిత్య ఠాక్రె, నచికేత్ భట్ కీలకం కానున్నారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ హర్ష్ దూబే తాజా సీజన్‌లో 59 వికెట్లు పడగొట్టి అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఈ నేపథ్యంలో ముంబై టాపార్డర్ నిలకడలేమిని సొమ్ము చేసుకుంటూ డిఫెండింగ్ చాంపియన్‌పై పైచేయి సాధించాలని విదర్భ యోచిస్తోంది.

కేరళ నిరీక్షణ ముగిసేనా!

అహ్మదాబాద్ వేదికగా ప్రారంభం కానున్న మరో సెమీఫైనల్లో గుజరాత్‌తో కేరళ తలపడనుంది. జమ్మూ కశ్మీర్‌తో క్వార్టర్ ఫైనల్లో ఒక్క పరుగు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ద్వారా కేరళ జట్టు ముందంజ వేయగా... సౌరాష్ట్రతో ఏకపక్షంగా సాగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో గెలిచి గుజరాత్ సెమీఫైనల్లో అడుగు పెట్టింది. 2016–17లో చాంపియన్‌గా నిలిచిన గుజరాత్ జట్టు ఆ తర్వాత 2019–20 సీజన్‌లో మాత్రమే సెమీస్‌కు చేరింది. మరోవైపు కేరళ జట్టు ఇప్పటి వరకు ఒక్కసారి కూడా రంజీ ట్రోఫీలో ఫైనల్‌కు చేరుకోలేకపోయింది. గుజరాత్ జట్టు తరఫున కెప్టెన్ చింతన్ గాజా, ప్రియాంక్ పంచాల్, ఆర్య దేశాయ్, సిద్ధార్థ్ దేశాయ్, మనన్ హింగ్‌రాజియా, జైమీత్ పటేల్, ఉర్విల్ పటేల్ మంచి ఫామ్‌లో ఉన్నారు. ముఖ్యంగా మిడిలార్డర్‌లో జైమీత్, ఉర్విల్, మనన్ కీలక ఇన్నింగ్స్‌లతో గుజరాత్ జట్టు సునాయాసంగా సెమీస్‌కు చేరింది. ఈ సీజన్‌లో 582 పరుగులు చేసిన జైమీత్ గుజరాత్ తరఫున 'టాప్' స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. మనన్ 570 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో అర్జాన్ నాగ్‌వస్వల్లా, చింతన్ గాజా, రవి బిష్ణోయ్ కీలకం కానున్నారు. మరోవైపు సచిన్ బేబీ సారథ్యంలోని కేరళ జట్టు... క్వార్టర్స్‌లో జమ్మూకశ్మీర్‌పై చూపిన తెగింపే సెమీస్‌లోనూ కొనసాగించాలని భావిస్తోంది. బ్యాటింగ్‌లో సల్మాన్ నిజార్, మొహమ్మద్ అజహరుద్దీన్, జలజ్ సక్సేనా, సచిన్ బేబీ, రోహన్ కున్నుమ్మల్ కీలకం కానున్నారు. క్వార్టర్స్‌లో నిజార్, అజహరుద్దీన్ పోరాటం వల్లే కేరళ జట్టు సెమీస్‌కు చేరగలిగింది. నిధీశ్, బాసిల్ థంపి, జలజ్, ఆదిత్య, అక్షయ్ బౌలింగ్ భారం మోయనున్నారు.



చైనా జట్టుకు ఇండోనేసియా షాక్

తొలిసారి ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ సొంతం



కింగ్‌డావో (చైనా): ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఇండోనేసియా జట్టు తొలిసారి విజేతగా అవతరించింది. డిఫెండింగ్ చాంపియన్ చైనా జట్టుతో జరిగిన ఫైనల్లో ఇండోనేసియా 3–1తో నెగ్గింది. తొలి మ్యాచ్‌గా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో రివాల్డీ–ఫాదియా జంట 21–11, 21–13తో జువాన్–మెంగ్ యింగ్ జోడీని ఓడించడంతో ఇండోనేసియా 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో మ్యాచ్‌గా జరిగిన పురుషుల సింగిల్స్‌లో ఫర్హాన్ 21–15, 21–13తో హు జె ఆన్‌ను ఓడించడంతో ఇండోనేసియా ఆధిక్యం 2–0కు పెరిగింది. మూడో మ్యాచ్‌గా జరిగిన మహిళల సింగిల్స్‌లో జు వెన్ జింగ్ 21–12, 21–13తో కుసుమ వర్ధినిపై గెలవడంతో చైనాకు తొలి విజయం దక్కింది. నాలుగో మ్యాచ్‌గా జరిగిన పురుషుల డబుల్స్‌లో షోహిబుల్ ఫిక్రి–డానియల్ మార్టిన్ జోడీ 21–15, 21–9తో చెన్ జుజున్–హువాంగ్ ది (చైనా) ద్వయంపై గెలిచి ఇండోనేసియాకు టైటిల్‌ను ఖరారు చేసింది.


ముంబై ఇండియన్స్ జట్టులో ముజీబ్

గాయపడిన ఘజన్‌ఫర్ స్థానంలో ఎంపిక



ముజీబ్

ముంబై: ఐపీఎల్‌లో 'ఫైవ్ స్టార్ చాంపియన్' ముంబై ఇండియన్స్ అఫ్గానిస్తాన్ ఆఫ్‌స్పిన్నర్ ముజీబ్ ఉర్ రహ్మాన్‌ను జట్టులోకి తీసుకుంది. అఫ్గాన్‌కే చెందిన టీనేజ్ స్పిన్నర్ ఘజన్‌ఫర్ వెన్ను గాయంతో ఆటకు దూరమయ్యాడు. జింబాబ్వే పర్యటన సందర్భంగా అతని వెన్నుపూసలో పగుళ్లు వచ్చినట్లు తేలడంతో... ఈనెల 19 నుంచి జరిగే చాంపియన్స్ ట్రోఫీ నుంచి కూడా అతను వైదొలిగాడు. వచ్చే నెలలో మొదలయ్యే ఐపీఎల్ 18వ సీజన్‌కల్లా ఘజన్‌ఫర్ కోలుకునే అవకాశం లేకపోవడంతో ముంబై... అతని స్థానంలో అఫ్గాన్‌కే చెందిన సీనియర్ బౌలర్ ముజీబ్‌ను తీసుకుంది. ఈ సందర్భంగా ముజీబ్‌కు స్వాగతం పలుకుతూ టీనేజ్ స్పిన్నర్ త్వరగా కోలుకోవాలని ముంబై ఫ్రాంచైజీ ఆకాంక్షిస్తూ ట్వీట్ చేసింది. గత ఏడాది జరిగిన ఐపీఎల్ ఆటగాళ్ల మెగా వేలంలో ఘజన్‌ఫర్‌ను ముంబై రూ. 4.80 కోట్లకు కొనుగోలు చేసింది. అంతర్జాతీయ, దేశవాళీ టోర్నీల్లో కలిపి ముజీబ్ 300 పైచిలుకు టి20లు ఆడాడు. 6.5 ఎకానమీతో 330 వికెట్లు పడగొట్టాడు. మెగా వేలంలో ఫ్రాంచైజీలన్నీ అతనిపై విముఖత చూపడంతో 'అన్‌సోల్డ్' (అమ్ముడుపోని) ఆటగాడిగా మిగిలిపోయాడు. అయితే సహచరుడి గాయం ముజీబ్‌కు వరమై... రూ. 2 కోట్లతో ముంబై చెంత చేరాడు. 2018లో పంజాబ్ తరఫున ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన ముజీబ్ మూడు సీజన్లపాటు పంజాబ్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించి 18 మ్యాచ్‌లు ఆడాడు. చివరగా ఇటీవల ఎస్‌ఏ20 (సఫారీ లీగ్)లో పార్ల్ రాయల్స్ తరఫున ఆడగా... ఈ జట్టును రెండో క్వాలిఫయర్స్‌లో ఓడించిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ వరుసగా మూడోసారి ఫైనల్స్‌కు చేరింది. కానీ 'హ్యాట్రిక్' టైటిళ్ల వేటలో ముంబై ఇండియన్స్ కేప్‌టౌన్ చేతిలో కంగుతింది. అయితే ఈ మూడు (పార్ల్, సన్‌రైజర్స్, ముంబై) కూడా భారతీయ యాజమాన్యంలోని సఫారీ ఫ్రాంచైజీ జట్లు! ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ జట్లతో ప్రసిద్ధికెక్కాయి.



ఐపీఎల్ 2025 షెడ్యూల్

తేదీ	ఎవరితో ఎవరు	వేదిక	సమయం
మార్చి 22	కోల్‌కతా నైట్‌రైడర్స్ X రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	కోల్‌కతా	రాత్రి గం. 7:30
మార్చి 23	సన్‌రైజర్స్ హైదరాబాద్ X రాజస్తాన్ రాయల్స్	హైదరాబాద్	మధ్యాహ్నం.గం 3:30
మార్చి 23	చెన్నై సూపర్ కింగ్స్ X ముంబై ఇండియన్స్	చెన్నై	రాత్రి గం.7:30
మార్చి 24	ఢిల్లీ క్యాపిటల్స్ X లక్నో సూపర్ జెయింట్స్	విశాఖపట్నం	రాత్రి గం.7:30
మార్చి 25	గుజరాత్ టైటాన్స్ X పంజాబ్ కింగ్స్	అహ్మదాబాద్	రాత్రి గం.7:30
మార్చి 26	రాజస్తాన్ రాయల్స్ X కోల్‌కతా నైట్‌రైడర్స్	గువాహటి	రాత్రి గం.7:30
మార్చి 27	సన్‌రైజర్స్ హైదరాబాద్ X లక్నో సూపర్ జెయింట్స్	హైదరాబాద్	రాత్రి గం.7:30
మార్చి 28	చెన్నై సూపర్ కింగ్స్ X రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	చెన్నై	రాత్రి గం.7:30
మార్చి 29	గుజరాత్ టైటాన్స్ X ముంబై ఇండియన్స్	అహ్మదాబాద్	రాత్రి గం.7:30
మార్చి 30	ఢిల్లీ క్యాపిటల్స్ X సన్‌రైజర్స్ హైదరాబాద్	విశాఖపట్నం	మధ్యాహ్నం గం.3:30
మార్చి 30	రాజస్తాన్ రాయల్స్ X చెన్నై సూపర్ కింగ్స్	గువాహటి	రాత్రి గం.7:30
మార్చి 31	ముంబై ఇండియన్స్ X కోల్‌కతా నైట్‌రైడర్స్	ముంబై	రాత్రి గం.7:30
ఏప్రిల్ 1	లక్నో సూపర్ జెయింట్స్ X పంజాబ్ కింగ్స్	లక్నో	రాత్రి గం.7:30
ఏప్రిల్ 2	రాయల్ చాలెంజర్స్ బెంగళూరు X గుజరాత్ టైటాన్స్	బెంగళూరు	రాత్రి గం.7:30
ఏప్రిల్ 3	కోల్‌కతా నైట్‌రైడర్స్ X సన్‌రైజర్స్ హైదరాబాద్	కోల్‌కతా	రాత్రి గం.7:30
ఏప్రిల్ 4	లక్నో సూపర్ జెయింట్స్ X ముంబై ఇండియన్స్	లక్నో	రాత్రి గం.7:30
ఏప్రిల్ 5	చెన్నై సూపర్ కింగ్స్ X ఢిల్లీ క్యాపిటల్స్	చెన్నై	మధ్యాహ్నం గం.3:30
ఏప్రిల్ 5	పంజాబ్ కింగ్స్ X రాజస్తాన్ రాయల్స్	న్యూ చండీగఢ్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 6	కోల్‌కతా నైట్‌రైడర్స్ X లక్నో సూపర్ జెయింట్స్	కోల్‌కతా	మధ్యాహ్నం గం.3:30
ఏప్రిల్ 6	సన్‌రైజర్స్ హైదరాబాద్ X గుజరాత్ టైటాన్స్	హైదరాబాద్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 7	ముంబై ఇండియన్స్ X రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	ముంబై	రాత్రి గం.7:30
ఏప్రిల్ 8	పంజాబ్ కింగ్స్ X చెన్నై సూపర్ కింగ్స్	న్యూ చండీగఢ్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 9	గుజరాత్ టైటాన్స్ X రాజస్తాన్ రాయల్స్	అహ్మదాబాద్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 10	రాయల్ చాలెంజర్స్ బెంగళూరు X ఢిల్లీ క్యాపిటల్స్	బెంగళూరు	రాత్రి గం.7:30
ఏప్రిల్ 11	చెన్నై సూపర్ కింగ్స్ X కోల్‌కతా నైట్‌రైడర్స్	చెన్నై	రాత్రి గం.7:30
ఏప్రిల్ 12	లక్నో సూపర్ జెయింట్స్ X గుజరాత్ టైటాన్స్	లక్నో	మధ్యాహ్నం గం.3:30
ఏప్రిల్ 12	సన్‌రైజర్స్ హైదరాబాద్ X పంజాబ్ కింగ్స్	హైదరాబాద్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 13	రాజస్తాన్ రాయల్స్ X రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	జైపూర్	మధ్యాహ్నం గం.3:30
ఏప్రిల్ 13	ఢిల్లీ క్యాపిటల్స్ X ముంబై ఇండియన్స్	ఢిల్లీ	రాత్రి గం.7:30
ఏప్రిల్ 14	లక్నో సూపర్ జెయింట్స్ X చెన్నై సూపర్ కింగ్స్	లక్నో	రాత్రి గం.7:30
ఏప్రిల్ 15	పంజాబ్ కింగ్స్ X కోల్‌కతా నైట్‌రైడర్స్	న్యూ చండీగఢ్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 16	ఢిల్లీ క్యాపిటల్స్ X రాజస్తాన్ రాయల్స్	ఢిల్లీ	రాత్రి గం.7:30
ఏప్రిల్ 17	ముంబై ఇండియన్స్ X సన్‌రైజర్స్ హైదరాబాద్	ముంబై	రాత్రి గం.7:30
ఏప్రిల్ 18	రాయల్ చాలెంజర్స్ బెంగళూరు X పంజాబ్ కింగ్స్	బెంగళూరు	రాత్రి గం.7:30
ఏప్రిల్ 19	గుజరాత్ టైటాన్స్ X ఢిల్లీ క్యాపిటల్స్	అహ్మదాబాద్	మధ్యాహ్నం గం.3:30
ఏప్రిల్ 19	రాజస్తాన్ రాయల్స్ X లక్నో సూపర్ జెయింట్స్	జైపూర్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 20	పంజాబ్ కింగ్స్ X రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	న్యూ చండీగఢ్	మధ్యాహ్నం గం.3:30
ఏప్రిల్ 20	ముంబై ఇండియన్స్ X చెన్నై సూపర్ కింగ్స్	ముంబై	రాత్రి గం.7:30
ఏప్రిల్ 21	కోల్‌కతా నైట్‌రైడర్స్ X గుజరాత్ టైటాన్స్	కోల్‌కతా	రాత్రి గం.7:30
ఏప్రిల్ 22	లక్నో సూపర్ జెయింట్స్ X ఢిల్లీ క్యాపిటల్స్	లక్నో	రాత్రి గం.7:30
ఏప్రిల్ 23	సన్‌రైజర్స్ హైదరాబాద్ X ముంబై ఇండియన్స్	హైదరాబాద్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 24	రాయల్ చాలెంజర్స్ బెంగళూరు X రాజస్తాన్ రాయల్స్	బెంగళూరు	రాత్రి గం.7:30
ఏప్రిల్ 25	చెన్నై సూపర్ కింగ్స్ X సన్‌రైజర్స్ హైదరాబాద్	చెన్నై	రాత్రి గం.7:30
ఏప్రిల్ 26	కోల్‌కతా నైట్ రైడర్స్ X పంజాబ్ కింగ్స్	కోల్‌కతా	రాత్రి గం.7:30
ఏప్రిల్ 27	ముంబై ఇండియన్స్ X లక్నో సూపర్ జెయింట్స్	ముంబై	మధ్యాహ్నం గం.3:30
ఏప్రిల్ 27	ఢిల్లీ క్యాపిటల్స్ X రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	ఢిల్లీ	రాత్రి గం.7:30
ఏప్రిల్ 28	రాజస్తాన్ రాయల్స్ X గుజరాత్ టైటాన్స్	జైపూర్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 29	ఢిల్లీ క్యాపిటల్స్ X కోల్‌కతా నైట్‌రైడర్స్	ఢిల్లీ	రాత్రి గం.7:30
ఏప్రిల్ 30	చెన్నై సూపర్ కింగ్స్ X పంజాబ్ కింగ్స్	చెన్నై	రాత్రి గం.7:30
మే 1	రాజస్తాన్ రాయల్స్ X ముంబై ఇండియన్స్	జైపూర్	రాత్రి గం.7:30
మే 2	గుజరాత్ టైటాన్స్ X సన్‌రైజర్స్ హైదరాబాద్	అహ్మదాబాద్	రాత్రి గం.7:30
మే 3	రాయల్ చాలెంజర్స్ బెంగళూరు X చెన్నై సూపర్ కింగ్స్	బెంగళూరు	రాత్రి గం.7:30
మే 4	కోల్‌కతా నైట్ రైడర్స్ X రాజస్తాన్ రాయల్స్	కోల్‌కతా	మధ్యాహ్నం గం.3:30
మే 4	పంజాబ్ కింగ్స్ X లక్నో సూపర్ జెయింట్స్	ధర్మశాల	రాత్రి గం.7:30
మే 5	సన్‌రైజర్స్ హైదరాబాద్ X ఢిల్లీ క్యాపిటల్స్	హైదరాబాద్	రాత్రి గం.7:30
మే 6	ముంబై ఇండియన్స్ X గుజరాత్ టైటాన్స్	ముంబై	రాత్రి గం.7:30
మే 7	కోల్‌కతా నైట్‌రైడర్స్ X చెన్నై సూపర్ కింగ్స్	కోల్‌కతా	రాత్రి గం.7:30
మే 8	పంజాబ్ కింగ్స్ X ఢిల్లీ క్యాపిటల్స్	ధర్మశాల	రాత్రి గం.7:30
మే 9	లక్నో సూపర్ జెయింట్స్ X రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	లక్నో	రాత్రి గం.7:30
మే 10	సన్‌రైజర్స్ హైదరాబాద్ X కోల్‌కతా నైట్‌రైడర్స్	హైదరాబాద్	రాత్రి గం.7:30
మే 11	పంజాబ్ కింగ్స్ X ముంబై ఇండియన్స్	ధర్మశాల	మధ్యాహ్నం గం.3:30
మే 11	ఢిల్లీ క్యాపిటల్స్ X గుజరాత్ టైటాన్స్	ఢిల్లీ	రాత్రి గం.7:30
మే 12	చెన్నై సూపర్ కింగ్స్ X రాజస్తాన్ రాయల్స్	చెన్నై	రాత్రి గం.7:30
మే 13	రాయల్ చాలెంజర్స్ బెంగళూరు X సన్‌రైజర్స్ హైదరాబాద్	బెంగళూరు	రాత్రి గం.7:30
మే 14	గుజరాత్ టైటాన్స్ X లక్నో సూపర్ జెయింట్స్	అహ్మదాబాద్	రాత్రి గం.7:30
మే 15	ముంబై ఇండియన్స్ X ఢిల్లీ క్యాపిటల్స్	ముంబై	రాత్రి గం.7:30
మే 16	రాజస్తాన్ రాయల్స్ X పంజాబ్ కింగ్స్	జైపూర్	రాత్రి గం.7:30
మే 17	రాయల్ చాలెంజర్స్ బెంగళూరు X కోల్‌కతా నైట్‌రైడర్స్	బెంగళూరు	రాత్రి గం.7:30
మే 18	గుజరాత్ టైటాన్స్ X చెన్నై సూపర్ కింగ్స్	అహ్మదాబాద్	మధ్యాహ్నం గం.3:30
మే 18	లక్నో సూపర్ జెయింట్స్ X సన్‌రైజర్స్ హైదరాబాద్	లక్నో	రాత్రి గం.7:30
మే 20	క్వాలిఫయర్-1	హైదరాబాద్	రాత్రి గం.7:30
మే 21	ఎలిమినేటర్	హైదరాబాద్	రాత్రి గం.7:30
మే 23	క్వాలిఫయర్-2	కోల్‌కతా	రాత్రి గం.7:30
మే 25	ఫైనల్	కోల్‌కతా	రాత్రి గం.7:30

అనిసిమోవా అదరహో

- ఖతర్ ఓపెన్‌లో విజేతగా నిలిచిన అమెరికా స్టార్
- కెరీర్‌లో తొలిసారి డబ్ల్యూటీఏ 1000 టైటిల్ సొంతం



దోహా: ఎనిమిదేళ్ల క్రితం మహిళల టెన్నిస్‌లో భవిష్యత్ తారగా గుర్తింపు తెచ్చుకున్న అమెరికా ప్లేయర్ అమండా అనిసిమోవా ఎట్టకేలకు తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని అందుకుంది. గ్రాండ్‌స్లామ్ తర్వాత రెండో అత్యున్నత శ్రేణి అయిన మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) 1000 సిరీస్ టోర్నీలో ఆమె మొదటిసారి విజేతగా అవతరించింది. ఖతర్ ఓపెన్‌లో 23 ఏళ్ల అనిసిమోవా చాంపియన్‌గా నిలిచింది. దోహాలో జరిగిన సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 41వ ర్యాంకర్ అనిసిమోవా 6–4, 6–3తో 2017 ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ ఎలెనా ఒస్టాపెంకో (లాత్వియా)పై గెలిచింది. అనిసిమోవాకు 5,97,000 డాలర్ల (రూ. 5 కోట్ల 17 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 2002లో మోనికా సెలెస్ తర్వాత ఖతర్ ఓపెన్‌లో విజేతగా నిలిచిన రెండో అమెరికా ప్లేయర్‌గా అనిసిమోవా గుర్తింపు పొందింది. ఈ గెలుపుతో అనిసిమోవా నేడు విడుదలయ్యే డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ 18వ ర్యాంక్‌ను అందుకుంటుంది. ఓవరాల్‌గా అనిసిమోవా కెరీర్‌లో ఇది మూడో సింగిల్స్ టైటిల్. 2019లో బొగోటా ఓపెన్‌లో, 2022లో మెల్‌బోర్న్ ఓపెన్‌లో ఆమె టైటిల్స్ సాధించింది.

రామ్‌కుమార్ సంచలనం



పుణే: మహా ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత అగ్రశ్రేణి ఆటగాడు రామ్‌కుమార్ రామనాథన్ మెయిన్ 'డ్రా'కు మరో విజయం దూరంలో నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో రామ్‌కుమార్ సంచలనం సృష్టించాడు. టాప్ సీడ్, ప్రపంచ 267వ ర్యాంకర్ ఇలియాస్ ఇమర్ (స్వీడన్)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 403వ ర్యాంకర్ రామ్‌కుమార్ 5–7, 6–1, 6–4తో గెలుపొందాడు. ఒక గంట 52 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్‌కుమార్ తొమ్మిది ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. నేడు జరిగే క్వాలిఫయింగ్ రెండో రౌండ్ మ్యాచ్‌లో కిమర్ కాప్‌జాన్స్ (బెల్జియం)తో రామ్‌కుమార్ ఆడతాడు. ఈ మ్యాచ్‌లో నెగ్గిన ప్లేయర్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధిస్తాడు.

క్యాంఫెర్ షో

- జింబాబ్వేపై ఐర్లాండ్ విజయం
- సిరీస్ 1–1తో సమం



హరారే: ఆల్‌రౌండర్ కర్టిస్ క్యాంఫెర్ అటు బ్యాట్‌తో ఇటు బంతితో అదరగొట్టడంతో...ఆదివారం జరిగిన రెండో వన్డేలో ఐర్లాండ్ ఆరు వికెట్ల తేడాతో జింబాబ్వేపై గెలిచింది. తొలి పోరులో జింబాబ్వే విజయం సాధించగా... ఈ గెలుపుతో ఐర్లాండ్ 1–1తో సమం చేసింది. మొదట జింబాబ్వే 49 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. మధెవెరె (70 బంతుల్లో 61; 6 ఫోర్లు), సికందర్ రజా (75 బంతుల్లో 58; 5 ఫోర్లు) అర్ధశతకాలతో మెరిశారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్ 4, క్యాంఫెర్ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఐర్లాండ్ 48.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ (102 బంతుల్లో 89; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), క్యాంఫెర్ (94 బంతుల్లో 63; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. చివర్లో ఉత్కంఠ నెలకొన్నా... టకెర్ (36 నాటౌట్), డాక్రెల్ (20 నాటౌట్) జట్టును విజయ తీరాలకు చేర్చారు. క్యాంఫెర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య మూడో వన్డే మంగళవారం జరగనుంది.

కారుతో 50 మీటర్లు ఈడ్చుకెళ్లాడు

ఓవర్ టేక్ చేయడమే కారణం



బెంగళూరు: తన కారును ఓవర్‌టేక్ చేసినందుకు అవతలి కారు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడో వ్యక్తి. అతడిని తన కారుతో పాటు ఏకంగా 50 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లాడు. ఈ ఘటన తాజాగా కర్నాటకలోని నేలమంగళ హైవే టోల్‌బూత్ వద్ద జరిగింది. హైవేపై ఒక కారును మరో కారు ఓవర్‌టేక్ చేసింది. దాంతో వెనుకబడ్డ కారులోని వ్యక్తి మండిపడ్డాడు. టోల్‌బూత్ చేరగానే ఇద్దరూ తిట్టుకున్నారు. అది పోట్లాటకు దారి తీసింది. అంతలో టోల్ గేట్ తెరవడంతో కారులో ఉన్న వ్యక్తి అప్పటికే కారు దిగిన రెండో వ్యక్తిని చొక్కాను పట్టుకుని తన కారుతో పాటు ఈడ్చుకెళ్లాడు. 50 మీటర్ల దూరం వెళ్లాక అతడిని వదిలేసి వేగంగా వెళ్లిపోయాడు. ఇదంతా సీసీటీవీలో రికార్డయింది. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోడలికి హెచ్ఐవీ ఇంజక్షన్

అడిగినంత కట్నం ఇవ్వలేదని అత్తమామల అమానుషత్వం

హరిద్వార్: అడిగినంత కట్నం ఇవ్వలేదని కోడలికి ఏకంగా హెచ్ఐవీ సోకిన ఇంజెక్షన్ ఇచ్చిన అత్తామామల అమానుషత్వమిది. ఉత్తరాఖండ్‌లో హరిద్వార్‌లోని జస్వవాలాలో ఈ దారుణం జరిగింది. నాతిరామ్ సైనీ కుమారుడు అభిషేక్‌కు రెండేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్‌కు చెందిన సోనాల్ సైనీతో పెళ్లయింది. కట్నంగా రూ.15 లక్షల నగదు, కారు ఇచ్చారు. కొంతకాలానికే అత్తమామలు స్కార్పియో కారు, రూ.25 లక్షలు డిమాండ్ చేయడం ప్రారంభించారు. యువతి తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో కోడలిని ఇంటి నుంచి గెంటేశారు. గ్రామంలో పంచాయతీ పెట్టి తిరిగి అత్తారింటికి పంపించారు. శారీరకంగా, మానసికంగా హింసించడంతో ఆమె ఆరోగ్యం క్షీణించింది. తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్తే హెచ్ఐవీ పాజిటివ్ అని తేలింది. భర్తకు మాత్రం నెగిటివ్ వచ్చింది. షాక్‌కు గురైన యువతి తల్లిదండ్రులు అత్తామామలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టించుకోకపోవడంతో బాధితురాలు కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఆదేశాల మేరకు భర్త, అత్తమామ, ఇతర కుటుంబీకులపై వరకట్న వేధింపులు, దాడి, హత్యాయత్నం కేసు నమోదు చేశారు.



పారాగ్లైడింగ్‌తో పరీక్ష కేంద్రానికి

పరీక్షకు ఆలస్యమవుతోందని విద్యార్థి సాహసం

సతారా: ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించకపోవడంతో కన్నీటిపర్యంతమైన అభ్యర్థులను ఎంతోమందిని చూశాం. తనకలా అవ్వొద్దనుకున్నాడు మహారాష్ట్రకు చెందిన ఓ యువకుడు. ట్రాఫిక్ కష్టాలు తప్పించుకుని సకాలంలో ఎగ్జామ్ సెంటర్‌కు చేరేందుకు వినూత్న ఆలోచన చేశాడు. సతారా జిల్లా పసరణి గ్రామానికి చెందిన సమర్థ్ మహంగాడేకు ఎగ్జామ్స్ జరుగుతున్నాయి. పని నిమిత్తం పంచగని వెళ్లాడు. అక్కడ అనుకోకుండా ఆలస్యమై పరీక్షకు వెళ్లడానికి కొద్ది నిమిషాలే మిగిలింది. రోడ్డు మార్గాన భారీ ట్రాఫిక్ లో చిక్కి ఎటూ సమయానికి చేరలేనని గ్రహించి అసాధారణ ఆలోచన చేశాడు. పంచగని జీపీ అడ్వెంచర్‌కు వెళ్లి సమస్య చెప్పాడు. సకాలంలో చేర్చాలని కోరాడు. సాహస క్రీడల నిపుణుడు గోవింద్ యెవాలే బృందం పారాగ్లైడింగ్ ద్వారా మనవాడిని నేరుగా పరీక్ష కేంద్రం సమీపంలో సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. ఈ వీడియోను ఇన్‌స్టాలో షేర్ చేశారు. దాంతో సమర్థ్‌పై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సుందరమైన ప్రకృతి దృశ్యాలతో పాటు పారాగ్లైడింగ్‌కు కూడా సతారా పెట్టింది పేరు.

నేడు యూరప్ అధినేతల అత్యవసర భేటీ!

వాషింగ్టన్: ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్ని సాధ్యమైనంత త్వరగా ముగించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టుదలతో ఉన్నారు. ఈ మేరకు ఇప్పటికే సంకేతాలిచ్చారు. చెప్పిన మాట వినకపోతే ఉక్రెయిన్‌కు ఆయుధ, ఆర్థిక సాయం నిలిపివేస్తామని హెచ్చరించారు. గత వారం రష్యా అధినేత పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గంటకు పైగా సుదీర్ఘంగా చర్చించారు. ఉక్రెయిన్–రష్యా మధ్య శాంతిని నెలకొనాలని ఆకాంక్షిస్తున్నట్లు ట్రంప్ స్పష్టంచేశారు. ట్రంప్ పోద్బలంతో ఉక్రెయిన్–రష్యా మధ్య జరిగే శాంతి చర్చల్లో యూరప్ భాగస్వామ్యం ఉండబోదని అమెరికా ప్రతినిధి కీత్ కెల్లాగ్ తేల్చిచెప్పారు. ఈ పరిణామాలన్నీ యూరప్ దేశాలకు మింగుడుపడడం లేదు. విజేత ఎవరో తేలకుండానే యుద్ధం ముగించాలన్న ప్రతిపాదనను కొన్ని ఐరోపా దేశాలు పరోక్షంగా వ్యతిరేకిస్తున్నాయి. ట్రంప్ తమను లెక్కచేయకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ అంశంలో చేపట్టాల్సిన తదుపరి కార్యాచరణపై చర్చించడానికి అత్యవసరంగా భేటీ కావాలని నిర్ణయించుకున్నాయి. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో సోమవారం ఈ సమావేశం జరగబోతున్నట్లు తెలుస్తోంది. యూరప్ జాతీయ భద్రతకు ఈ భేటీ చాలా ముఖ్యమని యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ చెప్పారు. అమెరికా, యూరప్ మధ్య సంబంధాలు ఎప్పటిలాగే బలంగా ఉండాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆ దిశగా తమవంతు కృషి చేస్తున్నామని వెల్లడించారు. తమ కూటమిలో విభజనలను అంగీకరించబోమని పేర్కొన్నారు. ఉక్రెయిన్–రష్యా వ్యవహారంలో ఐరోపా దేశాలు ఒంటరవుతున్నాయని, అమెరికాకు దూరంగా జరుగుతున్నాయన్న వాదనను ఆయన ఖండించారు. మరోవైపు ఉక్రెయిన్‌కు మద్దతుగా నూతన చర్యలతో ముందుకు రాబోతున్నట్లు యూరోపియన్ యూనియన్(ఈయూ) ఫారిన్ పాలసీ చీఫ్ కాజా కెల్లాస్ ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. యూరప్ భద్రతకు తాము అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. అయితే, యూరప్ ఆదేశాల అధినేతల అత్యవసర భేటీని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఇంకా ధ్రువీకరించారు. ఆయన ప్రతినిధుల సైతం దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ, భేటీ కచ్చితంగా జరుగుతుందని యూరోపియన్ అధికారులు అంటున్నారు.

ఆదిమ బాలుని ఆగమనం

అగ్గి కోసం అభ్యర్థిస్తూ బయటికొచ్చిన వైనం

- బ్రెజిల్‌లో అరుదైన ఘటన
- వెంటనే అడవిలోకి పంపేసిన అధికారులు



నేటి ఆధునిక ప్రపంచానికి దూరంగా జీవించే ఎన్నో ఆదిమజాతులకు బ్రెజిల్‌లోని అమెజాన్ నదీ పరివాహక ప్రాంతం ఆవాసంగా ఉంది. ఆ ఆదిమజాతుల కట్టూబొట్టూ, ఆచర వ్యవహారాలు, ఆహార నియమాలు ఎవరికీ తెలీదు. బ్రెజిల్ ప్రభుత్వం కూడా ఎవరికీ చెప్పదు. ఆధునిక పోకడల బారిన పడకుండా ఆ జాతులను తమ మానాన వారి బతకనివ్వాలని బ్రెజిల్ ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుంది. అందుకే అలాంటి ఆదిమజాతులు ఆవాసాల వైపు ఎవరినీ వెళ్లనివ్వదు. అయితే అనుకోకుండా ఆ ఆదిమజాతుల్లో ఒక గిరిజనజాతికి చెందిన వ్యక్తి వాళ్ల ప్రపంచం నుంచి బాహ్య ప్రపంచంలోకి వచ్చాడు. వెంట రెండు చిన్న దుంగలను తెచ్చుకున్నాడు. మంట రాజేయడానికి అగ్గి కావాలని అభ్యర్థించాడు. ఈ అరుదైన ఘటన గత బుధవారం నైరుతి అమెజాన్‌లోని పురూస్ నదీతీరం వెంట బెలారోసా అనే కుగ్రామంలో జరిగింది. బుధవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఒక గిరిజన వ్యక్తి ఒంటిపైభాగంపై ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా కాళ్లకు చెప్పులు లాంటివి ఏమీ లేకుండా నడుచుకుంటూ కుగ్రామానికి చేరుకున్నాడు. సంబంధిత వీడియోను అసోసియేటెడ్ ప్రెస్ న్యూస్‌ఏజెన్సీ సంపాదించింది. ఆ వీడియోలో ఆ గిరిజన వ్యక్తి పూర్తి ఆరోగ్యవంతంగా, నెమ్మదస్తుడిగా కనిపించాడు. గ్రామస్థులను అగ్గి కావాలని అడిగాడు.

దీంతో వాళ్లు ఒక లైటర్‌ను ఇచ్చి దీంతో అగ్గిరాజేసుకోవాలని సూచించారు. అయితే అతనికి లైటర్‌ను ఎలా వెలిగించాలో అర్థంకాలేదు. దానిని ఎలా వాడాలో స్థానికులు ఎంతలా విడమరిచి, వివరించి చూపినా అతనికి అర్థంకాలేదు. ఈలోపు బ్రెజిల్ దేశ ఆటవిక, ఆదివాసీ, గిరిజన సంబంధ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 'ఫునాయ్' అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆ మనిషిని తమ కార్యాలయానికి తీసుకెళ్లారు. స్థానికులతో ఉండటంతో స్థానికులకు ఉన్న అంటురోగాలు, ఇన్ఫెక్షన్లు, బ్యాక్టీరియా ఏమైనా సోకాయో లేదో అని నిర్ధారించుకుని గురువారం సాయంత్రం కల్లా తిరిగి ఆ ఆదిమజాతి ఆవాసానికి సురక్షితంగా పంపేశారు. ఆదిమజాతులు శతాబ్దాలుగా బయటి వ్యక్తుతో కలవని కారణంగా వారిలో రోగనిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. ఆధునిక జీవనశైలికి అలవాటుపడ్డ సాధారణ ప్రజల్లో అన్ని రకాల అంటురోగాలకు సంబంధించిన ఇన్ఫెక్షన్లు పోగుబడి ఉంటాయి. ఇవి పొరపాటున ఆదిమజాతులకు సోకినా చాలా ప్రమాదం. గతంలో జరిగిన ఇలాంటి ఉదంతాల్లో కొన్ని జాతులు హఠాత్తుగా రోగాల పాలై సగం జనాభా అంతరించిపోయింది. అందుకే అతడిని ఎవరితోనూ కలవనీయకుండా విడిగా ఉంచి 24 గంటల్లోపు తిరిగి అతని జాతి ఆవాసానికి పంపేశారు. స్థానికులు అతను వచ్చిన మార్గం గుండా వెళ్లి ఆదిమజాతులను కలవకుండా ఉండేందుకు ఫునాయ్ అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో ఇలా ఎవరైనా గిరిజనులు బాహ్యప్రపంచంలోకి పొరపాటున వస్తే వారిని మెమోరియా గ్రాండే ఆదిమ,పర్యావరణ పరిరక్షణా స్థావరానికి తీసుకెళ్లి సపర్యలు చేసి పంపేస్తారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

దేశంలో 29 వేల రిజిస్టర్డ్ డ్రోన్లు

న్యూఢిల్లీ: దేశం మొత్తమ్మీద 29,500 రిజిస్టర్డు డ్రోన్లున్నట్టు పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) తెలిపింది. ఢిల్లీలోనే ఇవి అత్యధికంగా 4,882 ఉన్నాయని వెల్లడించింది. తర్వాత అత్యధికంగా తమిళనాడులో 4,588, మహారాష్ట్రలో 4,132 రిజిస్టర్డ్ డ్రోన్లున్నట్లు వివరించింది. జనవరి 29 నాటికి దేశంలో 29,501 రిజిస్టర్డ్ డ్రోన్లున్నట్లు ఇటీవల రాజ్యసభలో వెల్లడించింది. హరియాణాలో 3,689, కర్ణాటకలో 2,516, తెలంగాణలో 1,928, గుజరాత్‌లో 1,338, కేరళలో 1,318 ఉన్నట్లు వివరించింది. మొత్తం 96 మోడళ్ల డ్రోన్లకు సర్టిఫికెట్లివ్వగా ఇందులో వ్యవసాయానికి సంబంధించినవి 65 వరకు ఉన్నట్లు పేర్కొంది. రిమోట్ పైలట్ ట్రెయినింగ్ ఆర్గనైజేషన్స్ నుంచి 22,466 రిమోట్ పైలట్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు డీజీసీఏ తెలిపింది. డ్రోన్ రిజిస్ట్రేషన్/ట్రాన్స్‌ఫర్ కోసం పాస్‌పోర్టు నిబంధనను తొలగించినట్లు తెలిపింది. ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు చూపితే సరిపోతుందని తెలిపింది.

ప్రపంచంలో తొలి గే ఇమాం హత్య



కేప్‌టౌన్: ప్రపంచంలోనే తొలి స్వలింగ సంపర్కుడైన ఇమాంగా పేరొందిన ముహసిన్ హెండ్రిక్స్ హత్యకు గురయ్యారు. దక్షిణాఫ్రికాలోని గెబెర్హాలో శనివారం ఆయనను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. కారులో వెళ్తుండగా ఎదురుగా వాహనంలో వచ్చి కాల్చేశారు. ఈ హత్యను ప్రపంచ ఎల్‌జీబీటీక్యూ అసోసియేషన్ ఖండించింది. ఇది విద్వేష నేరమేనని ఆరోపించింది. సమగ్ర దర్యాప్తుకు డిమాండ్ చేసింది. అరబిక్ టీచర్‌గా, ఫ్యాషన్ డిజైనర్‌గా పనిచేసిన హెండ్రిక్స్ 1996లో విడాకులు తీసుకున్నారు. అప్పుడే తన లైంగికతను వెల్లడించారు. పలు ఎల్జీబీటీక్యూ+ గ్రూపుల్లో పని చేస్తున్నారు. రెండేళ్ల తర్వాత తన జన్మస్థలం కేప్‌టౌన్‌లో ఎల్జిబిటిక్యూ ముస్లింల కోసం ఇన్నర్ సర్కిల్ నెట్‌వర్క్‌ను ప్రారంభించారు. 2011లో వైన్‌బర్గ్ వద్ద ఎల్‌బీటీక్యూ ముస్లింల కోసం మసీదు నిర్మించి ఇమాంగా ప్రసిద్ధి కెక్కారు. 2022లో 'ది రాడికల్' డాక్యుమెంటరీ రూపొందించారు. తనపై బెదిరింపుల గురించి గతంలోనే పరోక్షంగా ప్రస్తావించారు. ''బాడీగార్డులను పెట్టుకోవాలని నాకెందరో సలహా ఇచ్చారు. దాడులకు భయపడబోను'' అని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.

అభివృద్ధి బాటలో గిరిజన వర్గాలు: రాష్ట్రపతి

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం దేశవ్యాప్తంగా గిరిజనులపై సానుకూలంగా ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ఆది మహోత్సవ్ 2025ను ఆదివారం ఆమె ప్రారంభించి ప్రసంగించారు. గిరిజనుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం అన్నివిధాలా ప్రయత్నాలు చేస్తోందన్నారు. గిరిజన వర్గాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం నిజమైన అభివృద్ధి సాధించినట్లని చెప్పారు. ప్రభుత్వ ప్రయత్నాల వల్ల వారికి గౌరవం, వారి సంస్కృతిపై అవగాహన పెరిగాయన్నారు.

కొత్త ఫార్మాట్‌లో ఛేంజ్ ఆఫ్ గార్డ్

రాష్ట్రపతి భవన్‌లో మారిన ఫార్మాట్‌లో ఛేంజ్ ఆఫ్ గార్డ్ కార్యక్రమం ఆదివారం ప్రయోగాత్మకంగా జరిగింది. ఇందులో రాష్ట్రపతి పాల్గొన్నారు. రాష్ట్రపతి భవన్ నేపథ్యంతో దీన్ని మరింత ఆకర్షణీయంగా రూపొందించారు. రాష్ట్రపతి బాడీగార్డుల బృందం విధులు మారే వేళ ఛేంజ్ ఆఫ్ గార్డ్‌ను పాటించే ఆనవాయితీ 2007 నుంచి కొనసాగుతోంది. కొత్తఫార్మాట్‌లో ప్రజల సమక్షంలో ఈ నెల 22న ఛేంజ్ ఆఫ్ గార్డ్ కార్యక్రమం ఉంటుందని రాష్ట్రపతి భవన్ వర్గాలు తెలిపాయి.



పక్షి రాజా

ఇదేమిటో తెలుసా? అసంఖ్యాకమైన స్టార్లింగ్ పక్షులు ఒక పెద్ద పక్షి ఆకృతి దాల్చిన అందమైన దృశ్యం. సాధారణంగా అవి సాయంవేళ ఇళ్లకు చేరే క్రమంలో సమన్వయంతో సాగుతూ ఇలాంటి రకరకాల ఆకారాలను ఏర్పరుస్తుంటాయి.

సంకెళ్లు.. కాళ్లకు గొలుసులు

భారత వలసదారులపై అమెరికాది మళ్లీ అదే తీరు

హోషియార్‌పూర్/పటియాలా/చండీగఢ్: అమెరికా తిప్పి పంపిన రెండో విమానంలోనూ భారతీయ వలసదారుల పట్ల అమానవీయంగా ప్రవర్తించింది. చేతులకు సంకెళ్లు.. కాళ్లను గొలుసులతో కట్టేశారు. 116 మందిలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పిల్లలు మినహా అందరిదీ ఇదే పరిస్థితి. మరోవైపు వలసదారుల్లోని సిక్కులు తలపాగా ధరించడానికి అమెరికా అనుమతించకపోవడాన్ని ఎస్‌జీపీసీ ఖండించింది. అమెరికా నుంచి భారత్‌కు తిరిగొచ్చిన వలసదారులలో ఇద్దరు వ్యక్తులు అరెస్టయ్యారు. హత్య కేసుతో సంబంధం ఉన్న పటియాలా జిల్లా రాజ్‌పురాకు చెందిన ఇద్దరు యువకులను పోలీసులు శనివారం రాత్రే అరెస్టు చేశారు. సందీప్ సింగ్ అలియాస్ సన్నీ, ప్రదీప్ సింగ్‌లు 2023లో నమోదైన ఒక హత్య కేసులో నిందితులని పోలీసులు ధ్రువీకరించారు. వలసదారుల్లో సిక్కులను తలపాగా ధరించడానికి కూడా అనుమతించకపోవడంపై శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ ప్రధాన కార్యదర్శి గురుచరణ్ సింగ్ గ్రేవాల్ ఖండించారు. విషయాన్ని అమెరికా దృష్టికి తీసుకెళ్లాలని విదేశాంగ శాఖను కోరారు.

రెండేళ్ల నరకం...

శనివారం వచ్చిన వలసదారుల్లో పంజాబ్‌లోని హోషియార్‌పూర్ జిల్లా కురాలా కలాన్ గ్రామానికి చెందిన దల్జీత్‌ది విషాద గాథ. కుటుంబానికి మంచి జీవితం ఇవ్వాలనే ఆశతో అమెరికాకు వెళ్లాలనుకున్న దల్జీత్ ఏజెంట్ రెండేండ్ల పాటు నరకం చూపారు. గ్రామంలోని ఓ వ్యక్తి దల్జీత్‌కు 2022లో ట్రావెల్ ఏజెంట్‌ను పరిచయం చేయగా.. ఆయనకు రూ.65 లక్షలు చెల్లించారు. అవి తీసుకున్న ఏజెంట్ 2022లో దల్జీత్‌ను మొదట దుబాయ్‌కు పంపారు. 18 నెలలు అక్కడున్న తరువాత.. ఆయన ఇండియాకు తిరిగొచ్చారు. ఆ తరువాత అతన్ని అమెరికా పంపుతానని చెప్పి.. దక్షిణాఫ్రికాకు పంపించారు. అక్కడ నాలుగున్నర నెలలున్నారు. ఎట్టకేలకు గత ఏడాది ఆగస్టు 26న డంకీ మార్గం ద్వారా అమెరికా వెళ్లేందుకు ముంబై నుంచి బ్రెజిల్‌కు పంపించారు. బ్రెజిల్‌లో దాదాపు నెల రోజుల పాటు గడిపిన తర్వాత మూడు రోజులపాటు కాలినడక, ట్యాక్సీ, వివిధ మార్గాల ద్వారా పనామా దాటించారు. చివరకు మెక్సికోకు చేరుకున్న దల్జీత్ అక్కడా నెలరోజులపాటు ఉండాల్సి వచ్చింది. ఈ సమయంలో ట్రావెల్ ఏజెంట్ దల్జీత్‌ను ఇబ్బందులకు గురి చేశారు. అమెరికాకు పంపాలంటే.. వారి కుటుంబానికున్న నాలుగున్నర ఎకరాల భూమి యాజమాన్యాన్ని తనకు బదలాయించాలని ఒత్తిడి తెచ్చారు. బదిలీ చేసిన తరువాత జనవరి 27న దల్జీత్‌ను యూఎస్‌లోకి పంపించేశారు. అక్కడ అధికారులు అరెస్టు చేసి, డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. బయటకు కూడా రానివ్వకుండా గదిలో బంధించారు. ఆహారంగా నీళ్లబాటిల్, చిప్స్ ప్యాకెట్, ఆపిల్ ఇచ్చారు. రెండో విమానంలో తిరిగి భారత్‌కు పంపించారు.

నవాల్నీ మృతికి ఏడాది

రష్యా విపక్ష పార్టీల్లో నాయకత్వ లోపం, అనైక్యత

మాస్కో: వ్లాదిమిర్ పుతిన్ ఏకఛత్రాధిపత్యాన్ని ధిక్కరిస్తూ, ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ రష్యాలో కీలక విపక్షనేతగా ఎదిగిన అవినీతి వ్యతిరేక ఉద్యమ నాయకుడు అలెక్సీ నవాల్నీ మరణించి ఏడాది అయింది. ఈ ఏడాదిలో విపక్షాలను ఏకతాటి మీదకు తెచ్చి ప్రభుత్వ వ్యతిరేకోద్యమాన్ని నడిపే సత్తా ఉన్న నేత లేకుండా పోయాడు. దాంతో రష్యా విపక్షాలు నాయకత్వ లోపంతో ఇబ్బందులు పడుతున్నాయి. విపక్ష పార్టీల్లో ఐక్యత లోపించడం ప్రధాన సమస్యగా తయారైంది. 47 ఏళ్ల నవాల్నీ 2024 ఏడాది ఫిబ్రవరి 16న రష్యా మారుమూల ఆర్కిటిక్ ఖండ సమీపంలోని పీనల్ కాలనీ కారాగారంలో అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోయిన విషయం తెల్సిందే. ఆయన మరణానికి కారణాలను రష్యా వెల్లడించలేదు. దీంతో రష్యా ప్రభుత్వమే ఆయనను చంపేసిందని విపక్షాలు ఆరోపించాయి. 2020లో సెర్బియా పర్యటనలో ఉన్నప్పుడు నవాల్నీపై నరాల సంబంధ విషప్రయోగం జరిగిన అంశాన్ని విపక్షాలు గుర్తుచేశాయి. నవాల్నీ మృతితో ఇప్పుడు పుతిన్ ఆగడాలకు అడ్డేలేకుండా పోయిందని ఒలెగ్ ఇవనోవ్ వ్యాఖ్యానించారు. 2022లో ఉక్రెయిన్‌ను రష్యా ఆక్రమించడం మొదలెట్టాక నవాల్నీ మద్దతుదారు అయిన ఇవనోవ్ రష్యాను వీడి అమెరికాలోని లాస్‌ఏంజెలెస్‌లో స్థిరపడ్డారు. '' రష్యా విపక్షంలో ఇన్నాళ్లూ ఉన్న ఏకైక ఆశాదీపం నవాల్నీ. ఆ దీపాన్ని ఆర్పేశారు. ఇన్నాళ్లూ మా దేశంలో ఏదైనా మంచి మార్పు చోటుచేసుకుని, మంచి రోజులు వస్తాయని ఆశపడ్డాం. నవాల్నీ మరణంతో మా ఆశలు అడుగంటాయి. విపక్షాలు పుతిన్‌ను ఎదుర్కొంటాయన్న ఆశ దాదాపు పూర్తిగా చచ్చిపోయింది'' అని ఇవనోవ్ ఆవేదన వ్యక్తంచేశారు. అద్భుతమైన ప్రసంగాలు ఇచ్చే నవాల్నీ మరణం తర్వాత ఆయన తరఫున వాదించిన లాయర్లనూ 'తీవ్రవాదులు'గా పేర్కొంటూ పుతిన్ ప్రభుత్వం జైలుపాలుచేసింది. అరెస్టు భయంతో నవాల్నీ మద్దతుదారులు రష్యాను వీడారు. కొందరు స్వదేశంలో ఉన్నా మౌనంగా ఉండిపోయారు.



ఆదివారం మాస్కోలోని బోరిసోవ్‌స్కోయీ శ్మశానవాటికలో నవాల్నీ సమాధి వద్ద అంజలి ఘటిస్తున్న ఓ యువతి

ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారతీయ వర్సిటీల హవా

- దశాబ్దకాలంలో ర్యాంకింగ్స్‌లో పెరిగిన భారతీయ వర్సిటీల సంఖ్య
- ఏకంగా 318 శాతం పెరుగుదల
- జీ20దేశాల్లో అత్యధిక వృద్ధి సాధించిన భారత్
- ప్రకటించిన కేంద్ర విద్యాశాఖ

సాక్షి, న్యూఢిల్లీ: భారతీయ విశ్వవిద్యాలయాల్లో విద్యా ప్రమాణాలు ఇటీవలికాలంలో బాగా మెరుగయ్యాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు దశాబ్దకాలంలో అంతర్జాతీయ వర్సిటీ ర్యాంకింగ్స్‌లో పెరిగిన భారతీయ వర్సిటీల సంఖ్యను ప్రబల తార్కాణంగా ప్రభుత్వం చూపించింది. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో 2015 ఏడాదిలో కేవలం 11 భారతీయ విశ్వవిద్యాలయాలు మాత్రమే ర్యాంక్‌లు సాధిస్తే ప్రస్తుత సంవత్సరంలో ఏకంగా 46 వర్సిటీలు ర్యాంక్‌లు సాధించడం విశేషం. అంటే దశాబ్దకాలంలో భారత వర్సిటీలు 318 శాతం వృద్ధిని సాధించాయి. జీ20 సభ్యదేశాల్లో ఇంతటి వృద్ధిని సాధించిన ఏకైక దేశంగా భారత్ నిలిచిందని కేంద్ర విద్యాశాఖ తాజాగా ఒక ప్రకటనలో పేర్కొంది. దేశానికి స్వాతంత్రం వచ్చిన కొత్తలో అంటే 1950–51 కాలంలో పాఠశాల్లో చేరే వారి సంఖ్య(గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో–జీఈఆర్) కేవలం 0. 4 శాతంగా నమోదైతే ఇప్పుడు 2021–22 నాటికి 71 రెట్లు పెరిగి ఏకంగా 28.4 శాతానికి చేరుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. 2035 నాటికి 50శాతం జీఈఆర్ లక్ష్యంగా ముందుకు అడుగులు వేస్తున్నట్లు విద్యాశాఖ వెల్లడించింది.

ప్రభుత్వ వర్సిటీల ద్వారా 3.25 కోట్ల మందికి విద్య

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసిస్తున్న వారి సంఖ్య సైతం గణనీయంగా పెరిగిందని నీతి ఆయోగ్ తాజాగా ప్రకటించింది. దీనికి సంబంధించి ఫిబ్రవరి పదో తేదీన నీతి ఆయోగ్ ఒక నివేదికను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 3.25 కోట్ల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. 2035 నాటికి ఈ సంఖ్యను రెట్టింపు చేసే లక్ష్యంతో నూతన జాతీయ విద్య విధానం, 2020ను అమలు చేస్తున్నామని విద్యాశాఖ తెలిపింది. '1857లో కోల్‌కతా, ముంబై, మద్రాస్‌లలో తొలి విశ్వవిద్యాలయాలు స్థాపించబడినప్పటి నుంచి దేశ ఉన్నత విద్యావ్యవస్థ గణనీయంగా విస్తరించింది. 1947లో స్వాతంత్రం వచ్చే నాటికి దేశంలో ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలల ద్వారా 2.38 లక్షల మంది విద్యార్థులు మాత్రమే విద్యను అభ్యసిస్తున్నారు. అక్షరాస్యత రేటు 14 శాతం ఉండటంతో ఆరోజుల్లో విద్య వ్యవస్థ ఆందోళనకరంగా ఉండేది. ఆనాటి రోజుల నుంచి విద్యలో పురోగతి సాధిస్తూ ఈ విశ్వవిద్యాలయాల ద్వారా 81 శాతం విద్యార్థుల నమోదును సాధించాం''అని కేంద్రం వివరించింది.

ఎస్‌పీయూల ద్వారా పురోగతి

ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2011–12లో 2.34 కోట్ల మంది విద్యార్థులు ప్రభుత్వ వర్సిటీల్లో చదువుకుంటే 2021–22 నాటికి ఆ విద్యార్థుల సంఖ్య 3.24కోట్లకు పెరిగింది. ఓబీసీ విద్యార్థుల్లో వృద్ధి 80.9 శాతం మంది కాగా ఎస్సీ విద్యార్థుల్లో 76.3 శాతం వృద్ధి కనిపించింది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఉన్నత విద్యాసంస్థల్లో దాదాపు 16 లక్షల మంది ఉపాధ్యాయులు విధులు నిర్వరిస్తున్నారు. వీరిలో 68 శాతం మంది లెక్చరర్లు/అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. రీడర్లు/అసోసియేట్ ప్రొఫెసర్లు 10శాతం మంది ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అంతర్జాతీయంగా చూస్తే భారత్ నుంచి పరిశోధనా పత్రాలు సైతం గణనీయంగా పెరిగాయి. 2017లో మొత్తం పరిశోధనా పత్రాల్లో భారత్ వాటా కేవలం 3.5 శాతం ఉండగా 2024 ఏడాదిలో అది 5.2 శాతానికి పెరిగింది.

సాక్షి ప్లస్
సోమవారం | 17-2-2025

రుగ్వేదంలో ఎంత మంది దేవతల ప్రస్తావన ఉంది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



వైదిక నాగరికత - 2

తొలి వేద కాలంలో ఆర్యులు ప్రధానంగా సప్త సింధూ ప్రాంతానికే పరిమితమయ్యారు. తూర్పున యమునా నదిని దాటి విస్తరించలేదు. అందుకే తొలివేద కాలానికి చెందిన రుగ్వేదంలో సింధూ, దాని ఐదు ఉపనదులతోపాటు సరస్వతిని అధికంగా ప్రస్తావించారు. కానీ మలివేద కాలానికి ఆర్యులు యమునను దాటి గంగామైదాన ప్రాంతానికి విస్తరించారు. ఈ భౌగోళిక విస్తరణతో పాటే మలివేద కాలం నాటికి ఆర్యుల ఆర్థిక, సామాజిక, రాజకీయ, మత వ్యవస్థల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

వైదిక నాగరికత లక్షణాలు

సామాజిక వ్యవస్థ: ఆర్యులు భారతదేశంలో వర్ణ వ్యవస్థను ప్రవేశపెట్టారు. సమాజాన్ని నాలుగు వర్ణాలుగా విభజించారు. ఇందులో మొదటి మూడు వర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను ద్విజులుగా పరిగణించారు. నాలుగో వర్ణమైన శూద్రులు రుగ్వేద కాలం చివరలో కనిపిస్తారు. అయితే ఈ వర్ణ వ్యవస్థ అంత కఠినంగా లేదు. ఏ వర్ణం వారైనా ఏ వృత్తినైనా చేపట్టవచ్చు. వర్ణాంతర వివాహాలు అధికంగానే జరిగేవి. అయితే అనులోమ వివాహాల సంఖ్య అధికంగా ఉంది. ఆనాటి సమాజంలో పైన పేర్కొన్న నాలుగు వర్ణాలతోపాటు దస్యులు అనే మరొక వర్గం కూడా ఉంది. వీరు ఆర్యుల చేతిలో ఓడిపోయిన స్థానిక ప్రజలు. వాస్తవంగా 'వర్ణం' అనే పదానికి రంగు అని అర్థం. నలుపు వర్ణంలో ఉన్న స్థానిక ప్రజలను సూచించేందుకు దీన్ని వాడారు. నాటి సమాజంలో స్త్రీలకు గౌరవప్రదమైన స్థానం ఉండేది. పాలనా సభల్లో కూడా మహిళలకు ప్రాతినిధ్యం ఉంది. స్త్రీలు భర్తతోపాటు యజ్ఞ యాగాది క్రతువుల్లో పాల్గొనేవారు. తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడంలోనూ స్వేచ్ఛ ఉండేది. వీరికి విద్యా హక్కు కూడా ఉండేది. ఉన్నత విద్యను అభ్యసించిన 20 మంది మహిళా మేధావుల ప్రస్తావన రుగ్వేదంలో కనిపిస్తోంది. బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలకు తావు లేదు. వితంతు పునర్వివాహాలకు, నియోగ వివాహాలకు అవకాశముండేది. అపాల, విశ్వవర, ఘోష మొదలైన బ్రహ్మవాదినులు.. జీవితాంతం వివాహం లేకుండా విద్యార్జనకే తమ జీవితాలను అంకితం చేసినట్లు తెలుస్తోంది. రుగ్వేదంలోని చాలా శ్లోకాలను మహిళలే రచించారని చరిత్రకారుల అభిప్రాయం. బృహదారణ్యక ఉపనిషత్‌లో గార్గి అనే బ్రహ్మవాదినికి యజ్ఞవల్క్య మహర్షికి మధ్య జరిగిన తాత్విక చర్చల ప్రస్తావన ఉంది.

మలివేద కాలం నాటికి చాతుర్వర్ణ వ్యవస్థ బాగా స్థిరపడింది. వర్ణ వ్యవస్థ కఠినంగా మారింది. దీనికితోడు వర్ణాశ్రమ ధర్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం జీవితాన్ని బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం అనే నాలుగు దశలుగా విభజించారు. ఒకే వర్ణానికి చెందిన వారి మధ్య మాత్రమే వివాహాలను అనుమతించేవారు. గోత్ర సంప్రదాయం అమల్లోకి వచ్చింది. ఒకే గోత్రానికి చెందిన వారి మధ్య వివాహాలను అనుమతించేవారు కాదు. వర్ణాంతర వివాహాలు నిషేధించినా అవి ఆగలేదు. అందుకే వర్ణ సంకర సిద్ధాంతాన్ని రూపొందించారు. ఈ కాలంలోనే అష్ట వివాహ పద్ధతి ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇందులో బ్రహ్మ, దైవ, అర్ష, ప్రజాపత్య, గాంధర్వ, అసుర, రాక్షస, పైశాచ అనే 8 రకాల పద్ధతులున్నాయి. వీటిలో గాంధర్వ, రాక్షస వివాహాలకు క్షత్రియులను అనుమతించారు. వర్ణాంతర వివాహాల వల్ల సమాజంలో అనేక మిశ్రమ కులాలు వచ్చి చేరాయి. రుగ్వేద కాలంతో పోలిస్తే స్త్రీల గౌరవ మర్యాదలు క్షీణించాయి. వారిపై అనేక రకాలైన ఆంక్షలను విధించారు. స్త్రీలకు సంబంధించి అనేక సామాజిక దురాచారాలు ప్రారంభమయ్యాయి. బాల్య వివాహాలు, సతీ సహగమనం, వితంతు వివాహాలను నిషేధించారు. వేదాధ్యయనం చేసే అవకాశం స్త్రీలకు లేదు. పున్నామ నరకాన్ని తప్పించేవాడు అని పుత్ర సంతానానికి ప్రాధాన్యం పెరిగింది. సభ, సమితి వంటి వాటిలోనూ స్త్రీలకు సభ్యత్వం లేకుండా పోయింది.

ఆర్థిక వ్యవస్థ: రుగ్వేద ఆర్యుల ప్రధాన వృత్తి పశుపోషణ. కాబట్టి గోవులకు అమిత ప్రాధాన్యతనిచ్చారు. రుగ్వేదంలో 'గోవ్' అనే పదాన్ని 176సార్లు ప్రస్తావించారు. వీరి సంపదకు మూలం పశువులే. కాబట్టి పశువుల దొంగతనాలను ఘోరాపరాధంగా పరిగణించేవారు. ఈ నేరానికి కఠినమైన శిక్షలుండేవి. ఆ కాలంలో 'పాణిలు' అనేవారు పశువుల దొంగతనాలకు పాల్పడేవారు. పశు సంపదను రక్షించడం రాజన్ ముఖ్య విధి. కాబట్టి రాజన్‌ను 'గోప, గోపతి' అనే పేర్లతో పిలిచేవారు. సంపన్నుమైన వ్యక్తిని 'గోమత్' అనేవారు. 'గవిష్టి' అంటే గోవుల కోసం చేసే యుద్ధం లేదా గోవుల కోసం వెదకడం అని అర్థం. ఈ విధంగా వీరి ఆర్థిక వ్యవస్థలో సమస్త పదాలు గోవులతో ముడిపడి ఉండడాన్ని బట్టి చూస్తే పశువులు రుగ్వేదార్యుల ఆర్థిక వ్యవస్థలో ముఖ్య స్థానం ఆక్రమించినట్లు తెలుస్తోంది. పశుపోషణ తర్వాత ఆర్యుల ప్రధాన వృత్తి వ్యవసాయం. ఇంకా స్థిర జీవనం ఏర్పడనందున వ్యవసాయాన్ని పరిమితంగానే చేపట్టారు. వీరి ముఖ్య పంటలు గోధుమ, బార్లీ. తొలివేద కాలంలో అనేక రకాల చేతివృత్తుల వారు ఉన్నారు. చేతివృత్తుల్లో రథాలను తయారు చేసే రథకారులకు (వడ్రంగులు) ప్రముఖ స్థానముండేది.

ఇంకా ఇతర వృత్తుల్లో వస్త్రాలు, కుండలు, చర్మ వస్తువుల తయారీ మొదలైనవి పేర్కొనదగినవి. లోహాన్ని 'ఆయాస్' అని పిలిచారు. లోహ వస్తువులను తయారు చేసేవారిని 'కర్మార' అనేవారు. ఆ కాలంలో రాగి లేదా కంచును అధికంగా ఉపయోగించారు. తొలివేద కాలంలో పరిమిత స్థాయిలో వ్యాపార, వాణిజ్యాలు జరిగాయి. రుగ్వేదంలో 'నిష్క' అనే నిర్దిష్ట విలువ కలిగిన బంగారు ఆభరణం గురించి ప్రస్తావన ఉంది. దీన్ని నాణెంగా ఉపయోగించారని కొందరి అభిప్రాయం. అయినప్పటికీ వాణిజ్యం ప్రధానం వస్తు మార్పిడి పద్ధతిలోనే జరిగేది. వేదాల్లో 'ఫణి' అనే అనార్య జాతికి చెందిన వ్యాపారస్తుల ప్రస్తావన ఉంది.

మలివేద కాలానికి ఆర్యుల ఆర్థిక జీవనంలో పెనుమార్పులు సంభవించాయి. దీనికి ప్రధాన కారణం వీరు సప్త సింధూ నుంచి ప్రపంచంలోనే అత్యంత సారవంతమైన గంగా మైదానానికి విస్తరించడమే. ఈ విస్తరణకు ఇనుప పరిజ్ఞానం తోడై ఆర్యుల ఆర్థిక వ్యవస్థ వ్యవసాయాధార ఆర్థిక వ్యవస్థగా మారడానికి కారణమైంది. ఇనుమును వీరు 'కృష్ణ ఆయా' లేదా 'శ్యామ ఆయా' అని పిలిచారు. ఇనుప నాగళ్ల ఉపయోగం ప్రారంభమైంది. శతపథ బ్రాహ్మణంలో వివిధ రకాలైన వ్యవసాయ కార్యకలాపాల గురించిన ప్రస్తావన ఉంది. గోధుమ, బార్లీతోపాటు వరి ప్రధాన పంటగా రూపొందింది. ఈ వ్యవసాయాభివృద్ధి వల్ల ఆర్యుల సంచార జీవితం అంతమై స్థిర జీవనం ప్రారంభమైంది. తొలివేద కాలంతో పోలిస్తే వృత్తుల సంఖ్య కూడా పెరిగింది. లోహకారులకు ప్రాధాన్యం పెరిగింది. ఈ అభివృద్ధి అంతా కలిసి చిన్న చిన్న పట్టణాలు ఏర్పడటానికి దారి తీసింది. మలివేద గ్రంథాల్లో కనిపించే 'నగరం' అనే పదాన్ని ఈ పట్టణాలకు సంకేతంగా భావించవచ్చు. అయితే వాస్తవంగా పట్టణాలు ఏర్పడింది మాత్రం మలివేద యుగం చివరలో మాత్రమే. మలివేద గ్రంథాల్లో పేర్కొన్న కొన్ని ముఖ్య పట్టణాలు.. కాశీ, కౌశాంబి, వైదేహ, అయోధ్య, హస్తినాపూర్, ఇంద్రప్రస్థ మొదలైనవి. విస్తృత వ్యవసాయం, స్థిరమైన జీవన విధానం, పట్టణ జీవితం, చేతి వృత్తులు ఇవన్నీ కలిసి వ్యాపార వాణిజ్యాల అభివృద్ధికి దోహదపడ్డాయి. దీంతో వ్యాపార నిర్వహణకు వ్యాపారస్తులు 'శ్రేణులు' లేదా 'గణ'లుగా ఏర్పడ్డారు. రుగ్వేద కాలపు నిష్కతోపాటు అనేక రకాలైన నాణేలు వచ్చాయి. అవి.. శతమాన, క్రిష్ణాల, సువర్ణ, హిరణ్య పిండ మొదలైనవి. బృహదారణ్యక ఉపనిషత్‌లో 'పడ' అనే నాణెం ప్రస్తావన ఉంది. అయితే వాస్తవంగా ఇవన్నీ నిర్ణీత విలువ కలిగిన ఆభరణాలు మాత్రమే. అసలైన నాణేలు వాస్తవంగా క్రీ.పూ. 6వ శతాబ్దంలో ప్రారంభమయ్యాయి. అవే విద్ధాంక నాణేలు. అధర్వణ వేదం సంతల గురించి, అక్కడి సందడిని గురించి ప్రస్తావిస్తోంది. ఈ కాలంలో వడ్డీ వ్యాపారం కూడా ఒక వృత్తిగా గుర్తింపు పొందింది. వడ్డీ వ్యాపారిని 'కుసిదిన్' అని పిలిచేవారు.

రాజకీయ వ్యవస్థ: రుగ్వేద కాలంలో పూర్తిస్థాయి రాచరిక వ్యవస్థ ఏర్పడలేదు. పాలక వర్గాలను రాజన్య అని పిలిచేవారు. ఈ వర్గాల నుంచే రాజన్‌ను ఎన్నుకునేవారు. రాజన్‌ను రాజుగా కంటే తెగ నాయకుడిగా పరిగణించడమే సబబుగా ఉంటుంది. రాజన్ ముఖ్య విధి ప్రజలను కాపాడడంతో పాటు వారి ప్రధాన సంపద అయిన గోవులను దొంగిలింపకుండా కాపాడటం. దీని కోసం గూఢచారులను నియమించేవారు. ఇంకా పురోహితుడు, సేనాపతి, ప్రజాపతి మొదలైన వారు రాజుకు సహాయకులుగా ఉండేవారు. 'ప్రజాపతి' ముఖ్య విధి గడ్డి మైదానాల పర్యవేక్షణ. రుగ్వేద కాలంలో వశిష్ఠుడు, విశ్వామిత్రుడు ప్రసిద్ధి చెందిన పురోహితులు. దశరాజ యుద్ధానికి వీరు పరోక్ష కారకులు. రుగ్వేద కాలంలో కుటుంబాన్ని 'కుల' అన్నారు. కుటుంబ పెద్దను 'కులప' అని పిలిచేవారు. కొన్ని కులాల కలయికతో ఏర్పడేదే గ్రామం. దీనికి 'గ్రామణి' అధిపతిగా ఉండేవాడు. కొన్ని గ్రామాల సమూహాన్ని 'విస్' అనేవారు. దీనికి విస్పతి అధిపతిగా ఉండేవాడు. ఇలాంటి విస్‌ల సముదాయంతో 'జన' లేదా'తెగ' ఏర్పడుతుంది. దీని నాయకుడే 'రాజన్'. అయితే రుగ్వేద కాలంలో రాజన్ అధికారం అపరిమితమైంది కాదు. సభ, సమితి, విధాత, గణ అనే ప్రజా సభలు రాజన్ అధికారాన్ని నియంత్రించేవి. రుగ్వేదంలో బలి, భాగ అనే పన్నుల ప్రస్తావన ఉంది. ఇవి వాస్తవంగా పన్నులు కావు. 'బలి' అనేది ప్రజలు రాజుకు ఇచ్చే కానుక. 'భాగ' అనేది యుద్ధంలో కొల్లగొట్టిన సంపదలో రాజు వాటా.

మలివేద కాలానికి ఆర్యులు స్థిర జీవనానికి అలవాటు పడ్డారు. కాబట్టి రుగ్వేద కాలం నాటి తెగల ఆధారిత పాలనా వ్యవస్థ స్థానంలో ప్రదేశం ఆధారిత పాలనా వ్యవస్థ ఏర్పడింది. వీటినే 'జనపదాలు' అంటారు. ఈ కాలంలో రాజన్ కేవలం గోవులను రక్షించే గోపతి మాత్రమే కాదు.. సుశిక్షిత సైన్యాన్ని కలిగి ఉండి పక్క రాజ్యాలను ఆక్రమించే స్థాయికి ఎదిగాడు. దీనికోసం రాజసూయ, అశ్వమేధ, వాజపేయ వంటి యజ్ఞ, యాగాలూ ప్రారంభమయ్యాయి. రాజుపై నియంత్రణాధికారమున్న సభలు క్షీణించి సభ, సమితులు మాత్రమే మిగిలాయి. అవి కూడా నామమాత్రపు సలహా మండళ్లుగా మారిపోయాయి. దీనివల్ల సభలతో ఎంపికయ్యే రాజన్ పదవి వంశపారంపర్య పదవిగా మారిపోయింది. ఈ కాలంలో రాజుకు సహాయ సహకారాలు అందించేందుకు 'ద్వాదశ రత్నిన్' అనే మంత్రి మండలి ఏర్పడింది. వీరిలో ప్రధాన పురోహితుడు, పట్టమహిషి, సేనాని, సూత, సంగ్రహిత్రి, భాగదుఘ, అక్షావాప, గోవికర్తన, గ్రామణి మొదలైనవారు సభ్యులుగా ఉండేవారు. బలి, భాగ అనేవి పూర్తిస్థాయి పన్నులుగా మారాయి. వాటి వసూలుకు భాగదుఘ అనే అధికారి ఉండేవాడు. అయినప్పటికీ ఈ కాలానికి పూర్తిస్థాయి అధికార యంత్రాంగం మాత్రం ఏర్పడలేదు.

మత వ్యవస్థ: రుగ్వేద కాలపు ఆర్యులు ప్రకృతి శక్తులను అర్థం చేసుకోలేకపోవడంతో వాటికి దైవత్వాన్ని ఆపాదించారు. మానవ రూపమిచ్చి పూజించారు. రుగ్వేదంలో మొత్తం 33 మంది దేవతల ప్రస్తావన ఉంది. వీరందరిలో అతిముఖ్య దైవం ఇంద్రుడు లేదా పురంధరుడు. ఇతడు యుద్ధ దేవత. రెండో ముఖ్య దైవం అగ్ని. ఇతడిని మానవులకు, దేవతలకు మధ్య వారధిగా భావించారు. వరుణుడు ప్రకృతిని క్రమబద్ధీకరించే దేవత. ఇంకా సోమ, ఉషస్,అదితి, పృథ్వీ, అరణ్యాని మొదలైన దేవతల ప్రస్తావన ఉంది. వీరి పూజా విధానంలో భక్తికి ప్రాధాన్యముండేది. భక్తి శ్లోకాలను ఆలపించడం, కానుకలను సమర్పించడం ద్వారా దేవతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. తమకు ప్రీతిపాత్రమైన సోమ, సుర అనే పానీయాల్ని నైవేద్యంగా సమర్పించేవారు. వీరు ప్రధానంగా సంతానం, పశు సంపద కోసం దేవతలను ప్రార్థించారు.

మలివేద కాలానికి రుగ్వేదపు ప్రధాన దేవతల ప్రాధాన్యత తగ్గిపోయింది. ఇంద్రుడు, అగ్ని వంటి దేవతల స్థానాన్ని త్రిమూర్తులు ఆక్రమించారు. రుగ్వేదపు ప్రధాన దేవతలు అష్టదిక్పాలకులుగా మారిపోయారు. సృష్టికర్త అయిన ప్రజాపతి ప్రధాన దేవతగా, రుద్రుడు, విష్ణువు మొదలైనవారు ఇతర ముఖ్య దేవతలుగా అవతరించారు. ఈ కాలంలో వచ్చిన మరొక ముఖ్యమైన మార్పు వర్ణాల వారీగా దేవతలు ఏర్పడటం. ఈ విధంగా ఏర్పడిన దేవతే 'పుషాన్' అనే శూద్రుల దేవత. ఆర్యుల పూజా విధానంలోనూ మార్పులు సంభవించాయి. భక్తి ప్రాధాన్యత తగ్గి యజ్ఞ యాగాలు,బలిదానాలకు ప్రాధాన్యత పెరిగింది. విపరీతమైన జంతు బలుల వల్ల పశు సంపదకు పెద్ద నష్టం వాటిల్లింది. మోక్ష మార్గం సంక్లిష్టం, వ్యయభరితం అవడమే కాకుండా శూద్రులు, స్త్రీలు వంటి కొన్ని వర్గాలకు మోక్ష మార్గాన్ని నిరాకరించారు. మలివేద కాలంలో మత వ్యవస్థలో చోటు చేసుకున్న ఈ పరిణామాలన్నీ కలిసి వైదిక యుగం చివరినాటికి అంటే క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి వైదిక మతంపై తిరుగుబాటుగా అనేక మత ఉద్యమాలు రావడానికి కారణమయ్యాయి.

మాదిరి ప్రశ్నలు

1. వేద కాలం నాటి 'పాణిలు' అంటే?
   1) నాణేలు 2) సైనిక వర్గం
   3) వ్యాపారులు 4) పశువుల దొంగలు
2. రుగ్వేదంలో వ్యవసాయదారుడిని ఏ పేరుతో సూచించారు?
   1) కినాస 2) శూద్ర 3) క్షేత్రక 4) కర్షక
3. వీటిలో తప్పుగా జతపర్చిన దాన్ని గుర్తించండి?
   1) గోఘన - అతిథి 2) దౌహిత్రి - కూతురు
   3) గోప - పశుకాపరి 4) గవిష్టి - యుద్ధం
4. వీరిలో పురోహితుల దైవం?
   1) ఇంద్రుడు 2) అగ్ని
   3) వరుణుడు 4) సూర్యుడు
5. వైదిక యుగంలోని ఏ సభలను ప్రజాపతి (బ్రహ్మ) పుత్రికలుగా భావిస్తారు?
   1) సభ, సమితి 2) సమితి, విధాత
   3) విధాత, గణ 4) గణ, పరిషత్
6. వేద కాలంలో ఏ వృత్తి వారికి ఉపనయనం ధరించే అర్హతను కల్పించారు?
   1) స్వర్ణకారులు 2) రథకారులు
   3) చర్మకారులు 4) లోహకారులు
7. వీటిలో సరైన జతను గుర్తించండి?
   1) కులాల-కుండలు తయారు చేసేవారు
   2) నిషాద - చేపలు పట్టేవారు
   3) కైవర్త - బుట్టలు అల్లేవారు
   4) వేణ - వేటాడేవారు
8. కింద ఇచ్చిన జాబితాల నుంచి సరైన సమాధానాన్ని గుర్తించండి?

జాబితా -1	జాబితా-2
ఎ) సూత	1) మంగలి
బి) దౌహిత్రి	2) వధించరానిది (ఆవు)
సి) గోఘన	3) రథకారుడు
డి) అఘన్య	4) కూతురు
ఇ) వాప్త	5) అతిథి

కోడ్స్:	ఎ	బి	సి	డి	ఇ
1	5	4	1	2	3
2	3	4	5	2	1
3	3	4	1	2	5
4	1	2	3	4	5

9. దశరాజ యుద్ధానికి కారకుడైన పురోహితుడు?
   1) దుర్వాసుడు 2) విశ్వామిత్రుడు
   3) యజ్ఞవల్క్య 4) సుదాసు
10. వైదిక యుగ పాలనా విభాగాలను సరైన ఆరోహణ క్రమంలో అమర్చండి?
   1) రాష్ట్ర, జన, విశ్, గ్రామ, కుల
   2) జన, రాష్ట్ర, గ్రామ, కుల, విశ్
   3) కుల, గ్రామ, విశ్, జన, రాష్ట్ర
   4) కుల, గ్రామ, విశ్, రాష్ట్ర, జన

సమాధానాలు

1) 4; 2) 1; 3) 3; 4) 2; 5) 1; 6) 2; 7) 1; 8) 2; 9) 2; 10) 3.

సిమ్లా పట్టణం ఏ పర్వత శ్రేణిలో ఉంది?



1. భారతదేశం ఏ రకమైన శీతోష్ణస్థితిని కలిగి ఉంది?
జ. ఉష్ణమండల రుతుపవన శీతోష్ణస్థితి
2. మన దేశంలో పశ్చిమ దిశగా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తున్న నదులేవి?
జ. నర్మద, తపతి, మహి, సబర్మతి
3. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం?
జ. రాజస్థాన్‌లోని జైసల్మీర్
4. మనదేశంలో నైరుతి రుతుపవన కాలం?
జ. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు
5. ఈశాన్య రుతుపవనాలు (తిరోగమన రుతుపవనాలు) వీచే కాలం?
జ. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు
6. నైరుతి రుతుపవనాల వల్ల మొదటగా ఏ రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయి?
జ. కేరళ
7. ఈశాన్య రుతుపవనాలు మొదటగా ఏ రాష్ట్రంలో ప్రవేశిస్తాయి?
జ. పంజాబ్
8. ప్రస్తుతం హిమాలయాలున్న భూభాగంపై మధ్య మహాయుగంలో ఉన్న సముద్రం?
జ. టెథిస్
9. భారత ద్వీపకల్ప పీఠభూమిని పూర్వం ఏమని పిలిచేవారు?
జ. గోండ్వానా పీఠభూమి
10. హిమాలయాలు ఏ రకమైన పర్వతాలు?
జ. నవీన ముడుత పర్వతాలు
11. సిమ్లా పట్టణం ఏ పర్వత శ్రేణిలో ఉంది?
జ. ధౌల్‌దార్ శ్రేణి
12. అరుణాచల్‌ప్రదేశ్‌లోని బాహ్య హిమాలయాలను ఏమని పిలుస్తారు?
జ. మిష్మి కొండలు
13. ప్రముఖ వేసవి విడిది కేంద్రమైన డెహ్రాడూన్ ఏ రాష్ట్రంలో ఉంది?
జ. ఉత్తరాఖండ్
14. ప్రపంచంలో రెండో అతి ఎత్తైన శిఖరం ఏ పర్వత శ్రేణిలో ఉంది?
జ. కారకోరం శ్రేణి
15. మడ అడవులు (సుందర వనాలు) ఏ రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నాయి?
జ. పశ్చిమ బెంగాల్
16. ఆరావళి పర్వతాల్లో ఎత్తైన శిఖరం?
జ. గురుశిఖర్ పర్వతం (1722 మీటర్లు)
17. ఆరావళి పర్వతాలు ఏ రకాని చెందినవి?
జ. అతి పురాతన ముడుత పర్వతాలు
18. ఛోటా నాగపూర్ పీఠభూమి ఏ రాష్ట్రంలో ఉంది?
జ. జార్ఖండ్
19. ఆరావళి పర్వత శ్రేణి ఏ రాష్ట్రంలో ఉంది?
జ. రాజస్థాన్
20. ఊటీ ఏ కొండల్లో ఉంది?
జ. నీలగిరి కొండలు (తమిళనాడు)
21. సింధు నది ముఖ్య ఉపనదులు?
జ. జీలం, చీనాబ్, బియాస్, సట్లెజ్, రావి
22. బ్రహ్మపుత్ర నదిని అరుణాచల్‌ప్రదేశ్‌లో ఏమని పిలుస్తారు?
జ. డి హాంగ్
23. అస్సోం దుఃఖదాయనిగా పేరొందింది?
జ. బ్రహ్మపుత్రా నది
24. కృష్ణా నది జన్మస్థానం?
జ. మహాబలేశ్వర్ (మహారాష్ట్ర)
25. సింధు నది జన్మస్థానం?
జ. మానస సరోవరం (టిబెట్)
26. అమర్ కంటక్ వద్ద జన్మించిన నది?
జ. నర్మద
27. తపతి నది జన్మస్థానం?
జ. ముల్తాయి (బేటల్, మధ్యప్రదేశ్)
28. కోరమండల్ తీరంలో ఏ రుతుపవనాల వల్ల అధిక వర్షం కురుస్తుంది?
జ. ఈశాన్య రుతుపవనాలు
29. కరువుకు గురయ్యే ప్రాంతాల ప్రణాళిక(DPAP)ను ఏ సంవత్సరంలో ప్రవేశ పెట్టారు?
జ. 1973
30. మహానది ఏ రాష్ట్రంలో ఎక్కువ దూరం ప్రవహిస్తోంది?
జ. ఒడిశా
31. బెంగాల్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
జ. దామోదర్ నది
32. సుగంధ నూనెలను తయారుచేయడానికి ఉపయోగపడే రూసా గడ్డిని ఏ జిల్లాలో పండిస్తున్నారు?
జ. నిజామాబాద్
33. భారతదేశ సగటు అటవీ శాతం?
జ. 20.55%
34. అడవుల విస్తీర్ణం పరంగా మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా, చివరిస్థానంలో ఉన్న రాష్ట్రం?
జ. హర్యానా
35. వైశాల్యం పరంగా అత్యధిక శాతం అడవులు ఉన్న రాష్ట్రం?
జ. అరుణాచల్ ప్రదేశ్
36. మృత్తికా క్రమక్షయం అంటే?
జ. సహజ కారణాల వల్ల సారవంతమైన నేలల పైపొర కొట్టుకొని పోవడం
37. ఉష్ణమండల చెర్నోజెమ్ మృత్తికలుగా పేరొందినవి?
జ. నల్లరేగడి నేలలు
38. మౌసమ్ అనేది ఏ భాషా పదం?
జ. అరబిక్ (అర్థం-రుతువు)
39. మన దేశంలో ఇప్పటి వరకూ అత్యల్ప ఉష్ణోగ్రత (−40°C) ఎక్కడ నమోదైంది?
జ. ద్రాస్ (కార్గిల్- కశ్మీర్)
40. అత్యధిక వర్షపాతం(1141సెం.మీ.) నమోదయ్యే మాసిన్‌రామ్ ప్రాంతం ఏ రాష్ట్రంలో ఉంది?
జ. మేఘాలయ
41. తమిళనాడులో అత్యధిక వర్షపాతం సంభవించడానికి కారణమయ్యే రుతుపవనాలు?
జ. తిరోగమన రుతుపవనాలు
42. పత్తి పంటకు అత్యంత అనుకూలమైన నేలలు?
జ. నల్లరేగడి నేలలు
43. భంగర్, ఖాదర్ మృత్తికలుండే నేలలు?
జ. ఒండ్రు నేలలు
44. మృత్తికా పరిరక్షణ పద్ధతులేవి?
జ. కాంటూర్ బండింగ్, ఫిర్రోయింగ్, స్రిప్ క్రాసింగ్
45. దక్కన్ లావా నేలలుగా పేరుగాంచినవి?
జ. నల్లరేగడి నేలలు
46. జనసాంద్రత అంటే?
జ. చదరపు కిలోమీటరుకు నివసించే సగటు జనాభా
47. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఏ రోజున జరుపుకుంటాం?
జ. జూలై 11
48. తెలంగాణలో అక్షరాస్యత ఎక్కువగా ఉన్న జిల్లా హైదరాబాద్ కాగా తక్కువగా ఉన్న జిల్లా?
జ. మహబూబ్‌నగర్ (55.4%)
49. తెలంగాణ రాష్ట్ర మొత్తం జనాభా?
జ. 3 కోట్ల 52 లక్షలు
50. రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న జిల్లా రంగారెడ్డి. కాగా, అతి తక్కువ జనాభా ఉన్న జిల్లా?
జ. నిజామాబాద్
51. తెలంగాణలో ఎస్సీ జనాభా తక్కువగా ఉన్న జిల్లా హైదరాబాద్. కాగా, ఎక్కువగా ఉన్న జిల్లా?
జ. కరీంనగర్
52. తెలంగాణలో ఎస్టీ జనాభా అధికంగా ఉన్న జిల్లా ఖమ్మం కాగా, తక్కువగా ఉన్న జిల్లా ఏది?
జ. హైదరాబాద్
53. దేశంలో ఎక్కువగా వ్యవసాయానికి తోడ్పడే నీటి పారుదల వనరు?
జ. బావులు
54. పెరియార్, మెట్టూరు కాలువలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
జ. తమిళనాడు
55. చెరువుల ద్వారా సాగయ్యే భూమి ఏ రాష్ట్రంలో ఎక్కువగా ఉంది?
జ. తెలంగాణ
56. కాలువలు, బావుల ద్వారా సాగయ్యే భూమి అత్యధికంగా ఉన్న రాష్ట్రం?
జ. ఉత్తరప్రదేశ్
57. ఏ రాష్ట్రంలో చాలా వరకు వ్యవసాయమంతా నీటిపారుదల వసతుల కిందే జరుగుతుంది?
జ. పంజాబ్
58. భారీ నీటిపారుదల పథకాల ఆయకట్టు ప్రాంతం ఎంత ఉంటుంది?
జ. 10,000 హెక్టార్ల కంటే ఎక్కువ
59. చిన్నతరహా నీటిపారుదల పథకాల ఆయ కట్టు ప్రాంతం ఎన్ని హెక్టార్లలోపు ఉం టుంది?
జ. 2000
60. తెల్లబొగ్గుగా పిలిచేది?
జ. జలవిద్యుచ్ఛక్తి
61. దేశంలో ఉత్పత్తయ్యే మొత్తం విద్యుచ్ఛక్తిలో జలవిద్యుచ్ఛక్తి వాటా?
జ. 22 శాతం
62. మనదేశంలో జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తికి అత్యంత అనువైన ప్రాంతం?
జ. హిమాలయ పర్వతపాద ప్రాంతం
63. ఏ బహుళార్థసాధక పథకం వల్ల అధికంగా జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది?
జ. భాక్రానంగల్
64. మనదేశంలోని ఏకైక అంతర్జాతీయ బహుళార్థసాధక ప్రాజెక్టు
జ. కోసి ప్రాజెక్టు
65. భాబర్ అంటే?
జ. గులకరాళ్లతో కూడిన సచ్ఛిద్ర మండలం
66. టెరాయి అంటే?
జ. చిత్తడి ప్రాంతం
67. భంగర్ అంటే?
జ. ప్రాచీన కాలంలో ఏర్పడిన ఒండలి మైదానం.
68. ఖాదర్ అంటే?
జ. నూతనంగా ఏర్పడిన ఒండలి మైదానం
69. రే/ కల్లార్ అంటే?
జ. చవుడు, లవణీయ, స్ఫటికీయ భూభాగం

బహుళార్థసాధక ప్రాజెక్టు	నది	నిర్మించిన ప్రదేశం	లబ్ధి పొందుతున్న రాష్ట్రాలు
భాక్రానంగల్ ప్రాజెక్టు	సట్లెజ్	భాక్రానంగల్ (హిమాచల్ ప్రదేశ్)	పంజాబ్, హర్యానా, రాజస్థాన్
బియాస్ ప్రాజెక్టు	బియాస్	పాంగ్ (పంజాబ్)	పంజాబ్, హర్యానా, రాజస్థాన్
దామోదర్ ప్రాజెక్టు	దామోదర్	జార్ఖండ్	పశ్చిమ బెంగాల్, జార్ఖండ్
హిరాకుడ్ ప్రాజెక్టు	మహానది	సంబల్‌పూర్	ఒడిశా
నాగార్జునసాగర్ ప్రాజెక్టు	కృష్ణా	నందికొండ (నల్గొండ, తెలంగాణ)	తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
తుంగభద్ర ప్రాజెక్టు	తుంగభద్ర	మల్లాపూర్ (బళ్లారి)	కర్ణాటక, ఆంధ్రప్రదేశ్
కోసి ప్రాజెక్టు	కోసి నది	హనుమాన్ నగర్ (బిహార్)	బిహార్, నేపాల్ (అంతర్జాతీయ పథకం)
చంబల్ ప్రాజెక్టు	చంబల్	మధ్యప్రదేశ్	మధ్యప్రదేశ్, రాజస్థాన్
గండక్ ప్రాజెక్టు	గండక్	వాల్మీకి నగర్ (బిహార్)	బిహార్, ఉత్తరప్రదేశ్, నేపాల్
రామ్‌గంగా ప్రాజెక్టు	రామ్‌గంగా	కాలాగర్	ఉత్తరాఖండ్

పర్వతాలు	రాష్ట్రం
మహాదేవ్ కొండలు	మధ్యప్రదేశ్
రాజ్‌మహల్ కొండలు	జార్ఖండ్
మిష్మి కొండలు, దాఫ్లా కొండలు	అరుణాచల్‌ప్రదేశ్
కచార్ కొండలు	అస్సోం
పాట్‌కాయ్ కొండలు	నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్
ఖాసీ కొండలు, జాంతియా కొండలు, గారో కొండలు	మేఘాలయ
పళని కొండలు, నీలగిరి కొండలు, షేవరాయ్ కొండలు	తమిళనాడు
యాలకుల (కార్డమమ్) కొండలు, అన్నామలై కొండలు	కేరళ
లూషాయ్ కొండలు	మిజోరాం
గిర్ కొండలు	గుజరాత్

తీరప్రాంత మైదానం	విస్తరించిన రాష్ట్రం
సర్కార్ తీరం	ఆంధ్రప్రదేశ్
ఉత్కల్ తీరం	ఒడిశా
కోరమండల్ తీరం	తమిళనాడు
మలబార్ తీరం	కేరళ
కెనరా తీరం	కర్ణాటక
కొంకణ్ తీరం	గోవా, మహారాష్ట్ర

2011 జనాభా లెక్కల ప్రకారం భారత్‌లో	
మొత్తం జనాభా	121 కోట్లు
జనాభా పెరుగుదల రేటు (దశాబ్దంలో)	17.7%
అక్షరాస్యత	74%
లింగనిష్పత్తి	1000 : 943
జనసాంద్రత	382
పట్టణ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం	గోవా (62.2%)
గ్రామీణ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం	హిమాచల్ ప్రదేశ్ (90%)

జనబాహుళ్యంలో ఆదరణ పొందిన కళారూపాలు

జానపద కళలు - కళాకారులు

తెలంగాణ రాష్ట్రంలో అనేక రకాల జానపద కళాకారులు ఉన్నారు. వీరు తమ కళలనే కులవృత్తులుగా చేసుకొని వాటి ద్వారా జీవనం సాగిస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ సిలబస్‌లో వీటన్నింటినీ ప్రత్యేక అధ్యాయంగా పేర్కొన్నారు. అందువల్ల అభ్యర్థులు తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, కళారూపాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

కొలనుపాక భాగవతులు

కొలనుపాక భాగవతులనే గంటి భాగవతులుగా పేర్కొంటారు. వీరికి, ఆంధ్ర ప్రాంతంలో ఉండే గంటి భాగవతులకూ వ్యత్యాసం ఉంది. తెలంగాణలో గంటి భాగవతులు ఎక్కువగా కరీంనగర్ జిల్లా కొలనుపాకలో ఉన్నారు. వీరు రాత్రి వేళల్లోనే ప్రదర్శన చేస్తారు. వీరి ప్రదర్శనలకు సాహిత్యపరంగా అంతగా ప్రాముఖ్యం లేదు. వీరు ప్రదర్శనల్లో ప్రధానంగా గరిటెలను ఉపయోగిస్తారు. అందువల్ల వీరిని గరిటె భాగవతులు, గంటె భాగవతులుగా వ్యవహరిస్తారు. ప్రతి పాత్రధారి చేతిలోనూ ఒక గరిటె ఉంటుంది. అందులో చమురు పోసి, వత్తి వేసి వెలిగిస్తారు. ప్రతి పాత్ర హావభావాలూ, ఆంగిక చలనాలు ఈ గరిటె వెలుతురు వల్ల ప్రేక్షకులకు విశదంగా వెల్లడవుతాయి. ప్రదర్శనలో భాగంగా మధ్య మధ్య నటనను సాగిస్తూ, గరిటెలలోని వత్తిని ఎగదోస్తూ ఉంటారు. గరిట ప్రాముఖ్యంతోనే నాటకాలను ప్రదర్శిస్తారు.

శారదకాండ్రు

శారదకాండ్రు అనే జానపద కళాకారులు కేవలం తెలంగాణాలోనే కనిపిస్తారు. వీరు ఎక్కువగా వరంగల్ ప్రాంతంలో ఉన్నారు. బుర్రకథ వాయిద్యకారులు, శారద కథకులకు మధ్య పెద్ద వ్యత్యాసమేమీ కనిపించదు. బుర్రకథకుల మాదిరిగానే వీరు కూడా డక్కీలను ఉపయోగిస్తారు. వీరు ఉపయోగించే తంబురాను 'శారద' అంటారు. అందువల్ల వీరికి శారదకాండ్రు అనే పేరు వచ్చింది.

గంగిరెద్దులాట

ఇది తెలంగాణ రాష్ట్రంలో ఒక చక్కని జానపద కళ. సాధారణంగా పూజగొల్ల కులానికి చెందిన వారు గంగిరెద్దులను ఆడిస్తారు. వీరు ఎద్దును చక్కగా అలంకరించి, ఊళ్లలో తిరుగుతూ దాన్ని ఆడిస్తారు. వీరు ప్రధానంగా భిక్షాటన ద్వారా జీవనం సాగిస్తారు. ఒక గంగిరెద్దుతో పాటు ముగ్గురు వ్యక్తులు ఉంటారు. వీరిలో ఒకరు గంగిరెద్దును ఆడిస్తే.. మరో వ్యక్తి డోలు వాయిస్తాడు. మూడో వ్యక్తి సన్నాయి వాయిస్తాడు. ఇది గ్రామస్థులకు మంచి వినోదం. సాధారణంగా వీరు డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఎక్కువగా కనిపిస్తారు.

తెలంగాణలో పుట్టి ఇక్కడే అభివృద్ధి చెందిన ఒక అపురూప జానపద కళారూపం 'ఒగ్గుకథ'. ఒగ్గు అంటే శివుడి చేతిలోని 'ఢమరుకం' అనే అర్థం కూడా ఉంది. ఇది అచ్చమైన తెలంగాణా దేశీ పదం. ఒగ్గు కథలను తెలంగాణ ప్రాంతంలోని గొల్ల, కురుమలు తమ 'కుల పురాణం'గా భావిస్తారు. మిద్దె రాములు, చుక్క సత్తయ్య లాంటి వారు ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఒగ్గు కళాకారులు.



ఒగ్గుకథ

ఒగ్గుకథ ఒక కళారూపం. కురు కులానికి చెందినవారు దీన్ని ప్రదర్శిస్తారు. 'ఒగ్గు' అంటే త్రినేత్రుడైన శివుడిని ప్రార్థించడం. వీరశైవారాధకుల్లో పురోహితులైనవారు శైవ దీక్ష తీసుకుంటారు. ఒగ్గు దీక్ష తీసుకున్నవారు మల్లన్న, వీరన్న కథలను వల్లె వేస్తారు. కోయతెగకు చెందిన ఒక వంశస్థులు సమ్మక్క కథ చెబుతూ పాటలు పాడతారు.

బుడబుక్కల వాళ్లు

వీరు తెలంగాణ రాష్ట్రంలో సంచార జాతికి చెందినవారు. వీరు ఊరూరా తిరుగుతూ ఉంటారు. సాధారణంగా వీరు క్షుద్రదేవతలను పూజిస్తారు. తెల్లవారుజామున విచిత్ర వేషధారణతో ఢమరుకం వాయిస్తూ గ్రామాల్లో వీధుల వెంట తిరుగుతారు. జ్యోతిషం చెబుతూ, తాయత్తులు కడుతూ యాచిస్తారు.

బుడగ జంగాలు

బుడగ జంగాలు శివభక్తులు. ఒక చేతిలో గంట వాయిస్తూ, శివుడి గురించి యక్షగానం చేస్తూ భిక్షాటన చేస్తారు. వినసొంపైన జానపద పాటలు పాడుతారు. ప్రజలకు విభూతిని పంచుతారు. అందువల్ల వీరిని 'జంగమదేవర' అని పిలుస్తారు. వీరు వాయించే గంటపై చిన్న 'నంది' విగ్రహం ఉంటుంది.

భిక్షుక కుంట్లు

వీరు కూడా తెలంగాణా ప్రాంతానికి చెందిన సంచారజాతివారే. వీరు సత్యహరిచ్చంద్ర, మార్కండేయ, భక్త ప్రహ్లాద కథలను ఎంతో రమ్యంగా చెబుతారు. ప్రదర్శనలో నలుగురు కళాకారులు ఉంటారు. ప్రధాన కథకుడు చేతిలో 'పన్నుకర్ర' పట్టుకొని అటూ ఇటూ ఊపుతూ కథ చెబుతాడు. మిగిలినవారు మద్దెల, హార్మోనియం, తాళాలు వాయిస్తూ అతడిని అనుకరిస్తారు.

రంజు కళాకారులు

విశ్వ బ్రాహ్మణులపై ఆధారపడి రంజు, పవన, సమయాలు ఇచ్చే ప్రదర్శనలు ఎంతో రమ్యంగా ఉంటాయి. వీరు 'రంజు' అనే వాయిద్యాన్ని వాయిస్తారు. వీర బ్రహ్మేంద్ర స్వామి కథ, విశ్వకర్మ పురాణం చెబుతారు. వీరు శైవ మతాన్ని అనుసరిస్తారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ సంస్కృతి-కళలు

డోలి కళాకారులు

కోయ జాతికి చెందిన వీరు అడవుల్లో, పర్వత ప్రాంతాల్లో నివసిస్తారు. డోలి కళాకారులు వారి జాతికి చెందిన ఆదిపురుషుల గురించి కథల రూపంలో చెబుతారు. కోయజాతిలో మూడో తరానికి చెందిన 'పేరంబోయరాజు' కథను వల్లె వేస్తారు.

బందారు కళాకారులు

వీరు పెరిక కులంపై ఆధారపడి ఉంటారు. బండారు కళాకారులు పెరిక జాతి గొప్పతనం గురించి పురాణకథలు చెబుతారు. వీరు ఏ రకమైన వాయిద్యాలను ఉపయోగించరు. ప్రధాన కథకుడు కథ చెబుతూ ఉంటే మరో ఇద్దరు వంత పాడతారు.

డాఢీల ప్రదర్శన

వీరు లంబాడీ తండాలకు వెళ్లి అక్కడి పెద్దలను కలిసి ప్రదర్శనలు ఇస్తారు. వీరిని 'భట్టు' అనే పేరుతో కూడా పిలుస్తారు. వీరు తమ జాతిలో మూలపురుషుల కథలను పాడుతూ సంచారం చేస్తూ భిక్షాటన చేస్తారు. వీరు ఒక బృందంగా ఏర్పడి పాటలు పాడతారు. ఒక్కో బృందంలో అయిదు నుంచి 15 మంది సభ్యులు ఉంటారు.

అసాదులు

తెలంగాణా ప్రజలకు అనేక గ్రామ దేవతలను పూజించే ఆచారం ఉంది. వీరు ప్రకృతి దేవతలను కూడా పూజిస్తారు. ఎల్లమ్మ, పోచమ్మ, నల్లపోచమ్మ, పెద్దమ్మ పేర్లతో దేవతలను పూజిస్తారు. రాష్ట్రంలో అడుగడుగునా ఇలాంటి దేవాలయాలు కనిపిస్తాయి. ఈ దేవాలయాల్లో అన్ని రకాల శూద్ర కులాలకు చెందినవారు అర్చకులుగా ఉంటారు. వీరినే 'అసాదులు' అంటారు. ఈ అసాదులు అమ్మవార్లను 'తాంత్రిక' పద్ధతిలో పూజిస్తారు. మాల కులంలో మాలదాసరులు ఉన్నట్లుగానే.. మాదిగ కులంలో అసాదులనే తెగకు చెందినవారు ఉంటారు. అసాదులంటే మాల, మాదిగ కులాల్లో పూజారి వర్గానికి చెందినవారని 'ఆరుద్ర' పేర్కొన్నారు. వీరు ప్రధానంగా ఎల్లమ్మ కథను గానం చేస్తూ చిందులు వేస్తారు.

కప్పతల్లి

అత్యంత ప్రాచీనమైన జానపద కళ ఇది. నృత్యం, పాట, తప్పెట, లయతో ఈ జానపద కళ ఎంతో రమ్యంగా ఉంటుంది. తప్పెటను ఎదురు రొమ్ముపై పెట్టుకొని వాయిస్తారు. తెలంగాణలో ఈ కళను 'కప్పతల్లి'గా వ్యవహరిస్తారు.

కాటి కాపరులు

వీరు దహన కార్యక్రమాల్లో పాలు పంచుకొంటారు. శ్మశానంలో అన్ని ఏర్పాట్లు చేస్తారు. మరణించిన వారి గురించి కీర్తిస్తూ పాటలు పాడటం ద్వారా యాచిస్తారు. చనిపోయిన వ్యక్తి దుస్తులను కూడా వీరు స్వీకరిస్తారు.

మాయాజాల కళాకారులు

వీరిని 'విప్ర వినోదులు'గా పేర్కొంటారు. వీరు గారడి ద్వారా అనేక మాయలను ప్రదర్శించి, యాచిస్తారు.

మందెచ్చు కళాకారులు

వీరు యాదవ కులానికి చెందినవారు. ఈ జానపద కళాకారులు 'ఒల్లమాదేవి' కథను పాడుతూ యాచిస్తారు. వీరిలో ప్రధాన కళాకారుడు ఒక చేతిలో కత్తి, మరో చేతిలో చిరుతలు పట్టుకొని కథకు సంబంధించిన పాటలు పాడతాడు. మరో ఇద్దరు.. ఒకరు కత్తి, మరొకరు కర్ర పట్టుకొని ఇతడికి వంత పాడతారు.

తోటి కళాకారులు

గిరిజన, అడవి జాతులకు చెందిన కోయ, గోండు, నాయకపోడు కులాలకు ఆశ్రిత కులం తోటివారు. గిరిజన జాతులన్నీ లక్ష్మీదేవి జాతికి చెందినవి. తోటి కళాకారులు కురువంశానికి చెందినవారిగా, వారికి వారసులుగా భావిస్తారు. వీరు కురువంశ మూలపురుషుల కథలు చెబుతారు.

పెద్దమ్మ కళాకారులు

వీరు సంచార జాతికి చెందిన మహిళా కళాకారులు. సాధారణంగా ముగ్గురు లేదా నలుగురు కలిసి ప్రదర్శనలు ఇస్తారు. పెద్దమ్మ దేవత విగ్రహాన్ని ఒకరి చేతిలో ఉంచుతారు. మరో కళాకారిణి డోలు వాయిస్తుంది. చేతిలో పెట్టిన విగ్రహాన్ని కళాకారిణి తలపై పెట్టుకొని డోలు శబ్దానికి అనుగుణంగా లయబద్ధంగా నృత్యం చేస్తుంది. వీరు నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించిన విప్లవ వీరుడు 'పండుగ శాయన్న' గాథను పాడుతూ ప్రదర్శన నిర్వహిస్తారు.

యానాది భాగవతం

యానాది కులానికి చెందినవారు చెప్పే భాగవతాన్ని 'యానాది భాగవతం' అంటారు. వీరు చెంచులక్ష్మీ కథను ఎంతో రమ్యంగా చెబుతారు. దీన్నే 'గరుడాచల భాగవతం'గా వ్యవహరిస్తారు. వీరు నృత్యం చేస్తూ, పాటలు పాడుతూ కథను వల్లె వేస్తారు.

పర్ధాన్ కళాకారులు

ఇది గోండు జాతి పుట్టు పుర్వోత్తరాలకు సంబంధించిన జానపద కళ. ఆదిమవాసీలైన పర్ధాన్‌లు 'దేవాల్ పులాక్' పురాణగాథను ఆలపిస్తూ ప్రదర్శనలు ఇస్తారు. వీరు డక్కి, తాళాలు అనే వాయిద్యాలను ఉపయోగిస్తారు.

జముకులవారు

పోచమ్మ, ఎల్లమ్మ, అక్కమ్మ, సారంగధర మొదలైన గ్రామ దేవతల కథలను వీరు ఎంతో మనోరంజకంగా చెబుతారు. వీరు ఉపయోగించే వాయిద్యాల్లో 'జమిడిక' లేదా 'బవనిక' ముఖ్యమైంది.

వీరముష్టివారు

వీరు వైశ్యులకు అనుయాయులు. వైశ్యుల ఆరాధ్య దైవమైన శ్రీకన్యకాపరమేశ్వరి గురించి పాటలు పాడతారు. వీరు 'జంగాల' దగ్గర కూడా యాచిస్తారు.

సాతాను వైష్ణవులు

వీరు వైష్ణవ భక్తులు. విష్ణువును ఆరాధిస్తారు. విష్ణువు గురించి పాటలు పాడుతూ యాచిస్తారు.

పిట్టల దొర

తెలంగాణాలో ఆదరణ ఉన్న మరో ముఖ్యమైన జానపద కళాకారుడు 'పిట్టల దొర'. ఈ వేషాన్నే 'లత్కోర్ సాబ్', 'బుడ్డర్ ఖాన్', 'తుపాకి రాముడు'గా పేర్కొంటారు. ఇది పగటి వేషాల్లో ఒక రకానికి చెందింది. వీరు ప్రధానంగా గ్రామాల్లో ప్రదర్శనలు ఇస్తారు. పిట్టల దొర వేషగాళ్లు సమాజంలోని లోపాలు, కుతంత్రాలను హాస్యాత్మకంగా, వ్యంగ్య రూపంలో చెబుతారు. ఖాకీ ప్యాంటు లేదా నిక్కరు, చిరిగిన ఖాకీ షర్టు, తలపై దొర టోపి, కాళ్లకు బూట్లు ధరిస్తారు. టోపిపై ఒక పక్కన తెల్లటి ఈక, చేతిలో కట్టె తుపాకీ, మెడలో రుమాలు ఉంటుంది. వీరు ముఖానికంతా తెల్ల రంగు పూసుకుని, ఫ్రెంచ్‌కట్ మీసంతో దొరలా హంగామా చేస్తూ విరామం లేని వాగ్ధోరణితో ప్రజలను అలరిస్తారు.

మాదిరి ప్రశ్నలు

1. తెలంగాణలో మాయాజాల కళాకారులుగా ఎవరిని పిలుస్తారు?
   1) మందెచ్చు కళాకారులు
   2) విప్ర వినోదులు
   3) ఒగ్గుకథ కళాకారులు
   4) శారదకాండ్రు
2. మిద్దె రాములు, చుక్క సత్తయ్య ఏ కళలో ప్రసిద్ధి చెందిన వ్యక్తులు?
   1) ఒగ్గుకథ 2) బుర్రకథ
   3) హరికథ 4) గుస్సాడి నృత్యం
3. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో గిరిజనులు చేసే నృత్యం పేరు?
   1) సిద్ధీ నృత్యం 2) గుస్సాడి నృత్యం
   3) గరగల నృత్యం
   4) పేరిణీ తాండవం
4. కాకతీయ ప్రభువుల కాలంలో ప్రసిద్ధిగాంచిన నృత్యం ఏది?
   1) సిద్ధీ నృత్యం 2) రేల నృత్యం
   3) కోలాటం
   4) పేరిణీ తాండవం
5. తెలంగాణ రాష్ట్రంలో గ్రామ దేవతలను పూజించే శూద్ర కుల అర్చకులను ఏమంటారు?
   1) శారదకాండ్రు 2) వీరముష్టివారు
   3) అసాదులు
   4) బండారు కళాకారులు

సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 4; 5) 3.

She buys milk and butter from the..



BANK EXAMS
GENERAL ENGLISH

1. The girl in the pink frock is my daughter. (**Use:** wearing)
   1) Wearing pink frock is my daughter.
   2) The girl wearing in the pink frock is my daughter.
   3) My daughter is wearing pink frock.
   4) The girl wearing the pink frock is my daughter.
2. She said that she had gone there the night before.
   1) She said, "I went there the night before."
   2) She said "she went there the previous night."
   3) She told that 'she had gone there last night.'
   4) She said, "I went there last night."
3. Join the following simple sentences into a single sentence. He was tired of work. He lay down to rest.
   1) He was tired of work; he was lay down to rest.
   2) Being tired of work, he lay down to rest.
   3) So tired of work, to lay down to rest.
   4) Too tired of work he was laid down to rest.
4. She buys milk and butter from the ____
   1) Dairy 2) diary
   3) daily 4) dairies
5. ____ being fined he was sent to prison.
   1) beside 2) in
   3) besides 4) always
6. I have been in this office ____ six years.
   1) since 2) from
   3) for 4) last
7. All laughed at her. (Change into Passive)
   1) Everyone laughed at her
   2) Everybody laughed at her
   3) She was laughed at by all
   4) All were laughed at by her
8. You will never be hurt by him. (Change into Active)
   1) Nobody hurts you
   2) He will never hurt you
   3) He may not hurt you
   4) He may be hurting you
9. I cannot lift this box, I need ____ help.
   1) few 2) a few
   3) a little 4) little
10. Which sentence is correct?
    1) Bread and butter are a wholesome food.
    2) The captain, with all his men, were drowned.
    3) Either Ramu or Anil were absent.
    4) The jury were divided in their opinion.
11. In which sentence the verb is used in past continuous and simple past?
    1) We were playing when you came.
    2) The boys are doing their homework when the bell rang.
    3) She was dancing and playing.
    4) She was singing when I meet her.
12. There is ____ hotel in ____ centre of ____ town.
    1) the, the, the 2) the, a, the
    3) a, the, the 4) a, a, the
13. I met him ____ hour ago.
    1) a 2) an
    3) the 4) no article
14. They have gone to a movie. (Use an appropriate question tag)
    1) Have they? 2) Had they?
    3) Hadn't they? 4) Haven't they?
15. Raju rides a bicycle. ____?
    1) is he 2) does he
    3) was he riding 4) doesn't he
16. He flatters her whenever he meets her. The meaning of flatter is ____.
    1) prays 2) preys
    3) prize 4) praise
17. Keep him at arm's length, means
    1) keep him close
    2) keep him in front
    3) keep him near
    4) keep him away
18. Which of the sentence is correct?
    1) "I have seen a tiger", Ravi said.
    2) Ravi said "I seen tiger?"
    3) "I am seeing a tiger" Ravi said
    4) Ravi said, "I have saw a tiger?"
19. Identify the sentence with correct use of punctuation.
    1) "try and try again," said the teacher.
    2) "Try and Try again," said the Teacher.
    3) "Try and try again," said the teacher.
    4) The teacher said, "try and try again".
20. The police found him guilty. The structure of the sentence is
    1) S+V+ pronoun + complement
    2) S + V + O1 + O2
    3) S + V + IO + DO
    4) S + V + O + complement
21. Identify the silent letters in 'phlegm'
    1) P, l 2) P, h, g
    3) H, g, m 4) G, m, l
22. 'My Dear' is an expression used in ____
    1) formal letters
    2) semi formal letters
    3) personal letters
    4) official letters
23. Usually informal letters will be written to ____.
    1) Colleagues 2) Boss
    3) Editor 4) Near & dear
24. You have been summoned. The opposite of the underlined word is ____.
    1) Call for 2) Said for
    3) Dismiss 4) Call upon
25. He has ____ a lot of weight.
    1) Put in 2) Put on
    3) Put through 4) Put off

PASSAGE

We are living in the midst of a great chemical experiment, and some serious consequences are becoming apparent to scientists. More than two billion pounds of chemicals are spewed into the air each year which are brewing a disastrous stew. The greatest consequences of the atmosphere crisis may be global warming and the ozone depletion. The Earth appears to be warming due to greenhouse effect. Scientists estimate that average temperature could climb about 2 degrees Celsius in 20 years. Global warming is the predict result of the greenhouse effect, created by the greenhouse gases, such as carbon dioxide and methane, in the atmosphere. This change in the global climate would have disastrous results, including drought, coastal flooding and increased species extinction. Also, the scientists have discovered a hole in the ozone layer. The ozone layer is the only protection for life on Earth against deadly ultraviolet radiation from the sun. Once the ozone layer is completely destroyed, all life on Earth will cease exist, killed by the deadly radiation. The planet will become a barren rock devoid of all life. And when this happens the process of industrialization would have to take the blame which has resulted in increased use of fossil fuels such as coal, petroleum and diesel.

26. Which of the following can be inferred from the given passage?
    1) The use of all chemical products should be immediately stopped.
    2) Scientists will have a hard time to estimate the rate of change of temperature in the years to come due to enormous changes in environment.
    3) The environmental disaster in the future will happen as a result of increased usage of fossil fuels.
    4) All of the above
27. Greenhouse effect envisages____
    1) Carbon dioxide and methane
    2) Harmful gases
    3) Global warming
    4) Chemicals
28. The scientists have discovered a hole in the ozone layer. Hole means ____.
    1) complete 2) partial
    3) fissure 4)comprehensive
29. This is really helping us from the ultraviolet radiation____.
    1) global warming
    2) green house gases
    3) ozone layer
    4) industrialization
30. This pen is yours, isn't it?
    1) this is a statement
    2) request 3) interrogation
    4) asking for information

Key

1) 4	2) 4	3) 2	4) 1	5) 3
6) 3	7) 3	8) 2	9) 3	10) 4
11) 1	12) 3	13) 2	14) 4	15) 4
16) 4	17) 4	18) 1	19) 3	20) 4
21) 2	22) 3	23) 4	24) 3	25) 2
26) 4	27) 3	28) 3	29) 3	30) 4

విద్య, ఉద్యోగ సమాచారం

బెల్ బెంగళూరులో సీనియర్ అసిస్టెంట్ ఆఫీసర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన సీనియర్ అసిస్టెంట్ ఆఫీసర్(ఈ-1 గ్రేడ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
- **అర్హత:** ఏదైనా పీజీ(హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులు ఉండాలి) ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిప్యూటీ మేనేజర్ (హెచ్ఆర్-ఈఆర్), హెచ్ఆర్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ప్లాట్ నెం.405, ఇండస్ట్రియల్ ఏరియా ఫేజ్-3, పంచకుల, హర్యానా చిరునామకు పంపించాలి. • **దరఖాస్తులకు చివరితేది:** 26.02.2025. • **వెబ్‌సైట్:** http://bel-india.in/

ఎస్‌వీఎన్ఐఆర్‌టీఏఆర్, ఒడిశాలో 10 పోస్టులు

ఒడిశా రాష్ట్రం కటక్‌లోని ఓలత్‌పూర్‌లో ఉన్న స్వామి వివేకానంద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిహాబిలిటేషన్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్(ఎస్‌వీఎన్ఐఆర్‌టీఏఆర్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
- **పోస్టుల వివరాలు:** డైరెక్టర్-01, అసిస్టెంట్ ప్రొఫెసర్(స్పీచ్)-01, అసిస్టెంట్ ప్రొఫెసర్(క్లినికల్ సైకాలజీ)-01, లెక్చరర్ ఫిజియోథెరపీ-01, లెక్చరర్ ఆక్యుపేషనల్ థెరపీ-01, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-01, రిహాబిలిటేషన్ ఆఫీసర్-01, క్లినికల్ అసిస్టెంట్-01, స్పెషల్ ఎడ్యుకేటర్స్-01, అకౌంటెంట్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(కామర్స్), బీఈడీ, పీజీ(ఎంబీఏ), మాస్టర్స్(ఫిజియోథెరపీ), పీజీడీఈలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 56 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** డైరెక్టర్ పోస్టుకు నెలకు రూ.90,000, అసిస్టెంట్ ప్రొఫెసర్(స్పీచ్), అసిస్టెంట్ ప్రొఫెసర్(క్లినికల్ సైకాలజీ)కు రూ.75,000, లెక్చరర్ ఫిజియోథెరపీ, లెక్చరర్ ఆక్యుపేషనల్ థెరపీ పోస్టులకు రూ.60,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది డైరెక్టర్ స్వామి వివేకానంద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిహాబిలిటేషన్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్, ఓలత్‌పూర్, బైరోయ్, కటక్, ఒడిశా-754010.
- **దరఖాస్తులకు చివరితేది:** 27.02.2025.
- **వెబ్‌సైట్:** https://www.svnirtar.nic.in